

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

విశాఖపట్నం

: fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-7-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 161 పేజీలు: 16 వెల: 6.50


కరూర్ బాధిత కుటుంబాలకు ఉద్యోగాలిచ్చిన తమిళ సిఎం

ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్

5లో

## కట్టుకథల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

### పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించిన మంత్రి మండలి

### తప్పుడు ప్రచారాల బాధ్యులపై కేసులు కఠినతరం: సిఎం చంద్రబాబు

### అమరావతిలో రెండోవిడత భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం

### ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలకు భూకేటాయింపు

### కేబినెట్ భేటీలో 30పైగా అంశాలకు ఆమోదం




శుక్రవారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం దృశ్యం

**విజయవాడ,జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** సామాజిక మాధ్యమాల్లోను, కొన్ని మీడియా ప్రసారాల్లో వస్తున్న ఫేక్ వార్తలపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కులపరమైన అంశాలు, తప్పుడు వార్తలను కొందరు ఉద్దేశపూర్వకంగానే వేగంగా వ్యాప్తి చేస్తున్నారని మండిపడ్డారు.భావ ప్రకటనా స్వేచ్ఛను గౌరవిస్తూనే అభ్యంతరకర వ్యాఖ్యలను ఏ మాత్రం ఉపేక్షించవద్దని పోలీస్ అధికారులకు కేబినెట్ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం వెంటనే టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులను మంత్రిమండలి ఆదేశించింది. అవసరమైతే బయటనుంచి సిబ్బందిని తీసుకోవాలని సూచించింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 10 మల్టీ విలేజ్ డ్రింకింగ్ వాటర్ స్కీమ్స్‌కు రూ.9,355 కోట్ల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలకు 2,943 తాగునీటి పథకాలు రూ.1,811 కోట్లతో చేపట్టేందుకు పరిపాలనా అనుమతులు ఇచ్చింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో దాదాపు 30కి పైగా అజెండా అంశాలకు ఆమోదం తెలిపారు.సమావేశంలో సోషల్ మీడియా అంశంపై ఏపీ కేబినెట్‌లో సీరియస్‌గా చర్చ జరిగింది. ఈ సందర్భంగా సోషల్ మీడియాపై డీజీపీ, ఇతర పోలీస్ అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. సోషల్ మీడియాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేతలను కించపరుస్తూ వస్తున్న వీడియోలపై మంత్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్వార్థ రాజకీయాల కోసం బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను అడ్డం పెట్టుకుని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. అనంతపురంలో తోపుదుర్తి దాడులకు కుట్రలు పన్ని రెచ్చగొట్టే ట్రాప్ వేశాడని మంత్రులు చర్చించారు. ఫేక్ వార్తల నియంత్రణకు హోం, న్యాయ శాఖలు కలిసి పనిచేయాలని పవన్ కల్యాణ్ సూచించినట్లు నాదెండ్ల మనోహర్ తెలిపారు. వాట్సాప్ యూజర్ నేమ్ వస్తే ఈ సమస్యలు మరింత పెరుగుతాయని డీజీపీ అభిప్రాయ పడ్డారు. సైబర్ క్రైమ్ సమస్యల పరిష్కారానికి ఐజీ స్థాయి అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై నిరంతరం నోటి విరోచనాలు చేసుకునే ఇటువంటి మానసిక రోగులకు చట్టం పవర్ చూపించాల్సిందేనని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చారు. సోషల్ మీడియా నేరగాళ్లపై నమోదవుతున్న కేసులను కోర్టుల్లో బలంగా వాదించడానికి, నిందితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడానికి అవసరమైతే ప్రత్యేకంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సైబర్ క్రైమ్ చట్టాలను మరింత కఠినంగా అమలు చేస్తూ, ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో విచారణ జరిపించేలా న్యాయపరమైన మౌలిక వసతులను బలోపేతం చేయాలని ఐటీ, హోంశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. విశాఖలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. తిరుపతి జిల్లాలో 63 ఎకరాల్లో లాజిస్టిక్స్ పార్క్ ఏర్పాటుపై చర్చ జరిగింది. పర్యాటక పాలసీలో భాగంగా రాష్ట్రంలో కాన్సర్ట్‌ల నిర్వహణ, కాన్సర్ట్‌లకు ప్రత్యేక విధానం ప్రతిపాదనకు ఆమోదం లభించింది. అదేవిధంగా రూ.50కోట్లతో పర్యాటక ప్రచారానికి ఆమోదం >>2



శుక్రవారం ఆక్లాండ్ విమానాశ్రయంలో ప్రధాని మోడీకి ఘనంగా స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

## ఆక్లాండ్‌లో ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

### ప్రొటోకాల్ పక్కనపెట్టి మోడీకి స్వాగతం పలికిన న్యూజిలాండ్ ప్రధాని లక్సన్

**ఆక్లాండ్,జులై 10:** మూడు దేశాల విదేశీ పర్యటనలో భాగంగా చివరి దశలో న్యూజిలాండ్‌కు చేరిన ప్రధాని నరేంద్రమోడీకి న్యూజిలాండ్ ప్రధాని ఘనంగా స్వాగతంపలికారు. శుక్రవారం ఆయన ఆక్లాండ్‌నగరంలో అడుగుపెట్టారు. ఒక భారత ప్రధాని న్యూజిలాండ్లో పర్యటించడం ఇదే తొలిసారి కావడంవిశేషం. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ >>2

## కాల్పుల విరమణ ముగిసిందని చెప్పేశా

### ఇరాన్‌తో చర్చలకు అభ్యంతరంలేదు: ట్రంప్



**వాషింగ్టన్,జులై 10:** ఇరాన్ మళ్లీ చర్చలు కొనసాగించాలని అమెరికాను సంప్రదించిందని, అందుకు అమెరికా అంగీకరించినప్పటికీ ఇరు దేశాల మధ్య అమల్లో ఉన్న కాల్పుల విరమణ (సీజ్‌ఫైర్) ఇక ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. తన సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో ఈ మేరకు ట్రంప్ పోస్టు చేశారు."ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ మాతో చర్చలు కొనసాగించాలని కోరింది. అందుకు మేము అంగీకరించాం. అయితే కాల్పుల విరమణ ఇక ముగిసిందని వారికి స్పష్టంగా తెలియజేశామని ట్రంప్ పేర్కొన్నారు. పోస్టు చివరలో ఈ విషయంపై మీ దృష్టికి ధన్యవాదాలు అంటూ తన సంతకం కూడా జత చేశారు. అమెరికా దౌత్యపరమైన చర్చలకు తలుపులు తెరిచి ఉంచినప్పటికీ, ప్రస్తుతం ఇరాన్‌తో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ అమల్లో లేదని ట్రంప్ స్పష్టం చేశారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య జూన్ నెలలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో కుదిరిన అవగాహన ఒప్పందంలో భాగంగా తాత్కాలిక కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఈ ఒప్పందం ప్రకారం 60 రోజుల పాటు శత్రుత్వ చర్యలను నిలిపివేసి, ఇరాన్ అణు కార్యక్రమం, ఆర్థిక ఆంక్షల సడలింపు, హార్ముజ్ >>2

## భారీగా కొరియా పెట్టుబడులు

### శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే లక్ష్యం

### ఎపి పట్ల విశ్వాసానికి కియా మోటార్స్ పెట్టుబడి నిదర్శనం

### సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్, కొరియా రోడ్‌షోలో మంత్రి లోకేష్ పిలుపు




సియోల్‌లో సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ప్రసంగిస్తున్న ఎపి మంత్రి లోకేష్

**విజయవాడ,జులై10, ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ, కొరియా భాగస్వామ్యంలో మరో అధ్యాయాన్ని లిఖించబోతున్నాం. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యమని ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ స్పష్టం చేసారు. కొరియాతో ఆంధ్రప్రదేశ్ ది విజయవంతమైన భాగస్వామ్యం. ఏపీ అభివృద్ధి ప్రయాణంలో కొరియా కంపెనీలు భాగస్వామ్యం కావాలని విద్య, పిలుపునిచ్చారు. దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా సియోల్ లో 31వ సీఐఐ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) పార్ట్ నర్ షిప్ సమ్మిట్ సౌత్ కొరియా పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన రోడ్ షో లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సియోల్‌లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తూ మీ మధ్య ఉండటం ఎంతో గౌరవంగా ఉంది. అంతకంటే ముఖ్యంగా, ఇప్పటికే వేలాది మంది జీవితాలను మార్చిన, భవిష్యత్తులో ఆసియాలో అత్యంత కీలకమైన ఆర్థిక భాగస్వామ్యాల్లో ఒకటిగా నిలిచే సామర్థం ఉన్న ఈ భాగస్వామ్యానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి లోకేష్ అన్నారు. పెట్టుబడిదారులతో శాశ్వత భాగస్వామ్యాలు నిర్మించడమే మా లక్ష్యం అన్నారు.ఏపీలో 2024లో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నా లక్ష్యం ప్రపంచాన్ని ఆంధ్రప్రదేశ్‌కు తీసు కురావడం అన్నారు., ఆంధ్రప్రదేశ్‌ను ప్రపంచానికి పరిచయం >>2

## ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువులు

### బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం

### మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ,జులై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతోపాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలవారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలిం చేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిన్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో >>2

## ఎన్ఐఎ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

### హైకోర్టులో 'రిజిస్ట్రార్' పోస్టుకు గ్రీన్ సిగ్నల్: మంత్రి ఎన్ఎండి ఫరూక్




**విజయవాడ, జులై 10,ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చట్టం కింద నమోదయ్యే కేసుల విచారణ కోసం విశాఖపట్నంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. శుక్రవారం వెలగపూడి సచివాలయం లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన ప్రతిపాదనలకు ఆమోదం లభించిన విషయాన్ని మంత్రి ఫరూక్ వెల్లడించారు.జాతీయ దర్యాప్తు సంస్థ చట్టం, 2008 కింద నమోదయ్యే కేసులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించేందుకు ప్రత్యేక ఎన్ఐఏ కోర్టులను ఏర్పాటు చేయాలని భారత సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు అన్ని రాష్ట్రాలకు ఆదేశించినట్లు ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ప్రభుత్వానికి తెలియజేయడం జరిగిందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో విజయవాడ, విశాఖలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం రెండు నోటిఫై చేసిన కోర్టులు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.కాగా రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 20 ఎన్ఐఏ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిలో 19 కేసులు విశాఖపట్నంలోని 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో, విజయవాడలోని 2వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి కోర్టులో ఒక కేసు పెండింగ్‌లో ఉందన్నారు.విశాఖలో ఎన్ఐఏ కేసుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం అవసరమని హైకోర్టు అభిప్రాయ పడిందన్నారు. విశాఖలో జిల్లా మరియు సెషన్స్ జడ్జి స్థాయిలో ఒక ప్రత్యేక ఎన్ఐఏ కోర్టును ఏర్పాటు చేయడం, ఆ కోర్టుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం పరిధిగా ఉండేలా నిర్ణయించడం, అలాగే దీనిని నిర్వహించడానికి ఒక స్పెషల్ జడ్జితో సహా మొత్తం 16 మంది సిబ్బందిని కేటాయించాలని చేసిన ప్రతిపాదనకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం తెలపడం >>2

## మరో 100 ఎంబిబిఎస్ సీట్లు

### ఎన్ఎంసి గ్రీన్ సిగ్నల్

### రాష్ట్రంలో వైద్య విస్తరణకు కీలకముందడుగు



**విజయవాడ,జులై 10.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో వైద్య విద్య విస్తరణకు మరో కీలక ముందడుగు పడింది. 202627 విద్యా సంవత్సరానికిఅదనంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో 75, నెల్లూరులోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 25 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) లెటర్ ఆఫ్ పర్మిషన్ (ఎల్ఓపీ) మంజూరు చేసింది. దీంతో రాష్ట్రానికి మొత్తం 100 అదనపు ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంసీ తాజా అనుమతితో కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 175 నుంచి 250కు పెరిగింది. నెల్లూరులోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో సీట్ల సంఖ్య 175నుంచి 200కు చేరుకుంది. ఈ పెంపుతో రాష్ట్రంలో >>2

## జనాభా దామాషాలో బిసి రిజర్వేషన్లు

### సమగ్ర కులగణన చేపట్టాలి

### రిజర్వేషన్లపై విధించిన 50శాతం పరిమితిని తొలగించాలి

### బిసి రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి: మహాధర్నాలో బిసి నేతలు



మహాధర్నా నిర్వహిస్తున్న బిసి నేతలు

**విజయవాడ, జులై 10, ప్రభాతవార్త :** సమగ్ర కులగణన చేసి జనాభా దామాషాలో బీసీ రిజర్వేషన్లు పెంచాలి , రిజర్వేషన్లపై విధించిన 50 శాతం పరిమితి ఎత్తివేయాలి. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలి, కులగణన చేపట్టిన తర్వాతే ఏపీలో స్థానిక ఎన్నికలు నిర్వహించాలి. బీసీ రక్షణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలి, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి, విద్యా ఉద్యోగాల వలె బిసి రాజకీయ రిజర్వేషన్లలో ఏబిసిడి లుగా వర్గీకరించాలి. బీసీల న్యాయమైన డిమాండ్ పరిష్కరించకపోతే ఆగస్టులో ఢిల్లీని ముట్టడిస్తాం అని బీసీ మహా ధర్నా లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్ >>2

## కడపలో మరో కరోనా కేసు

### పాజిటివ్ నిర్ధారణ వ్యక్తిని పరామర్శించిన కమిషనర్, ఎంహెచ్ఓ



**కడప కార్పొరేషన్, జులై 10 ప్రభాతవార్త:** కరోనా కేసులు (కోవిడ్ 19) నమోదు కలకలం రేపుతోంది. కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. కడప నగర పరిధిలోని మాసాపేట ప్రాంతంలో కరోనా వైరస్‌కు సంబంధించి పాజిటివ్ కేసు నమోదైన నేపథ్యంలో కడప నగరపాలక సంస్థ కమిషనర్ డా. పి. భవాని ప్రసాద్, ప్రజా వైద్య అధికారి డాక్టర్ సౌదాగిరి రమేష్ లు శుక్రవారం కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తిని స్వయంగా పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అలాగే వైద్య శాఖ అధికారులు, సిబ్బందికి >>2



శుక్రవారం మెల్‌బోర్న్‌లోని క్రికెట్‌గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనితో ప్రధాని మోడీ

# ప్రధాని మోడీకి అపూర్వ స్వాగతం

>> లక్సన్ స్వయంగా విమానాశ్రయానికి విచ్చేసి, ప్రధాని మోడీని ఆలింగనం చేసుకుని అత్యంత ఆత్మీయంగా, ఘనంగా స్వాగతం పలికారు. ఇండోనేషియా, ఆస్ట్రేలియా పర్యటనల అనంతరం ఆయన ప్రయాణిస్తున్న ఎయిర్ ఇండియా వన్ ప్రత్యేక విమానం ఆక్లాండ్ విమానాశ్రయంలో ల్యాండ్ అయింది. విమానం దిగి వచ్చిన ప్రధాని మోడీకి న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ ఘనంగా స్వాగతం పలికారు. ఇద్దరు ప్రపంచ దేశాల నేతలు ఎంతో ఆత్మీయంగా కరచాలనం చేసుకుని, ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. గడచిన నాలుగు దశాబ్దాలకు పైగా కాలంలో ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో జరుపుతున్న తొలి అధికారిక పర్యటన ఇదే కావడం విశేషం. ప్రధాని లక్సన్ ప్రత్యేక ఆహ్వానం మేరకు నరేంద్ర మోడీ ఇక్కడ రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. గతేడాది 2025 మార్చిలో న్యూజిలాండ్ ప్రధాని లక్సన్ భారతదేశంలో అధికారిక పర్యటన జరిపిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన ఇరు దేశాల బంధానికి కొత్త ఊపునివ్వగా, భారత్‌న్యూజిలాండ్ మధ్య చారిత్రాత్మక స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కూడా కుదిరింది. ఆ ఒప్పందం జరిగిన కొన్ని నెలలకే ప్రధాని మోడీ ఈ పర్యటనకు రావడం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ రెండు రోజుల పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు ద్వైపాక్షిక సంబంధాల పూర్తి పరిధిని కవర్ చేస్తూ విస్తృతమైన చర్చలు జరుపుతారు. ముఖ్యంగా ఆర్థిక, వాణిజ్య, వ్యాపార సహకారాన్ని మరింత ఉన్నత స్థాయికి విస్తరించడంపై ఈ సమావేశంలో ప్రత్యేక దృష్టి సారించనున్నారు. గత రెండేళ్లుగా భారత్, న్యూజిలాండ్ మధ్య వాణిజ్యం, వ్యాపారం, రక్షణ రంగాలలో సాధించిన గణనీయమైన పురోగతిని, తదుపరి కార్యాచరణను ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సమీక్షిస్తారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ప్రధాని మోడీ చేపట్టిన ఆరు రోజుల విదేశీ పర్యటన ఈ న్యూజిలాండ్ పర్యటనతో ముగియనుంది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పర్యటనను పురస్కరించుకుని ఆక్లాండ్ నగరం సరికొత్తగా ముస్తాబైంది. ఇరు దేశాల స్నేహానికి ప్రతీకగా ఆక్లాండ్‌లోని అత్యంత ప్రతిష్టాత్మకమైన 'స్కై టవర్‌'ను శుక్రవారం రాత్రి భారత త్రివర్ణ పతాక వర్ణాల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ అద్భుతమైన దృశ్యాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ, ప్రధాని మోడీకి ఆక్లాండ్లో అపూర్వ స్వాగతం లభించిందని పేర్కొన్నారు. ప్రధాని లక్సన్ ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి విమానాశ్రయంలో స్వాగతం పలకడం, స్కై టవర్ను త్రివర్ణ శోభితం చేయడం ఇరు దేశాల మధ్య ఉన్న దృఢమైన బంధానికి నిదర్శనమని, ఈ పర్యటన పలు రంగాలలో సహకారానికి కొత్త మార్గాలను తెరుస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

# కాల్పుల విరమణ ముగిసిందని చెప్పేశా

>> జలసంధిలో సముద్ర భద్రత వంటి కీలక అంశాలపై చర్చలు జరపాలని నిర్ణయించారు. అయితే ఖతార్‌లో జరిగిన పరోక్ష చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. అనంతరం ఇరు దేశాలు పరస్పరం సైనిక దాడులకు దిగడంతో మరోసారి ఉద్రిక్తతలు పెరిగి, యుద్ధ భయం నెలకొంది. ఇంతకుముందు నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ, టెహ్రాన్‌తో చర్చలు సమయ వృథాగా మారాయని వ్యాఖ్యానించారు. ఇరాన్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేస్తూ, వారితో వ్యవహరించాలనే ఆసక్తి తనకు లేదన్నారు. అమెరికా చర్చల బృందం దౌత్యపరమైన చర్చలను కొనసాగించేందుకు స్వేచ్ఛగా ఉందని తెలిపారు. టర్కీలో జరిగిన నాటో సమావేశానికి ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్, ఇరాన్‌తో కుదిరిన తాత్కాలిక ఒప్పందం ఇప్పటికీ అమల్లో ఉందా అనే ప్రశ్నకు స్పందిస్తూ, అది ఆసక్తికరమైన ప్రశ్న. నా అభిప్రాయం ప్రకారం అది ముగిసిపోయింది. వారితో నేను వ్యవహరించాలనుకోవడం లేదని అన్నారు. తదుపరి మాట్లాడుతూ, ఇరాన్‌తో మరో ఒప్పందం కుదిరినా అది కొనసాగుతుందనే నమ్మకం నాకు లేదు. వారు విశ్వసనీయత లేని వ్యక్తులుగా కనిపిస్తున్నారని ట్రంప్ వ్యాఖ్యానించారు. అయితే ఈ వివాదం పూర్తిస్థాయి యుద్ధంగా మారే అవకాశాలు తక్కువేనని, ఏదైనా జరిగినా చాలా త్వరగా ముగుస్తుందని, దాంతో చమురు సరఫరా సహా భద్రత మరింత మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. ట్రూత్ సోషల్‌లో మరో పోస్ట్‌లో ట్రంప్, తాజా సైనిక చర్య వాణిజ్య నౌకలపై జరిగిన దాడులకు ప్రతీకార చర్య అని పేర్కొన్నారు. "నిన్న ఇరాన్ వాణిజ్య నౌకలపై జరిపిన దాడులకు ప్రతిస్పందనగానే ఈ చర్య చేపట్టాం. మళ్లీ ఇలాంటి ఘటనలు జరిగితే పరిస్థితి మరింత తీవ్రంగా మారుతుంది" అని ఆయన హెచ్చరించారు.

# కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాలకు గౌరవం

## జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో మతాల మధ్య చిచ్చుపెట్టి, అలజడులు సృష్టించేందుకు వైసీపీ తెరవెనుక పెద్ద ఎత్తున కుట్రలు పన్నుతోందని జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైసీపీ ఆడుతున్న ఈ ప్రమాదకరమైన రాజకీయ క్రీడను ప్రజలంతా గమనించాలని కోరారు. రాష్ట్రంలో సనాతన ధర్మం, హిందుత్వంపై కావాలనే కొందరు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని విజయ్ మండిపడ్డారు. ఏలూరు సభలో జడ శ్రవణ్ అనే వ్యక్తి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ మాట్లాడటం వెనుక పెద్ద హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తం చేశారు. మత ఘర్షణలకు ప్లాన్ చేస్తున్న ఈ ముఠాకు, తాడేపల్లికి ఉన్న ఆర్థిక, రాజకీయ సంబంధాల గుట్టును పోలీసులు పూర్తిగా బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. జగన్‌కు వ్యతిరేకంగా తానే రూ. 25 కోట్లు ఖర్చు పెట్టానని చెప్పుకుంటున్న జడ శ్రవణ్‌కు అసలు అన్ని కోట్ల డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో సమాధానం చెప్పాలని నిలదీశారు. ప్రశాంతంగా ఉన్న సమాజంలో విషం చిమ్మేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. యూట్యూబర్ రాజేశ్, నటుడు ప్రకాశ్ రాజ్, అలాగే జడ శ్రవణ్‌లకు అసలు సనాతన ధర్మం అంటే ఏంటో తెలుసా? అని ప్రశ్నించారు. వీరంతా కేవలం ఒక అజెండా ప్రకారం పనిచేస్తున్న కిరాయి ఆర్టిస్టులని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో అన్ని కులాలు, మతాలు సమానమని స్పష్టం చేశారు. ఆయన... హిందుత్వంపై, సనాతన ధర్మంపై ఇలాంటి కుటిల యత్నాలు కొనసాగిస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు.

# ఇథనాల్ వినియోగంతో ఇంధన సామర్థ్యం తగ్గుదల: అంగీకరించిన కేంద్రం

**న్యూఢిల్లీ,జూలై 10:** ఇథనాల్ కలిపిన పెట్రోల్ (E20) వాడకం వల్ల వాహనాల మైలేజీ పడిపోతున్నాయన్న ఆందోళనలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తుండటం... కేంద్రం మాత్రం దాన్ని సమర్థించుకుంటూ రోజూ ప్రకటనలు విడుదల చేస్తోంది. వాహనాల్లో ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకం వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను మాత్రం అంగీకరించింది. 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ కొన్ని వాహనాల్లో ఇంధన సామర్థ్యాన్ని 35 శాతం వరకు తగ్గించగలదని చమురు మంత్రిత్వ శాఖ ఇవాళ స్పష్టత ఇచ్చింది. ఈ ప్రభావం కంటే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీనాక్ లక్షణాలు, వేగవంతమైన దహనం, మెరుగైన పికప్, సున్నితమైన త్వరణం, శుభ్రమైన ఇంజిన్ పనితీరు, తక్కువ జీవితకాల కార్బన్ ఉద్గారాలు వంటి ప్రయోజనాలే ఎక్కువగా ఉన్నాయని కేంద్ర వాదిస్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ కార్యక్రమంపై వస్తున్న విమర్శలను ఎదుర్కోవడానికి జారీ చేసిన ఒక వివరణాత్మక పత్రంలో పెట్రోలియం ,సహజ వాయువుల మంత్రిత్వ శాఖ, E10 లేదా స్వచ్ఛమైన పెట్రోల్ కంటే E20 ఒక శుభ్రమైన, అధికనాణ్యత గల, మరింత సమర్థవంతమైన ఇంధనమని పేర్కొంది. అలాగే సంవత్సరాల తరబడి శాస్త్రీయ పరీక్షలు, ఆటోమొబైల్ తయారీదారులతో సంప్రదింపులు ,దేశీయ ఇథనాల్ ఉత్పత్తి విస్తరణ తర్వాత మాత్రమే దీనిని ప్రవేశపెట్టినట్లు వెల్లడించింది. ఈ కార్యక్రమాన్ని చాలా తొందరగా అమలు చేశారన్న ఆందోళనలను మాత్రం చమురు శాఖ తోసిపుచ్చింది. భారతదేశపు ఇథనాల్ మిశ్రమ కార్యక్రమం 2001లో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టుల నుండి మొదలైందని, 2006 నాటికి దేశంలోని కొన్ని ప్రాంతాల్లో 5 శాతం మిశ్రమాన్ని ప్రవేశపెట్టారని గుర్తుచేసింది.

# బలపడుతున్న సూపర్ ఎల్ నినో

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త:** ప్రస్తుత సీజన్‌లో వర్షాలు ముమ్మరంగా కురవాల్సిన సమయంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎండలు దంచి కొడుతున్నాయి. రెండ్రోజులుగా తెలంగాణలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. దీంతో ఎండలు మళ్లీ దంచికొడుతున్నాయి. రాష్ట్రంలో గడచిన 24 గంటల్లో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగాయి. సూర్యాపేట జిల్లా వేపల్లెలో అత్యధికంగా 38.2 డిగ్రీ సెల్సియస్ ల ఉష్ణోగ్రత నమోదైంది. అంతేకాకుండా సుమారు 20 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 35 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యాయి. ఇక ఈ నెల 11నుంచి 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగనున్నాయి. ముఖ్యంగా 12 నుంచి 15 వరకు ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. తూర్పు తెలంగాణ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు 37 నుండి 40 డిగ్రీ సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నగరంలో సైతం ఉష్ణోగ్రతలు 35 నుండి 37 డిగ్రీ సెల్సియస్ వరకు చేరే ఛాన్స్ ఉంది, జనాలను ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. తీవ్రమైన ఎండల కారణంగా అక్కడక్కడా స్థానికంగా మేఘాలు ఏర్పడి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం కూడా ఉంది. జూలై నెల సగటు వర్షపాతంతో పోలిస్తే చాలా తక్కువ శాతమే నమోదైనట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

# కట్టుకథల కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

>> తెలిపిన కేబినెట్, నెల్లూరులో ఐటీసీ హోటల్, కడపలో మాధవి హోటల్‌కు, విజయవాడలో సరోవర్ పోర్టికో హోటల్‌కు, కడపలో ఇంటిగ్రేటెడ్ అమ్యూజ్‌మెంట్ పార్క్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు నిర్ణయించింది. విశాఖ, గుంటూరు, నెల్లూరులో అంబేడ్కర్ గురుకుల సీవోఈల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఐఐటీ జేఈఈ, నీట్‌కు రెసిడెన్షియల్ కోచింగ్ ప్రతిపాదనలకు అనుమతి ఇచ్చింది. పెద్దగెడ్డ రిజర్వాయర్ కమాండ్ ఏరియా ఆధునీకరణకు, కుప్పంలో ఫీడర్ ఛానెల్స్, బీరగానిపల్లె రిజర్వాయర్‌కు ఆమోదం తెలిపింది. ఎస్ఐపీబీ సిఫార్సులతో భారీ పెట్టుబడులకు ప్రోత్సాహకాలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఆర్డీఏ అథారిటీ ఆమోదించిన సంస్థలకు భూకేటాయింపులకు అనుమతులు ఇచ్చింది. మంత్రి మండలిలో అన్ని అంశాలపై కీలకంగానే చర్చించారు. అమరావతిలో రెండో విడతకు భూములిచ్చే రైతులకు సాగు రుణమాఫీకి ఆమోదం మంత్రి ఆమోదం తెలిపింది, భూమి సమీకరించే 7 గ్రామాల రైతులకు రూ.లక్షన్నర వరకు రుణమాఫీకి ఆమోదం తెలిపింది, 2026 జనవరి 6 కంటే ముందు తీసుకున్న రుణాలకు మాఫీ వర్తింపు చేసింది, భూములిచ్చిన, ఇవ్వబోయే రైతులకు వార్షిక కౌలు పెంపు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది, మెట్ట రైతులకు రూ.40 వేలకు, జరీబు రైతులకు రూ.60 వేలకు కౌలు పెంపునకు ఆమోదం, మెట్ట రైతులకు ఏటా రూ.3 వేలు, జరీబు రైతులకు రూ.5 వేల చొప్పున కౌలు పెంపు, రెండో విడత భూసమీకరణ గ్రామాల్లోని ఇనాం భూములకు పరిహారానికి ఆమోదం కేబినేట్ ఆమోదించింది. 307 ఎకరాల ఇనాం భూములకు దేవదాయశాఖకు రూ.159 కోట్ల పరిహారం ఎన్ఎఫ్‌డీబీకి భారీ అక్వేరియం, కార్యాలయం కోసం భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది, ఈశా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది .ఇటీవల 19వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపిన 11 ప్రాజెక్టులకు మంత్రిమండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీని వలర .రూ.9,076 కోట్ల పెట్టుబడులుతో 10,531 ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయి,

**తప్పుడు ప్రచారాలను తీవ్ర స్థాయిలో తిప్పి కొట్టండి:** అభివృద్ధి, సంక్షేమం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే విపక్షాలు పలు ఎత్తుగడలు వేస్తున్నాయని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఇందులో భాగంగానే పలు అంశాల్లో ప్రజలను పక్కత్రోవ పట్టించే దిశలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు., మంత్రి మండలి సమావేశం అనంతరం ఆయన మంత్రులతో మాట్లాడుతూ ప్రతి పథకంపైన పనిగట్టుకుని విష ప్రచారం చేస్తున్నారు. ఈ తంతంతా కూటమి నేతలను రెచ్చగొట్టే ఉద్దేశంతో చేస్తున్నారు. వైఎస్సార్సీపీ వాళ్లు ఎంత రెచ్చగొట్టినా మనవాళ్లు రెచ్చిపోవద్దని, సంయమనం పాటించాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా అనంతపురం తదితర చోట్ల జరిగిన కొన్ని ఘటనలను ఆయన ప్రస్తావించారు. జిల్లాల్లోని ప్రతి అంశంపైనా, ముఖ్యంగా రెవెన్యూ సమస్యలపైనా ఇన్‌ఛార్జ్ మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం ఆదేశించారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం నుంచి దృష్టి మరల్చేందుకు కొత్తగా కావాలని ఎమ్మెల్యేలను రెచ్చగొడుతున్నారని, వైసీపీ వాళ్లు రెచ్చగొడితే రెచ్చిపోవద్దని సూచించారు. వైసీపీ ట్రాప్‌లోకి లాగేందుకు చూస్తోందని జాగ్రత్తగా ఉండాలన్నారు. అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. ఇన్‌ఛార్జి మంత్రులు జిల్లాలకు వెళ్లిన సమయంలో ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఇన్‌ఛార్జి మంత్రులు.. రెవెన్యూ, ఇతర సమస్యలపై కూడా ఫోకస్ పెట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను వెంటనే కేబినెట్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సీఎం ఆదేశించారు.

# భారీగా కొరియా పెట్టుబడులు

>> చేయడం అన్నారు., గత రెండేళ్లలో దావోస్, సింగపూర్, జపాన్, రష్యా, మధ్యప్రాచ్యం, యూరప్, ఇప్పుడు కొరియా వంటి అనేక దేశాల్లో పర్యటించాం. మా లక్ష్యం కేవలం ఎంవోయూలు కుదుర్చుకోవడం మాత్రమే కాదు. శాశ్వతంగా నిలిచే భాగస్వామ్యాలను నిర్మించడం మా లక్ష్యం. ఈ పర్యటనలో నా కొరియా మిత్రుల్లో ఒకరు నాకు ఇచ్చిన ప్రశంసను ఎంతో విలువైనదిగా భావిస్తున్నా. ఆయన నన్ను పల్లి పల్లి మంత్రి అని పిలిచారు. కొరియన్ భాషలో 'పల్లి పల్లి అంటే 'త్వరగా… త్వరగా(వేగవంతమైన) అని అర్థం. అదే విధంగా మా ప్రభుత్వం కూడా పనిచేయాలని మేం కోరుకుంటున్నామని పేర్కొన్నారు. 2016లో కియా మోటార్స్ ఏపీలో పెట్టుబడి పెట్టాలనే ధైర్యవంతమైన నిర్ణయంతో మా ప్రయాణం ప్రారంభమైంది. కియా మోటార్స్ ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోవడం కేవలం ఒక పెట్టుబడి మాత్రమే కాదు. అది మాపై ఉంచిన విశ్వాసానికి నిదర్శనం. అతి తక్కువ కాలంలోనే అనంతపురంలోని కియా ప్లాంట్ ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థకు అత్యుత్తమ ఉత్పాదకత కలిగిన తయారీ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామం మరింత ముఖ్యమైంది. కియా ఒంటరిగా రాలేదు. కియాతో పాటు మొత్తం ఎకో సిస్టమ్ ను తీసుకువచ్చింది. ఈరోజు అనంతపురం భారతదేశంలోని అత్యంత విజయవంతమైన కొరియన్ ఆటోమొబైల్ క్లస్టర్లలో ఒకటిగా ఎదిగింది. ఇప్పుడు మేం రెండో అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాం. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ భారతదేశంలో తన మూడో మ్యానుఫ్యాక్చరింగ్ ప్లాంట్ కోసం శ్రీసిటీని ఎంపిక చేసింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అదేవిధంగా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ ప్యాకేజింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఈవీ కాంపోనెంట్స్, ఫుట్ వేర్, ఇండస్ట్రియల్ మ్యానుఫ్యాక్చరింగ్ వంటి రంగాల్లో కూడా కొరియా కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాం. ఈ పర్యటన మమ్మల్ని మరింత ముందుకు తీసుకెళ్లింది. నౌకా నిర్మాణం, సెమీకండక్టర్లు, భారీ పరిశ్రమలు, సముద్ర పరికరాలు, స్టార్టప్‌ల రంగాలకు చెందిన ప్రముఖులతో భేటీ కావడం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌కొరియా మధ్య భాగస్వామ్యం కేవలం ఒక కంపెనీ గురించి కాదు.. పూర్తిస్థాయి ఇండస్ట్రియల్ ఎకోసిస్టమ్ నిర్మించడమే మా లక్ష్యం అన్నారు.

**సౌత్ కొరియా మ్యానుఫ్యాక్చరింగ్, లాజిస్టిక్స్ గేట్ వేగా ఏపీని తీర్చిదిద్దుతాం.** ఇటీవల భారత్ లో సౌత్ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్ జరిపిన పర్యటన ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. రెండు దేశాల ప్రభుత్వాలు వచ్చే దశాబ్దానికి జాయింట్ స్ట్రాటజిక్ విజన్‌ను ఆమోదించడం జరిగింది. ఇకపై ఈ సంబంధం కేవలం వాణిజ్యానికే పరిమితం కాదు. సెమీకండక్టర్లు, ఏఐ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, షిప్ బిల్డింగ్, మారిటైం సెక్యూరిటీ, క్రిటికల్ మినరల్స్, క్లీన్ ఎనర్జీ, ట్రస్టెడ్ సప్లై చెయిన్స్, ఎమర్జింగ్ టెక్నాలజీ రంగాలకు విస్తరించింది. ప్రస్తుతం భారత్‌కొరియా ద్వైపాక్షిక వాణిజ్యం సుమారు 27 బిలియన్ డాలర్లకు చేరింది. 2030 నాటికి దీన్ని 50 బిలియన్ డాలర్లకు చేర్చాలని రెండు దేశాల ప్రభుత్వాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఆ లక్ష్యాన్ని మనం సాధించడమే కాకుండా అధిగమిస్తామని కూడా నమ్ముతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్ 190 బిలియన్ డాలర్లకు పైగా ఆర్థిక వ్యవస్థను కలిగి ఉంది. ఏటా దాదాపు 21 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను ఎగుమతి చేసే భారతదేశంలోని అగ్రగామి రాష్ట్రాల్లో ఏపీ ఒకటి అన్నారు.

**స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్ మా విజయ రహస్యం:** ఏపీ ప్రత్యేకతల గురించి చాలా మంది అడుగుతారు. అందుకు మూడు 'ఎస్' లు ప్రధాన కారణాలుగా చెబుతాను. స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్. ప్రతి విజయవంతమైన పెట్టుబడి గమ్యస్థానం వెనుక ఒక సమర్థవంతమైన పెట్టుబడి ప్రోత్సాహక సంస్థ ఉంటుంది. మా వద్ద అది ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు, భారతదేశంలోని అత్యుత్తమ పెట్టుబడి ప్రోత్సాహక సంస్థల్లో ఇదొకటి. ఏపీ ఎకనామిక్ డెవలప్ మెంట్ బోర్డుకి ఒక విషయం స్పష్టంగా చెప్పా. వారు కేవలం పెట్టుబడులను తీసుకురావడమే కాదు… భారతదేశ భవిష్యత్తును నిర్మిస్తున్నారు. ఎంఓయూతో ఈడీబీ పని ముగిసిపోదు. అసలు పని అప్పుడే ప్రారంభమవుతుంది. పెట్టుబడిదారులకు భూమి గుర్తించడం, అనుమతుల ప్రక్రియలో మార్గనిర్దేశం చేయడం, ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేయడం, సరఫరాదారుల వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమస్యలను పరిష్కరించడం, విస్తరణలో సహకరించడం వంటి ప్రతి దశలో ఈడీబీ తోడ్పడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే. మీ మొత్తం పెట్టుబడి ప్రయాణంలో ఈడీబీ మీ భాగస్వామి అన్నారు. కొరియా ఏం సాధ్యమో చూపించింది. ఎల్జీ తదుపరి అధ్యాయాన్ని లిఖిస్తోంది. ఇప్పుడు మరెన్నో కొరియా కంపెనీలు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌కొరియా భాగస్వామ్యంలోని మొదటి అధ్యాయం ఆటోమొబైల్ రంగం ద్వారా ఖించడం జరిగింది. రెండో అధ్యాయం ఎలక్ట్రానిక్స్ రంగంలో ఇప్పటికే కొనసాగుతోంది. మూడో అధ్యాయాన్ని మనమందరం కలిసి సెమీకండక్టర్లు, షిప్ బిల్డింగ్, ఏఐ, క్లీన్ ఎనర్జీ, స్వచ్ఛ ఇంధనం, అధునాతన తయారీ రంగాల్లో లిఖించబోతున్నామని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ కొరియా భారత రాయబారి గౌరంగలాల్ దాస్, కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఆసియా, పసిఫిక్ వ్యవహారాల బ్యూరో డైరెక్టర్ జనరల్ శ్రీమతి లీ మిన్‌క్యోంగ్ ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డా.కిమ్ టే హ్యూంగ్ (హ్యూంగ్ కిమ్) సీఐఐ ఆంధ్రప్రదేశ్ (కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) ఛైర్మన్ ఎస్.నరేంద్ర కుమార్, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ శ్రీసిటీ ఫ్యాక్టరీ ప్రాజెక్ట్ లీడర్ సంగ్ హియో, సోలమ్ సీవోవో జే గ్యాబ్ హాటా కోట్రా అవుట్‌బౌండ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఎం ఏ టీమ్ డిప్యూటీ డైరెక్టర్ డే క్యున్ కిమ్, ఏపీ ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్, ఏపీ ఇండస్ట్రీస్ కమిషనర్ శుభమ్ భన్సల్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా దామాషాలో బిసి రిజర్వేషన్లు

>> రావుల హెచ్చరించారు. రాజ్యాంగబద్ధంగా విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాలలో బీసీల వాటా బీసీలకే దక్కాలంటే దేశవ్యాప్తంగా సమగ్ర కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను జనాభా దామాషా ప్రకారం పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్ రావు లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్ లో బీసీ డిమాండ్లపై మహా ధర్నా చేపట్టారు ఈ ధర్నాకు ముఖ్యఅతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచాలని దశాబ్దాలుగా బీసీలు పోరాడుతున్న ప్రభుత్వాలు స్పందించకపోవడం బాధాకరమన్నారు, బీసీ రిజర్వేషన్లు పెంచకపోవడం వలన బీసీలు విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు తక్షణమే జోక్యం చేసుకొని ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతి జనగణనలో బిసి కులగణన చేపట్టేలా ప్రధాని నరేంద్ర మోడీతో చర్చించి ఆమోదింపచేయాలని విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లులో బిసి మహిళలకు సబ్ కోట కల్పించకపోతే మహిళా బిల్లు లక్ష్యం నెరవేరదని బిసి మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం లేని మహిళా బిల్లును బిసి'లు ఒప్పుకోరని వారు హెచ్చరించారు. ఏపిలో స్థానిక సంస్థల ఎన్నికలు కులగణాంకాలు చేపట్టిన తర్వాత, కూటమి ప్రభుత్వం బిసి'లకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్ల హామీని నెరవేర్చిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆగస్టు మాసంలో చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టి ఢిల్లీని కూడా ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్, కేసిన శంకర్ రావులు హెచ్చరించారు.



శుక్రవారం అమర్‌నాథ్ యాత్రకు తరలుతున్న భక్తులు

# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువులు

>> ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అను గుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లా ల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని ఆర్.అముదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు. ఈ ఆర్ఎస్‌కే పరిధిలోని సంకిలి, చిన్నయ్యపేట, బొడ్డవలస, అప్పాపురం, ఎం.ఆర్.పేట గ్రామాలకు తొలి దఫా అవసరంగా 811 బస్తాల యూరియా అవసరమని తెలిపారు. ఇప్పటికే బొడ్డవలస, అప్పాపురం గ్రామాలకు 225 బస్తాలు పంపిణీ పూర్తయిందని, మిగిలిన గ్రామాలకు 219 బస్తాల పంపిణీని యూరియా కార్డులు, తిశితి.లీళీ ద్వారా చేపట్టే సమయంలో రైతులు పెద్ద సంఖ్యలో రావడంతో అదనపు డిమాండ్ ఏర్పడిందన్నారు. అదనంగా వెంటనే 444 బస్తాల యూరియాను సమీప రైతు సేవా కేంద్రం నుంచి తెప్పించి అదే రోజు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామ పెద్దలతో సమావేశం నిర్వహించి, టోకెన్ విధానం, క్యూలైన్ ఏర్పాటు చేసి పంపిణీని కొనసాగిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లాలో 9,987 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు, అందులో మార్క్‌ఫెడ్ వద్ద 4,850 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ అందుబాటులో ఉందని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో ఎక్కడా ఎరువుల కొరత లేదని, కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. రైతులు అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని, అవసరమైన ఎరువులను ప్రభుత్వం సమయానికి అందిస్తుందని భరోసా ఇచ్చారు.

# కడపలో మరో కరోనా కేసు

>> బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు, కుటుంబ సభ్యులు, పరిసర ప్రాంత ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కరోనా వ్యాప్తిని నివారించేందుకు అవసరమైన అన్ని నివారణ చర్యలను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు. కడపలోని మాసాపేటలోకు చెందిన వ్యక్తి అనారోగ్యంతో కడప రిమ్స్‌లో వైద్యం తీసుకుంటున్న సమయంలో అతనితోపాటు ఉన్న తన తనయుడు ఆరిఫ్ అక్కడే ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అతనికి కరోనా పాజిటివ్ వచ్చింది. ప్రస్తుతం హోమ్ ఐసోలేషన్లో ఆరిఫ్ ఉన్నాడు.

# ఎన్ఐఎ కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు

>> జరిగిందన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి చెందిన, రెగ్యులర్ ప్రాతిపదికన రిజిస్ట్రార్ ( కోర్టు కేస్ అండ్ మేనేజ్మెంట్ )పోస్టు సృష్టికి కూడా మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించిందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. సుప్రీంకోర్టు సుమోటో రిట్ పిటిషన్ (క్రిమినల్)నెంబర్ 4/2021 లోని ఆదేశాలు, సుప్రీంకోర్టు కేస్ ఫ్లో మేనేజ్‌మెంట్ కమిటీఖీ చేసిన సిఫార్సుల మేరకు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టులోని ఖీస్టేట్ కోర్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ కమిటీఖీకి చెందిన న్యాయమూర్తులు రాష్ట్ర హైకోర్టులో జిల్లా న్యాయమూర్తి స్థాయికి సమానమైన రిజిస్ట్రార్ (కోర్ట్ అండ్ కేస్ మేనేజ్‌మెంట్)ఖీ పోస్టును సృష్టించాలని నిర్ణయించిన మేరకు ప్రభుత్వం రిజిస్ట్రార్ పోస్టు సృష్టికి ఆమోదం తెలపడం జరిగిందన్నారు. కొత్త పోస్టు ఏర్పడటం వల్ల జిల్లా న్యాయస్థానాలలో పెండింగ్ కేసులను తగ్గించేదుకు వీలు కలుగుతుందని న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

## మరో 100 ఎంబిబిఎస్ సీట్లు

>> వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు మరిన్ని అవకాశాలు లభించనున్నాయి. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధి, అధ్యాపక సిబ్బంది నియామకం, ఎన్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టిన చర్యల ఫలితంగానే ఈ అనుమతులు లభించాయని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణు వర్ధన్ తెలిపారు ఈ సందర్భంగా కడప, నెల్లూరు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, వైద్య సిబ్బందికి అభినందనలు తెలిపారు.

# రాష్ట్రానికి 14 మంది కొత్త ఐపిఎస్‌లు

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కొత్తగా 14 మంది ఐపీఎస్ అధికారులను కేటాయించింది. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ 2024 ఫలితాల ఆధారంగా ఈ కేటాయింపులు జరిగాయి. రాష్ట్రానికి కేటాయించిన ఐపీఎస్‌లలో చక్కా స్నేహిత్, చల్లా పవన్ కల్యాణ్, ఉర్మి సిన్హా, ముకుంద్ సింగ్, ఆశిష్ రఘువంశీ, వికాస్, రోనక్ ఆశారామ్ మీనా ఉన్నారు. వీరితో పాటు శివం సింగ్, శ్రేయస్ రావు, షా మహ్మద్ ఇమ్రాన్, నిఖిల్ యాదవ్, వీర్ రిషికేష్ నాగనాథ్, దోనేపూడి విజయ్ బాబు, పెండెం ప్రతీష్‌లను ఏపీకి కేటాయిస్తూ కేంద్ర హోం శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

**ఐదుగురు అధికారులకు ఐఏఎస్ హోదా** రాష్ట్రంలో ఐదుగురు అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించారు. అధికారులు గోపీనాథ్, బాలకృష్ణ, జయకృష్ణ, పద్మావతి, వరప్రసాద్‌కు ఐఏఎస్ హోదా కల్పించారు. కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌తో సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతిలో సిఎం చంద్రబాబు పర్యటన

**విజయవాడ,జూలై 10,ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటించారు. రాజధానిలో జరుగుతున్న వివిధ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా జడ్జీల నివాస సముదాయాలు, ఎన్జీవో భవనాల పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే అమరావతిలో కొత్తగా నిర్మిస్తున్న తమ సొంత నివాస భవనాన్ని సీఎం దంపతులు పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు.

## వారం - వర్జ్యం

11-07-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
ద్వాదశి రా. 2.03
కృత్తిక ఉ. 11.01
వర్జ్యం : రా. 1.19-రా. 2.45
దు.తె. 5.41-ఉ. 7.21
రాహుకాలం - ఉ. 9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** సుదూర ప్రాంతాలలోని మీ ఆత్మీయుల సహాయ సహకారాలు అందుకుంటారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు.

**వృషభం:** చర్మ సంబంధిత బాధలు కలుగకుండా జాగ్రత్తలు పాటించండి. పనులు సక్రమంగా పూర్తి చేస్తారు.

**మిథునం:** కుటుంబ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపు పథకాలపై దృష్టి సారిస్తారు. వ్యవహారాలలో నిదానం.

**కర్కాటకం:** పెద్దలతో మాట్లాడేటప్పుడు సంయమనం పాటించండి. ఉద్యోగులకు అదనపు బాధ్యతలు మోయాల్సి ఉంటుంది.

**సింహం:** సంతానాన్ని సక్రమైన పంథాలో నడిపించటానికి విశేషంగా కృషి చేస్తారు. సౌందర్య చిట్కాలపట్ల ఆకర్షితులవుతారు.

**కన్య :** నూతన పెట్టుబడులకు అనుకూలంగా ఉంటుంది. అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. శుభవార్తలు వింటారు.

**తుల :** సంఘంలో ఉన్నతమైన వారు మీకు అనుకూలంగా వ్యవహరించడం కొంత ఊరట కలిగించే అంశమవుతుంది.

**వృశ్చికం:** సాంకేతిక, పరిశోధన విషయాలపై ఆసక్తి చూపుతారు. వ్యాపారాలలో స్వల్ప మార్పులు ఉంటాయి. వాహనసౌలభ్యం కలదు.

**ధనుస్సు:** మిత్రుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. పురాతన వస్తు సేకరణ చేస్తారు. వివాహ యత్నాలుచేస్తారు.

**మకరం :** మొండితనం కన్నా సర్దుకు పోవటమే మేలని అనుకుంటారు. వ్యవహారాలలో పెద్దల సలహాలు పాటించండి.

**కుంభం:** ఒత్తిడుల నుండి బయటపడతారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి. ప్రయాణాలు లాభిస్తాయి.

**మీనం:** అప్పుచేయక పోవటమే నిజమైన పొదుపని గుర్తిస్తారు. పెండింగ్ కేసులు పరిష్కార బాటలో ఉంటాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

11-7Pg3exHMNWJQEKO.qxdo/p:11-7Pg3exHMNWJQEKO.qxd 1/2/02 6:53 AM Page 1



# ఎపిలో కోట్రా ఇన్వెస్ట్ కొరియా ఆఫీస్ పెట్టండి

- ఇన్వెస్ట్ కొరియా కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యూంగ్‌తో మంత్రి లోకేష్ భేటీ
- గృహోపకరణాల యూనిట్‌ను ఏర్పాటు చేయాలి
- కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌ఒడి చోహాన్ చుల్‌కు వినతి
- శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్టు నెలకొల్పండి
- ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒ ముందు ప్రతిపాదనలు పెట్టిన మంత్రి లోకేష్
- ఎపిలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం
- డెల్టా ఎక్స్ ఫౌండర్, సిఇఒ స్టీఫెన్ కిమ్‌తో మంత్రి




**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇన్వెస్ట్ కొరియా సంస్థ కమిషనర్ డాక్టర్ కిమ్ టే హ్యూంగ్‌తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సియోల్‌లో భేటీ అయ్యారు. అమరావతి లేదా విశాఖపట్నంలో ఒక ప్రత్యేక కోట్రా/ ఇన్వెస్ట్ కొరియా కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. మెట్రో నగరాలు మినహా దక్షిణ భారతదేశంలో ఇది మొదటి ఉప జాతీయ కోట్రా కార్యాలయం అవుతుంది. ఇది ఎపిలో అంతర్భాగంగా ఉండే కోట్రా డెస్క్ నుండి పూర్తిస్థాయి కార్యాలయంగా దశలవారీగా అభివృద్ధి చెందుతుంది. దీనికి సియోల్‌లోని కోట్రా / ఇన్వెస్ట్ కొరియాకు అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ డెస్క్ పనిచేస్తుంది. దీని ద్వారా ఎపిఇడిబి- కోట్రా నడుమ బలమైన బంధం ఏర్పాటై పరిశ్రమ దారులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలి పారు. పెట్టుబడిదారుల అవసరాలు, కమ్యూనిటీ అవసరాలపై నాలెడ్జ్ పార్టనర్‌గా ఉమ్మడిగా ఒక ప్రత్యేక కొరియా ఇండస్ట్రియల్ పార్క్ / కొరియా క్లస్టర్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. ఎపిలోని శ్రీసిటీ, విశాఖపట్నం, అనంతపురం/ కియా ఎకోసిస్టమ్‌కు కొరియన్ వ్యాపార ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించండి. సిఐఐ-పార్టనర్‌షిప్ సమ్మిట్ 2026 (12-13 నవంబర్ 2026,ఎపి)లో కొరియా సంస్థలు పెద్దఎత్తున హాజరయ్యేలా ప్రోత్సహించాలని మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.

**కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌ఒడి చోహాన్ చుల్‌తో మంత్రి లోకేశ్ భేటీ:** దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ఆరో రోజు ప్రముఖ సంస్థ కుకూ ఎలక్ట్రానిక్స్ హెచ్‌ఒడి చోహన్ చుల్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. ఎపిలో గృహోపకరణాల యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఇప్పటికే ఎపిలోని శ్రీసిటీలో గృహోపకరణాల క్లస్టర్ ఉందని, అనేక ప్రముఖ సంస్థలు అక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయని వివరించారు. భారతదేశంలో తయారవుతున్న ఎసిలలో 40శాతం, టివిలలో 35శాతం ఆంధ్రప్రదేశ్ నుంచే ఉత్పత్తి అవుతున్నాయని లోకేశ్ స్పష్టం చేశారు.

పరిశ్రమలకు అవసరమైన స్కిల్డ్ వర్క్ ఫోర్స్ రాష్ట్రంలో పుష్కలంగా అందుబాటులో ఉందని, ఇక్కడి నుంచి ఆగ్నేయ, మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతులు చేయడం చాలా సులభమని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా, దక్షిణ భారతదేశంలో ఎసిల వినియోగం చాలా ఎక్కువగా ఉందని వివరించగా, ఎపి ప్రభుత్వ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని కుకూ ఎలక్ట్రానిక్స్ ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒతోనూ...:** ఆటోమోటివ్ పవర్ ఎలక్ట్రానిక్స్ సంస్థ సిఇఒతో కూడా మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. శ్రీసిటీలో మోటివ్ లింక్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఈవీ విడిభాగాలు, ఇంటిగ్రేటెడ్ మాడ్యూల్ యూనిట్లను ఆంధ్రప్రదేశ్‌లో స్థాపించాలని కోరారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన విద్యుత్, నీరు, లాజిస్టిక్స్ వంటి అన్ని రకాల మౌలిక సదుపాయాలు శ్రీసిటీలో సిద్ధంగా ఉన్నాయని మంత్రి వారికి వివరించారు. వీటితో పాటు రక్షణరంగ తయారీ యూనిట్లలో కూడా పెట్టుబడులు పెట్టాలని, కొరియన్ కంపెనీల సహకారంతో మోటివ్ లింక్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు.

**ఎపిలో బ్యాటరీ యూనిట్‌కు డెల్టా ఎక్స్ సానుకూలం:** సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సిఇఒ స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఎపిలో ఒక బిఇఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సిఇఒ స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

**శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు:** అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు.

**ఎఐ, డేటా సెంటర్ హబ్:** రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు. ఎపిలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఒఎస్ఎటి క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఒఎస్ఎటి) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

**అమరావతిలో భాగస్వామ్యం:** రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వా నించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్‌డి విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు.

**శాంసంగ్ సిటీ:** శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఎపిలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించా లన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు. మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతిని ధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృం దంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు.

# రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి

**- సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి**

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పెట్టుబడుల పెట్టేందు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య.వ్యాపార రంగాల్లో దిగ్గజ సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని ఏపీ సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మంత్రి సచివాలయంలోని ప్రచార విభాగ సమావేశ ప్రాంగణంలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడులకు ముందుకు వస్తున్న సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోంది, సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం ముద్రవేసిందన్నారు. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు. రాష్ట్ర ఆర్థిక బలోపేతం, సంక్షేమ పథకాల అమలు, పేద విద్యార్థుల ఉపాధిపై సుదీర్ఘంగా చర్చించామన్నారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. తప్పుడు ప్రచారాలు, వ్యక్తిత్వ హననం వల్ల సమాజం, పాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతోందని డీజీపీ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాజకీయ ప్రత్యర్థులపై సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశపూర్వకంగా దాడులు చేస్తున్నారని, వీటికి కొన్ని పార్టీలు ఆర్థిక సాయం కూడా చేస్తున్నాయని విమర్శించారు. సంప్రదాయ మీడియాకు ఉన్న నైతిక విలువలు వీరికి లేవన్నారు.

మహిళలు, బాలికలను కించపరిచే పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వం సహించదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సోషల్ మీడియా దుర్వినియోగంపై ఫిర్యాదుల పరిష్కారం కోసం రాష్ట్రస్థాయిలో ప్రత్యేక రెస్పాన్స్ సెల్, టాస్క్‌ఫోర్స్




ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్వేషాలు వ్యాప్తి చేసే వారిని గుర్తించేందుకు ఆధునిక ఫోరెన్సిక్ టూల్స్ వాడాలని నిర్ణయించారు. ఈ అంశంపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. సైబర్ నేరాల విచారణకు నిపుణులైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించాలని సీఎం సూచించారు. సోషల్ మీడియా నియంత్రణకు సంబంధించి దేశ విదేశాల్లో అమలులో ఉన్న చట్టాలపై జీఓఎం అధ్యయనం చేయాలని ఆదేశించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌ను ఒక ప్రధాన పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం నూతన విధానాన్ని ప్రకటించింది. రాష్ట్రంలో సంగీత కచేరీలు కార్నివాల్స్ వంటి భారీ ఈవెంట్లను నిర్వహించే వారికి ఖివయబిలిటీ గ్యాప్ ఫండింగ్ఖి కింద ఆర్థిక సహాయం అందించనుంది. 20,000 మంది లోపు హాజరైతే రూ.2 కోట్లు, 20,000 నుంచి 50,000 మధ్య హాజరైతే రూ.5 కోట్లు, 50,000 దాటితే రూ.5 కోట్ల వరకు ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తుంది. దీనికి తోడు, ప్రభుత్వ ఆధీనంలోని పెద్ద మైదానాలను ఉచితంగా వాడుకునేందుకు అవకాశం కల్పిస్తుంది.

## మంత్రి ఆనంకు సిఎం చంద్రబాబు బర్త్ డే విషెస్



మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కేక్ కట్ చేయిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గురువారం నిర్వహించిన కేబినెట్ సమావేశం అనంతరం సిఎం ప్రత్యేకంగా ఈ వేడుకను నిర్వహించారు. సహచర మంత్రుల సమక్షంలో ఆనం రామనారాయణరెడ్డితో సిఎం చంద్రబాబు కేక్ కట్ చేయించారు. అనంతరం ఆనంకు కేక్ తినిపించి, ఆయన ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చంద్రబాబు ఆకాంక్షించారు. ఈ వేడుకతో కాన్ఫరెన్స్ హాలులో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇతర మంత్రులు కూడా ఆనం రామనారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ కార్యక్రమాలతో బిజీగా ఉన్నప్పటికీ, సహచర మంత్రి పుట్టినరోజును గుర్తుపెట్టుకుని సిఎం చంద్రబాబు వేడుక జరపడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఆనం నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, ప్రజా సేవలో మరింత ముందుకు సాగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌కు సిఎం జన్మదిన శుభాకాంక్షలు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు సీఎం చంద్రబాబు "ఎక్స్" వేదికగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలతో సుదీర్ఘ కాలం దేశానికి సేవ చేయాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని సీఎం పేర్కొన్నారు. ఇక రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు మంత్రి లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయురారోగ్యాలు, సుదీర్ఘ జీవితం ప్రసాదించాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని లోకేశ్ పేర్కొన్నారు.

## రామాయపట్నం పోర్టు గడువు పెంపు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రామాయపట్నం వద్ద ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ ఓడరేవు నిర్మాణ గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఈపీసీ పద్ధతిలో ఇక్కడ ఓడరేవు నిర్మిస్తున్నారు. ఈ పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టు సంస్థ ఎన్ఈసీఎల్‌కు డిసెంబర్ 30 వరకు గడువు పెంచారు. ఓడరేవు నిర్మాణ పనుల పూర్తికి ఎన్ఈసీఎల్‌కు గడువు పెంచడం ఇది రెండోసారి కావడం గమనార్హం.

## మాతృశాఖకు విజయవాడ జిజిహెచ్ డిప్యూటీ సిఎంఆర్ఒ

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ జీజీహెచ్ ఆసుపత్రిలో మృతదేహం తరలింపునకు అంబులెన్స్ సమకూర్చటంలో డిప్యూటీ సీఎంఆర్‌వో మంగాదేవి విఫలమయ్యారు.

## స్టాక్ మార్కెట్ పెట్టుబడులు పేరుతో మోసం
## ఆల్మైటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్ల అరెస్టు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త:** స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ప్రతి నెల స్థిరమైన లాభాలు అందిస్తామని ఖాతాదారులను మోసగించిన ఆల్మైటి జెనిసెస్ సంస్థ డైరెక్టర్లు పి.మోజేష్, లలితాంబికను కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూ.లక్ష పెట్టుబడి పెడితే నెలకు రూ.15 వేల చొప్పున 10 నెలలు, రూ.12,500 చొప్పున మరో 10 నెలలు అసలు, లాభం కలిపి రూ.4 లక్షలు ఇస్తామని ఈ సంస్థ రూ.కోట్లలో సేకరించింది. కొన్ని నెలలు చెల్లించాక నిలిపేయడంతో ఇటీవల బాధితులంతా ఆల్మైటి జెనిసెస్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆరుగురు ఖాతాదారులు సర్పవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితులను పోలీసులు అదుపులోకి తీసు కున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ కిషోర్ కుమార్ పర్యవేక్షణలో సర్పవరం పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయులు సమావేశంలో ఎఎస్‌పి ఎం.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఖాతాదారులకు సుమారు రూ.37 కోట్ల మేర చెల్లింపులు నిలిపేసినట్లు తెలిపారు. మోజేష్ బ్యాంకు ఖాతాల్లో తగిన నిల్వలు లేకపోవడం, ఆస్తులు కనిపించక పోవడం ఖాతాదారులను మోసగించా లనే ఈ సంస్థను నడుపుతున్నారని వివరించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో డైరెక్టర్లను అరెస్టు చేసి స్పెషల్ మొబైల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు కాకినాడ ఎదుట హాజరుపరచున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సర్పవరం సిఐ సిహెచ్ ప్రకాష్, ఎస్ఐలు ఎం. ఏసుబాబు, జి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్‌టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పునరుద్ధరించండి

- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఎపి ఛాంబర్స్, హోటల్స్ అసోసియేషన్ వినతి

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** హాస్పిటాలిటీ రంగ సమస్యలను కేంద్రం దృష్టికి తీసుకెళ్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. శుక్రవారం విజయవాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్‌ను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్, ఎపి స్టార్ హోటల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి హాస్పిటాలిటీ రంగానికి జిఎస్‌టి సంస్కరణలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 18శాతం జిఎస్‌టిని 5శాతానికి తగ్గించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రతినిధి బృందం మంత్రి దుర్గేష్‌కు విన్నించింది. కమర్షియల్ ఎల్‌పిజి వినియోగిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు పైప్డ్ నేచురల్ గ్యాస్ వినియోగిస్తున్న సంస్థలతో పోలిస్తే అధిక నిర్వహణ వ్యయాన్ని భరిస్తున్నాయని, దీంతో వ్యాపార నిర్వహణలో అసమాన పరిస్థితులు ఏర్పడుతున్నాయని వివరించారు. ఈ వ్యత్యాసాన్ని తొలగించి హాస్పిటాలిటీ రంగానికి సమాన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హాస్పిటాలిటీ రంగానికి జిఎస్‌టి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పునరుద్ధరణ అత్యంత అవసరమని, ఐటిసి తొలగింపుతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వహణ వ్యయం, మూలధన వ్యయం గణనీయంగా పెరిగాయని, సుమారు 20శాతం వరకు పెరిగిన అద్దె భారం కారణంగా ఇప్పటికే తక్కువ లాభాలతో నడుస్తున్న హాస్పిటాలిటీ రంగంపై తీవ్ర ఆర్థిక ఒత్తిడి ఏర్పడిందని వివరించారు.

ఈ ప్రతిపాదనలపై మంత్రి దుర్గేష్ సానుకూలంగా స్పందించి రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులతో కేంద్ర ప్రభుత్వానికి పంపించేలా చర్యలు తీసుకుంటామన్నారు.




అదే విధంగా జులై 14న టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ స్టార్ హోటల్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ ఫెడరేషన్, అసోసియేషన్ ఆఫ్ నార్త్ ఆంధ్ర డొమెస్టిక్ ఇన్‌బౌండ్ టూరిజం సంయుక్తంగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోని బెర్మ్ పార్క్ హరిత రిసార్ట్‌లో 'ఆంధ్రప్రదేశ్ ట్రావెల్ ఏజెంట్స్ మీట్ / ఇన్‌బౌండ్ టూరిజం కాన్‌క్లేవ్'కు తమ పూర్తి సహకారం అందిస్తున్నందుకు మంత్రి కందుల దుర్గేష్‌కు ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది.

# సమాచార హక్కు అమలు.. సుపరిపాలనకు నిదర్శనం

- రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టీకరణ
- ప్రజలకు సమాచారమే శక్తి.. ఆ హక్కు పరిరక్షణే అధికారుల బాధ్యత
- విజయవాడలో ప్రభుత్వ కార్యాలయాల్లో విస్తృత తనిఖీలు
- నిబంధనలు ఉల్లంఘించిన కార్యాలయాలకు షోకాజు నోటీసులు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత బలోపేతమవుతాయని రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం స్పష్టం చేశారు. ప్రజలకు సమాచారాన్ని సకాలంలో అందించడం ప్రతి ప్రభుత్వ అధికారి చట్టబద్ధమైన బాధ్యత అని స్పష్టం చేశారు. శుక్రవారం రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం విజయవాడలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సమాచార ప్రకటన నిబంధనల అమలు, ప్రజా సమాచార అధికారుల (పీఐవోలు) నియామకం, మొదటి అప్పీలేట్ అధికారుల వివరాల ప్రదర్శన, సమాచార హక్కు దరఖాస్తులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. తొలుత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీ     ్మశతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం డీఆర్‌వో కార్యాలయాన్ని సందర్శించి స.హ. చట్టం, 2005 అమలుతీరుతెన్నులను పరిశీలించారు. ఆపై ఆకస్మిక తనిఖీలలో భాగంగా దుర్గాపురం, గులాబీతోట స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు న్యూ జీజీహెచ్, వక్ఫ్‌బోర్డు, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలను తనిఖీ చేశారు. అయితే సమాచార



ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశను సంక్షేమ పథకాల డేటా అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర సమాచార కమిషనర్ డా. రెహానా బేగం

హక్కు చట్టం సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో దుర్గాపురం, గులాబీతోట స్వర్ణవార్డు కార్యాలయాలకు, అదేవిధంగా 4(1)(బి) రిజిస్టర్‌తో పాటు మరికొన్ని రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడంతో జీజీహెచ్‌కు నోటీసులు జారీచేశారు. ఈ సందర్భంగా డా. రెహానా బేగం మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం కేవలం సమాచారం అందించే చట్టం మాత్రమే కాదని, అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే కీలక సాధనమన్నారు. ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ముందస్తుగా అందుబాటులో ఉంచితే సమాచార హక్కు దరఖాస్తులు, అప్పీళ్ల సంఖ్య కూడా తగ్గుతుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రజలకు సకాలంలో సమాచారం అందించి పారదర్శకతకు పెద్దపీట వేయాలని సమాచార కమిషనర్ డా. రెహానా బేగం సూచించారు.


संगीत नाटक अकादेमी

సంగీత నాటక అకాడమీ

**నేషనల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్, డాన్స్ & డ్రామా**

రవీంద్ర భవన్, 35 ఫిరోజ్ షా రోడ్, న్యూఢిల్లీ-110 001

ఫోన్: 011-23386648, 23387246, 23387247, 23387248

ఇ-మెయిల్: mail@sangeetnatak.gov.in

**రిక్రూట్‌మెంట్ కోసం ప్రకటన**

భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని స్వయంప్రతిపత్తి గల సంస్థ అయిన సంగీత నాటక అకాడమీ (SNA), అకాడమీలోని క్రింది పోస్టులను మూడు సంవత్సరాల కాలానికి డిప్యుటేషన్ పద్ధతిలో బదిలీ ద్వారా భర్తీ చేయడానికి అర్హులైన భారతీయ పౌరుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

| పోస్ట్ పేరు | పోస్ట్ సంఖ్య | పే మ్యాట్రిక్స్ స్థాయి |
|---|---|---|
| డిప్యూటీ సెక్రటరీ (పరిపాలన) | 01 | పే లెవెల్ - 11 |
| డిప్యూటీ సెక్రటరీ (ఫైనాన్స్ & అకౌంట్స్) | 01 | పే లెవెల్ - 11 |
| ఆడిట్ అధికారి | 01 | పే లెవెల్ - 7 |

పోస్టులకు కావలసిన అర్హతలు మరియు ఇతర వివరాలు SNA వెబ్‌సైట్: www.sangeetnatak.gov.inలో అందుబాటులో ఉన్నాయి. **ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తులను నిర్దేశిత నమూనాలో, విజిలెన్స్ క్లియరెన్స్ మరియు గత 5 సంవత్సరాల ACRs/APARలతో పాటు, ప్రొపర్ చానల్ ద్వారా కార్యదర్శి, సంగీత నాటక అకాడమీ, రవీంద్ర భవన్, 35 ఫిరోజ్ షా రోడ్, న్యూఢిల్లీ-110001 చిరునామాకు సమర్పించవచ్చు. సంగీత నాటక అకాడమీ, న్యూఢిల్లీలో దరఖాస్తులను స్వీకరించే చివరి తేదీ 31 ఆగస్టు 2026.**

ఏ కారణం చెప్పకుండా ఏ సమయంలోనైనా ఏవైనా / లేదా అన్ని దరఖాస్తులను తిరస్కరించడానికి లేదా ప్రక్రియను / నియామకాన్ని రద్దు చేయడానికి అకాడమీకి హక్కు ఉంది.

కార్యదర్శి
సంగీత నాటక అకాడమీ
న్యూఢిల్లీ

**CBC 09114/11/0004/2627**

వార్త

జీవితంలో మమతలు పెంచుకున్నవాడు,
అదే కాలంలో మృత్యుభయాన్ని
హెచ్చించుకుంటాడు.

- లావోస్టే

# 'అణు'బంధం

ఇంధన భద్రతపై ప్రపంచమంతా ఆందోళన చెందుతున్న తరుణంలో భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఒక కీలక ఒప్పందం కుదిరింది. ఆస్ట్రేలియా నుంచి శాంతియుత అవసరాల కోసం భారత్‌కు యురేనియం ఎగుమతులకు అన్నివిధాల మార్గం సుగమమైంది. ఇరాన్ యురేనియం ముడిసరుకు కోసం అమెరికా ఖర్గే నుంచి ఎలుక కన్నాల వరకు తొలిచేస్తోంది. అదే సమ యంలో ఎలాంటి వివాదమూ రాజుకోకుండా భారత్‌కు ఆస్ట్రేలియా యురేనియం సరఫరాలో ఒక అడుగు ముందుకేసింది. ఇరుదేశాలు ఆస్ట్రేలియాల నుంచి భారత్‌కు యురేనియం సరఫరాను కార్యరూపంలోకి తెచ్చే పరిపాలనా ఆమోదాలను సిద్ధం చేసుకోవడం కీలకమైన ముందడుగే. నిజానికి తొలి అడుగు ఏనాడో 2014లోనే పడింది. ఆనాడు కుదిరిన పౌర అణు ఒప్పందానికి ఇప్పుడు ఆచరణాత్మక రూపం లభించిందన్న మాట. దీనిని కేవలం ఇంధన వాణిజ్య ఒప్పందంగా భావించకూడదు. ఇంధన భద్రత, ఇండో పసిఫిక్ ప్రాంతీయ సమతుల్యత, సరఫరా గొలుసుల స్థిరత్వం వంటి అంశాలతో ముడిపడి ఉన్నవ్యూహాత్మక భాగస్వా మ్యంగానే గుర్తించాలి. ఆస్ట్రేలియాలో భారత ప్రధాని నరేంద్రమోడీ పర్యటన సందర్భంగా వార్షిక ద్వైపాక్షిక శిఖరాగ్ర సమావేశం తర్వాత భారత ప్రధాని, ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ ఆల్బనీస్‌లు సంయుక్తంగా తమ ఒప్పందంలోని కీలక అంశాలను తెలియ చేశారు. తమ ఒప్పందా నికి బాసటగా ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ భద్రతా నిబంధనలు అమల్లో ఉంటాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల పర్యవసానంగా ఈ రెండు దేశాల మధ్య ఏర్పడిన ఒప్పందం ఉభయ తారకమే. ఇంధన సంక్షోభ సమయంలో భారత్, ఆస్ట్రేలియా స్నేహ హస్తం అందుకోవడం లాభదాయకమే. ప్రపంచ ఇంధన సరఫరా ధరలపై యుద్ధ ప్రభావం గణనీయంగాఎక్కువే. ఈ సందర్భంలో ద్రవీకృత సహజ వాయువు సరఫరాలో, ద్రవ ఇంధనాలు, పెట్రోలియం ఉత్పత్తుల సరఫరా లో ఈ రెండు దేశాల భాగస్వామ్యం మంచిదే. భారత్ 2047 నాటికి అణువిద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని గణ నీయంగా పెంచేలక్ష్యంతో ముందుకు సాగుతోంది. బొగ్గుపై ఆధారపడటాన్ని తగ్గిస్తూ తక్కువ కార్బన్ ఉద్గా రాలతో స్థిరమైన విద్యుత్‌ఉత్పత్తిని విస్తరించడానికి యురేనియం అవసరమని అంచనా. భారత్‌కు దేశీయంగా ఉన్న యురేనియం నిల్వలు సరిపోవు. ప్రపంచంలోనే ఆస్ట్రేలియా అతిపెద్ద యురేనియం నిల్వలు కలిగిన దేశం కావున ఆ దేశం భారత్‌కు భారత ఇంధన వ్యూహానికి దీర్ఘకాలిక భరోసానిస్తోంది. ఇండో పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న చైనా ప్రాబల్యమే కాకుండా సముద్రభద్రతపై నెలకొన్న ఆందోళనలు, సరఫరా గొలుసుల వైవిధ్యీకరణ, ఆవశ్యకత భారత్‌ఆస్ట్రేలియా సంబంధాలను మరింత సమర్థవంతంగా దగ్గర చేస్తున్నాయి. క్వాడ్ భాగస్వామ్య దేశాలుగా ఇరు దేశాలు రక్షణ సముద్ర భద్రత, సాంకేతికత, కీలకఖనిజరంగాల్లో సహకారాన్ని అందచేసుకుంటాయి. యురేనియం సరఫరా కారణంగా భారత్ ఉన్నట్టుండి అణుశక్తిరంగం ఒక్కసారిగా విప్లవాత్మ కంగా మారుతుందని చెప్పలేం. కొత్త అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, పెట్టుబడులు, సాంకేతిక సామర్థ్యం, వ్యర్థాల నిర్వహణ వంటి అనేకసవాళ్లు సవాళ్లుగానే మిగిలిపోయి ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న పరిస్థితుల రీత్యా అంతర్జాతీయ అణుశక్తి సంస్థ భద్రతా ప్రమాణాలకు లోబడి, దేశశాంతియుత అవసరాల మేరకు మాత్రమే భారత దిగుమతి చేసుకున్న యురేనియంను వినియోగించాల్సి వస్తుంది. భారత్‌తో చేసుకున్న ఒప్పంద రీత్యా ఇకపై ఆస్ట్రేలియా చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకునే అవకాశముంది. విశ్వసనీయ భాగస్వామిగా భారత్‌తోఇంధన వాణిజ్యాన్ని విస్తరణ అణుఇంధన రంగంలో కొత్త మార్కెట్ వచ్చి చేరుతుంది. కీలక ఖనిజాల అవసరమూ ఏర్పడుతుంది. ఈదృష్ట్యా ఇరుదేశాల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద విస్త రణకు కూడా ఆస్కారం ఉంటుంది. అణుశక్తిని స్వచ్ఛమైన విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి చేయాలనే సంకల్పానికి ఇదొక పునర్నిర్వచనం చెబుతోంది. అంటే భారత్ స్వావలంబన దిశగా స్థిరమైన అడుగులు వేయనున్నది. ఈ పర్యటనలో మొత్తం 18 ఒప్పందాలపై భారత్, ఆస్ట్రేలియాల మధ్య సంతకాలు జరిగాయి. వీటిలో భారత్ తీర రక్షక దళం, ఆస్ట్రేలియాకు చెందిన మారిటైమ్ బోర్డర్ కమాండ్‌ల మధ్య ఒప్పందం కూడా ఇమిడి ఉంది. ఇది సముద్ర చట్టాల అమలు, సముద్ర ప్రాంతాలపై అవగాహన, సరిహద్దుల రక్షణ వంటి అంశాలలో పరస్పర సహకారానికి దోహదపడుతుంది. ఈ చర్చలు, ఒప్పందాలు ఇరుదేశాల మధ్య అసాధారణమైన అంశాలుగా ప్రధానులిద్దరూ అభిప్రాయపడ్డారు. ఇదిలా ఉండగా కేవలం శిలాజరహిత ఇంధన సామర్థ్యాన్ని పెంచడానికే భారత్‌కు యురేనియం ఆస్ట్రేలియా ప్రధాని ఆల్బానీస్ ప్రకటించారు. ఇకపై తమ భాగస్వామ్యం గతంలో ఎన్నడూ లేనంత పటిష్టంగా ఉండబోతుందన్న ఆశాభావాన్ని ఉభయులూ ప్రకటించారు. ఆస్ట్రేలియాలోని అతిపెద్ద సూపర్ ఫండ్ ఆస్ట్రేలియా భారతదేశంలో రూ.3,311కోట్లు అదనపు పెట్టుబడి పెట్టనుంది. భారత ఆర్థికవ్యవస్థపై పెట్టుబడిదారుల విశ్వాసానికి ఇదే నిదర్శనమని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఇండియా, ఆస్ట్రేలియా సిఇఒల ఫోరమ్‌లో ఆయన ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తాజా పెట్టుబడితోభారత ఆర్థికరంగంలో ఆస్ట్రేలియన్ సూపర్ మొత్తం పెట్టుబడి 3.3 మిలియన్ డాలర్లకు చేరనుంది. 28ఏళ్ల తర్వాత ఆస్ట్రేలియాలో పర్యటించిన తొలిభారత ప్రధాని తానేనని నరేంద్రమోడీ ఎంతో సంతోషంగా ముచ్చటించారు. ఈ పర్యటన భారత్, ఆస్ట్రేలియాల మధ్య ఎంతో పటిష్ట బంధాన్ని నిలబెట్టిందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

మనకు ఉన్న సంపదతో సంతృప్తిపడడం ఉత్తమం. మనకి ఉన్న జ్ఞానం సరిపోతుందనుకోవడం అజ్ఞానం.




సర్వేపల్లి రాధాకృష్ణన్

నీవెవరినో చూసి అనుకరించాలనుకునే కంటే నీకు నీవు సహజంగా ఉండటం ఎంతో శ్రేయోదాయకం.



బెర్నార్డ్ షా

## ప్రజావాక్కు



### ఒకరు వద్దు,ఇద్దరు ముద్దు నినాదం చాలు

ఇప్పటికిప్పుడే మన జనాభాను ప్రత్యేకంగా పెంచాల్సిన పని లేదు, ఇంకా పెరుగుతూనే వుంది, పెరుగుదల రేటు మాత్రం తగ్గింది. సమీప భవిష్యత్తులో యువతకు కొరత రాదు ఎప్పుడో విజన్ 2047 నాటికి ఆ పరిస్థితి వస్తే జపాన్ వలె పదవీ విరమణ వయస్సు పెంచీ, ఇరాన్ సైన్యం వలె ఉద్యోగ అర్హత వయసు తగ్గించి, ఆనాటి పరిస్థితులకి తగినట్లు ఆ పాలకులు చర్యలు చేపడతారు. నేడెందరో విద్యావంతులు, చిరుద్యోగులు విద్య, వైద్యం, పిల్లల పెంపకం వంటి కుటుంబ ఖర్చులు తట్టుకోలేక ఒక బిడ్డతోనే సరిపుచ్చుకుంటున్నారు. కనుక ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మూడో బిడ్డకి ఇస్తామంటున్న ముప్పై వేల రూపాయలను మొదటి బిడ్డకీ, నాలుగో బిడ్డకి ఇస్తామనే నలభై వేలని, రెండోబిడ్డకీ ఇచ్చి, గతంలో వలె అన్నిరాయితీలను అందిస్తే ఫలితం వుంటుంది. ఆ రెండో బిడ్డ, తొలి బిడ్డకి తోడై, వారి ఆటపాటలతో పెద్దలకీ కాలక్షేపంగా వుంటుంది. ఇక చదువుల కోసం బడిలో చేర్చే తల్లిదండ్రులిద్దరూ వుద్యోగులైతే పిల్లల సంరక్షణ కోసం, వారి కుటుంబపెద్దల్నీ తెచ్చుకుంటారు. ముఖ్యమంత్రి ఆశిస్తున్నట్లు వుమ్మడి కుటుంబ వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### సంకల్ప బలం ముఖ్యం

16వ ఆర్థిక సంగం నిధులు గ్రామపంచాయితీలకు విధిల్చాలి అంటే పెట్టిన నిబంధనలు గ్రామపంచాయితీల మధ్య పోటీ తత్వం పెంచే విధంగా ఉన్నాయి. అవి స్వంత నిధులను పెంచుకోవడం వైపు మార్గాలు వెతకాల్సిన పరిస్థితిని కల్పిస్తున్నాయి. అది హరిత హారం ద్వారా పెంచొచ్చు లేదా తెలంగాణకు ఉండే చారిత్రక జల సంపద ద్వారా కావొచ్చు. మొత్తం మీద కావాల్సినది సంకల్పం మాత్రమే.

- భారత అవినాష్, జనగాం

### పంటల మార్పిడి చేయాలి

నేటి కాలంలో పొలాలలో ఆధునికపద్ధతులను, యంత్రాలను ఉపయోగించి పంటల మార్పిడి విధానాన్ని చేపట్టి అధిక దిగుబడిని పెంపొందించుకోవాలి. రెండు కాలాలు ఒకే పంట వేసి నేల సామర్థ్యాన్ని తగ్గించడం కంటే మెరుగైన బహుళ జాతి పంటలు వేస్తే మద్దతు ధరతో పాటు దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### మాతృభాష మాధుర్యం

తెలుగు భాషలోని మాధుర్యం, సౌందర్య సౌరభాలు మరే భాషకులేవని ఘంటాపథంగాచెప్పవచ్చు. మాతృభాషను విస్మరించడం అంటే, అమ్మ భాషను మరిచిపోవటమే అవుతుంది. కేవలంరచయితల కల్పనలకే పరిమితమయ్యే దుర్గతి తెలుగుకు దాపురించిందంటే అతిశయోక్తి కాదు. దీన్ని అధికమించాలంటే మన పిల్లలకు చిన్నతనం నుంచి తెలుగుదనం అలవరచాలి. రామాయణ, భారతాల వంటి ఇతిహాసాలను పరిచయం చేస్తూ, ఆకథలను పిల్లలకు చెప్తూ మాతృభాషలోని తియ్యదనాన్ని వారికి రుచి చూపించాలి. వారికి తెలుగు మాట్లాడటం, చదవటం, రాయటం నేర్పించాలి. ప్రాథమిక పాఠశాలలో అర్హులైన తెలుగు ఉపాధ్యాయులను నియమించి తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి. పదవ తరగతి వరకు తెలుగు పాఠ్యాంశాన్ని తప్పనిసరి చేయాలి. తెలుగు మాధ్యమాలలో చదివిన వారికి ఉద్యోగాల్లో, ఇతరత్రా ప్రోత్సాహకాలు అందించాలి. తెలుగుభాషను బ్రతికించుకోవాలంటే, ప్రభుత్వ కార్యకలాపాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలకు తెలుగును ఉపయోగించాలి.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### విద్యుత్ పొదుపుపై అవగాహన అవసరం

దేశంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ శాఖలు విద్యుత్ పొదుపుపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రోకేంద్రాల్లో రాత్రి వేళల్లో అవసరానికి మించి వెలిగించే దీపాలను తగ్గించడంద్వారా గణనీయమైన విద్యుత్ ఆదా సాధ్యమవుతుంది. ప్రయాణికుల రద్దీ తక్కువగా ఉండే అర్ధరాత్రి సమయాల్లో ప్రతి దీపాన్ని వెలిగించడం అవసరం లేదు. ప్రధాన స్టేషన్లు, లోకల్ రైలు కేంద్రాలు, మెట్రో స్టేషన్లలో కనీస భద్రతకు అవసరమైనంత వెలుతురు మాత్రమే ఉంచి, మిగతా దీపాలను నిలిపివేయవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్నత విద్య

వివిధ యూనివర్సిటీల నుండి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఉన్నత విద్య అవకాశాలు కల్పించాలి. ఈ కోర్సులకు గాను వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలి. ప్రతి ప్రభుత్వ శాఖ ఆధ్వర్యంలో ఆయా శాఖల అభివృద్ధికి గానునిధులు నియామకాలు సంక్షేమపథకాల ప్రచారం కొరకు పరిశోధనలు అవసరం. తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగులలో ప్రస్తుతం ఉన్నత విద్య డాక్టరేట్ పట్టా పొందిన వారి చేత పర్యవేక్షణ వీరి ద్వారా చేయించడం అవసరం.

- రాపాక రవీందర్, జనగాం

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# తిప్పలు పెడుతున్న రెవెన్యూ చట్టాలు!

**'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇక కౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్ని కోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి.**

దామెర్ల సాయిబాబ

కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడిపోయినట్లుగా ఉంది. భూముల వ్యవహారంలో కొందరు పాలక పెద్దలు, మరికొందరు అధికారులు వ్యవహరిస్తున్న తీరు. సంస్కరణలు, చట్టాలు ఎన్ని తెచ్చినా అవి ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలి. అందులోని కష్టనష్టాలను సమగ్రంగా అధ్యయనం చేసి ఆచరణ సాధ్యం అవుతుందా? అందుకు తగిన సిబ్బంది ఉందా? వీటన్నింటిని మించి సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యం వారికుందా? తదితర అంశాలు పరిగణనలోకి తీసుకొని చట్టాలుచేయాలి. అప్పుడే ఆ చట్టాలు చేసిన నేతలకు ప్రజాభిమానం పెరుగుతుంది. భూముల రికార్డుల విషయంలో ఆది నుంచి భూయజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇప్పుడే కాదు గతంలో కూడా ఎన్నో చట్టాలు చేశారు. ఎంతో మంది అధికారులను నియమించారు. కానీ సమస్యలు పెరిగాయే తప్ప తగ్గలేదని చెప్పొచ్చు. దశాబ్దాల తరబడి వేలాది కేసులు న్యాయస్థానాల్లో కొనసాగుతూనే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన కాంగ్రెస్‌ప్రభుత్వం 'భూ భారతి' చట్టాన్ని సరికొత్తగా ప్రవేశపెట్టింది. అంతకు ముందు తెలంగాణ ఏర్పడిన తర్వాత మొదటిసారిగా టిఆర్ఎస్ ప్రభుత్వం 'ధరణి పోర్టల్' అనే నూతన చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఆ చట్టం రికార్డుపరంగా ఎంత ఉపయోగకరంగా కన్పించినా ఆచరణకు వచ్చేసరికి అన్నీఇన్నీ ఇబ్బందులు కాదు. ఎంతో వ్యయం చేసుకున్నా రికార్డులు సరిచేయించలేక, జరిగిన పొరపాట్లతో కొందరు రైతులు ప్రభుత్వాల నుంచి పొందాల్సిన ప్రయోజనాలను పూర్తిగా పొందలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ చట్టాన్ని పక్కనబెట్టి ఇప్పుడు కొత్తగా 'భూ భారతి' చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఎంత పటిష్టంగా, పకడ్బందీగా నిబంధనలు ఏర్పాటు చేసినా శత కోటిదరిద్రాలకు అనంత కోటి ఉపాయాలన్నట్లు ఏదోరకంగా దళారులు, మరికొందరు రియల్టర్‌ల నుండి ముఖ్యంగా ప్రభుత్వం భూములను కాపాడలేకపోతున్నారు. భూముల రేట్లు అత్యధికంగా పెరిగిన హైదరాబాద్‌తోపాటు చుట్టూ ఉన్న రంగారెడ్డి తదితర జిల్లాల్లో అక్రమాలకు అంతేలేకుండా పోతున్నది. అంతెందుకు తెలంగాణలో 'హైడ్రా'ను ప్రవేశపెట్టిన తరువాత వెలుగు చూసిన ప్రభుత్వ భూములు, ప్రధానంగా చిన్ననీటి వనరులను ఆక్రమించుకొని ఏకంగా పెద్దపెద్ద భవనాలే కాదు కాలనీలకు కాలనీలే నిర్మించుకొన్న ఉదంతాలు బయటపడ్డాయి. కొన్నింటిని కూల్చి వేసి తిరిగి హైడ్రా ప్రభుత్వానికి స్వాధీనం చేసింది. ఒకటి రెండు కాదు వేలాది ఎకరాల అత్యంత విలువైన భూములున్నాయి. ఈ అక్రమాలు నిర్మాణాలన్నీ ఒక్కరోజులోనో, ఒక నెలలోనో జరిగినవి కాదు. దశాబ్దాల తరబడి జరిగాయి, జరుగుతున్నాయి. చాలావరకు అనుమతులు సంబంధిత ప్రభుత్వ కార్యాలయాల నుండి పొందారు. ఇందులో నష్టపోయింది, పోతున్నది అమాయక కొనుగోలుదారులే. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా చెప్పుకొనే ప్రజాప్రభుత్వంలో వేలాదిరూపాయలు జీతభత్యాలు రూపేణ నెలనెలా ప్రజాధనాన్ని తీసుకొంటున్న సంబంధిత అధికారగణం ఏంచేస్తున్నట్లు అనే ప్రశ్న ఉదయించక తప్పదు. ఇటీవల అవినీతి నిరోధక శాఖ చేస్తున్న ఆకస్మిక తనిఖీల్లో ఆదాయానికి మించిన వందలాది కోట్లరూపాయల విలువైన అక్రమాస్తులు బయటపడుతుండటం పరిశీలిస్తే చట్టాలకు ఎలా తూట్లు పొడుస్తున్నారో అర్థమౌతుంది. వాస్తవంగా చూసినా భూముల విషయంలో నిజాంపాలన నుండి పటిష్టమైన చట్టం లేదని చెప్పొచ్చు. తెలంగాణ ప్రాంతంలో 1936 నుంచి రికార్డ్స్ ఆఫ్ రైట్స్ నిర్వహించడం ప్రారంభించారు. నైజాం పరిపాలన హక్కుల రికార్డుల నిర్వహణ కోసం భూమి హక్కుల రికార్డు చట్టం 1936 ఫస్లీ రూపొందించారు. ఆ తర్వాత హైదరాబాద్ రాష్ట్రంలో భూహక్కుల రెగ్యులరైజేషన్ చట్టాన్ని 1358 ఫస్లీ పేరుతో మరో చట్టాన్ని తెచ్చారు. ఆ చట్టాన్ని రద్దు చేస్తూ 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తకాల చట్టం చేశారు. ఇలా ఎన్నో మార్పులు, చేర్పులు చేసినా ఖచ్చితమైన రికార్డులు చేయలేకపోయారనే చెప్పొచ్చు. అందుకే ప్రభుత్వ, దేవుళ్ల భూములతోసహా వేలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయి. శాసనసభలో కూడా ఎన్నోసార్లు ఈ ఆక్రమణలపై చర్చలు జరిగాయి. భూముల విషయంలో రాజుల మధ్య కొంతకాలం, జాగీర్దారుల మధ్య కొంతకాలం ఆ తర్వాత భూకామందుల మధ్య చివరకు వారిపై తిరగబడ్డ సన్నజనం కూడా ఈ పోరాటంలో పాలు పంచుకున్నారు. నక్సలిజం ఆవిర్భావానికి, ఇప్పటికీ అంతో ఇంతో మిగిలి ఉండడానికి ప్రధాన సమస్య అదే. భూమి ముఖ్యమైందన్న విషయం నిర్వివాదం. భూముల విషయంలో ఇప్పటికీ ఎన్నిచట్టాలు చేశారో, ఎన్ని సవరణలుచేశారో, ఇంకెన్ని మినహాయింపులు ఇచ్చారో లెక్కకు అందదు. రాజకీయాల అవసరాలకోసం భూమి చూపి పేదల జీవితాలతో ఆటలాడుకుంటున్నారన్న విమర్శలు ఏనాటి నుంచో వినిపిస్తున్నాయి. పార్టీలు మారినప్పుడు వారి ఆలోచనా ధోరణిలో మార్పు వచ్చినప్పుడల్లా చట్టాల్లో మార్పులు చేసుకుంటూపోతున్నారు. 1971లో కేంద్ర ప్రభుత్వం భూగరిష్ట పరిమితిని తీసుకురావడంతో కొంత కదలిక వచ్చిందని చెప్పొచ్చు. 1973లో జనవరి ఒకటిన అప్పటి ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం చట్టం చేసింది. కానీ అమలు చేయడానికి చట్టం వచ్చిన రెండేళ్ల తర్వాత 1975 జనవరి నుంచి శ్రీకారం చుట్టారు. ఈ రెండేళ్ల వ్యవధిలో చాలామంది పెద్దలు తమ భూములను సర్దుబాటు చేసుకునే అవకాశం దొరికింది. పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములను పెద్దలు నయానో, భయానో ఆక్రమించి అమ్ముకుంటున్నారని అలా వీలుకాకుండా పటిష్టమైన 9/77చట్టాన్ని తీసుకువచ్చారు. అయినా అసైన్డ్ భూముల అమ్మకాలు, కొనుగోళ్లు ఆగలేదు. ఇందుకు రాజకీయ జోక్యం, అవినీతి కారణం. పట్వారీతో పంచాయతీ పెట్టుకుంటే పొలం పోయి గుట్టెక్కుతుంది. గుట్ట వచ్చి పొలంలో కూర్చుంటుందనే నానుడి అప్పట్లోనే ఉండేది. ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీరామారావు ఏకంగా ఆ వ్యవస్థనే రద్దు చేశారు. అయినా ఆ జాడ్యం ఆగలేదు. ఏదో ఒక రూపం లో కొనసాగుతూనే ఉంది. ఇలాంటి వాటిని అధిగమిం చేందుకు భూహక్కుల రికార్డులను పక్కాగా నిర్వహించ డానికి భూమి అమ్మకాలు, కొనుగోళ్లు జరిగిన వెంటనే రికార్డుల్లో మార్పులు చేసి భూయజమానులకు హక్కు పత్రం ఇవ్వడానికి భరోసా కల్పించడానికి తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' పోర్టల్ కొత్త చట్టాన్ని తీసుకువచ్చింది. భూ రికార్డుల నిర్వహణలో అధునాతనమై పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ పట్టాదారు పాసుపుస్తకాల జారీలో జాప్యాన్ని నివారించడం, భూపరిపాలన, అవినీతిని నిర్మూలించడం లక్ష్యంగా ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు చెప్పారు. ఏకగవాక్ష విధానం ద్వారా భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, పట్టాల జారీ అన్నీ ఒకే రోజు ఒకే కార్యాలయంలో జరిగేలా నిబంధనలు పొందుపరిచారు. ఇవన్నీ తు.చ తప్పకుండా అమలు చేసి పొరపాట్లు జరగకుండా చేయగలిగితే రైతులకు ఎంతో మేలు జరిగేది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు వేరయ్యాయి. సమస్యలు పెరిగిపోయాయి. కొందరు ఉద్దేశ్యపూర్వకంగా రికార్డులు తప్పువచ్చేలా చేసి అవి సవరించడానికి వేలు కాదు, లక్షలు వసూలు చేశారు. సమస్యలను భూతద్దంలో చూపి మాయమాటలతో నమ్మించి తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసిన సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. 'భూ భారతి' చట్టం కూడా విధానపరంగా ఎంతో కొంత ఆశాజనకంగానే కన్పిస్తున్నది. కానీ అమలులో సమస్యలు తక్కువేమీ లేవు. వందలాది కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమార్కుల పాలవుతున్నాయనే విమర్శలు పెల్లుబుకుతున్నాయి. అవినీతి కూడా ఏమాత్రం తగ్గలేదు. తమ చుట్టూ ప్రదక్షిణలు చేసే భజనపరులతో కాకుండా తమకు ఉన్న ఏజెన్సీల ద్వారా క్షేత్రస్థాయిలో జరుగుతున్న వాస్తవాలను తెప్పించుకోగలిగితే కొత్త చట్టానికి అర్థం పరమార్థం ఉంటుంది. ఇకకౌలురైతుల, పోడు భూముల సమస్యలు రగులుతూనే ఉన్నాయి. వాటిని పరిష్కరిస్తామని పాలక పెద్దలు ప్రకటించారు. లక్షలాది మంది గిరిపుత్రులు, కౌలురైతులు ఎదురుచూస్తున్నారు. ఈ సమస్యలు ఎంతో సున్నితమైన భూముల విషయంలో జోక్యం చేసుకొని చేతులే కాదు ఒళ్లు కాల్చుకున్న పెద్దలున్నారు. అవన్నీ దృష్టిలో ఉంచుకొని అన్నికోణాల్లో మనసు పెట్టి ఆలోచించి ఆచితూచి అడుగులు వేయాలి. ●

## ఒక్క మాట

# జనాభా కాదు... జనశక్తిని నిర్మించాలి

వంగవోలు రవి

భారత్ అభివృద్ధి భవిష్యత్తు జనాభా పరిమాణంపై కాదు, యువతకు విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యం, ఉపాధి, స్వేచ్ఛ కల్పించడంపైనే ఆధారపడి ఉంది. ప్రపంచ జనాభా దినోత్సవం వచ్చినప్పుడల్లా మన చర్చ ఇప్పటికీ "జనాభా ఎంత పెరిగింది?" అనే ప్రశ్న చుట్టూనే తిరుగుతోంది. కానీ నేడు ప్రపంచం ఎదుర్కొంటున్న అసలు ప్రశ్న అది కాదు. ఐక్యరాజ్యసమితి జనాభా నిధి 2026 ప్రపంచ జనాభా దినోత్సవానికి ప్రకటించిన 'రిలైజింగ్ ద హోప్స్ అండ్ ఆస్పిరేషన్స్ ఆఫ్ యంగ్ పీపుల్ టుడే అండ్ ఫర్ ద ఫ్యూచర్' అనే థీమ్ కూడా ఇదే విషయాన్ని గుర్తుచేస్తోంది. జనాభా ఎంత ఉందన్నది కాదు ఆ జనాభా ఎంత ఆరోగ్యంగా ఉంది, ఎంత చదువుకుంది, ఎంత నైపుణ్యం సంపాదించింది, ఎంత స్వేచ్ఛగా తన జీవితాన్ని నిర్మించుకోగలుగుతోంది అనేదే దేశ భవిష్యత్తును నిర్ణయించే అంశంగా మారింది. ఒకప్పుడు జనాభా పెరుగుదలనే అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకిగా భావించేవారు. ఇప్పుడు పరిస్థితులు మారాయి. ఐక్యరాజ్యసమితి లెక్కలప్రకారం అనేక దేశాలు వృద్ధాప్య జనాభా, తగ్గుతున్న జననాల రేటు, కార్మికుల కొరత వంటి సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో పాటు, అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ఒక చారిత్రక అవకాశం లభించింది. అయితే ఈ అవకాశాన్ని నిజమైన జనశక్తిగా మార్చగలుగుతున్నామా? అనే ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన సమయం వచ్చింది. ఒక దేశ భవిష్యత్తును కేవలం జనాభా సంఖ్య నిర్ణయించదు. ఆ జనాభాలో ఎంతమంది ఆరోగ్యంగా ఉన్నారు? ఎంత మంది నాణ్యమైన విద్య పొందుతున్నారు? ఎంతమందికి అవసరమైన నైపుణ్యాలున్నాయి? ఎంతమందికి గౌరవప్రదమైన ఉపాధి లభిస్తోంది? అన్నదే దేశ పురోగతిని నిర్ణయిస్తుంది. యువశక్తికి నాణ్యమైన విద్య, సరైన శిక్షణ, మెరుగైన ఆరోగ్యం, తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోతే అదే జనాభా నిరుద్యోగం, అసమానత, సామాజిక అసంతృప్తికి కారణమయ్యే ప్రమాదం కూడా ఉంది. అందుకే జనాభా సంఖ్య కంటే మానవ వనరుల నాణ్యతపై పెట్టుబడి పెట్టడం అత్యవసరమైంది. విద్యారంగంలో భారత్ గణనీయమైన పురోగతి సాధించింది. యుడిఐఎస్ఇ 2023-24 గణాంకాల ప్రకారం పాఠశాల స్థాయిలో బాలికల నమోదు అబ్బాయిలతో దాదాపు సమాన స్థాయికి చేరుకుంది. కానీ ఈ గణాంకాలు మరో ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నాయి. చదువు పూర్తయిన ప్రతి యువకుడు, యువతి ఉద్యోగానికి సిద్ధంగా ఉన్నారా? పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు వారికి అందుతున్నాయా? మారుతున్న సాంకేతిక ప్రపంచానికి తగిన సామర్థ్యాలను విద్యా వ్యవస్థ పెంపొందిస్తోందా? ప్రతి సంవత్సరం లక్షలాది మంది యువత విద్య పూర్తిచేసి ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు. కానీ వారందరికీ వారి నైపుణ్యాలకు తగిన ఉపాధి లభిస్తోందా? అనేది కీలకమైన ప్రశ్న. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే 2023-24 ప్రకారం మహిళల శ్రామిక భాగస్వామ్యం పెరుగుతున్నప్పటికీ, ఆ పెరుగుదలలో గణనీయమైన భాగం స్వయం ఉపాధి లేదా అనౌపచారిక రంగంలోనే ఉంది. మరోవైపు యువత నిరుద్యోగం, నైపుణ్యాలకు తగ్గఉద్యోగాల కొరత ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. ప్రపంచ జనాభా దినోత్సవం మనకు గుర్తు చేయాల్సిన సందేశం ఒక్కటే. జనాభా సంఖ్యను లెక్కించడం కంటే, ప్రతి మనిషిలోని సామర్థ్యాన్ని పెంపొందించడం చాలా ముఖ్యం. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, గౌరవ ప్రదమైన ఉపాధి, లింగ సమానత్వం, నిర్ణయ స్వేచ్ఛ ఇవే భవిష్యత్ భారతాన్ని నిర్మించే అసలు పునాదులు. ప్రతి యువకుడికి, ప్రతి యువతికి తమ సామర్థ్యాన్ని వికసింప జేసుకునే అవకాశాలను కల్పించినప్పుడే జనాభా నిజమైన జనశక్తిగా మారుతుంది. ●

# పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



గంగాపురం స్థితప్రజ్ఞ

ఒక్కరైతే ఒంటరే... ఒక్కటైతే ఉప్పెనే' అనే నినాదంతో, లక్షలాది సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల సామాజిక భద్రతే ధ్యేయంగా జనం నుండి ఉద్భవించిన మహా ప్రవాహం .. తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయిస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్‌ఈయు). 2016 లో ప్రారంభమైన ఈ సంఘం, సిపిఎస్ విధానం పట్ల ఉద్యోగుల్లో ఉన్న అంధకారాన్ని తొలగించి, వారిలో అవగాహన కల్పించేందుకు మండల, డివిజన్, జిల్లా స్థాయిల్లో విస్తృతంగా సదస్సులు, సమావేశాలను నిర్వహించింది. నాటి నుండి నేటి వరకు రాజీలేని పోరాటాలతో పాత పెన్షన్ (ఓపిఎస్) సాధనకై ఈ యూనియన్ దేశవ్యాప్త ఉద్యమానికి ఇరుసుగా నిలిచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2016వరకు లేని 16 లక్షల విలువక్ డెత్ కామ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీతోపాటు ఉద్యోగి సర్వీస్‌లో ఆకస్మికంగా మరణిస్తే వారి కుటుంబాలకు ఫ్యామిలీ పెన్షన్‌ఆర్థిక రక్షణను కల్పించాయి. ఇది కేవలం 10 ఏళ్లలోనే సాధించింది. అనేక శక్తి యుక్తులతో, అనంతమైన మేధోశక్తితో, కఠినమైనపోటీని తట్టుకుని ప్రభుత్వ ఉద్యోగం సాధించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల భవితను పిఎఫ్ఆర్డీఏ అనే చట్టం ద్వారా ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం అంధకారమయం చేసింది.

మార్కెట్ ఒడిదొడుకులపై పెన్షన్ ఆధారపడటం : పాత పెన్షన్ విధానంలో (ఓపిఎస్) ఉద్యోగి రిటైర్ అయ్యేనాటికి వచ్చిన చివరి జీతంలో సగం మొత్తాన్ని పెన్షన్‌గా ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చేది. కానీ సిపిఎస్ విధానంలో ఉద్యోగి జీతం నుండి కట్ చేసిన సొమ్మును షేర్ మార్కెట్లలో పెట్టుబడిగా పెడుతున్నారు. మార్కెట్ ఒడిదొడుకుల వల్ల రిటైర్మెంట్ తర్వాత వచ్చే పెన్షన్ కేవలం కొన్ని వందల రూపాయలకే పరిమితం అవుతోంది.

**జీవన భృతికి చాలని పెన్షన్లు:** ముప్పై, నలభై ఏళ్ల ప్రభుత్వానికి సేవలందించి రిటైర్ అయిన ఉద్యోగులకు నేడు నెలకు రూ. 1000 నుండి రూ. 2000 లోపే పెన్షన్ వస్తున్న ఉదాహరణలు అనేకం ఉన్నాయి. ఈ కాలంలో ఈ అరకొర డబ్బులతో ఒక వృద్ధాప్య కుటుంబం కనీసం మందుల ఖర్చులు కూడా వెళ్లదీసుకోలేని దుస్థితి నెలకొంది. ఆత్మగౌరవానికి దెబ్బ: జీవితాంతం గౌరవప్రదమైన హోదాలో బతికిన ఉద్యోగి, రిటైర్మెంట్ తర్వాత కుటుంబ సభ్యులపై లేదంటే ఇతరులపై ఆధారపడాల్సి రావడం వారి ఆత్మగౌరవాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. సామాజిక భద్రత కరువై, విశ్రాంత జీవితం నిస్సహాయంగా మారుతోంది. ఈ అన్యాయమైన విధానానికి వ్యతిరేకంగా టిఎస్‌సిపిఎస్‌ఈయు నేతృత్వంలో సాగినఉద్యమ ప్రస్థానంలో ఎన్నో మైలురాళ్ళు




ఉన్నాయి. శంఖారావం (ఫిబ్రవరి 26, 2017): నిజాం కాలేజ్ మైదానంలో లక్షలాది మందితో నిర్వహించిన ఈ సభ రాష్ట్రంలో పెనుదుమారాన్ని రేపింది. దీని ఫలితంగానే డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ (జి.ఓ 60)సాధించబడింది. సామూహిక సెలవు, ధర్మదీక్ష (సెప్టెంబర్ 1, 2017): సంఘం ఇచ్చిన పిలుపుతో 85పైగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు పెట్టి, జిల్లా కేంద్రాల్లో ధర్మదీక్షలు చేపట్టి తమ దృఢ సంకల్పాన్ని చాటారు. ఆయుత ధర్మదీక్ష (జనవరి 7, 2018): నాటి ముఖ్యమంత్రి నియోజకవర్గ కేంద్రమైన గజ్వేల్ గడ్డపై వేలాది మందితో ఆయుత ధర్మదీక్షను విజయవంతంగా నిర్వహించారు. ఆత్మగౌరవ జన జాతర, ఓట్ ఫర్ ఓపిఎస్: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో లక్షకుపైగా కుటుంబాలతో భారీ బహిరంగ సభ నిర్వహించి, "పాత పెన్షన్ ఇచ్చే పార్టీలకే మా ఓటు" అని ప్రతిజ్ఞ చేసి సిపిఎస్ ఐక్యతను చాటారు. రాజకీయ నిర్ణయం మేనిఫెస్టోలో హామీ: దేశవ్యాప్తంగా ఎన్.ఎం.ఓ.పి.యస్ ద్వారా ఉద్యమాన్ని విస్తరింపజేసి ఇప్పటికే ఆరు రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణకు కారణమైంది సిపిఎస్ యూనియన్. తెలంగాణలో సైతం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కను కలిసి సమస్య తీవ్రతను వివరించడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో "సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ" హామీని చేర్చేలా ఈ యూనియన్ నేతలు క్రియాశీలక కృషి చేశారు. గతంలో ఇచ్చిన హామీలు, సిపిఎస్ పెన్షన్ లోపాలవల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న తీవ్ర అన్యాయాన్ని ప్రస్తుత ప్రభుత్వానికి మరోమారు బలంగా గుర్తుచేస్తూ, పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలనే ఏకైక డిమాండ్‌తో టిఎస్‌సిపిఎస్ఈయు మరో చారిత్రాత్మక ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. జులై 11 నుండి జన జాగరణ యాత్ర: ఈ సుదీర్ఘ పోరాట యాత్ర భద్రాద్రి జిల్లా నుండి ఘనంగా ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఉన్న సిపిఎస్ ఉద్యోగ ఉపాధ్యాయులందరినీ ఏకం చేస్తూ ఈ యాత్ర సాగుతుంది. నియోజకవర్గ కేంద్రాల్లో సిపిఎస్‌ఉద్యోగులతో ప్రత్యేక అవగాహన, సమరశీల సమావేశాలు నిర్వహించి, ఆయా ప్రాంతాల స్థానిక శాసనసభ్యులను (ఎమ్మెల్యేలను) ప్రత్యక్షంగా కలిసి. ఎమ్మెల్యేల స్పందన కోరనున్నారు. 'నాడు ఓట్లు వేశాం.. నేడు మా పెన్షన్ సమస్యపై మీ స్పందన ఏంటి?' అని ప్రశ్నిస్తూ, నాటి ఎన్నికల మేనిఫెస్టో హామీని తక్షణమే జీవో రూపంలో అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి స్థానిక ప్రజాప్రతినిధుల మద్దతు కూడగట్టడం ఈ యాత్ర ముఖ్య ఉద్దేశ్యం. ఆగస్టు 23చలో హైదరాబాద్ భారీ బహిరంగ సభ: జన జాగరణ యాత్ర ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో మలిదశ చైతన్యంతో ఆగస్టు 23న హైదరాబాద్ నడిబొడ్డున చలో హైదరాబాద్ పేరిట 2.6లక్షలాదిమందితో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నారు. ఈ సభ ద్వారా సిపిఎస్ విధానంవల్ల రిటైర్డ్ ఉద్యోగులు పడుతున్నవేదనను, సమస్య తీవ్రతను ప్రభుత్వానికి కళ్లకుకట్టేలా వివరించి, పాత పెన్షన్ జీవోసాధన దిశగా అంతిమపోరాటం చేయనున్నారు. ●

**(రచయిత : రాష్ట్ర అధ్యక్షులు, టిఎస్‌సిపిఎస్ఈయు)**

# కరూర్ బాధిత కుటుంబాలకు ఉద్యోగాలు

## నియామక పత్రాలు అందజేసిన ముఖ్యమంత్రి విజయ్

## ఆ ఘటన తనకు మానని గాయమైందన్న తమిళ సిఎం


శుక్రవారం కరూర్‌లో బాధితులకు ఉద్యోగనియామకపత్రాలు అందజేస్తున్న తమిళ సిఎం విజయ్

**కరూర్,జులై 10:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ శుక్రవారం కరూర్ తొక్కిసలాట ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక (కంపాషనేట్ అపాయింట్‌మెంట్) ఉత్తర్వులను అందజేశారు. కరూర్ ఘటన తన హృదయంలో ఇప్పటికీ మానని గాయంగా మిగిలిపోయిందని ఆయన భావోద్వేగంతో పేర్కొన్నారు.గత ఏడాది సెప్టెంబర్ 27న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు కరూర్‌లో నిర్వహించిన టీవీకే ఎన్నికల ప్రచార సభలో తొక్కిసలాట చోటుచేసుకుని 41 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై ప్రస్తుతం కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) విచారణ కొనసాగుతోంది. ఈ ఘటన అనంతరం తమిళనాడు ప్రభుత్వం మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించగా, టీవీకే పార్టీ అదనంగా రూ.20 లక్షల పరిహారాన్ని అందించింది. బాధిత కుటుంబాల పునరావాస చర్యల్లో భాగంగా సీఎం విజయ్ కరూర్‌కు వెళ్లి అర్హులైన కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక ఉత్తర్వులను పంపిణీ చేశారు. అట్లాస్ అరేనాలో నిర్వహించిన కార్యక్రమంలో 32 బాధిత కుటుంబాలకు చెందిన ఒక్కో సభ్యుడికి వారి విద్యార్హతలకు అనుగుణంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామక పత్రాలను అందజేశారు. అయితే ఇదే సమయంలో బాధిత కుటుంబాలకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ విచారణ చేపట్టింది. ప్రస్తుతం లబ్ధిదారులకు తాత్కాలిక నియామకాలు మాత్రమే ఇవ్వాలని కోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ సందర్భంగా మాట్లాడిన సీఎం విజయ్ భావోద్వేగానికి లోనయ్యారు. "నా హృదయంలో నిలిచిపోయిన కరూర్ సోదర, సోదరీమణులందరికీ నా హృదయపూర్వక అభివాదాలు. జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మనసులోని గాయాలు, బాధలు ఎప్పటికీ మరచిపోలేం. ఎన్నోకష్టాలు, మానసిక వేదనలు దాటుకుని ఈరోజు మీ ముందుకు వచ్చాను" అని అన్నారు. కరూర్ ఘటన నాకు తీవ్ర మనోవేదన కలిగించింది. అక్కడ నా సోదరులను, సోదరీమణులను, అమాయక చిన్నారులను కోల్పోయాను. ఆ విషాదం నా గుండెల్లో ఇప్పటికీ మానని గాయంగా ఉంది. ఆ ఘటనకు నన్నే బాధ్యుడిగా చూపించే ప్రయత్నం చేశారు. కానీ ప్రజల కోసమే నేను రాజకీయాల్లోకి వచ్చాను. ఇలాంటి విషాదాలు మళ్లీ జరగకుండా శాశ్వత పరిష్కారం తీసుకురావడమే నా లక్ష్యమని విజయ్ స్పష్టంచేశారు. ప్రతిపక్షాలపై కూడా సీఎం విజయ్ విమర్శలు గుప్పించారు. శాసనసభలో పార్టీ ఫండ్ అనే పదం ప్రస్తావనకు రాగానే ప్రతిపక్ష సభ్యులు సభనుంచి బయటకు వెళ్లిపోయారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ శాఖల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, అవినీతి గణనీయంగా తగ్గాయని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు.ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామని మరోసారి పునరుద్ఘాటించిన సీఎం విజయ్, మాజీముఖ్యమంత్రి సి.ఎన్. అన్నాదురై జయంతి సందర్భంగా జన్మించిన శిశువులకు మేనమామ తరఫున బంగారుఉంగరం బహూకరించే పథకాన్ని కూడా హామీఇచ్చినట్లుగానే అమలు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమం చివర్లో బాధిత కుటుంబ సభ్యులకు నియామక పత్రాలు పంపిణీ చేయగా, ఈచర్య ద్వారా కుటుంబ పోషకులను కోల్పోయిన వారికి దీర్ఘకాలిక ఆర్థిక భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.



# పేలుళ్లతో దద్దరిల్లిన ఇరాన్


## తమకు సంబంధం లేదన్న అమెరికా

**టెహ్రాన్, జులై 10:** ఇరాన్‌లో గురువారం సాయంత్రం నుంచి పలుచోట్ల భారీ పేలుళ్లు చోటుచేసుకున్నాయి. ఈ విషయాన్ని స్థానిక వార్తా సంస్థలు, అధికారులు ధ్రువీకరించారు. ఇరాన్‌లోని అణు విద్యుత్ ప్లాంట్ ఉన్న బుషెహర్ వద్ద సైనిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని దాడి జరిగింది. ఈ విషయాన్ని అక్కడి పొలిటికల్ అండ్ సెక్యూరిటీ గవర్నర్ ఇసన్ జహనియన్ వెల్లడించారు. మరోవైపు కొనారాక్‌లోని నేవల్ జోన్‌లో శత్రు దేశ ఫైటర్ జెట్లు రెండు విడతల్లో దాడులు చేసినట్లు ఇరాన్ అధికారి మహమ్మద్ యూనిస్ హక్కానీ పేర్కొన్నారు. అయితే అమెరికా మాత్రం ఈ దాడులతో తమకు సంబంధం లేదని పేర్కొంది. తమ దళాలు తాజాగా ఎటువంటి దాడులు నిర్వహించలేదని తేల్చి చెప్పింది. ఇక ఇజ్రాయెల్ అధికారి ఒకరు అమెరికా మీడియా సంస్థతో మాట్లాడుతూ దాడుల్లో తమ మిలిటరీ ప్రమేయం ఉన్నట్లు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. మరి తాజా దాడులకు పాల్పడింది ఎవరనే అంశంపై స్పష్టం రాలేదు. ఇరాన్ మాత్రం అమెరికా–ఇజ్రాయెల్ హస్తంఉండొచ్చని చెబుతోంది. అమెరికా గురువారం తెల్లవారుజామున చేసిన దాడుల్లో కూడా బుషెహర్‌ను లక్ష్యంగా చేసుకొంది. ఈ సమయంలో అణుప్లాంట్‌ను టార్గెట్ చేసినట్లు ఇరాన్ ఆరోపించింది. గురువారం మొత్తం 90 లక్ష్యాలపై దాడి చేసిన విషయం తెలిసిందే.

# తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల బాధ్యత

## వాళ్ల బాగోగులు చూడకపోతే ఆస్తులు వెనక్కి

## బాంబే హైకోర్టు కీలక తీర్పు!



**ముంబై, జులై 10:** తల్లిదండ్రుల నుంచి ఆస్తులు పొంది వారి సంరక్షణ విషయంలో నిర్లక్ష్యంగా, అశ్రద్ధతో వ్యవహరించే పిల్లలకు కనువిప్పు కలిగేలా బాంబే హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. వృద్ధాప్యంలో తమను చూసుకుంటారనే షరతుతో ఆస్తిని పిల్లలకు బదిలీ చేసినతల్లిదండ్రులు, ఆ షరతును కనుక పిల్లలు నెరవేర్చకపోతే వారు తమ ఆస్తిని తిరిగి వెనక్కి తీసుకోవచ్చునని బాంబే హైకోర్టు తీర్పు చెప్పింది. తల్లిదండ్రులు ఆర్థికంగా స్థితిమంతులైన ప్పటికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేసింది. లోయర్ పారెల్‌లోని ఫ్లాట్‌ను తన 68 యేండ్ల తండ్రికి స్వాధీనం చేయాలంటూ కింది కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ 42యేళ్ల వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర చుగే, జస్టిస్ గౌతమ్ అంఖడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. వృద్ధులైన తల్లిదండ్రులకు ప్రాథమిక సౌకర్యాలు, శారీరక అవసరాలు కల్పిస్తాననే షరతులో ఆస్తి బదిలీ జరిగి, అలా చేయడంలో విఫలమైతే, ఆ బదిలీని రద్దు చేసే అధికారం ట్రిబ్యునల్‌కు ఉందని సీనియర్ సిటిజన్స్ చట్టం, 2007 సెక్షన్ 23 చెబుతున్నదని పేర్కొన్న హైకోర్టు ట్రిబ్యునల్ తీర్పును సమ

# కేతన్ హత్యకేసు విచారణకు ఫాస్ట్‌ట్రాక్‌కోర్టు ఏర్పాటు చేయాలి

## రాష్ట్రపతికి లేఖరాసిన పుణే వ్యాపారి కేతన్ అగర్వాల్ తండ్రి



**పుణె,జులై 10:** నగరానికి చెందిన యువ వ్యాపారవేత్త కేతన్ అగర్వాల్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసును త్వరగా విచారించి, దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కేతన్ తండ్రి విశాల్ అగర్వాల్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగతంగా జోక్యం చేసుకుని, ఈ కేసు త్వరగా ముందుకు సాగేలా సహాయం చేయాలని ఆయన కోరారు. కొడుకును పోగొట్టుకున్న 20 రోజుల్లోనే తాను తండ్రిని కూడా కోల్పోయానని, తమకు న్యాయం చేయాలని ఆయన భావోద్వేగంతో రాష్ట్రపతికి లేఖ రాశారు. కేతన్ మరణాన్ని తట్టుకోలేక అతడి తాత గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. రాష్ట్రపతి సెక్రటరీకి పంపిన విశాల్ అగర్వాల్ బుధవారం పంపిన ఈమెయిల్‌లో తమ కుమారుడు మరణం తర్వాత కుటుంబం ఎదుర్కొంటున్న బాధను పంచుకున్నారు. ఓ వ్యాపారవేత్తగా లేదా ప్రభావశీలివ్యక్తిగా తాను ఈ లేఖ రాయడం లేదు. కేవలం ఓతండ్రిగా ఆవేదనతోనూ ఇది రాస్తున్నానని వాపోయారు. కేతన్ అంటే తన తండ్రికి ఎంతో ఇష్టమని, ఎంతగానే ప్రేమించే మన వడు మరణంతో ఆయన మనోవేదనకు గురై గుండెపోటుతో చనిపోయారని అన్నారు. తమ కుటుంబానికి ఇది తీరని వేదనను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ కేసును విచారించేలా చూడాలని, దోషులకు చట్ట ప్రకారం కఠిన శిక్ష పడేలా చూడాలని విశాల్ కోరారు.

# ట్రంప్ హత్యకు ఇరాన్ కుట్ర: ఇజ్రాయెల్



**టెల్ అవీవ్,జులై 10:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను హత్య చేసేందుకు ఇరాన్ మరోసారి కుట్ర పన్నుతోందని అమెరికాను ఇజ్రాయెల్ హెచ్చరించిందన్న సమాచారం వైరల్ అయింది. అందుకే ట్రంప్ ఇరాన్‌పై దాడులు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. ఈ సమాచారం ఇజ్రాయెల్ ఇటీవల పెంటగాన్‌కు అందించిన నిఘా నివేదికలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. దీంతో అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. ట్రంప్‌ను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ రూపొందించిన ప్రత్యేక ప్రణాళికను ఇజ్రాయెల్ అగ్రరాజ్యానికి అందజేసింది. అయితే ఈ సమాచారాన్ని అమెరికా నిఘా సంస్థలు ఇప్పటివరకు స్వతంత్రంగా నిర్ధారించలేదని తెలుస్తోంది. ఇజ్రాయెల్ హెచ్చరికకు ముందు అలాంటి కుట్రపై తమ వద్ద స్పష్టమైన ఆధారాలు లేవని అధికారులు పేర్కొన్నట్లు సమాచారం. కొంతమంది అమెరికా అధికారులు మాత్రం ఈ హెచ్చరిక వెనుక మరో కోణం ఉండొచ్చని భావిస్తున్నట్లు సమాచారం. ఇరాన్‌పై మరింత సైనిక చర్యలకు ట్రంప్‌ను ఒప్పించే ప్రయత్నంలో భాగంగానే ఇజ్రాయెల్ ఈ సమాచారం ఇచ్చి ఉండొచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. ఇరాన్ మాత్రం చాలా కాలంగా ట్రంప్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని బహిరంగంగానే హెచ్చరిస్తూ వస్తోంది. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్‌కు చెందిన అగ్ర కమాండర్ ఖాసీ సులేమానీ హత్యకు అమెరికానే కారణమని టెహ్రాన్ ఆరోపిస్తోంది.

# అయోధ్య విరాళాల చోరీ కేసు: 13న సుప్రీంలో విచారణ

**న్యూఢిల్లీ, జులై 10:**అయోధ్య రామాలయం విరాళాల చోరీపై నమోదు అయిన పిటిషన్లపై జులై 13వ తేదీన విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. రామాలయ నిధుల చోరీ కేసులో అరెస్టు అయిన 8 మందిని ఒక్క రోజు కస్టడీలోకి తీసుకోవాలని జులై7వ తేదీన అయోధ్య కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్న విషయం తెలిసిందే. అనుకల్ప్ మిశ్రా, లవ్‌కుశ్ మిశ్రా, కరుణేశ్ పాండేలను రిమాండ్‌లోకి తీసుకోవాలని కోర్టు సూచించింది. జూన్ 29వ తేదీన స్థానిక కోర్టు 8 మంది నిందితులను 14రోజుల జుడిషియల్ కస్టడీకి ఆదేశించింది. అయితే ఈ అంశంపై దాఖలైన మూడు పిటీషన్లను సుప్రీంకోర్టు విచారించనున్నది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిటీషన్లను పరిశీలించనున్నది.

# కరిగిపోతున్న అమర్‌నాథ్ మంచులింగం

**శ్రీనగర్,జులై 10:** శతాబ్దాలుగా కోట్ల మంది హిందువులు అత్యంత పవిత్రంగా పూజించే అమర్‌నాథ్ గుహలోని సహజసిద్ధ మంచు లింగం (బాబా బర్ఫానీ) యాత్ర ప్రారంభమైన కేవలం ఐదు రోజుల్లోనే 90 శాతానికిపైగా కరిగిపోవడం కలకలం రేపుతోంది. ఈ నెల 3న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్రకు భక్తులు రికార్డు స్థాయిలో తరలివచ్చారు. అయితే, యాత్ర మొదలైన మొదటి వారంలోనే మంచు లింగం దాదాపు అదృశ్యమవడంతో దర్శనానికి వస్తున్న భక్తులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పుపై పీడీపీ నాయకురాలు ఇల్తిజా ముఫ్తీ సామాజిక మాధ్యమ వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తూ, గుహ పరిసరాల్లో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని హెచ్చరించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రోజుకు కేవలం 10వేలమంది భక్తులను మాత్రమే అనుమతించాలనే నిబంధన ఉన్నప్పటికీ, మొదటి నాలుగు రోజుల్లోనే ఏకంగా 93వేల మందికి పైగా భక్తులు గుహను సందర్శించారు. అధికారిక నమోదు లేకుండా వస్తున్న వేలాది మంది అదనపు భక్తుల వల్ల అక్కడి మౌలిక వసతులపై, పర్యావరణంపై తీవ్ర ఒత్తిడిపెరుగుతోందని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా కూడా ఆందోళన వ్యక్తంచేశారు. అమర్‌నాథ్ మంచు లింగం ఇంత వేగంగా కరిగిపోవడానికి గ్లోబల్ వార్మింగ్ (భూతాపం),మానవ కార్యకలాపాలే ప్రధానకారణాలని శాస్త్రవేత్తలు, నిపుణులు హెచ్చరిస్తున్నారు. సముద్ర మట్టానికి 3,888 మీటర్లఎత్తులో ఉన్న ఈ గుహ పరిసర ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. గతంలో 2018, 2020, 2022 సంవత్సరాల్లోనూ మంచు లింగం త్వరగా కరిగినప్పటికీ ఈసారి కేవలం ఐదు రోజుల్లోనే కరిగిపోవడం పర్యావరణ విపత్తుకు అద్దం పడుతోంది.

# మేఘాలయ హనీమూన్ హత్య కేసు నిర్దోషినని సుప్రీంలో సోనమ్ వాదన



**న్యూఢిల్లీ, జులై 10:** మేఘాలయ హనీమూన్ హత్య కేసులో తనను తప్పుగా ఇరికించారని ప్రధాన నిందితురాలు సోనమ్ రఘువంశీ సుప్రీంకోర్టుకు తెలిపారు.మేఘాలయలో హనీమూన్ సందర్భంగా తన భర్త రాజా హత్య కేసులో ప్రధాన నిందితురాలైన సోనమ్ రఘువంశీ, తాను నిర్దోషినని సుప్రీంకోర్టులో వాదించారు. రాష్ట్ర హైకోర్టు మంజూరు చేసిన తన బెయిల్‌ను రద్దు చేయాలన్న మేఘాలయ ప్రభుత్వ అభ్యర్థనను వ్యతిరేకిస్తూ ఆమె అఫిడవిట్ దాఖలు చేశారు. తనను తప్పుగా ఇరికించారని, ప్రాసిక్యూషన్ కేసు కేవలం అనుమానం, పరిస్థితులపైనే ఆధారపడి ఉందని సోనమ్ తన అఫిడవిట్‌లో ఆరోపించారు. ఆమెకు బెయిల్ మంజూరు చేయాలన్న హైకోర్టు నిర్ణయాన్ని మేఘాలయ ప్రభుత్వం సవాలు చేయగా, సుప్రీంకోర్టు సోనమ్ అభ్యర్థనను విచారించింది. హైకోర్టు ఉత్తర్వుల ఆధారంగా ఆమె ఇప్పటికే విడుదలయ్యారని పేర్కొంటూ, ఆమె బెయిల్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. బెయిలు మంజూరు చేయడానికి హైకోర్టు చెప్పిన కారణాలపై ధర్మాసనానికి సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ఈ దశలో జోక్యం చేసుకోకూడదని నిర్ణయించుకుంది. విచారణ సందర్భంగా, తన అరెస్టుకు గల కారణాలను తనకు తెలియ జేయలేదని, సరైన న్యాయ సహాయం నిరాకరించారని సోనమ్ తరపు న్యాయవాది వాదించారు. గతంలో బెయిలు దరఖాస్తుల సమయంలో దిగువ కోర్టులలో ఈ అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. మేఘాలయ తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, ఈకేసు 'దిగ్భ్రాంతికరం', పథకం ప్రకారం జరిగిన హత్యఅని, అరెస్టు పత్రాలలో జరిగిన ఒక అక్షర దోషం కారణంగా బెయిలు మంజూరు చేశారని వాదించారు. హత్యకు సంబంధించిన సెక్షన్ 103కు బదులుగా, అరెస్టు మెమోలో పొరపాటున భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 403ను పేర్కొన్నారని మెహతా వివరించారు. ఇది కేవలం ఒక గుమాస్తా పొరపాటు అని, దీనివల్ల నిందితురాలికి ఎలాంటి నష్టం జరగదని ఆయన వాదించారు. ఇలాంటి పొరపాటు అరెస్టును రద్దు చేయగలదా? బెయిలు మంజూరును సమర్థించగలదా? అనే విషయాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించవచ్చని కూడా సుప్రీంకోర్టు సూచించింది.

# శబరిమల కానుకల లెక్కింపుపై హైకోర్టు కీలక ఆదేశాలు

**తిరువనంతపురం, జులై 10:** శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల మదింపు, భద్రతకు సంబంధించి కేరళ హైకోర్టు తాజాగా ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డుకు కీలక ఆదేశాలు జారీ చేసింది. 80 బస్తాలలో భద్రపరిచిన అయ్యప్పస్వామి బంగారు, వెండి కానుకల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న మాజీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కెటి శంకరన్‌కు అవసరమైన అన్ని సహాయ సహకారాలుఅందించాలని బోర్డును కోర్టు ఆదేశించింది.
ప్రత్యేక కమిషనర్ సమర్పించిన నివేదికను పరిశీలిస్తూ జస్టిస్ వి.రాజా విజయ రాఘవన్ ఈ ఉత్తర్వులు ఇచ్చారు. జులై 4న నిర్వహించిన తనిఖీల్లో ఆ 80 సంచులలో కేవలం బంగారం, వెండి మాత్రమే కాకుండా ఇతర సామగ్రి కూడా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో, విలువ లేని వస్తువులను ముందుగా వేరు చేస్తే తప్ప అసలైన కానుకల విలువను నిర్ధారించడం సాధ్యం కాదని నివేదిక పేర్కొంది. ఈ వేరుచేసే ప్రక్రియకు, మదింపునకు పూర్తి సహకారం అందిస్తామని దేవస్థానం బోర్డు కోర్టుకు హామీ ఇచ్చింది. భవిష్యత్తులో స్వీకరించే విలువైన కానుకలను సురక్షితంగా భద్రపరచడానికి అనుసరించబోయే శాశ్వత విధానాన్ని తమకు తెలియజేయాలని బోర్డు స్టాండింగ్ కౌన్సిల్‌ను హైకోర్టు ఆదేశించింది. ఆలయానికి వచ్చే



కానుకలను క్రమానుగతంగా మదింపు చేసి, ఒక సమగ్రమైన డిజిటల్ ఇన్వెంటరీ ద్వారా నమోదు చేయడమే దీని ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 4వ తేదీకి వాయిదా వేసింది.

# సంక్షిప్త వార్తలు

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడులు

**క్యీవ్,జులై 10:** రష్యా ఆర్థిక జీవనాడి అయిన చమురు శుద్ధి కర్మాగారాలు, ఇంధన నిల్వ కేంద్రాలే లక్ష్యంగా ఉక్రెయిన్ తన డ్రోన్ దాడులను ముమ్మరం చేసింది. రష్యాలోని స్టావ్‌రోపోల్, ట్వెర్, ఉఫా ప్రాంతాలతో పాటు క్రిమియాలోని కీలక చమురు పంపింగ్ స్టేషన్‌లను తమ దళాలు పూర్తిగా ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. యుద్ధాన్ని ముగించడానికి మాస్కో నిరాకరిస్తుండడం వల్లే ఈ దాడులు పెంచామని, రష్యా వెనక్కి తగ్గే వరకు ప్రతిరోజూ అక్కడ యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తామని ఆయన హెచ్చరించారు.

## డిజిటల్ సంతకాలు వీసాలకు చెల్లవు..

**న్యూఢిల్లీ, జులై 10:** హెచ్1బీ వీసా పిటిషన్లు, గ్రీన్ కార్డ్ దరఖాస్తులు సహా ఇమిగ్రేషన్ ప్రయోజన అభ్యర్థనలపై దరఖాస్తుదారులు ఎలా సంతకం చేయాలన్న విషయమై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్(యూఎస్‌సీఐఎస్) శుక్రవారం నుంచి కొత్త నిబంధనలను అమలుకు తెచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం చేతిరాతతో చేసిన సంతకాలు లేదా నకలు సంతకాన్ని(రీప్రొడ్యూస్డ్ సిగ్నేచర్) మాత్రమే అధికారులు స్వీకరించనున్నారు. కాపీ పేస్ట్ చేసిన సంతకం, ఆటో జనరేటెడ్ లేదా అనధికార సంతకంతో కూడిన దరఖాస్తును అధికారులు తిరస్కరిస్తారు.

## చైనా మెగా ప్రాజెక్టుకు భూకంపాల ముప్పు

**బీజింగ్,జులై 10:** బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ స్థాయిలో నిర్మిస్తున్న మెగా హైడ్రోపవర్ ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కింద ఒక క్రియాశీలక ఫాల్ట్ లైన్ ఉన్నట్లు చైనాకు చెందిన జియాలజిస్టులే స్వయంగా హెచ్చరించారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని వారి అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక గత నెలలో ప్రచురితమైంది.

## బాలీవుడ్ నటుడికి 3నెలల జైలు



**న్యూఢిల్లీ, జులై 10:** బాలీవుడ్ నటుడు రాజ్‌పాల్ యాదవ్‌కు చెక్ బౌన్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు మూడునెలల జైలు శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు విధించిన ఆరునెలల శిక్షను హైకోర్టుతగ్గించింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పు వెలువరించారు. అయితే, తీర్పు అమలుపై రెండునెలల స్టే విధించి, ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించే అవకాశం కల్పించారు. ఈ తీర్పుపై రాజ్‌పాల్ యాదవ్ స్పందిస్తూ,ప్రస్తుతం నాదగ్గర డబ్బులేనందున జైలుశిక్ష అనుభవించాల్సి వస్తోందన్నారు.

## ఎయిర్‌రూటులో తరలిస్తున్న కొకైన్ పట్టివేత

**న్యూఢిల్లీ,జులై 10:** భారత్‌కు విమాన మార్గంలో తరలిస్తున్న సుమారు 22 కేజీల కొకైన్‌ను అమెరికా పోలీసులు పట్టుకున్నారు. ఆ కొకైన్ విలువ సుమారు 1.5 మిలియన్ల డాలర్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు. మియామీ అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఉన్న ఎయిర్ కార్గో వేర్‌హౌజ్‌లో ఆ కొకైన్‌ను సీజ్ చేశారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ అధికారులు ఆ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఓ పార్సిల్‌లో ఉన్న స్పీకర్లు, ఆంప్లిఫయర్స్ కింద ఆ కొకైన్ దాచారు. మ్యూజిక్ ఎక్విప్మెంట్ అన్న మార్కింగ్‌తో పార్సిల్ చేశారు.

## సర్ ఫారాలు నింపేందుకు డబ్బు డిమాండ్!

**రాంచి,జులై 10:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పత్రాల పంపిణీ కోసం బూత్ స్థాయి అధికారిణి (బీఎల్‌వో) డబ్బులు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు. దీనితో పాటు డబ్బులు తీసుకుని సర్ ఫారాలు నింపుతున్న సైబర్ కేఫ్‌పై ఎన్నికల అధికారులు చర్యలు చేపట్టారు. జార్ఖండ్‌లో ఈ సంఘటన జరిగింది. గర్వా జిల్లాలో బీఎల్‌వోగా విధులు నిర్వహిస్తున్న జమీలా బీబీ,సర్ ఫారాల పంపిణీ, పూరించడం, స్వీకరించడం కోసం రూ. 50 నుంచి రూ.100 వరకు డిమాండ్ చేసినట్లు గ్రామస్తులు ఆరోపించారు.

## ఫోర్జరీ పత్రాలతో ఉద్యోగాలు పొందిన టీచర్ల తొలగింపు

**పాట్నా,జులై 10:** బీహార్ విద్యాశాఖ రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రక్షాళనకు శ్రీకారం చుట్టింది. నకిలీ పట్టాలు, ఫోర్జరీ చేసిన విద్యా ధ్రువీకరణ పత్రాలను సమర్పించి మోసపూరితంగా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సంపాదించిన 3,035మంది టీచర్లను విధుల్లోంచి తొలగించింది. 2006నుండి 2015 మధ్య కాలంలో జరిగిన ఉపాధ్యాయుల నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో రాష్ట్ర విజిలెన్స్ బ్యూరో గత కొంతకాలంగా లోతైన దర్యాప్తు చేపట్టింది. ఈ సుదీర్ఘ విచారణ ముగిసిన తర్వాత విజిలెన్స్ బ్యూరో సమర్పించిన నివేదిక ఆధారంగా ఈ భారీ చర్యలకు విద్యాశాఖ పూనుకుంది.

# డిజిటల్‌రైల్వే టికెట్లు బుక్‌చేసిన మొబైల్‌లోనే చూపించాలి

**న్యూఢిల్లీ,జులై 10:** భారతీయ రైల్వే శాఖ డిజిటల్ అన్‌రిజర్వ్‌డ్ టికెట్ల విషయంలో ప్రయాణికులకు కీలక స్పష్టతనిచ్చింది. రైల్ వన్ యాప్ ద్వారా బుక్ చేసుకున్న డిజిటల్ టికెట్లను ప్రయాణ సమయంలో తప్పనిసరిగా బుకింగ్ చేసిన మొబైల్ ఫోన్‌లోనే చూపించాలని స్పష్టం చేసింది. టికెట్ స్క్రీన్‌షాట్లు, పీడీఎఫ్ కాపీలు లేదా వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా ఫార్వార్డ్ చేసిన కాపీలు చెల్లవని తేల్చి చెప్పింది. వీటిని ప్రయాణానికి సరైన ఆధారాలుగా పరిగణించబోమని రైల్వే అధికారులు వెల్లడించారు. డిజిటల్ టికెట్ల దుర్వినియోగాన్ని అరికట్టేందుకే ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నట్లు సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే అధికారిక ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. ఇటీవల ఓ ప్రయాణికుడు వాట్సాప్ స్క్రీన్‌షాట్ చూపించగా, అధికారులు అతడికి జరిమానా విధించినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రయాణికులు రైలు బయలుదేరక ముందే టికెట్ బుక్ చేసుకోవాలని, ప్రయాణ సమయంలో టికెట్ బుక్ చేసిన ఫోన్‌తో పాటు తప్పనిసరిగా అసలు గుర్తింపుకార్డును వెంట ఉంచుకోవాలని అధికారులు సూచించారు. రైల్వేశాఖ నిర్ణయంపై సోషల్ మీడియా వేదికగా ప్రయాణికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కుటుంబ సభ్యులందరికీ ఒకరే టికెట్లు బుక్‌చేసే సందర్భాల్లోనూ, సాంకేతిక పరిజ్ఞానంలేని వృద్ధుల ప్రయాణించేటప్పుడు ఎదురయ్యే సాధకబాధల గురించి పలువురు ప్రశ్నిస్తున్నారు. టికెట్ బుక్ చేసిన వ్యక్తి ప్రయాణంలో లేకపోతే ఇబ్బందులు తప్పవని వారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రయాణికుల ఆందోళనలపై రైల్వే శాఖ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. రైల్ వన్‌యాప్‌లో డిజిటల్ పద్ధతిలోఅన్‌రిజర్వ్‌డ్ టికెట్లుకొనుగోలు చేస్తే 3శాతంరాయితీ లభిస్తున్నప్పటికీ, తాజాగా ఈ నిబంధన అనేక మందికి ఇబ్బందికరంగా మారింది.

# గురుగ్రామ్‌లో ఎన్‌కౌంటర్ నలుగురు క్రిమినల్స్ హతం

**గురుగ్రామ్,జులై 10:**ఢిల్లీసమీపంలోని గురుగ్రామ్‌లో గురువారం రాత్రి పోలీసులు, నేరస్థుల మధ్య ఫైరింగ్ జరిగింది. సుమారు 60 రౌండ్ల పాటు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఆ ఘటనలో నలుగురు నేరస్థులు మృతిచెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. గురుగ్రామ్‌లోని సుశాంత్ లోక ఫేజ్‌లో ఆ ఎన్‌కౌంటర్ జరిగింది. గురువారం రాత్రి 9.30 నిమిషాలకు క్రైం బ్రాంచ్ పోలీసులు సమాచారం అందుకున్నారు. ఓ స్కార్పియో ఎస్‌యూవీలో సాయుధ వ్యక్తులు ఉన్నట్లు తెలిసింది. ఆ ఇంటెలిజెన్స్ ఆధారంగా క్రైం బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సువాంత్ లోక్ ఫేజ్‌లో ఉన్న ఓ వ్యాపారి ఇంటి వద్ద ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. విదేశాల్లో ఉన్న ఓ గ్యాంగ్‌స్టర్ వ్యాపారి నుంచి బెదిరింపుకు పాల్పడుతున్నట్లు తెలిసింది. అనుమానిత నిందితులను పోలీసులు చుట్టుముట్టారు. లొంగిపోవాలని ఆదేశించారు. కానీ నిందిత వ్యక్తులు విచక్షణారహితంగా ఫైరింగ్ చేశారు. ఆ కాల్పులకు కౌంటర్‌గా పోలీసులు ఫైరింగ్‌కు దిగారు. దీపక్ నందల్ గ్యాంగ్‌కు చెందిన షూటర్లు ఈ కాల్పుల్లో పాల్గొన్నారు. అందరికీ గాయాలు అయినట్లు తెలిసింది. ఓ ప్రైవేటు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి తరలించారు. కానీ నలుగురు మృతిచెందినట్లు డాక్టర్లు చెప్పారు. అయిదో వ్యక్తి మాత్రం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు గురుగ్రామ్ పోలీసులు కూడా గాయపడ్డారు. వాళ్లను కూడా ఆస్పత్రికి తీసుకెళ్లారు.

# ఉత్తరాదిని ముంచెత్తుతున్న భారీ వర్షాలు

## విరిగిపడుతున్న కొండచరియలు

## పెద్దసంఖ్యలో సాధారణ ప్రజలు మృతి

**న్యూఢిల్లీ,జులై 10:** ఉత్తరాది రాష్ట్రాలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాలకు ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కొండ చరియలు విరిగిపడగా పలువురు మరణించినట్లు అధికారులు వెల్లడించారు. యూపీలోని సంత్ కబీర్ నగర్, కుషినగర్, బులంద్ షహర్, షమ్లీ, ఘజియాబాద్ లలో వర్షాల కారణంగా కొందరు మరణించారు. భారీ వర్షాల ధాటికి నదులు, వాగులు ప్రమాదకరస్థాయిలో ప్రవహిస్తుండగా కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఢిల్లీలోని కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 16 సెంటీమీటర్లకు పైగా వర్షపాతం నమోదవ్వగా సూరత్ లో రోడ్లు జలమయమై వాగులను తలపిస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లో నేడు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. ఇప్పటికే కురిసిన భారీ వర్షాలకు అలకనంద, మందాకిని నదులు పొంగి పొర్లుతుండగా మరోసారి అతిభారీ వర్షాల హెచ్చరికలు రావడంతో అధికారులు అప్రమత్తమై లోతట్టు ప్రాంతాల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రుద్రప్రయాగ్ జిల్లాలో స్కూళ్లను మూసివేశారు. హిమాచల్ ప్రదేశ్ లో 75 ప్రాంతాల్లో రోడ్లు ధ్వంసమవ్వగా 29 విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు వర్షాలు, గాలులకు పాడైనట్లు గుర్తించారు. భారీ వర్షాల నేపథ్యంలో చార్ ధామ్ యాత్రకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరకాశి



జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో గంగోత్రి హైవే మూసుకుపోయింది. ఉత్తరప్రదేశ్ లోనూ నేడు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఘజియాబాద్, మీరట్, హాపూర్, బులంద్ షహర్, బాఘ్ పత్, ముజఫర్ నగర్, మొరాదాబాద్ జిల్లాల్లో స్కూళ్లకు ముందుగానే సెలవు ప్రకటించారు. మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

11-7Pg6exHMNWJQE.qxd:11-7Pg6exHMNWJQE.qxd 1/2/02 5:53 AM Page 1



## బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో జగన్ భారీ దోపిడి

• స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో మాజీ సిఎం జగన్ రాయలసీమ యువతకు ఉపాధి ఇస్తానని భ్రమ కల్పించి భారీ దోపిడీ చేశారని స్వర్ణాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని పరిశ్రమలకు భూ కేటాయింపుల పేరుతో క్విడ్ ప్రో కో ద్వారా జగన్ కోట్లు దండుకున్నారని ఆరోపించారు. బ్రాహ్మణి స్టీల్స్‌కు 14 వేల ఎకరాల ప్రజల సొత్తు, ప్రభుత్వ భూమిని కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. కేటాయించిన భూములను రూ.350 కోట్లకు తాకట్టు పెట్టి భారీ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డారని వ్యాఖ్యానించారు. రెడ్ గోల్డ్ ఎంటర్‌ప్రైజెస్, ఆరోర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి జగతి పబ్లికేషన్స్‌కు రూ.44 కోట్లు, ఇందిరా టెలివిజన్‌కు రూ.30 కోట్లు వెళ్లిన విషయం వాస్తవం కాదా అని పట్టాభి ప్రశ్నించారు. జగన్ లూటీకి గురైన 14 వేల ఎకరాల ప్రభుత్వ భూమిని కూటమి ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుందని పట్టాభి వివరించారు. నాడు పరిశ్రమల పేరుతో జగన్ లూటీ చేస్తే.. నేడు పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి విప్లవాన్ని తీసుకొచ్చింది కూటమి ప్రభుత్వమని తెలిపారు. కియాతో ప్రారంభమైన పారిశ్రామిక ప్రగతి.. నేడు గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్, ఆర్సెలార్ మిట్టల్ వంటి గ్లోబల్ సంస్థల పెట్టుబడులతో కొనసాగుతోందన్నారు. లూటీకి ప్రతీక జగన్ అయితే.. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలకు ప్రతీక చంద్రబాబు అని కొమ్మారెడ్డి పట్టాభి పేర్కొన్నారు.

# విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం

• వంద శాతం ఆన్‌లైన్ బిల్లు చెల్లింపులే ఎస్‌పిడిసిఎల్ లక్ష్యం: సిఎండి శివశంకర్



**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎస్‌పిడిసిఎల్) పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలను అందించేందుకు సంస్థ నిరంతరం కృషి చేస్తోంది. డిజిటల్ యుగానికి అనుగుణంగా అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ వినియోగదారులకు విద్యుత్ సేవలను మరింత సరళతరం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో వెబ్‌సైట్ ద్వారా విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపు విధానంతో పాటు అధికారిక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చి, వేగవంతమైన, సురక్షితమైన, పారదర్శకమైన చెల్లింపు వ్యవస్థను అమలు చేస్తోంది. ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారిక వెబ్‌సైట్, మొబైల్ యాప్, డైనమిక్ క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ గవర్నెన్స్ (మనమిత్ర), నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా విద్యుత్ బిల్లులను సులభంగా చెల్లించవచ్చు. అంతేకాకుండా మొబైల్ యాప్ ద్వారా విద్యుత్ వినియోగ వివరాలు, గత బిల్లు చెల్లింపుల చరిత్రను తెలుసుకోవడంతో పాటు కొత్త విద్యుత్ సేవలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా కల్పించబడింది. ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో మొత్తం 61.32 లక్షల మంది విద్యుత్ వినియోగదారులకు సంస్థ నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తోంది. ప్రతి నెలా సుమారు రూ.520 కోట్ల విలువైన విద్యుత్ బిల్లులను వినియోగదారులు చెల్లించడం జరుగుతోంది. ప్రస్తుతం మొత్తం బిల్లుల్లో 49.50 శాతం ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. ఈ శాతాన్ని దశలవారీగా 100 శాతానికి పెంచడమే సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. డిజిటల్ చెల్లింపులను మరింత ప్రోత్సహించే దిశగా సంస్థ పలు చర్యలు చేపడుతోంది. ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలు (ఇఆర్‌ఓలు)లో కూడా ఆన్‌లైన్ చెల్లింపులకే ప్రాధాన్యం కల్పిస్తోంది. బిల్లుల వసూళ్లలో పారదర్శకతను మరింత పెంపొందించేందుకు, నగదు లావాదేవీలను తగ్గించేందుకు దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే ప్రక్రియను అమలు చేస్తోంది.

**వినియోగదారుల్లో చైతన్యం:** 'విద్యుత్ బిల్లుల ఆన్‌లైన్ చెల్లింపులపై వినియోగదారుల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. విద్యుత్ బిల్లుల వసూళ్లలో పారదర్శకత పెంపొందించడంతోపాటు వంద శాతం డిజిటల్ చెల్లింపులను అమలు చేయాలని అన్ని జిల్లాల సూపరింటెండింగ్ ఇంజినీర్లకు ఆదేశాలు జారీ చేశాం. ఈ లక్ష్యంతో దశలవారీగా బిల్లు వసూళ్ల కేంద్రాలను మూసివేసే చర్యలు కొనసాగుతున్నాయి. డిజిటల్ చెల్లింపుల సందర్భంగా గుర్తు తెలియని లింకులు, సందేశాలు లేదా నకిలీ యాప్‌లను నమ్మి మోసపోవద్దు. విద్యుత్ బిల్లులను ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారిక మొబైల్ యాప్, అధికారిక వెబ్‌సైట్ ద్వారానే చెల్లించాలని వినియోగదారులను కోరుతున్నాం. సురక్షితమైన, వేగవంతమైన, పారదర్శకమైన సేవల కోసం వినియోగదారులు ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాల్సి' అని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు.

## మామిడి రైతుకు ప్రభుత్వం అండ

• తోతాపురి రైతుకు సబ్సిడీ అందించడంతో అర్హులైన ప్రతి రైతుకు న్యాయం: చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్



**చిత్తూరు, జులై 10 ప్రభాతవార్త:** తోతాపురి మామిడి సాగు చేసి నష్టపోయిన అర్హులైన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల మేరకు సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో శుక్రవారం కలెక్టర్ సుమిత్ కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తోతాపురి మామిడి పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అందించే సబ్సిడీ పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావు వుండదని, గ్రామసభలు, క్షేత్రస్థాయి పరిశీలన, గత ఏడాది వివరాలు, రైతు ధృవీకరణ, పంట ఈకేవైసి నమోదు వంటి అంశాల ఆధారంగా అర్హులైన రైతులను గుర్తించడం జరుగుతుందన్నారు. మామిడి పంట నష్టపోయిన రైతులందరికీ న్యాయం జరిగేలా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. మామిడి రైతులకు సబ్సిడీ పంపిణీ రాష్ట్ర ప్రభుత్వ విధానాల ప్రకారం జరుగుతుందని, అర్హులైన రైతులు ఎవ్వరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామ స్థాయిలో అధికారులు సమగ్రంగా వివరాలు సేకరించి అర్హులైన జాబితాను సిద్ధం చేస్తారన్నారు. అలాగే అంతర్జాతీయ పరిస్థితులు, ఎగుమతుల మందగమనం, పల్ప్ పరిశ్రమల్లో కొనుగోళ్లు తగ్గిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మామిడి రైతులను ఆదుకునేందుకు ఈ సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి చర్చించడం జరిగిందన్నారు. సిఎం ఆదేశాల మేరకు తోతాపురి కేజీకి రూ.4 కనీస మద్దతు ధర ప్రకటించడం జరిగిందన్నారు. దక్షిణ భారతదేశంలో మామిడి గుజ్జు తయారీ, ఎగుమతులకు చిత్తూరు ప్రధాన కేంద్రంగా వుండటంతో సుమారు 35 వేల రైతు కుటుంబాలు మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్నా యన్నారు. తోతాపురి సాగుకు సంబంధించిన సమస్యలను అధ్యయనం చేసి తగిన పరిష్కారాలను సూచించడానికి కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి ఆదేశాల మేరకు ఐసిఎఆర్ నియమించిన నిపుణుల బృందం శుక్రవారం జిల్లాలో పర్యటిస్తోందన్నారు.




# ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు ఉపసంహరించాలి

• సిపిఐ రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు నేతలు డిమాండ్

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రశ్న యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు ప్రశ్న రావణ్‌పై మోపిన ఉపా చట్టం కేసు తక్షణమే ఉపసంహరించాలని సిపిఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం విజయవాడలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేసే ప్రయత్నం జరుగుతోందని, ప్రశ్నించే వారిపైన, విమర్శించే వారిపైన కేసులు మోపుతూ కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని, ఇటీవల కాలంలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అనేక పరిణామాలు జరగడంపై సమావేశంలో విపక్షాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యల్ని పక్కదారి పట్టించేందుకుగానే ప్రశ్న రావణ్‌పై అక్రమ కేసులు మోపి, జైలుకు పంపారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, వైసిపి, కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు, రిటైర్డ్ ఐఎఎస్, ఐపిఎస్‌లు, ప్రజాసంఘాలు, పౌర హక్కుల నేతలు, జర్నలిస్టులు, యువజన, విద్యార్థి, మహిళా సంఘాలు, సామాజిక సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున హాజరై ముక్తకంఠంతో ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం, రాజద్రోహం కేసులు మోపడాన్ని తప్పుపట్టారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కేలా కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడుతోందని నేతలు ధ్వజమెత్తారు.

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని వందలాదిగా ఉన్న యూట్యూబర్ల వాక్ స్వాతంత్రానికి, భావజాలానికి భంగం కలిగేలా పాలకులు వ్యవహరించడం దుర్మార్గమని తప్పుపట్టారు. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటనా స్వేచ్ఛ ఉండాలనేదే తమ అభిమతమని స్పష్టం చేశారు. ఎవరైనా మితిమీరి వ్యవహరిస్తే చట్టాలు ద్వారానే ఎదుర్కోవాలని సూచించారు. రిటైర్డ్ ఐఎఎస్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై ఉపా కేసు నమోదుతో భవిష్యత్తులో మరిన్ని కేసులు నమోదయ్యే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపిఎస్ అధికారి పివి సునీల్ కుమార్ మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టం కేసు ఉద్దేశ్యం పూర్వకంగాను, కావాలనే రావణ్‌ను జైలుకు పంపాలనే పెట్టిన కేసేనని తేల్చిచెప్పారు. సిపిఐ జాతీయ నాయకులు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ప్రజలను డైవర్షన్ చేసేందుకు రావణ్‌పై రాజకీయ కుట్రలకు పాల్పడ్డారని, తక్షణమే ఉపా కేసు ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ప్రసంగాన్నే ప్రశ్న రావణ్ అనుకరించారనీ, కానీ పవన్‌లా ప్రశ్న రావణ్ చెప్పు చూపించలేదన్నారు. దీంతో ముందస్తుగా పవన్‌పైనే కేసు పెట్టాలన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ప్రశ్న రావణ్‌పై ఉపా చట్టం కేసు నమోదు అన్యాయం, అక్రమం, దారుణమని ఖండించారు. ఈ కేసు ముగిసేవరకు వైసిపి పక్షాన ప్రశ్న రావణ్‌కు అండగా నిలుస్తామని, విపక్షాలు చేసే ఉద్యమంలో భాగస్వాములవుతామని స్పష్టం చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య అధ్యక్షోపన్యాసం ప్రశ్న రావణ్‌పై పెట్టిన ఉపా చట్టాన్ని ఈ నెల 17వ తేదీలోపు ఉపసంహరించుకోకపోతే ఆ తదుపరి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర నాయకులు ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బి.రామకృష్ణ, సిపిఐ(ఎంఎల్) ఎంఎల్ లిబరేషన్ నాయకులు డి.హరినాథ్, ఎస్‌యుసిఐ నాయకులు అమర్‌నాథ్, ఎంసిపిఐ(యు) నాయకులు ఖాదర్ భాషా, పిసిసి ఉపాధ్యక్షులు కొలనుకొండ శివాజీ, జర్నలిస్టులు డానీ, అమరయ్య, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర నాయకులు ఉమామహేశ్వరరావు, రిటైర్డ్ సిఐ సాల్మన్‌రాజు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి శంకర్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి అధ్యక్షులు పి.చంద్రానాయక్, రాష్ట్ర నాయకులు ఆర్.పిచ్చయ్య ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, తాటిపాక మధు, విసికె పార్టీ నాయకులు వెంకట్రాముడు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.రవీంద్రనాథ్, సిహెచ్. వెంకటసుబ్బయ్య, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి వలరాజు, బందెల నాసర్‌జీ, ఉపాధ్యక్షులు సాయి, ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్‌కె సుభాని, నాయకులు లంకా గోవిందరాజులు, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, ఎపి మహిళా సమాఖ్య కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, నాయకులు ఓర్సు భారతీ, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, నాయకులు బి.రాయప్ప, ఇన్సాఫ్ రాష్ట్ర నాయకులు సయ్యద్ అఫ్సర్ తదితరులు హాజరయ్యారు.

## 'రావణ్‌కు ఏ విధంగా జగన్ మద్దతిస్తున్నార్ను



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశద్రోహానికి పాల్పడిన రావణ్‌కు మాజీ సిఎం జగన్ ఏ విధంగా మద్దతు ఇస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, దేశద్రోహ శక్తుల తరఫున వాదనలు వినిపించడంపై ప్రజలకు జవాబు చెప్పాలన్నారు. రాజ్యాంగం, చట్టం, దేవతలపై కనీస గౌరవం లేకుండా మాట్లాడే వారిని వైసిపి సమర్థించడం సభ్యసమాజం తలదించుకునే చర్యగా ఆయన అభివర్ణించారు. కులాల, ప్రాంతాల మధ్య భేదాభిప్రాయాలు సృష్టించి సమాజాన్ని ఇబ్బంది పెట్టేలా వైసిపి వ్యవహరిస్తోందని ఆరోపించారు. సోషల్ మీడియా యాక్టివిస్టులకు నెలనెలా ముడుపులిచ్చి, ప్రజాప్రభుత్వంపై బురదజల్లేలా సంఘ విద్రోహ శక్తులను తయారు చేస్తున్నారంటూ వైసిపి నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ యజ్ఞాన్ని భగ్నం చేసేందుకు వారు రాక్షసుల్లా ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌మోహన్ రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కూర్చొని విధ్వంసానికి ప్లాన్ గీసి, తాడేపల్లి ప్యాలెస్‌కు వచ్చి ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆరోపించారు.

# తిరుమల సమాచారం



## మళ్లీ కొండ కిటకిట

• వెంకన్న సర్వదర్శనానికి 24గంటలు

**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** వారాంతం... వరుససెలవుల నేపథ్యంలో శుక్రవారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. వరుసగా రెండవ శనివారం, ఆదివారాలు సెలవు రావడంతో ఏడుకొండల వెంకన్న దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. గత మూడురోజులు నుండి కొనసాగుతున్న ఈ రద్దీ శుక్రవారం కూడా యధావిధిగా ఉంది. సాయంత్రానికి భక్తులు వెలుపల క్యూలైన్లలో ఐదుకిలోమీటర్ల వరకు బారులు తీరారు. దీంతో స్వామివారి సర్వదర్శనానికి మధ్యాహ్నానికి 24గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనానికి ఆరుగంటలపైగానే భక్తులు నిరీక్షిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం వరకు 45వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు. ఇంకా 20వేల మంది భక్తులు అర్ధరాత్రి వరకు దర్శనం చేసుకునే వీలుందని టిటిడి వర్గాలు తెలిపాయి. గురువారం రాత్రి వరకు 70,141మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. భక్తులు భారీగా తిరుమలకు చేరుకోవడంతో గదుల కోసం సామాన్యభక్తులు అవస్థలు వర్ణనాతీతం. 'ఏడుకొండలవాడా... ఆపదమొక్కుల వాడ అనాధరక్షకా' గోవింద అంటూ తిరుమలకు చేరుకునే సామాన్యభక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడంతో గదుల కోసం నిరీక్షణ తప్పడం లేదు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి జితిన్ రామ్



**శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో శుక్రవారం కేంద్ర సూక్ష్మ,చిన్న మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి, బీహార్ మాజీ ముఖ్యమంత్రి జితిన్‌రామ్ మాంఝి పూజలు జరిపించుకున్నారు. కేంద్ర మంత్రికి ఆలయ దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టెసాయి ప్రసాద్, ప్రోటోకాల్ ఎఇఓ లోకేష్‌బాబు, ఎపిఆర్‌ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసారు. అంతరాలయ దర్శనం చేసుకున్న ఆయన ఆలయ ప్రాశస్త్యం గురించి వవేదపండితులను అడిగి తెలుసుకున్నారు. మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు. ఏర్పాట్లను ఆలయ ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు సి.నాగభూషణం యాదవ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ హరియాదవ్, ఎపిఆర్‌ఓ సుబ్రమణ్యం, తహాశీల్దార్ టివి సుబ్రమణ్యం, సహాయ తహాశీల్దార్ అనిల్ కుమార్‌లు పర్యవేక్షించారు.

# కొండపై కష్టాలకు చెక్ ఎప్పుడు?

## అలిపిరి వద్ద ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు 'బ్రేక్' పడిందా!

• తిరుమల శ్రీవారి భక్తుల్లోనూ వీడని సందేహాలు





**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆపద మొక్కులవాడు... అనాధ రక్షకుడు శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల సంఖ్య రోజు రోజుకూ రెట్టింపవుతున్న నేపథ్యంలో కొండపై దర్శనాలతో బాటు వసతి సౌకర్యం గగనంగా మారింది. రోజువారీగా 40వేల మంది భక్తులు పెరిగితేనే తిరుమలలో వసతి దొరకడం క్లిష్టసమస్య. ఈ నేపథ్యంలో దేశవిదేశాల నుండి వస్తున్న భక్తులకు కొండపై కష్టాలు తొలగించి తిరుపతి అలిపిరి వద్ద ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుచేయాలని ఏడాదిన్నర క్రిందటే ప్రతిపాదనలు సిద్ధమైనా... టిటిడి పాలక మండలి ఆమోదించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చ లేదు. ఇందుకోసం అలిపిరికి సమీపంలోని ఎస్వీ శిల్ప కళాశాల స్థలంతోబాటు పరిసరాలను ఎంపికచేశారు. ఈ స్థలంలో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటుతో కొండపై భక్తుల కష్టాలకు కొంత వరకు చెక్‌పెట్టవచ్చని భావించారు. అయితే ఈ ప్రతిపాదనలు వెనుక స్థల గ్రహణం పట్టిందనేది టిటిడి వర్గాల్లో దుమారం. ఈ సమయంలో కొండకు వచ్చే భక్తుల సంఖ్య అనూహ్యం గా పెరిగింది. సాధారణరోజుల్లోనూ 90వేలమంది వరకు భక్తులు వస్తుండగా వారాంతం, వరుస సెలవులు, ప్రత్యేక పర్వదినాల్లో 1.50లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు వస్తుండటం తెలిసిందే. వచ్చిన భక్తులకు దేవుని దర్శనం సకాలంలో చేయించే మాట ఎలా ఉన్నా కనీసం ఉండటానికి గది కూడా దొరకదంటే ఆశ్చర్యంలేదు. ఆలయం వెలుపల కిలో మీటర్ల బారులు తీరుతున్న సామాన్యభక్తులకు తాగు నీరు, అన్నప్రసాదాలు కూడా అందకపోవడం మరో విశేషం. తిరుమలకొండపై రద్దీని నియంత్రించేం దుకు వీలుగా తిరుపతి అలిపిరిలోనే బేస్‌క్యాంప్ ఏర్పాటు చేయాలనేది టిటిడి అధికారుల ఆలోచన. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌తో యాత్రికులను అలిపిరిలోనే బసచేసేలా చర్యలు తీసుకునే వీలుకలుగుతుంది. అయితే ఇలా ఇప్పటికీ ఈ పనులకు కార్యాచరణ అమలుకాలేదు.

**తిరుమల విజన్ 2047 అమలు ఇలాగేనా!?:** తిరుమల విజన్ 2047 అమలు చేయడంలో భాగంగా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం దేశం నలుమూలల నుండి విచ్చేస్తున్న భక్తులకు వసతి, దర్శన సదుపా యాలు మరింత సులభం చేయడానికి అలిపిరి వద్ద బేస్‌క్యాంపు (ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్)ఏర్పాటుకు సుమారు 15 హెక్టార్ల విస్తీర్ణం స్థలం ఎంపిక చేసింది. ఈ స్థలంలో ప్రస్తుతం శిల్పకళాశాల నడుస్తుండటంతో దాన్ని మరోచోటికి తరలించి కాలుష్యం కూడా ఉండదని భావించారు. అయితే ఈ పనులకు ఇప్పటికీ అడుగడుగునా గ్రహణం పట్టింది. ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ ఏర్పాటైతే అలిపిరి వద్దే భక్తులకు వసతి సౌకర్యంతో బాటు దర్శన టిక్కెట్లు, టోకెన్లు జారీచేసే కౌంటర్ల ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు అన్ని సమకూర్చేలా తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మకర్తలమండలి, అధికారులు కూడా సూచనప్రాయం గా అంగీకరించారు. లక్షమంది వరకు తిరుమలకు భక్తులు వస్తుండటంతో ఉన్న వసతి, దర్శనం కష్టంగా మారింది. విపరీతమైన రద్దీతో శ్రీవారి దర్శనానికి 24 గంటల నుండి 30గంటల సమయం కూడా పడు తోంది. రద్దీకి అనుగుణంగా టిటిడి కొన్ని ప్రత్యామ్నా య చర్యలు, నిర్ణయాలు తీసుకోవాల్సి ఉందనే భక్తుల సూచనలతో అలిపిరిలోనే టౌన్‌షిప్‌కు మార్గం అన్వే షించారు. తిరుపతి అలిపిరిలో బేస్‌క్యాంపు ఏర్పాటు చేయడం వల్ల వసతి, దర్శన కౌంటర్లు అందుబాటు లోకి తీసుకువస్తే సుమారు 30వేల మంది వరకు భక్తులు ఈ క్యాంప్‌లోనే ఉండేందుకు వీలుంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అవసరమైన మౌలిక వసతులకు టిటిడికి అనుమతులు ఇచ్చింది. కొండపై రద్దీని నియంత్రించేందుకు వీలుగా అలిపిరిలో బేస్ క్యాంపు అవసరాన్ని గుర్తించారు. అలిపిరి పాత చెక్ పోస్టు ప్రాంతంలో సమీప స్థలాలను కలుపుకుని ఇందుకు శ్రీకారం చుట్టాలనేది ఆలోచన.

**టౌన్‌షిప్‌తోనే యాత్రికులకు సకల సౌకర్యాలు:** అలిపిరి వద్ద టౌన్‌షిప్ ఏర్పాటుచేస్తే తిరుమలకొండపై కష్టాలు తప్పినట్లే. ప్రస్తుతం తిరుమలలో 7,700 గదులు, వెయ్యికిపైగా మఠాల్లోని గదులు, ఐదు యాత్రికుల వసతి సముదాయాల్లో 10వేల వరకు లాకర్ల సదు పాయం ఉన్నాయి. 50వేల మంది వరకు భక్తులకు వసతి పొందుతున్నారు. భక్తులు కొండకు చేరు కున్నా ఆరుబయట, ఖాళీస్థలాల్లో, ఉద్యానవనాల్లో విశ్రాంతి తీసుకోవడం, తలదాచుకోవడం జరుగుతుంది. తిరుపతికి చేరుకునే ప్రైవేటు వాహనాలు, యాత్రికుల వాహనాలను అలిపిరి బేస్‌క్యాంపుకు అనుసంధానం చేసి, ఇక్కడ వసతి కల్పించడం వల్ల శేషాచలం అడవిలో కొలువైన తిరుమ లకు వాహనాల కాలుష్యం నుండి రక్షణతోబాటు, పర్యావరణ పరిరక్షణకు సులభ మవుతుంది. ఇంటి గ్రేటెడ్ టౌన్‌షిప్‌లో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ప్రణాళి కలు రూపొందించి ఆమోదించ డంతో టెండర్లు పిలిచి పనులు చేపట్టాల్సి ఉంది.

## తిరుపతిలో డ్రీమ్ చేజర్ ప్రొడక్షన్ చిత్రం



**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతిలో సినిమాల షూటింగ్ మొదలైంది. యువ నటుడు, దర్శకుడు తిలక్ రాయల్ దర్శకత్వంలో డ్రీమ్ చేజర్ ప్రొడక్షన్ నం.1 బ్యానర్‌పై రూపొందుతున్న నూతన చిత్రం శుక్రవారం ఉదయం తిరుపతి కోనేటికట్ట వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ముహూర్త కార్యక్రమంతో ప్రారంభమైంది. ఈ చిత్ర ప్రారంభోత్సవానికి సినీ నిర్మాత ఎన్.వి. ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ కొట్టారు. బిజెపి నాయకుడు నవీన్ కుమార్‌రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి తొలి షాట్‌కు 'యాక్షన్' చెప్పి చిత్రీకరణకు శ్రీకారం చుట్టారు. ఈ చిత్రంలో తిలక్ రాయల్, లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, భూషణమణి, రేణుక, రుహిక అర్జున్, గగన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సహ దర్శకులుగా శ్రీనివాస్ విక్రమ్, రామేశ్వరం, అనిల్, సినిమాటోగ్రాఫర్ గా భరత్, అసిస్టెంట్ డైరెక్టర్లుగా మాధురి, విష్ణు, షణ్ముగన్, మహేష్, నితీష్, విజయ్, ధనుష్ పనిచేస్తున్నారు. లైటింగ్ విభాగాన్ని కిరణ్, కార్తీక్, ఫైట్ మాస్టర్‌గా నవదీప్, సంగీత దర్శకుడిగా వివాన్ సూర్య, గేయ రచయిత లుగా దినకర్, రవితేజ వ్యవహరిస్తున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో చిత్ర ప్రారంభం జరగడం శుభసూచకమని, ఈ చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షి ం చారు. నటుడు, దర్శకుడు తిలక్ రాయల్ మాట్లాడుతూ, చిత్ర ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు కృతజ్ఞతలు తెలిపారు. అత్యున్నత ప్రమాణాలతో, పూర్తి నిబద్ధతతో చిత్రాన్ని రూపొందిస్తున్నామని, ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే చిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమా నికి విశ్రాంత ఆంధ్ర బ్యాంక్ మేనేజర్ డాక్టర్ జిఎస్ ప్రసాద్, శ్రీకాళహస్తి ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు పగడాల మురళి, బిజెపి నాయకులు సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి స్వాధీనం

• నిందితులు ఒడిశా, తమిళనాడు వాసులు

**కుప్పం, జులై 10 ప్రభాతవార్త:** అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను శుక్రవారం సాయంత్రం అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాలతో తాను, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, అర్బన్ ఎస్సైలు బాబు, రామకృష్ణ కలసి కుప్పం పట్టణం రైల్వే స్టేషన్ ప్రాంతంలో తనిఖీలు చేస్తుండగా నలుగురు యువకులు కుప్పం రైల్వేస్టేషన్ అండర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కన్పించారన్నారు. వీరిని విచారించగా వీరి నుంచి ఆరు కిలోల గంజాయి లభ్యమైందన్నారు. పట్టుబడిన నిందితుల్లో ఒడిషా రాష్ట్రంకు చెందిన అలోక్ డిగల్ (20) సాయి డిగల్ (22), తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మౌలా (32), ప్రదీప్ (23) ఉన్నారన్నారు.

నిందితులనుంచి గంజాయితోపాటు ఓ మోటారు సైకిల్‌ను సైతం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.కుప్పం సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్పీ హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

### సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి రంగాలలో

# భారత్ పరుగులు

• 'ఐసర్ష్ వార్షికోత్సవంలో పలువురు వక్తలు



**శ్రీకాళహస్తి, జులై 10 ప్రభాతవార్త:** రెండు దశాబ్దాలుగా సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి రంగాలలో దేశం పరుగులు తీస్తుందని కేంద్ర రక్షణ పరిశోధన శాఖాదికారి డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి సమీపంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐసర్) ఏడవ స్నాతకోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ద్దేశించి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఐఐటి, ఐసర్ ఒకేచోట ఆంధ్ర ప్రదేశ్‌లో ఉండటం గర్వకారణం అన్నారు. దీని సాధనకు కృషి చేసిన నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందనీయుడన్నారు. రక్షణ శాఖ భారత ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అత్యధిక యుద్ధవిమానాలు, రాడార్లు ఇతర రక్షణ సాంకేతికాలను అభివృద్ధిలో ప్రపంచంలోనే భారత దేశం ముందంజలో ఉందన్నారు. ఐసర్‌లో చదివిన విద్యార్థులు మంచి భవిష్యత్తుకు వెళ్ళాలి. తమ పరిశోధనల ఫలితాలను దేశ రక్షణకు ఉపయోగపడాలన్నారు. స్నాతకోత్సవంలో అండర్ గ్రాడ్యుయేట్, ప్రొఫెషనల్ మాస్టర్స్, డాక్టోరల్ ప్రోగ్రామ్‌లలో మొత్తం 214మంది విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఐఐఎస్ఇఆర్ తిరుపతి, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్‌పర్సన్ హరి ఎస్. భర్తియా స్నాతకోత్సవానికి అధ్యక్షత వహించారు. ఐఐఎస్ఇఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాంతను భట్టాచార్య, రాష్ట్ర ప్రభుత్వ డి.ఎస్.టి కార్యదర్శి హెచ్ పురుషోత్తం, ఐఐటి తిరుపతి డైరెక్టర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ సత్యనారాయణ పాల్గొని, పట్టభద్రులను అభినందించారు.

# విశాఖ చేరుకున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం

## ఐఎన్ఎస్ డేగా వద్ద జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధుల ఆత్మీయ ఆహ్వానం



**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:**

ఒక్కరోజు పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం విశాఖపట్నం చేరుకున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఐఎన్ఎస్ డేగా విమానాశ్రయం వద్ద జిల్లా యంత్రాంగం ఘన స్వాగతం పలికింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పుష్పగుచ్ఛాలు అందజేసి కేంద్ర మంత్రికి స్వాగతం పలికారు. కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టగా, భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా నిర్వహించారు. ఆయన పర్యటనలో పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొననున్నట్లు అధికారులు తెలిపారు.

# వైద్య విద్యలో అంతర్జాతీయ స్థాయికి భారతదేశం: వేద ప్రకాష్ మిశ్రా..



**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:**

భారతదేశంలో వైద్య విద్య అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా శరవేగంగా విస్తరిస్తోందని అకాడమి ఆఫ్ మెడికల్ ఎవాల్యుయేటర్స్ అండ్ ఇంటర్ ప్రిటర్స్ నేషనల్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వేద ప్రకాష్ మిశ్రా స్పష్టం చేశారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం లో జరిగిన ఒక ముఖ్యమైన సదస్సులో శుక్రవారం ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అధ్యక్షుడు, మరియు పార్లమెంట్ సభ్యులు భరత్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎరోల్ డిసౌజా, ప్రొ వైస్ ఛాన్సలర్ డాక్టర్.బి.గీతాంజలి ,ప్రొఫెసర్లు మరియు వివిధ వైద్య కళాశాలల ప్రతినిధులు పాల్గొన్నారు. 2017లో ప్రవేశపెట్టిన 'ఇన్స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్' పాలసీ ద్వారా ప్రైవేట్ మరియు ప్రభుత్వ వైద్య సంస్థలకు స్వయంప్రతిపత్తి (అటానమి) కల్పించి, వాటిని అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లేందుకు అవసరమైన సంస్కరణలపై సదస్సులో చర్చించారు. సెప్టెంబర్ 20, 2023న వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ భారత నేషనల్ మెడికల్ కమిషన్ కి (తరువాయి 8వ పేజీలో)

# స్నేహ మాక్స్ బినామీ ఆస్తుల జప్తు

**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త :**

విశాఖలో సంచలనం సృష్టించిన స్నేహ ఎంఏసీఎస్ (మాక్స్) కుంభకోణంలో ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ సంస్థకు చెందిన బినామీ ఆస్తుల జప్తునకు ఆదేశాలు జారీ చేసింది. అక్రమంగా రూ.6.32 కోట్ల డిపాజిట్లు సేకరించిన నిందితులు కటికాల శివభాగ్యరావు, స్వర్ణలతతో పాటు మరో 20 మందిపై విశాఖ పోలీసులు ఇప్పటికే కేసులు నమోదు చేశారు. డిపాజిట్ దారుల సొమ్ముతో బినామీలు, కుటుంబ సభ్యుల పేర్లతో భారీగా ఆస్తులు కూడబెట్టారు. పృథ్వీ కనస్ట్రక్షన్స్, ఇతర నిందితుల ఆస్తులను జప్తు చేయనున్నారు. చోడవరం, గోపాలపట్నం, ఎలమంచిలిలో ఉన్న 16 ఆస్తులతో పాటు 22.3 ఎకరాల భూమిని జప్తు చేయాలని విశాఖ సీపీ, స్టాంపులు కొనుగోలు శాఖ ఐజీలను ప్రభుత్వం ఆదేశించింది.

### ఇండియన్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్

# మెడ్ టెక్ జోన్ శాఖ ప్రారంభం



**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:**

ఇండియన్ బ్యాంక్ భారతదేశం లోని ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఒకటి. ఇండియన్ బ్యాంక్ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తమ ఉనికిని మరింత బలోపేతం చేయుటకు విశాఖపట్నం జోన్ పరిధిలో ఇండియన్ బ్యాంక్ వారి 51వ శాఖ ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్ (ఎఎంటిజెడ్) విశాఖపట్నం ను డాక్టర్ జితేందర్ శర్మ వ్యవస్థాపకులు, మేనేజింగ్ డైరెక్టర్ మరియు ముఖ్య కార్య నిర్వహణాధికారి ఈరోజు ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శ్రీమతి అస్మితా పాటిల్, జోనల్ మేనేజర్, ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం జోన్ వారు, శ్రీమతి ఎమ్.ఒరామణి, బ్రాంచి మేనేజర్, బ్రాంచి మరియు సిబ్బంది తదితరులు హాజరైనారు. ఇండియన్ బ్యాంక్ ప్రారంభోత్సవం సందర్భంగా డాక్టర్ జితేందర్ శర్మ మాట్లాడుతూ, ఎఎంటిజెడ్ పరిధిలో అనేక వైద్య సంబధిత పరికరాలు తయారీ సంస్థలు మొదలైనవి పనిచేస్తున్నాయని, ఇండియన్ బ్యాంక్ ఇక్కడ ప్రారంభించటం వలన వారి ఆర్థిక లావాదేవీలకు ఎంతో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని సంతోషం (తరువాయి 8వ పేజీలో)

### రాష్ట్ర సమాచార కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన

# ఏపీఈపీడీసీఎల్ అధికారులు

**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడును ఏపీఈపీడీసీఎల్ జోన్-1 సూపరెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు మరియు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా శుక్రవారం విశాఖపట్నంలోని ప్రభుత్వ అతిథి గృహంలో కలిశారు. అధికారిక కార్యక్రమం లో పాల్గొనటానికి వచ్చిన రాష్ట్ర సమాచార కమిషనర్ పి ఎస్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమాచార హక్కు చట్టం పై పెద్ద ఎత్తున అవగాహన సదస్సులు నిర్వహించడం చాలా శుభపరిణామమని కొనియాడారు. ఈ సదస్సుల ద్వారా ప్రజలకు, అధికారులకు చట్టంపై మరింత స్పష్టత వస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు.

### కాలుష్య నియంత్రణలో రాజీ ఉండదు..

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

- పారిశ్రామికాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి
- పరిశ్రమలు, పోర్టులు కాలుష్య నివారణకు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు రావాలి
- ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణే తొలి ప్రాధాన్యంగా ఉండాలి
- మేజర్ పరిశ్రమల నిర్వాహకులు, అధికారులతో ఎంపీ ఎం. శ్రీభరత్, ఏపీ పీసీబీ చైర్మన్ పి. కృష్ణయ్య





**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త :**

అత్యంత ప్రాముఖ్యత కలిగిన విశాఖ మహా నగర ప్రాధాన్యతను గుర్తించి పారిశ్రామికవేత్తలు నడుచుకోవాలని, నగర విశిష్టతను కాపాడేలా వ్యవహరించాలని, కాలుష్య నివారణలో భాగస్వామ్యం కావాలని విశాఖ ఎంపీ శ్రీభరత్, ఏపీ పీసీబీ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య పిలుపునిచ్చారు. అదే క్రమంలో కాలుష్య నియంత్రణలో రాజీ ఉండదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారిశ్రామికాభివృద్ధితో పాటు ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని హితవు పలికారు. జిల్లాలో కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, గాలి, నీటి నాణ్యత పరిరక్షణ, పరిశ్రమల్లో పర్యావరణ నిబంధనల అమలుపై కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమీక్ష సమావేశంలో విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్, ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి. కృష్ణయ్య, జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్, ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, గణబాబు, విష్ణుకుమార్ రాజు, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు డా. భాగవతుల సందీప్, పంచకర్ల సందీప్, వివిధ పరిశ్రమలు, పోర్టుల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొని పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ ఎం. శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని, అదే సమయంలో కాలుష్య నియంత్రణకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో గాలి నాణ్యత సూచికను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రస్తుతం ఉన్న ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కేంద్రానికి అదనంగా మరో మూడు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. భూగర్భ జలాలు, తీరప్రాంత జలాల నాణ్యతను నిరంతరం (తరువాయి 8వ పేజీలో)

### దేవస్థానం షాపుల తొలగింపులో

# ఉద్రిక్తత



- పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించిన బాధితుడు.
- అభివృద్ధి కోసం పనులు....
- వ్యాపారులను తొలగించుట కోసమే అధికారుల ఎత్తుగడలు
- అండగా కూటమి నాయకులు
- మాజీ కార్పొరేటర్ పి. వి. నరసింహం.



**సింహాచలం, జూలై 10, ప్రభాతవార్త :**

సింహాచలం దేవస్థానం పరిధిలోగల అడివివరం కొండ క్రింద గల తొలిపావాంచా ప్రాంతం లో అభివృద్ధిని షాక్ గా చూపి సుమారు 13షాపులను తొలగించుటకు అధికారులు అల్టిమేటం జారీచేయడంతో దుకాణం దారులు స్థానిక ఎమ్మెల్యే గంట శ్రీనివాస్ రావు కు జిల్లా కలెక్టర్ కు, స్థానిక మాజీ కార్పొరేటర్ పి. వి. నరసింహం కి సమస్య తీసికొని వెళ్లారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వచ్చి సమస్య ను అడిగి తెలుసుకుని, గిరి ప్రదక్షిణకి ఎటువంటి ఆటంకం లేదు కనుక తాత్కాలికంగా నిలిపివేయమని కార్య నిర్వహణ అధికారికి ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఉదయం షాప్ లు తొలగిస్తారని విషయం తెలుసుకుని స్థానిక మాజీ కార్పొరేటర్ పీవీ నరసింహం, వార్డ్ అధ్యక్షులు పంచదార్ల శ్రీనివాస్ రావు, టీడీపీ నాయుకులు, జనసేన అధ్యక్షులు మజ్జి సూరిబాబు, బీజేపీ వేమూరి మహేష్, వారికి అండగా నిలిచారు. స్థానిక దుకాణదారుడు పెట్రోల్ పోసుకొని నిప్పు అంటించుకోవడానికి ప్రయత్నించగా కూటమి నాయకులు ఓదార్చారు. ఈ దుకాణాలు మెట్లమార్గం ఏర్పాటు చేసిన నాటి నుండి ఇక్కడ ఉండేవి భక్తులు మెట్ల మార్గం నుండి వెళుతూ, వస్తూ ఇక్కడ దైవ ప్రసాదంగా బావించే కొబ్బరికాయలు, అరటిపళ్ళు, దీపాలు, పప్పు ప్రసాదాలు, దేవుని ప్రతిమలు, తాళ్ళు, ఫోటోల వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి సాగిస్తూ ఇక్కడనే (తరువాయి 8వ పేజీలో)

### సింహాచల గిరి ప్రదక్షిణకు

# పగడ్బందీ ఏర్పాట్లు



**సింహాచలం, జూలై 10, ప్రభాతవార్త :**

- 32 కిలోమీటర్ల మార్గాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్
- భక్తులకు అసౌకర్యం కలగకుండా సమగ్ర ప్రణాళికలు

శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి వారి గిరి ప్రదక్షిణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. జూలై 28, 29 తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవానికి లక్షలాది మంది భక్తులు తరలిరానున్న నేపథ్యంలో, విశాఖపట్నం జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఎం. అభిషిక్త్ కిషోర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావుతో కలిసి కలెక్టర్, కొండ చుట్టూ ఉన్న 32 కిలోమీటర్ల గిరి (తరువాయి 8వ పేజీలో)

# మహాసముద్రానికి భారత్‌నే భద్రతా కవచం

- మారుతున్న యుద్ధ సవాళ్లకు సైనికులు సిద్ధంగా ఉండాలి..
- ప్రపంచ స్థాయి ఆయుధాలతో సాయుధ దళాలను మరింత బలోపేతం చేస్తాం: రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్



**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త :**

హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పరిరక్షించే ప్రధాన శక్తిగా భారత్ నిలిచిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. విశాఖపట్నంలో శనివారం భారత నౌకాదళంలో చేరనున్న స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ 'మహేంద్రగిరి' కమిషనింగ్‌కు ముందు నిర్వహించిన బరాఖానా కార్యక్రమంలో నౌకాదళ సిబ్బందిని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత వాణిజ్యంలో 90 శాతానికి పైగా సముద్ర మార్గాల ద్వారానే జరుగుతోందని, దేశ ఆర్థికాభివృద్ధి, ఇంధన భద్రత, ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజెడ్), ద్వీప ప్రాంతాల రక్షణకు సముద్ర భద్రత అత్యంత కీలకమని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్న నేపథ్యంలో భారత నౌకాదళం దేశ సముద్ర సరిహద్దులను, కీలక సముద్ర మార్గాలను, జాతీయ ప్రయోజనాలను సమర్థంగా కాపాడుతోందని ప్రశంసించారు. "హిందూ మహాసముద్ర ప్రాంతం మన ఆవరణ.. దానిని రక్షించడం మన బాధ్యత" అని పేర్కొన్న ఆయన, ఈ ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు భారత్ పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. స్వదేశీ రక్షణ తయారీలో భారత్ వేగంగా ముందుకు సాగుతోందని, (తరువాయి 8వ పేజీలో)

### ఆర్‌టీఐ అమలులో ఏపీఈపీడీసీఎల్‌కు

# రాష్ట్ర సమాచార కమిషనర్ ప్రశంసలు



**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త :**

ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణ విధానాన్ని పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ఏపీఈపీడీసీఎల్ పనితీరును ప్రశంసించారు. శుక్రవారం ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, సంస్థ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్, ఐఏఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సమాచార (తరువాయి 8వ పేజీలో)

### అవంతి పోలిటెక్నిక్ కళాశాలలో

# శుభారంభం ఇండక్షన్ మీట్






**విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:**

తగరపువలస, అవంతి పోలిటెక్నిక్ కళాశాలలో పోలి టెక్నిక్ (డిప్లొమా) ప్రధమ సంవత్సరములో ప్రవేశము పొందిన విద్యార్థిని, విద్యార్థులకు శుభారంభం ఇండక్షన్ మీట్ కార్యక్రమములో అవంతి విద్యా సంస్థలు చైర్మన్, మాజీ మంత్రివర్యులు, గౌరవనీయులైన ముత్తంశెట్టి శ్రీనివాసరావు విద్యార్థులను ఉద్దేశించి కృషి, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలను అందుకోగలమని, అలాగే ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని భవిష్యత్తును నిర్మిం చుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులతో మంచి స్నేహబంధం ఏర్పాటు చేసుకొని ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పై దృష్టి పెట్టాలిని హితువు పలికారు. దేశములో మొదటిగా వ్యవసాయ రంగములో మార్పులు మొదలై పారిశ్రామిక రంగములో మార్పులు చోటు చేసుకున్నాయి. కాలనుగుణంగా ఎలక్ట్రానిక్స్,శాస్త్ర, (తరువాయి 8వ పేజీలో)

### ఆర్‌టీఐ నిబంధనలు పాటించని అధికారులపై

# కఠిన చర్యలు



8లో

## భీమిలి నియోజకవర్గంలో కాపు భవనంను నిర్మించాలి



పద్మనాభం, జూలై 10, ప్రభాతవార్త :

రాష్ట్రంలో రెండవ అతిపెద్ద నియోజకవర్గంగా దినదిన అభివృద్ధి చెందుతున్న భీమిలి నియోజకవర్గంలో కాపు కార్పోరేషన్ ద్వారా కాపు కులస్థులకు సమావేశ మందిరంను నిర్మించాలని కోరుతూ శుక్రవారం అమరావతిలో కార్పోరేషన్ చైరపర్సన్ ఆధ్వర్యంలో జరిగిన డైరెక్టర్ల సమావేశంలో విశాఖపట్నం డైరెక్టర్ కె.లీలావతి వినతిపత్రంను అందజేశారు.నియోజకవర్గంలో అత్యధికంగా కాపు ఓట్లు ఉన్నాయని,నియోజకవర్గంలో సమావేశ మందిరం లేక ఇబ్బందులు పడుతున్నారని లీలావతి వివరించారు.

## పోర్ట్ కాలుష్యం పై ఎంపి భారత్ కు భాదితులు వినతి



విశాఖపట్నం, జూలై 10, ప్రభాత వార్త :

జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో శుక్రవారం సాయంత్రం జరిగిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సమావేశములో విశాఖ పట్నం పోర్ట్ అథారిటీ అనుబంధ పరిశ్రమల కార్యకలాపాల వలన విశాఖ దక్షిణ నియోజకవర్గం 39 వ వార్డు ప్రాంత కాలుష్య భాదితులు వినతి పత్రం ఇచ్చారు.కాలుష్య కారణంగా తాము పడుతున్న ఇబ్బందులను పార్లమెంట్ సభ్యులు ఎం భరత్ కు 39 వ వార్డు ప్రజల తరపున ఇచ్చిన వినతిపత్రం లో తెలియ జేశారు.ముఖ్యంగా గత కొద్దిరోజులుగా విషపూరితమైన ప్రజల ప్రాణాలను హరించే బాక్సైట్ కార్గోను ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా పోర్టు వారు తమ వ్యాపారం చేసుకోవడంతో ఈ ప్రాంత ప్రజలు ఎర్రటి దుమ్ము, ధూళితో పడుతున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకుని వెళ్లారు.ఎంపీ భారత్ స్పందిస్తూ కాలుష్య నివారణ కోసం ఈరోజు సమావేశంలో ప్రజలకు మేలు కలిగే విధంగా కృషి చేస్తానని హామీని ఇచ్చినట్టు పోర్ట్ కాలుష్య భాదితులు తెలిపారు.

## రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం



గాజువాక,జూలై 10, ప్రభాతవార్త :

ఐఎన్ఎస్ మహేంద్రగిరి కమిష నింగ్ వేడుకల్లో పాల్గొనేందుకు నగరానికి విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శుక్రవారం ఐఎన్ఎస్ దేగా విమానాశ్ర యంలో ఘన స్వాగతం లభించింది. భారతీయ ప్రతిరక్ష మజ్దూర్ సంఘ్ (బీపీఎంఎస్) అనుబంధ సంస్థ అయిన ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ (ఐఎన్‌సీఎంఎస్) ప్రతినిధి బృందం మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసింది. రక్షణ మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ సందర్భంగా ప్రతినిధులు ఆయనకు ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మంత్రిని కలిసిన వారిలో బీపీఎంఎస్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి. విద్యాసాగర్, ఐఎన్‌సీ మజ్దూర్ సంఘ్ జనరల్ సెక్రటరీ ఎస్. రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. సత్య శ్రీనివాస్, మెటీరియల్ ఆర్గనైజేషన్ ఐఎన్‌సీఎంఎస్ జాయింట్ సెక్రటరీ చెల్లిబోయిన శేష రామకృష్ణ, వర్క్స్ కమిటీ సభ్యుడు మోహన్ తదితరులు ఉన్నారు.

## విశాఖ విమానాశ్రయంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఘన స్వాగతం

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

విశాఖపట్నం, జూలై 10 ప్రభాత వార్త :



విశాఖపట్నం పర్యటనకు విచ్చేసిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ కు బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ విశాఖపట్నం విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో, సాయుధ దళాల సామర్థ్యాన్ని పెంపొందించడంలో రాజ్‌నాథ్ సింగ్ అందిస్తున్న నాయకత్వం ప్రశంసనీయమని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు.దేశ భద్రత, సరిహద్దుల పరిరక్షణ, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాల సాధనలో కేంద్ర రక్షణ మంత్రి కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. ఆయన సంపూర్ణ ఆయురారోగ్యాలతో దేశానికి మరెన్నో సంవత్సరాలు సేవలందించాలని ఆకాంక్షిస్తూ మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్ర సమాచార కమిషనర్ ప్రశంసలు

(7వ పేజీ తరువాయి)

హక్కు చట్టం –2005 అమలు తీరు, ఆర్‌టీఐ దరఖాస్తుల పరిష్కారం, మొదటి అప్పీళ్ల నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ప్రజలకు సమాచారాన్ని అందించే విధానంపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు ఏపీఈపీడీసీఎల్‌లో ఆర్‌టీఐ రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల నమోదు, ఫైళ్ల నిర్వహణ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులను అత్యంత క్రమబద్ధంగా, పారదర్శకంగా నిర్వహిస్తున్న తీరును అభినందిస్తూ సంస్థ అధికారులను ప్రశంసించారు. సమాచార హక్కు చట్టం అమలులో ఏపీఈపీడీసీఎల్ అనుసరిస్తున్న విధానం ఆదర్శప్రాయంగా ఉందని పేర్కొంటూ, ఇదే విధమైన పనితీరును భవిష్యత్తులో కూడా కొనసాగించాలని సూచించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు నిర్దేశిత గడువులోగా ఖచ్చితమైన సమాచారాన్ని అందించడం ప్రతి ప్రభుత్వ సంస్థ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఆర్‌టీఐ దరఖాస్తులు, అప్పీళ్లను సకాలంలో పరిష్కరించడంతో పాటు, చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అలాగే కార్యాలయ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, జవాబుదారీతనం మరింత పెంపొందించాలని, సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకునే పౌరులకు పూర్తి స్థాయిలో సహకారం అందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ఏపీఈపీడీసీఎల్ సీఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్, ఐఏఎస్ మాట్లాడుతూ, సంస్థలో సమాచార హక్కు చట్టం నిబంధనలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర సమాచార కమిషనర్ చేసిన సూచనలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) టి.వి. సూర్యప్రకాష్, చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) డి. సుమన్ కళ్యాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో బీఎల్‌వోలు, బీఎల్‌ఏలు సమన్వయంతో పనిచేయాలి

- నేడు, రేపు ప్రత్యేక క్యాంపెయిన్ ను సద్వినియోగం చేసుకుని మిగిలిన ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించాలి
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూలై 10, ప్రభాత వార్త:

ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి బీఎల్‌వోలు, రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) పరస్పర సమన్వయంతో పనిచేస్తే మరింత మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన



సమావేశంలో ఆయన ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు. జిల్లాలో ఆబ్సెంట్, షిఫ్టెడ్, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల సంఖ్య సుమారు 3.5 లక్షలు ఉన్నట్లు గుర్తించామని, వీటికి సంబంధించిన డిజిటలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల బీఎల్‌ఏలు చురుకుగా సహకరించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 15 లక్షల ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి అందాయని, ఇంకా సుమారు 1.5 లక్షల ఫారాలు సేకరించాల్సి ఉందన్నారు. మిగిలిన నాలుగు రోజులు అత్యంత కీలకమైనవని, ప్రతి బీఎల్‌వో, బీఎల్‌ఏ సమన్వయంతో పనిచేసి ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు శనివారం, ఆదివారం జిల్లావ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని, ఇంకా ఎన్యూమరేషన్ ఫారం (ఈఎఫ్) సమర్పించని వారు ఈ రెండు రోజుల్లో తప్పనిసరిగా అందజేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో భాగంగా జిల్లాలో గుర్తించిన ఆబ్సెంట్, షిఫ్టెడ్, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల వివరాలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు జిల్లా కలెక్టర్ అందజేశారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో రాజకీయ పార్టీల పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

(7వ పేజీ తరువాయి)

విశ్లేషించడంతో పాటు బయోమెడికల్ వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, ఈ-వేస్ట్, నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణ వంటి అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిర్దేశించిన నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. 120 మైక్రాన్ల కంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీబ్యాగుల వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. కాలుష్యానికి కారణమవుతున్న రెడ్ కేటగిరీ పరిశ్రమలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిబంధనలు పాటించే సంస్థలను అభినందిస్తామని, ఉల్లంఘించే వారిపై జరిమానాలు, చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. "మమ్మల్ని ఎవరూ ఏమి చేయలేరు" అనే ధోరణిని పరిశ్రమలు పూర్తిగా విడనాడాలని, చెప్పేది ఒకటి, చేసేది మరొకటి అనే పరిస్థితి ఉండకూడదన్నారు. ప్రజలకు పారదర్శకంగా వ్యవహరించాలని, పరిశ్రమల సీఎస్సార్ నిధులను స్థానిక ప్రజల సంక్షేమానికి వినియోగించాలని, గత ఐదేళ్ల సీఎస్ఆర్ వ్యయ నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

పరిశ్రమల భారీ వాహనాల రాకపోకల వల్ల దెబ్బతింటున్న రహదారులకు సంబంధిత సంస్థలే బాధ్యత వహించాలని, రోడ్లకు నష్టం కలిగించిన కంపెనీలే మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. కాలుష్య నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. పారిశ్రామికాభివృద్ధి ఎంత ముఖ్యమో, ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని పేర్కొంటూ ప్రజల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేసే సంస్థలపై రాజీ లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలుష్య నియంత్రణకు పటిష్ట చర్యలు అవసరం : పి. కృష్ణయ్య

ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఛైర్మన్ పి. కృష్ణయ్య మాట్లాడుతూ పరిశ్రమల్లో చోటుచేసుకునే ప్రతి అంశాన్ని మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని తెలిపారు. సంస్థల యాజమాన్యాలు తమ కార్యకలాపాలపై పూర్తి అవగాహనతో ఉండాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే ప్రజలను అప్రమత్తం చేస్తూ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. విశాఖ పోర్టు, అదానీ పోర్టు పరిధిలో ధూళి కాలుష్య నియంత్రణకు మరింత పటిష్ట చర్యలు అవసరమన్నారు. టార్పాలిన్ లేకుండా ముడిసరుకును నిల్వ చేయడం, రవాణా చేయడం పూర్తిగా నివారించాలని ఆదేశించారు. రెండు నెలల్లో స్పష్టమైన పురోగతి కనిపించకపోతే సంబంధిత సంస్థలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. గంగవరం పోర్టు చుట్టూ 20 అడుగుల ఎత్తైన రక్షణ గోడ నిర్మించాలని, విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రతి పరిశ్రమ కనీసం 33 శాతం గ్రీన్ కవర్ అభివృద్ధి చేయాలని, హిందూజా, జిందాల్, ఫార్మా పరిశ్రమలు సహా అన్ని రెడ్ కేటగిరీ పరిశ్రమలు కాలుష్య నియంత్రణలో అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. దివీస్ పరిశ్రమ వ్యర్థాలపై స్థానిక మత్స్యకారులు చేసిన ఫిర్యాదులను ప్రస్తావిస్తూ ప్రజల్లో అపోహలు తొలగించే బాధ్యత కూడా పరిశ్రమలదేనని పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ కాలుష్య నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేయాలని, వేగంగా పెరిగే మొక్కలను నాటడం ద్వారా గ్రీన్ బెల్టును అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో పరిశ్రమలు ఎలాంటి ఉదాసీన వైఖరిని ప్రదర్శించినా ప్రభుత్వం సహించబోదని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ ప్రతి పరిశ్రమకు తొలి ప్రాధాన్యాలుగా ఉండాలే తప్ప చివరి అంశాలుగా ఉండకూడదన్నారు. పరిశ్రమల అభివృద్ధితో పాటు ప్రజల జీవన ప్రమాణాలు, పర్యావరణ సమతుల్యతను కాపాడే బాధ్యత ప్రతి సంస్థపై ఉందన్నారు.

## ఇండియన్ బ్యాంక్ ఆంధ్రప్రదేశ్ మెడ్ టెక్ జోన్ శాఖ ప్రారంభం

(7వ పేజీ తరువాయి)

వ్యక్తపరిచారు. తమ ఇండియన్ బ్యాంక్ ఖాతాదారులకు సేవింగ్స్ ఖాతాలు, హౌసింగ్/ పర్సనల్ లోన్లు (గృహ మరియు వ్యక్తిగత రుణాలు) మంజూరు చేస్తుందని, క్రెడిట్ కార్డు మరియు డిజిటల్ బ్యాంకింగ్ సేవలు అందిస్తుందని బ్యాంక్ ప్రారంభోత్సవం సందర్భంగా బ్యాంక్ జోనల్ మేనేజర్ శ్రీమతి అస్మితా పాటిల్ వివరించారు. ఖాతాదారులు తమ బ్యాంక్ సేవలు వినియోగించుకోవలసినదిగా ఆమె సూచించారు.

## వైద్య విద్యలో అంతర్జాతీయ స్థాయికి భారతదేశం: వేద ప్రకాష్ మిశ్రా..

(7వ పేజీ తరువాయి)

గుర్తింపునిచ్చిందని నేషనల్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ డాక్టర్ వేద ప్రకాష్ మిశ్రాతెలిపారు. దీనివల్ల భారతదేశంలోని సుమారు 719 వైద్య కళాశాలలు ప్రపంచ గుర్తింపు పొందాయని, ఇంగ్లీష్ మాట్లాడే అభివృద్ధి చెందిన దేశాల కంటే భారతదేశంలోనే అత్యధిక వైద్య కళాశాలలు ఉన్నాయని ఆయన గర్వంగా ప్రకటించారు. 2035 నాటికి ప్రపంచవ్యాప్తంగా అవసరమయ్యే ప్రతి ముగ్గురు వైద్యులలో ఒకరు భారతదేశం నుండి ఉంటారని, 2035 నాటికి ప్రపంచ వైద్య రంగంలో 1/3 వంతు మానవ వనరులను భారతదేశమే అందిస్తుందని అంచనా వేశారు. సంఖ్యాపరంగానే కాకుండా నాణ్యత పరంగా కూడా వైద్య విద్యను మెరుగుపరచడం ఎంతో అవసరమన్నారు. 2009 నుండి ఇప్పటివరకు సుమారు 80,000 మంది మెడికల్ టీచర్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామని, ఇది ఒక రికార్డు అని పేర్కొన్నారు. వైద్య విద్యలో నాణ్యతను పెంచేందుకు అకడమిక్ స్టాఫ్ కాలేజీల ద్వారా ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ అవసరమని ఆయన సూచించారు. చివరగా, వైద్య విద్యలో స్వయంప్రతిపత్తిని మెరుగుపరుస్తూ, అంతర్జాతీయ ప్రమాణాలను అందుకోవడానికి మరిన్ని చట్టపరమైన సంస్కరణలు రావాలని డాక్టర్ వేద ప్రకాష్ మిశ్రా ఆకాంక్షించారు.

# దేవస్థానం షాపుల తొలగింపులో ఉద్రిక్తత

(7వ పేజీ తరువాయి)

స్థిరనివాసం ఉండేవారు. వీరిలో కొంతమందికి సొంత ఇళ్లు కూడా లేకపోవడం దీనికి నిదర్శనం. అలా సాగుతున్న వీరికి తొలిపావాంచా అభివృద్ధి లో భాగంగా అప్పటి అధికారులు వీటిని తొలగించాలని నిర్ణయం తీసుకొని వాటికి ప్రత్యామ్నాయంగా యాత్రా నివాస్ మరియు తొలిపావాంచా మధ్యలో ఉన్న స్థలమును కేటాయిస్తున్నాము కానీ దేవాలయం వద్ద నిధులు లేని కారణంగా మీ సొంత ఖర్చులతో నిర్మించుకొనుటకు అవకాశం కల్పిస్తున్నామని అప్పటి అధికారులు అవకాశం కల్పించారు. ప్రస్తుతం ఉన్న స్థలములో 13 మంది 13 దుకాణములు వారి స్వంత సొమ్ములతో నిర్మించుకొని సుమారు 7 సంవత్సరాలు కావస్తోంది. దీనిని అప్పటి భీమిలి శాసన సభ్యులు, మాజీ మంత్రి ముత్తం శెట్టి శ్రీనివాసరావు ప్రారంభించారు. కానీ నేటివరకు వారి దురదృష్టమో లేక అధికారుల నిర్లక్ష్యమో కానీ నేటి వరకు కరెంట్ కూడా లేదు.ఎన్ని వినతులు ఇచ్చినా వీరికి న్యాయం జరగలేదు. అయినా నేటి వరకు దీపపు బుడ్డీలు, బ్యాటరీ లతో వెలిగే కాంతితో వ్యాపారం సాగిస్తున్నారు. మరలా ఇన్నేళ్లకి మళ్ళీ దేవస్థానం అధికారులు వీరి వంక చూస్తున్నారు. ప్రస్తుత దుకాణములు ఏవిధమైన అడ్డంకి లేక పోయినా మరలా వీరిని ఇక్కడ లేకుండా చేయుటకు ఏవిధమైన నోటీసులు కానీ లేకుండా ఇంజనీరింగ్ అధికారులు, దేవాలయ కార్యనిర్వహణాధికారి నోటి మాటలతో ఇవి తొలగించ బడతాయి అని వెంటనే ఖాళీ చేయాలని హుకుం జారీ చేశారు.అసలు చక్కగా ఉన్న కొండ కు వెళ్ళు బస్ టికెట్ కౌంటర్, దాని వెనుక ఉన్న యాత్రవాసులు విశ్రాంతి భవనాలు ఎందుకు తీసి వేస్తున్నారో, దానికి ప్రత్యామ్నాయంగా ఏమి నిర్మిస్తున్నారు అన్నది ఏమీ ప్రజలకు గాని , భక్తులకు గాని పత్రికా ప్రకటనలు చేయకుండా భక్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని బుగ్గిపాలు చేస్తున్నారనే చెప్పాలి. దీనికి సంబంధించిన బ్లూ ప్రింట్ కూడా తయారు చేశారో లేదో తెలియదు. అయినా ఎప్పటి నుంచో ఇక్కడ స్వామి వారి పాదాల చెంత చిరు వ్యాపారాలు చేసుకుంటున్న నిరుపేద కుటుంబాలకు ఏవిధమైన దుకాణములు కేటాయిస్తామని కానీ , మరేవిధమైన బరోసా ఇవ్వకుండా అధికార బలంతో వీరిని వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు , విశ్వహిందూ పరిషత్ సంఘాలు, భక్తులు వాపోతున్నారు. వీరికి ఈ విధంగా కుటుంబ పోషణ లేకుండా చేయడం సమంజసం కాదని, వీరికి శాశ్వత దుకాణాలు ఏర్పాటు చేసి నిర్దిష్టమైన నెలసరి అద్దె నిర్ణయించి వారి జీవన భ్రుతికి తోడ్పాటు కల్పించవలసిన బాధ్యత ఇటు దేవస్థానం అధికారులు, ప్రభుత్వానికి ఉందని భక్తులు స్తానికులు కోరుకుంటున్నారు.

## రాజనాథ్ సింగ్‌ను కలసిన విష్ణు కుమార్ రాజు

విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త:



నగరానికి విచ్చేసిన గౌరవ కేంద్ర రక్షణ శాఖ మంత్రివర్యులు రాజ్‌నాథ్ సింగ్ ను ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ ఫ్లోర్ లీడర్ పి. విష్ణుకుమార్ రాజు శుక్రవారం ఎయిర్ పోర్ట్ లో మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు.గౌరవ రాజ్‌నాథ్ సింగ్ జన్మదినం సందర్భంగా వారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## అవంతి పోలిటెక్నిక్ కళాశాలలో శుభారంభం ఇండక్షన్ మీట్

(7వ పేజీ తరువాయి)

సాంకే తిక రంగాలలో అభివృద్ధి చెందుతుంది. ముఖ్య అతిధిగా కె.డి.వి. నరసింహారావు, ప్రిన్సిపాల్, గవర్నమెంట్ పాలి టెక్నిక్ కాలేజ్, చీపురుపల్లి మాట్లాడుతూ అవంతి విద్యా సంస్థలలో ప్రవేశం పొందిన డిప్లొమా విద్యార్థుల బంగారు భవిష్యత్ వుంది. ప్రస్తుత సమాజంలో డిప్లొమా చదువు కున్న విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశములు చాలా ఎక్కువగా వున్నాయి. ప్రతి విద్యార్థి టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ పై దృష్టి పెట్టాలని, చెడు వ్యసనాలకు దూరంగా, మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకొని ఎంతో మందికి ఆదర్శంగా ఉండాలని అలాగే కష్టపడేతత్వం ఉండాలని అభిప్రాయ పడ్డారు. అధునా తన కోర్సులు ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ యొక్క ప్రాముఖ్య తను వాటిలో ఉద్యోగ అవకాశములు ఎక్కువగా ఉన్నా యని వాటిని అంది పుచ్చుకోవాలని విధ్యార్దులకు ఉపదే శించారు. నగేష్ కుమార్ పతివాడ జనరల్ మేనేజర్, హోబుల్ బెల్లోస్ కంపెనీ, వైజాగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మిమ్మల్ని మీరు తక్కువ అంచనా వేసుకోకూడదు, డిప్లొమా వాళ్లకు ఎక్కువ ఉద్యోగావాకాశ ములు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు నైపుణ్యాలు కనుగొణంగా పరిశ్రమలతో అనుసంధానం చేసి, విద్యార్థు లకు ఉద్యోగ అవకాశాలు పొందగలరని అభిప్రాయ పడ్డారు. ప్రీతి వెరోనికా పూడి, సీనియర్ లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్, గవర్నమెంట్ పోలిటెక్నిక్ కాలేజ్, భీమిలి మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్ధిశించుకోవాలి, మీ గమ్యాన్ని చేరుకోవడానికి నిరంతరం ప్రయత్నం చేయాలి. ఎలాన్ మస్క్ లాగా కష్టపడి ఉన్నత స్థానానికి చేరుకోవాలని నా అభిప్రాయం. కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అన్ని వసతులు కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమ ములో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. మురళీకృష్ణ, డైరెక్టర్ డాక్టర్ ఏ చంద్రశేఖర్, డిప్లొమా ఇంచార్జి ప్రిన్సిపాల్ బి.జగదీశ్వరరావు, డిప్లొమా విభాగాధిపతి శేషు ఆమిటి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సింహాచల గిరి ప్రదక్షిణకు పకడ్బందీ ఏర్పాట్లు

(7వ పేజీ తరువాయి)

ప్రదక్షిణ మార్గాన్ని క్షేత్రస్థాయిలో సుదీర్ఘంగాపరిశీలించారు పర్యటనలో. జోడు భద్రాలు, అప్పుఘర్, మాధవధార, లక్ష్మీపురం వంటి కీలక ప్రాంతాల్లో భక్తుల రద్దీని అంచనా వేశారు. తొలి పావంచ వద్ద భక్తులు కొబ్బరికాయలు కొట్టే ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అక్కడ మెరుగైన వసతులు కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి మరింత ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ట్రాఫిక్ నియంత్రణ, రద్దీ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్య కూడళ్ల వద్ద దిశానిర్దేశక బోర్డులు ఏర్పాటు చేయాలని, చిన్నారులు, వృద్ధుల కోసం ప్రత్యేక సహాయ కేంద్రాలు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. గిరి మార్గంలో తాగునీరు, మజ్జిగ కేంద్రాలు, తాత్కాలిక షెడ్లు, మొబైల్ టాయిలెట్లు, వైద్య శిబిరాలు, పారిశుద్ధ్య పనులు యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు వివరించారు. ముఖ్య ప్రాంతాల్లో సీనియర్ అధికారులను పర్యవేక్షణకు నియమించనున్నట్లు పేర్కొన్నారు.

?ఈ కార్యక్రమంలో దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బండారు రాంబాబు, డిప్యూటీ ఇంజనీర్ (ఐ/సి) రామరాజు, జీవీఎంసీ సీఎంఓహెచ్ డాక్టర్ నరేష్, అదనపు కమిషనర్ సత్యవేణి, సీఈ సత్యనారాయణరావు, గోపాలపట్నం సీఐ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మహాసముద్రానికి భారత్‌నే భద్రతా కవచం

(7వ పేజీ తరువాయి)

'మహేంద్రగిరి' యుద్ధనౌక అందుకు నిదర్శనమని చెప్పారు. రాబోయే కాలంలో యుద్ధాల స్వరూపం పూర్తిగా మారే అవకాశముందని, సైనికులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని శారీరకంగా, మానసికంగా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని సూచించారు. సాయుధ దళాలకు ప్రపంచ స్థాయి ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం, అత్యుత్తమ వనరులు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. "యుద్ధాలను గెలిపించేది కేవలం ఆయుధాలు కాదు.. వాటిని వినియోగించే సైనికుల ధైర్యం, నైపుణ్యం, దేశభక్తే అసలైన బలం" అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్, తూర్పు నౌకాదళ కమాండ్ ఇన్‌చార్జి వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా, నౌకాదళానికి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆర్‌టీఐ నిబంధనలు పాటించని అధికారులపై కఠిన చర్యలు

విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త :

సమాచార హక్కు చట్టం-2005 (ఆర్‌టీఐ)ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినప్పుడే ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి ప్రజల్లో విశ్వాసం బలపడుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు అన్నారు. రాష్ట్ర సమాచార కమిషన్ నిర్ణయం మేరకు జిల్లాలో ఆర్‌టీఐ చట్టంలోని సెక్షన్ 4, 5 అమలు తీరును పరిశీలించేందుకు శుక్రవారం విశాఖపట్నం జిల్లాలోని పలు ప్రభుత్వ కార్యాల యాల్లో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్, జిల్లా పరిషత్, జీవీఎంసీ ప్రధాన కార్యాలయం, మధురవాడ జోనల్ కమిషనర్ కార్యాలయం, పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం, పెందుర్తి జోనల్ కార్యాలయం, పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, కేజీహెచ్, విమ్స్, మెడికల్ కళాశాల, ఏపీ ట్రాన్స్‌కో కార్యాలయాలను సంద ర్శించి ఆర్‌టీఐ అమలు తీరును పరిశీలించారు.

### పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో తీవ్ర నిర్లక్ష్యం

పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో ఆర్‌టీఐ దరఖాస్తుల నిర్వహణ, రికార్డుల సంరక్షణ, చట్టపరమైన నిబంధనల అమలులో తీవ్ర లోపాలు గుర్తించిన రాష్ట్ర సమాచార కమిషనర్ సంబంధిత అధికారులు, సిబ్బందికి అక్కడికక్కడే షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్ఓ) కార్యాలయం, మధురవాడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ ఆర్‌టీఐ అమలు సంతృప్తికరంగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### తనిఖీల్లో గుర్తించిన లోపాలు

తనిఖీల సందర్భంగా పలు కార్యాలయాల్లో ఈ క్రింది లోపాలు వెలుగుచూశాయి.

- సిటిజన్ చార్టర్‌ను నోటీస్ బోర్డులపై ప్రదర్శించకపోవడం.
- సెక్షన్ 4(1)(ఋ) ప్రకారం రికార్డుల క్రమబద్ధీకరణ, ఇండెక్సింగ్, కంప్యూటరీకరణ సక్రమంగా లేకపోవడం.
- సెక్షన్ 4(1)(ఎ) ప్రకారం ప్రజలకు స్వచ్ఛందంగా వెల్లడించాల్సిన 17 అంశాల సమాచారాన్ని వెబ్‌సైట్లు, నోటీస్ బోర్డుల్లో అందుబాటులో ఉంచకపోవడం.
- పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (ఏపీఐఓ), ఫస్ట్ అప్పీలేట్ అథారిటీ (ఎఫ్ఏఏ) వివరాలను ప్రదర్శించకపోవడం.
- ఆర్‌టీఐ దరఖాస్తులు, అప్పీళ్ల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం.
- చట్టబద్ధ గడువు దాటినా అనేక దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచడం.

వెంటనే అమలు చేయాల్సిన ఆదేశాలు రాష్ట్ర సమాచార కమిషనర్ అన్ని శాఖల అధికారులకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

- సెక్షన్ 4(1)(ఎ) ప్రకారం వెల్లడించాల్సిన సమాచారాన్ని వెంటనే వెబ్‌సైట్లు, నోటీస్ బోర్డుల్లో నవీకరించాలి.
- పీఐఓ, ఏపీఐఓ, ఎఫ్ఏఏల పేర్లు, హోదాలు, ఫోన్ నంబర్లు, ఈ-మెయిల్ వివరాలను స్పష్టంగా ప్రదర్శించాలి.
- ప్రతి ఆర్‌టీఐ దరఖాస్తుకు 30 రోజుల్లోగా సమాధానం ఇవ్వాలి. ఇతర శాఖకు బదిలీ చేయాల్సిన దరఖాస్తులను ఐదు రోజుల్లోగా పంపాలి.
- ప్రతి కార్యాలయం ప్రవేశ ద్వారం వద్ద ప్రజలకు అందించే సేవల వివరాలతో కూడిన సిటిజన్ చార్టర్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

### 15 రోజుల్లో లోపాలు సరిదిద్దాలి

జారీ చేసిన ఆదేశాలను 15 రోజుల్లోగా పూర్తిగా అమలు చేయాలని, లేనిపక్షంలో సంబంధిత కార్యాలయాధిపతులు, పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లపై సమాచార హక్కు చట్టం--2005లోని సెక్షన్ 20(2) ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.ఎస్. నాయుడు హెచ్చరించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి విధిగా పాటించాల్సిన బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన నిఖిల్



విజయవాడ, జులై 10, ప్రభాతవార్త :

ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత కుమారుడు నిఖిల్, తన పుట్టినరోజును భిన్నంగా, అర్థవం తంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విజయ వాడలోని విజయ మేరీ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఫర్ ది బ్లైండ్‌ను సంద ర్శించిన నిఖిల్, దృష్టివికలాంగ చిన్నారులకు స్వయంగా పోషకాహారం, పండ్లు అందించారు. అంతేకాక, పాఠశాలకు 15 ఫ్యాన్లు, 25 కాట్ బెడ్స్‌ను కూడా అందజేసి, చిన్నారుల సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచారు. విద్యా ర్థులతో ఆప్యా యంగా మమేకమై, వారి యోగక్షేమాలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సమయం గడుపుతూ, వారి నవ్వుల్లోనే తన పుట్టిన రోజు ఆనం దాన్ని వెతుక్కున్నారు. ఆర్భాటాలకు దూరంగా, సేవలోనే సంతృప్తిని వెతుక్కున్న నిఖిల్ తీరు స్థానికుల ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ భూదేవి సమేత శ్రీ శృంగార వల్లభ స్వామివారిని దర్శించుకున్న
# రాష్ట్ర బీజేపీ మీడియా కో-ఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి



విశాఖపట్నం, ప్రభాతవార్త

కాకినాడ జిల్లా, పెద్దాపురం సమీపంలోని చదలాడ (తిరుపతి) గ్రామంలో వెలసిన శ్రీ భూదేవి సమేత శ్రీ శృంగార వల్లభ స్వామివారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ మీడియా కోఆర్డినేటర్ శ్రీ వెన్నా శ్రీరామమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం అందించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా వెన్నా శ్రీరామమూర్తి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా శ్రీ పీవీఎన్ మాధవ్ ఒక సంవత్సరం విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామివారి ఆశీస్సులు వారిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. అనంతరం ఆలయ విశిష్టతను వివరిస్తూ, ఈ దేవాలయం "తొలి తిరుపతి"గా ప్రసిద్ధి చెందిందన్నారు. స్థానికుల విశ్వాసం ప్రకారం ఈ ఆలయానికి సుమారు 9,000 సంవత్సరాల చరిత్ర ఉందని తెలిపారు. ఆలయంలోని పద్మం గుర్తు ఉన్న ప్రత్యేక శిలపై నిలబడి స్వామివారిని దర్శిస్తే, భక్తుడు ఎంత ఎత్తులో ఉంటాడో అదే ఎత్తులో స్వామివారు దర్శనమివ్వడం ఈ క్షేత్రం ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఇది ప్రాచీన భారతీయ శిల్పకళ, నిర్మాణ నైపుణ్యానికి అద్భుత నిదర్శనమని అన్నారు. ధ్రువుడు--శాండిల్య మహర్షికి సంబంధించిన పురాణ గాథను ప్రస్తావిస్తూ, త్రేతాయుగంలో ఈ ప్రాంతం దట్టమైన అరణ్యంగా ఉండేదని, బాలభక్తుడు ధ్రువుడు శ్రీమహావిష్ణువు ప్రసన్నం చేసుకునేందుకు ఇక్కడ ఘోర తపస్సు చేశాడని తెలిపారు. అతని భక్తికి మెచ్చిన శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమయ్యారని, అయితే ఆయన దివ్య తేజస్సును తట్టుకోలేక ధ్రువుడు భయపడగా, "నేను నీలా ఉన్నాను" అని అభయమిస్తూ ధ్రువుడి కంటి స్థాయిలో శిలారూపమైన శ్రీ శృంగార వల్లభ స్వామి అవతరించారని పురాణాలు పేర్కొంటున్నాయని వివరించారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహానికి భిన్నంగా, ఈ ఆలయంలోని శ్రీ శృంగార వల్లభ స్వామివారి చేతుల్లో శంఖం, చక్రం స్థానాలు మారి ఉండటం మరో విశేషమని తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని ప్రసిద్ధ "బొటన బావి"ని పూర్వం "బొద్దా బావి"గా పిలిచేవారని చెప్పారు. ఈ బావి నీటిని తలపై జల్లుకుంటే మహా పుణ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసమని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ వెన్నా శ్రీరామమూర్తి ఈ పుణ్యక్షేత్రంతో తన చిన్ననాటి అనుబంధాన్ని, మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

# వైభవంగా వేణుగోపాలస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు

ఆరిలోవ, జూలై 10, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం స్థానిక 11వ వార్డు శ్రీ హరి నగర్‌లో ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం 21వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ కమిటీ ఆహ్వానం మేరకు ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా యువ నాయకులు వెలగపూడి ప్రతాప్ రుద్ర, ఏపీ ఎంఎస్ ఎం ఈ డైరెక్టర్ ముగడ రాజారావు, టిడిపి వార్డు నాయకులు కాకి గంగరాజు హాజరై శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామివారి కి పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదాలు స్వీకరించారు, అనంతరం 2వేల మందికి కమిటీ వారు ఏర్పాటు చేసిన మహా అన్నదానం కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదములు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు తోట ఆదినారాయణ, బొట్ట ఎర్రాజీరావు, నమ్మి కుమార్, టిడిపి నాయకులు రంగాల మంగరాజు, బోయి శ్రీను,రమణ, తదితరులు పాల్గొన్నారు.

# విమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం కమిషనర్ ఆకస్మిక తనిఖీ



ఆరిలోవ, జూలై 10, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ) కమిషనర్ పి.ఏ. నాయుడు విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్) ను ఆకస్మికంగా సందర్శించి వివిధ విభాగాల పనితీరు, పరిపాలనా రికార్డులు, సమాచార హక్కు చట్టానికి సంబంధించిన 4(1)బి సమాచార రికార్డులను పరిశీలించారు. విమ్స్ డైరెక్టర్ డా.వి.మన్మధరావు ఆసుపత్రి నిర్వహణ, రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, పరిపాలనా వ్యవస్థ, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆర్టిఐ కమిషనర్ కు క్లుప్తంగా వివరించారు. కమిషనర్ పి.ఏ. నాయుడు వివిధ శాఖలకు సంబంధించిన రిజిస్టర్ 1 మరియు రిజిస్టర్ 2 ఫైళ్లు, రికార్డులు, సమాచార హక్కు చట్టం అమలుకు సంబంధించిన పత్రాలను(పిఐఒ) ప్రజా సంబంధ అధికారి డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ కుమార్‌ను ఆదేశించి క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీ అనంతరం అన్ని రికార్డులు నిబంధనలకు అనుగుణంగా, సక్రమంగా నిర్వహించబడుతున్నాయని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణలో పారదర్శకత, క్రమబద్ధత, బాధ్యతాయుత విధానాన్ని అనుసరిస్తున్నందుకు విమ్స్ యాజమాన్యాన్ని అభినందించారు. విమ్స్ నందు ప్రత్యేకంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కు బదులు గవర్నింగ్ బాడీ విమ్స్ అభివృద్ధి కార్యక్రమాలు నిర్దేశించడం వంటి ప్రత్యేకమైన అంశాలు 4(1) బి సమాచారంలో ఉండడాన్ని గుర్తించారు. ప్రజలకు బాధ్యతాయుత పాలనను అందించడానికి, కార్యాలయాలు పారదర్శకంగా పనిచేయడానికి సమాచార హక్కు చట్టం ముఖ్యమైన సాధనమని, విమ్స్ అభివృద్ధి చెందినట్లయితే ఉత్తరాంధ్ర, రాష్ట్ర ప్రజలకు ఉన్నత స్థాయి ప్రమాణాలతో ప్రజలకు వైద్యం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పరిపాలనా అధికారులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు ఆర్థోపెడిక్ నెక్ ప్రో లేటెక్స్ దిండ్ల విరాళం

విశాఖపట్నం, ప్రభాతవార్త




విశాఖపట్నంలోని లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌కు 50,000 విలువైన ఆర్థోపెడిక్ నెక్ ప్రో లేటెక్స్ దిండ్లను విరాళంగా అందజేశారు. లయన్ విశాల్ అగర్వాల్, తుషార్ అగర్వాల్ తమ దివంగత తండ్రి లయన్ అశోక్ అగర్వాల్ జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమం లయన్స్ క్లబ్ మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ ఎన్.వి.ఎన్. దుర్గాప్రసాద రావు, విశాఖపట్నం లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ లయన్ సుశీల్ కుమార్ జైన్, సెక్రటరీ లయన్ వి.చంద్రమౌళి, లయన్ ఎ.రామారావు, మరియు లయన్ వి.శ్రీనివాసరావుల సమక్షంలో ఘనంగా జరిగింది. హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ లయన్ డా.వి.ఉమామహేశ్వరరావు ఈ విరాళాన్ని స్వీకరించి, దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివంగత లయన్ అశోక్ అగర్వాల్ సమాజానికి చేసిన గొప్ప సేవలను, వారి అందించిన విశేష సహకారాన్ని గుర్తుచేసుకున్నారు. విశాఖపట్నం లయన్స్ క్లబ్‌కు చెందిన పలువురు లయన్ సభ్యులు కూడా పాల్గొని దాతల సేవా గుణాన్ని అభినందించారు.

# నేడు హెచ్పీవీ వ్యాక్సిన్ శిబిరం

విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త

లయన్స్ క్లబ్ అఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా శనివారం ఉదయం 10.30గంటలకు సూర్యబాగ్‌లోని పోలీస్ బ్యారెక్స్‌లో 9నుండి 14ఏళ్ల లోపు గల పోలీసుల ఆడపిల్లలకు హెచ్పీవీ వ్యాక్సిన్ బూస్టర్ డోస్ వేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చీ, చైతన్య స్రవంతి అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రహమాన్ పాల్గొంటారు. పోలీసులకు చెందిన ఆడపిల్లలు ఈ వ్యాక్సిన్ వేసుకోని గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నియంత్రణకు సహకరించాలని డాక్టర్ షిరీన్ రహమాన్ కోరారు.

# పద్మనాభంలో ఘనంగా రెండవ విజయరామరాజు సంస్మరణ దినోత్సవం

పద్మనాభం, జూలై 10,ప్రభాతవార్త



భారతీయుల స్వాతంత్ర్య కోసం దేశంలో మొట్ట మొదటి సారిగా తెల్లదొరల తో వీరోచితంగా పోరాడి పద్మనాభం గ్రామంలో వీరమరణం పొందిన విజయనగర సంస్థానాదీశులు రెండవ విజయరామ రాజు సంస్మరణ దినోత్సవం ను మండల టీడీపీ అధ్యక్షుడు కె రమణ ఆధ్వర్యంలో శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. రెండవ విజయరామరాజు విగ్రహానికి, సమాధి వద్ద రమణతో పాటు ఎంపీటీసీ కె లక్ష్మీ, నాయకులు విజయబాబు, దామోదరరావు,కె రామరాజు, నందీష్, సన్యాసిరావు,ఎర్రినాయుడు, నాగు, గంగరాజు, ప్రసాదు,కర్రి రమణ, ఎర్రిబాబు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.అయితే 1994 నుండి ప్రభుత్వాలు,పాలకులు, అధికారులు ఎందరు మారినా పద్మనాభం యుద్ధ ప్రాంతం పర్యాటకంగా అభివృద్ధి చెందకపోవడం విచారకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీరామమూర్తి,ఎస్ రాము, పైడినాయుడు,రొబ్బు సూర్యనారాయణ, సంగు శ్రీను,సన్నిబాబు, బి రాము,సన్యాసినాయుడు పాల్గొన్నారు.

# సంఘ సేవకుడు జవహర్‌కి ఘన సన్మానం



## ముగిసిన సూరత్ ప్రకాష్ జయంతి ఉత్సవాలు

విశాఖపట్నం జూలై 10 ప్రభాతవార్త

అక్కయ్యపాలెం వాగ్దేవి పాఠశాలలో భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ వారి ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో 1963లో జాతీయ సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ బివిపిని స్థాపించిన దివంగత డాక్టర్ సూరజ్ ప్రకాష్ జి జయంతి ఉత్సవాలు, బీవీపీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గత పది రోజులుగా నగరంలో గల వివిధ ప్రాంతాలలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగింది. ముగింపును పురస్కరించుకొని సంఘ సేవకునిగా ప్రాణదాతగా పేరుగాంచిన 131 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన వంకాయల జవహర్‌ను సంస్థ తరపున ఘనంగా సన్మానించి అభినందించగా సత్కార గ్రహీత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీవీపీ జాతీయస్థాయి ప్రతినిధి రమేష్ చంద్ జైన్ బివిపి తరఫున నిర్వహించిన సేవా కార్యక్రమాలకు సంతృప్తిని వ్యక్తం చేసి రక్తదానం చేసిన జవహర్ని ప్రశంసించారు. తదుపరి 60 మంది నిరుపేదలకు ఒక్కొక్కరికి 5 కేజీలు చొప్పున బియ్యం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వంకాయల సన్యాసిరాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వీ రాజశేఖర్, బీవీపీ ప్రతినిధులు ఎంవివి సత్యనారాయణ, ఎంఎస్ఎల్ శైలజ, విశాఖపట్నం శాఖ అధ్యక్షులు సిహెచ్వి సత్యనారాయణ, కార్యదర్శి వి జవహర్, కోశాధికారి డి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

# భారత్ వికాస్ పరిషత్ 14 రోజుల సేవా యజ్ఞానికి ఘన ముగింపు

## 100 నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ

విశాఖపట్నం, జూలై 10 ప్రభాతవార్త



భారత్ వికాస్ పరిషత్ వ్యవస్థాపకులు డా. సూరజ్ ప్రకాశ్ జీ జన్మదినం (జూన్ 27) నుండి భారత్ వికాస్ పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం (జూలై 10) వరకు శ్రీ రాణి రుద్రమదేవి శాఖ, అల్లూరి సీతా రామరాజు శాఖ సంయుక్తంగా నిర్వహించిన 14 రోజుల నిరంతర సేవా యజ్ఞం విజయవంతంగా ముగిసింది. పలు ప్రాంతాల్లో 14 రోజుల పాటు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఆరోగ్య శిబిరాలు, దంత వైద్య శిబిరం, యుక్తవయస్సు బాలికలకు అవగాహన కార్యక్రమం, శానిటరీ న్యాప్‌కిన్ల పంపిణీ, రక్తదాన శిబిరం, గోశాలకు పచ్చి మేత పంపిణీ, దేవాలయాలకు నెయ్యి, బియ్యం, నూనె విరాళాలు, అన్నదాన కార్యక్రమాలకు సహకారం, పేదలకు బియ్యం పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించి సమాజంలోని వివిధ వర్గాల ప్రజలకు సేవలందించారు. అలాగే భారత్ వికాస్ పరిషత్ సేవా తత్వం, దేశభక్తి, భారతీయ సంస్కృతి విలువలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చివరి సేవా కార్యక్రమంలో భాగంగా కొబ్బరితోట స్లమ్ ప్రాంతంలోని 100 నిరుపేద కుటుంబాలకు ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పున మొత్తం 100 బియ్యం సంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ రాణి రుద్రమదేవి శాఖ అధ్యక్షురాలు టి. సత్యశ్రీ లక్ష్మీదేవి, కార్యదర్శి అనిత మోతా, కోశాధికారి అడప గీత, అల్లూరి సీతారామరాజు శాఖ అధ్యక్షులు డి. ఎం. రావు, ఉపాధ్యక్షులు వి. శివకుమార్ రెడ్డి, లక్ష్మీ, పార్వతీ, ఇరు శాఖల సభ్యులు, దాతలు, స్వచ్ఛంద సేవకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జనసేన పేరుతో వ్యక్తిగత రాజకీయాలు సహించం..

## పీతల మూర్తి యాదవ్ వ్యాఖ్యలకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదు -జనసేన బ్యానర్, పవన్ కల్యాణ్ చిత్రాన్ని వినియోగించొద్దు : దక్షిణ నియోజకవర్గ నాయకుల స్పష్టీకరణ



విశాఖపట్నం, ప్రభాతవార్త

ప్రభుత్వ అధికారులపై మాజీ కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చేస్తున్న ఆరోపణలకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం లేదని దక్షిణ నియోజకవర్గ జనసేన నాయకులు స్పష్టం చేశారు. జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఈ మేరకు వెల్లడించారు. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ శివ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ, పీతల మూర్తి యాదవ్ ఇకపై నిర్వహించే విలేకరుల సమావేశాల్లో జనసేన పార్టీ పేరు, పార్టీ బ్యానర్ లేదా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ చిత్రాన్ని ఉపయోగించరాదని సూచించారు. వ్యక్తిగత అభిప్రాయాలను పార్టీ అభిప్రాయాలుగా ప్రచారం చేయడం సరికాదని, ఆయన వ్యాఖ్యలను జనసేన పార్టీ అభిప్రాయాలుగా పరిగణించవద్దని కూటమి నాయకులు, కార్యకర్తలకు విజ్ఞప్తి చేశారు. జనసేన నాయకుడు డా. మత్రివేముల శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రభుత్వ అధికారులతో ఏవైనా సమస్యలు ఉంటే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాల్సిందే తప్ప, నేరుగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి ఆరోపణలు చేయడం తగదన్నారు. ప్రభుత్వ అధికారులపై మాట్లాడిన తీరు కూడా సమంజసం కాదని, ఇకపై జనసేన పార్టీ బ్యానర్‌ను ఉపయోగించకుండా ఉండాలని పీతల మూర్తి యాదవ్‌కు సూచించారు. పీతల మూర్తి యాదవ్ చేసిన వ్యాఖ్యలకు జనసేన పార్టీకి ఎలాంటి సంబంధం లేదని నాయకులు మరోసారి స్పష్టం చేశారు. గతంలో కూడా ఆయన సొంత పార్టీ నాయకులపై ఇదే తరహాలో మీడియా సమావేశాలు నిర్వహించారని పేర్కొన్నారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై జనసేన అధిష్ఠానం తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



# రెవెన్యూ సదస్సుకు విశేష స్పందన

ఆరిలోవ, జూలై 10, ప్రభాతవార్త

ఒక నెల ఒక నియోజకవర్గం, నాలుగు సందర్శనలు కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో తూర్పు నియోజకవర్గం 13వ వార్డు ఆరిలోవ చివరి బస్టాప్ జీవీఎంసీ కళ్యాణ మండపంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా తూర్పు శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు, జాయింట్ కలెక్టర్ విద్యాధరి హాజరయ్యారు. అనంతరం ఈ సదస్సు లో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వంలో జీవో నెంబర్ 296, 388 ద్వారా చంద్రన్న పట్టాలు ఇచ్చామని తర్వాత వచ్చిన గవర్నమెంట్ ఈ విషయంపై దృష్టి సారించలేదని తెలిపారు. ఇప్పుడు మరలా కూటమి ప్రభుత్వం ద్వారా చంద్రన్న పట్టాలకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తూ, అలాగే ఎవరైనా చంద్రన్న పట్టాకు అర్హులై ఉండి గతంలో తీసుకోలేకపోతే జీవో నెంబర్ 30 కింద మరలా దరఖాస్తు చేసుకోవాలని, చంద్రన్న పట్టాలో సర్వే నెంబర్,డోర్ నెంబర్, హద్దులు, పేర్లు నమోదులో తప్పులుంటే సరిదిద్దుకునే అవకాశం వచ్చిందని తెలిపారు. అలాగే శ్రీ కృష్ణాపురం, ఎస్.ఎస్.ఎస్ ఎన్ నగర్, రామకృష్ణాపురం గ్రామాలకు సంబంధించి సర్వేనెంబర్ 26 వాటర్ వర్క్స్‌లో ఉండటం వలన వారికి గతంలో చంద్రన్న పట్టాలు తిరస్కరించడం జరిగిందని,ఇప్పుడు మండల తహసీల్దార్,జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్‌తో మాట్లాడి దాని ఫైల్ ను అమరావతికి పంపించడం జరిగిందని త్వరలో వీరికి కూడా యాజమాన్య హక్కులు చంద్రన్న పట్టా ద్వారా కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సదస్సులో 231 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో భీమిలి ఆర్డిఓ సంగీత్ మాథుర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరావు, అర్బన్ తహసీల్దార్ ప్రసాద్,రూరల్ తహసీల్దార్ పాల్ కిరణ్, నోడల్ ఆఫీసర్ రామకృష్ణ, టిడిపి నాయకులు ఒమ్మి సన్యాసిరావు, వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు, మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత, పార్లమెంట్ అధికార ప్రతినిధి పొత్రకండ ధర్మారావు,వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి తదితరులు పాల్గొన్నారు.

# పద్మనాభం సిఐగా పదవీ భాధ్యతలు చేపట్టిన చంద్రమౌళి



పద్మనాభం,జూలై 10, ప్రభాతవార్త

పద్మనాభం మండల నూతన సిఐగా ఎం.చంద్రమౌళి శుక్రవారం పద్మ నాభం పోలీసు స్టేషనులో పదవీ భాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషను ఎస్ఐలు, సిబ్బంది నూతన సిఐకి మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం మండల టీడీపీ అధ్యక్షుడు కె.రమణ, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ సభ్యులు కె.దామోదరరావు,గంగరాజు,కర్రి రమణ, నూతన సిఐ చంద్రమౌళిని శాలువలు, మిఠాయిలతో ఘనంగా సన్మానించారు. పద్మనాభం సిఐగా పనిచేసిన శ్రీధర్ రికార్డులను అప్పగించారు.

# ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కారి చిన్నాను పరామర్శించిన జి.వి. రామచంద్రరావు



విశాఖపట్నం, జూలై 10, ప్రభాతవార్త

విశాఖపట్నం సముద్ర తీరంలో ఇటీవల జరిగిన ఘోర బోటు ప్రమాదం నుండి మృత్యుంజయుడిగా ప్రాణాలతో బయటపడి, ప్రస్తుతం శీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్స్యకారుడు, బోటు యజమాని కారి చిన్నాను వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి మరియు విశాఖపట్నం మత్స్యకార నాయకుడు జి.వి. రామచంద్రరావు శనివారం పరామర్శించారు. ఆస్పత్రికి చేరుకున్న రామచంద్రరావు.. చిన్నా ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నాను పరామర్శించి, ఆ భయంకరమైన ప్రమాదం ఎలా జరిగింది? సముద్రంలో ఎదుర్కొన్న పరిస్థితులు ఏమిటి? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలతో క్షేమంగా తిరిగొచ్చిన చిన్నాకు ధైర్యం చెప్తూ, అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు. ప్రమాదంలో సర్వస్వం కోల్పోయి, ఆస్పత్రి ఖర్చులు, కుటుంబ అవసరాల నిమిత్తం ఇబ్బంది పడుతున్న చిన్నా కుటుంబానికి జి.వి. రామచంద్రరావు తన వంతు మానవతా సహాయంగా రూ.30,000 (ముప్పై వేల రూపాయలు) నగదును అందజేశారు. వైద్య ఖర్చులకు, తక్షణ అవసరాలకు ఈ మొత్తాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

## ప్రభుత్వం ఆదుకోవాలి: జి.వి. రామచంద్రరావు

ఈ సందర్భంగా జి.వి. రామచంద్రరావు మీడియాతో మాట్లాడుతూ.. సముద్రంలో వేటకు వెళ్లి ప్రమాదానికి గురైన మత్స్యకారుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదం నుండి తృటిలో తప్పించుకుని, తీవ్ర మానసిక ఆందోళనలో ఉన్న చిన్నాకు మెరుగైన ఉచిత వైద్యం అందించడంతో పాటు, ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం తక్షణమే ప్రకటించాలని కోరారు. అలాగే ప్రమాదంలో బోటు మునిగిపోవడంతో ఉపాధి కోల్పోయిన జాలర్ల కుటుంబాలకు నష్టపరిహారం అందించి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని, బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ పరామర్శ కార్యక్రమంలో జి.వి. రామచంద్రరావుతో పాటు పలువురు ఫిషింగ్ హార్బర్ ప్రెసిడెంట్ ఎం.లక్ష్మణరావు, ఫిషింగ్ హార్బర్ జనరల్ సెక్రటరీ నరసింగ్,ఫిషింగ్ హార్బర్ కోశాధికారి చిన్న, ఆనంద్,కామేష్, గెడయ్య మరియు స్థానిక మత్స్యకార నాయకులు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాజువాక పోలీస్ స్టేషన్‌లో సీపీ శంఖబ్రత బాగ్చి, ఆకస్మిక తనిఖీ

## అధికారులకు దిశానిర్దేశం



గాజువాక,జూలై 10,ప్రభాతవార్త

నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి, శుక్రవారం మధ్యాహ్నం గాజువాక పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ నిర్వహణ, రికార్డుల పర్యవేక్షణ శాంతిభద్రతల పరిస్థితిపై ఆయన అధికారులతో సమీక్షించారు. స్టేషన్ ఆవరణలోని ఖాళీ ప్రదేశాలను శుభ్రంగా ఉంచాలి. వ్యర్థాలు పేరుకుపోకుండా చూడటంతో పాటు, మరుగుదొడ్లను నిత్యం పరిశుభ్రంగా నిర్వహించాలని ఆదేశించారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా వ్యవహరించాలి. వారి సమస్యలను ఓపికగా వినడంతో పాటు, పారదర్శకమైన విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పెండింగ్ కేసులను తక్షణమే పరిష్కరించాలని, అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలి. ముఖ్యంగా గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపాలని, స్టేషన్ పరిధిలో ఒక్క గంజాయి పెడ్లర్ కూడా లేకుండా చూడాలని స్పష్టం చేశారు. విధుల్లో ఎటువంటి నిర్లక్ష్యం వహించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా కఠిన చర్యలు ఉంటాయని సీపీ హెచ్చరించారు. విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.

# పశుగ్రాసం వినియోగంపై పాడి రైతులకు అవగాహన



ఆనందపురం, జూలై 10, ప్రభాతవార్త

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జూలై 7 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న పశుగ్రాస వారోత్సవాల సందర్భంగా ఆనందపురం మండలం సొంట్యాం గ్రామంలో పాడి రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంయుక్త సంచాలకులు డాక్టర్ నీలయ్య, ఉప సంచాలకులు డాక్టర్ ఎస్. రూపకళ, సహాయ సంచాలకులు డాక్టర్ ఎం. ప్రసాద్ రావు, సొంట్యాం పశు వైద్యాధికారిణి డాక్టర్ అశ్విని ప్రపుల్ల, ఎల్ఎస్ఏ డి. తేజ, ఏహెచ్ఏలు రఘురాం, సుభాని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంయుక్త సంచాలకులు డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ, పాడి పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి పెరుగుదలకు సమతుల్య మేత యాజమాన్యం మరియు పచ్చగడ్డి సాగు ఎంతో కీలకమని రైతులకు వివరించారు. వర్షాకాలంలో సమృద్ధిగా లభించే పచ్చగడ్డిని పాతర గడ్డి (సైలేజ్) రూపంలో నిల్వ చేసుకుంటే వేసవికాలంలో ఏర్పడే పశుగ్రాస కొరతను సమర్థవంతంగా అధిగమించవచ్చని తెలిపారు. అలాగే తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పీఎండీఎస్ పశుగ్రాస పంట సాగు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పచ్చని పశుగ్రాస సాగును విస్తృతంగా చేపట్టి, శాస్త్రీయ మేత యాజమాన్య పద్ధతులను అనుసరించడం ద్వారా పాడి పరిశ్రమను మరింత లాభసాటిగా మార్చుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని పశుగ్రాస సాగు, నిల్వ పద్ధతులు, పశుపోషణలో పాటించాల్సిన శాస్త్రీయ విధానాలపై అధికారులు ఇచ్చిన సూచనలను ఆసక్తిగా తెలుసుకున్నారు.


VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, ZAINAB JALNAWALA W/O YUSUF JALNAWALA, previously called ZAINEB JALNAWALA R/O 1B2, ADAM MANZIL, MUBARAK COLONY, YENDADA, VIZAG now changed my name from ZAINEB JALNAWALA to ZAINAB JALNAWALA. Henceforth I will be called as ZAINAB JALNAWALA for all purposes.

(Ro.No.14477)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం, విశాఖపట్నం-I
డి. నెం.9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీనగర్, సిరిపురం, విశాఖపట్నం-530003

**ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు**

టు:
ఋణగ్రహీత: 1. M/s సూపర్ కార్ వాష్, ఫ్లాట్ నెం 24 ఎదురుగా, సత్యనారాయణపురం, పెదగంట్యాడ గ్రామం, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్- 530044. 2. శ్రీ గొండేసి వంశీకృష్ణ (ప్రొప్రయిటర్), 17-7-39,గొండేసివీధి, పెదగంట్యాడ, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530044.
హామీదారు: శ్రీ కొరుపోలు రవికుమార్, తండ్రి: కెవియస్ నాయుడు, 24 13 1/4/1, FF 202, వుడా కాలనీ గాజువాక, గాజువాక, విశాఖపట్నం-530026.
డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా కెనరా బ్యాంక్, పెదగంట్యాడ బ్రాంచ్ నుండి M/s సూపర్ కార్ వాష్, శ్రీ గొండేసి వంశీకృష్ణ (ప్రొప్రయిటర్) మరియు శ్రీ కొరుపోలు రవికుమార్ గారు పొందిన లోన్స్ / ఋణ సౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | వడ్డీతో కలిపి ఈ తేది 07-07-2026 నాటికి బకాయి మొత్తం | వడ్డీ రేటు |
|---|---|---|---|
| టర్మ్ లోన్ అకౌంట్ నెం. 170005942453 | రూ. 10,00,000/- తేదీ: 06.09.2022 | రూ. 6,24,506.61/- | 11.10% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని తేది. 05/07/2026న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.6,24,506.61/- (అక్షరాల ఆరు లక్షల ఇరవై నాలుగు వేల ఐదు వందల ఆరు రూపాయలు మరియు అరవై ఒక్క పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కుల మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది. SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిస్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

**తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి**

అసెట్ ఐడి: 400064404711: విశాఖపట్నం జిల్లా, పెదగంట్యాడ యస్.ఆర్.ఒ., గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, పెదగంట్యాడ గ్రామం, పెదగంట్యాడ మండలం, పెదగంట్యాడ ఫేజ్-II, ఉడా కాలనీ, ఫ్లాట్ నెం. HIG-71, సర్వే నెం. 17 భాగంలో మొత్తం విస్తీర్ణం 417 చ॥గ॥లలో అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు స్థలం 42 చ॥గ॥ల విస్తీర్ణంతో "మనోజ్ రెసిడెన్సీ" నందు మొదటి అంతస్తులో 1385 చ॥అ॥ల ప్లింత్ ఏరియా (కామన్ ఏరియాలతో కలిపి)తో డోర్ నెం. 24-13-1/4/1, FF-202, అసెస్‌మెంట్ నెం. 1086514398 తో ఫ్లాట్ నెం. 202 మరియు స్టిల్ట్ ఫ్లోర్‌లో 80 చ॥అ॥ల కార్ పార్కింగ్ ఏరియా కలదు. హద్దులు: మొత్తం స్థలం ఏరియాకు హద్దులు: తూర్పు: పెదగంట్యాడ లేఅవుట్‌లో HIG ఫ్లాట్ నెం. 72, దక్షిణం: పెదగంట్యాడ లేఅవుట్‌లో HIG ఫ్లాట్ నెం. 84, పడమర: పెదగంట్యాడ లేఅవుట్‌లో HIG ఫ్లాట్ నెం. 70, ఉత్తరం: 40 అ॥ల వెడల్పు రహదారి. మనోజ్ రెసిడెన్సీ మొదటి అంతస్తులోని ఫ్లాట్ నెం.202 హద్దులు: తూర్పు: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: ఉమ్మడి వరండా, లిఫ్ట్ మరియు మెట్లు. టైటిల్ హోల్డర్ పేరు : శ్రీ కొరుపోలు రవికుమార్.

తేది: 07-07-2026, ప్రదేశం: విశాఖపట్నం సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## ఈనెల 12న అనకాపల్లిలో గరికపాటి నరసింహారావు ప్రవచనాలు

అనకాపల్లి, జూలై 10, ప్రభాతవార్త



వివేకనంద చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 12న ఆదివారం ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పద్మశ్రీ అవార్డు గ్రహీత గారపాటి నరసింహారావు ప్రవచనాలు జరగనున్నాయని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కాండ్రేగుల విష్ణుమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డులో ఉన్న పెంటకోట కన్వర్షన్ హాల్లో సాయంత్రం 6 గంటలకు గారపాటి నరసింహారావుచే సనాతన ధర్మం... మానవజన్మ సార్థకత అనే అంశంపై ప్రవచనాలు చేయుచున్నారని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ విష్ణుమూర్తి విజ్ఞప్తి చేశారు.

## జగన్నాథ స్వామి రథయాత్ర పోస్టర్ ఆవిష్కరణ



అనకాపల్లి, జూలై 10, ప్రభాతవార్త

స్థానిక గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద వేంచేసి ఉన్న శ్రీ సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల జూలై 16 నుంచి 25 తేదీ వరకు జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవ అత్యంత వైభవంగా జరగనుంది. ఈ మేరకు రథయాత్రకు సంబంధించిన పోస్టర్ని శుక్రవారం స్థానిక రింగ్ రోడ్డులో ఉన్న జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్చార్జి భీమిరెశెట్టి రామ్కి ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. దేవాలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, దేవస్థాన ధర్మకర్తలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం కావాలి

అనకాపల్లి, జూలై 10, ప్రభాతవార్త



ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ పిలుపు మేరకు అనకాపల్లిలో కోర్టు ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఐఎఎల్ ప్రతినిధులు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టంను ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. న్యాయాన్ని పరిరక్షించడంలో కృషి చేసే న్యాయవాదులకు ప్రతి ఘటనలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. న్యాయవాదులు పిల్లా హర శ్రీనివాసరావు, శివాచారి, అడపా సుధాకర్, బంధం రమణ, ఆదారి స్వామి, బాబు, సాయి లక్ష్మణ్, కుమార్, కనిశెట్టి సురేష్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్వాడీలు భారీ నిరసన



అనకాపల్లి, జూలై 10, ప్రభాతవార్త

సమస్యలు పరిష్కారం కోరుతూ అంగన్వాడి కార్యకర్తలు శుక్రవారం అనకాపల్లి పట్టణంలో భారీ నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆదేశాల మేరకు అంగన్వాడి కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరై కళ్ళకు గంతలు కట్టుకొని స్థానిక నెహ్రూ చౌక్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు పాల్గొని మద్దతు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పని చేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి అన్నారు. అంగన్వాడీలపై పని ఒత్తిడి పెంచుతూ అరకొర వేతనాలతో వారి శ్రమను దోచుకుంటున్నాయని వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు స్పందించకపోతే ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 29 30 తేదీల్లో రాష్ట్రంలోని అన్ని కలెక్టర్ కార్యాలయాలు వద్ద ముట్టడి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, సిఐటియు నాయకులు శంకర్రావు, అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### గ్రీవెన్స్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్

అనకాపల్లి, జులై 10, ప్రభాతవార్త



నియోజకవర్గ పరిధిలోని భూ సమస్యలు, రెవెన్యూ వివాదాల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించకుంటే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. శుక్రవారం మాడుగుల నియోజకవర్గం, పంచాయతీ రాజ్ గెస్ట్ హౌస్ లో ఒక నెల- ఒక నియోజక వర్గం- నాలుగు సందర్శనలు కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్, మాడు గుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ లతో కలసి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను శీఘ్రగతిన పరిష్కారం, రెవెన్యూ శాఖలో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కార్యక్రమం ఒక నెల- ఒక నియోజకవర్గం- నాలుగు పర్యటనలు కార్యక్రమాన్ని జిల్లాలో నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. మాడుగుల శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ మాడుగులలో గత రెండు వారాలుగా నిర్వహిస్తున్న ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభించిందని, ఈ కార్యక్రమం అత్యంత విజయవంతంగా కొనసాగిందని వెల్లడించారు. మొదటి వారంలోనే 460 దరఖాస్తులు రాగా, రెండో వారమైన శుక్రవారం వచ్చిన 414 వాటితో కలిపి మొత్తం 814 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, డివిజన్ జిల్లా స్థాయి అధికారులందరి సమష్టి సహకారంతోనే ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్పష్టం చేశారు. జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, ఇన్చార్జి డిఆర్ఓ, వై.శ్రీనివాసరావు, నర్సీపట్నం ఆర్డీఓ వెంకట రమణలు వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు.

## అవంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగత సభ



మాకవరపాలెం జులై 10 ప్రభాతవార్త

అవంతి పాలిటెక్నిక్ కళాశాల ప్రథమ సంవత్సర విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ప్రతేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ మాజీ పర్యాటక శాఖ మంత్రివర్యులు, ముత్తంశెట్టి శ్రీనివాసరావు హాజరై జ్యోతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అవంతి విద్యా సంస్థల వ్యవస్థాపకులు శ్రీ ముత్తం శెట్టి శ్రీనివాసరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ 26సంవత్సరాలు చరిత్ర ఉన్న మాకళాశాల ఎంపిక చేసుకున్న విద్యార్థులకు శుభాభినందనలు తెలియజేస్తూ సాంకేతిక విద్య అభ్యసించిన వారందరు మంచి స్థానాల్లో కొనసాగుతున్నారన్నారు. అనుభవజ్ఞులైన, అధ్యాపకులతోపాటు, సాకేతిక విద్యకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నాయని, 26 సంవత్సరాల కాలంలో ఒక్క రాగింగ్ కేసు నమోదవలేదని విద్యారుల రక్షణ కు సరిపడే వ్యవస్థా ఉందని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.మోహన్ రావు మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ విద్యతో పోలిస్తే పాలిటెక్నిక్ విద్య అభ్యసించిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని, పాలిటెక్నిక్ కోర్స్లో చేరిన విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేసారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.ఆర్.ప్రసాద్ రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ కళాశాల ఉండడం చేత పాలిటెక్నిక్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక ప్రయోగశాల వినియోగించున్నారని చెప్పారు.ట్రైనింగ్ అండ్ ప్లేసిమెంట్ ఆఫీసర్ డా.టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ పూర్తిచేసి విషయ, సాంకేతిక విజ్ఞానంతో పాటు ప్రయోగాత్మ నైపుణ్యం మెరుగు పరుచుకుంటే ఉద్యోగావకాలు విరివిగా ఉన్నాయని చేప్పారు.ఈకార్యక్రమానికి ప్రథమసంవత్సరంలో చేరిన 220 విద్యార్థిని విద్యార్థులు, తల్లి తండ్రులు, పాలిటెక్నిక్ అధ్యాపకులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## మాధవధార పరిధిలో పలు ప్రాంతాలలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాధవధార, ప్రభాతవార్త

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్లో మాధవధార,కళింగ నగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ -2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో మాధవధార ఉడా కాలనీ,ఈస్ట్ పార్క్, మాధవస్వామి గుడి రోడ్డు, సీతాన్న గార్డెన్స్, గాంధీ నగర్, కళింగ నగర్ ప్రాంతాలలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## కల్తీకి కళ్లెం ఎక్కడ..? బుచ్చయ్యపేటలో కిరాణా దుకాణాలపై తనిఖీలు కరువు

### తూనికల్లో తేడా.. బిల్లులు లేకుండా విక్రయాలపై ఆరోపణలు -నాసిరకం, గడువు ముగిసిన ఆహార పదార్థాల విక్రయాలపై వినియోగదారుల ఆందోళన -ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని ప్రజల డిమాండ్



బుచ్చయ్యపేట, జూలై 10, ప్రభాతవార్త

మండలంలోని పలు ప్రాంతాల్లో కిరాణా దుకాణాల నిర్వహణపై వినియోగదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తూనికలు-కొలతల్లో అవకతవకలు, బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు, గడువు ముగిసిన లేదా నాసిరకం ఆహార పదార్థాల విక్రయం జరుగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖల క్షేత్రస్థాయి తనిఖీలు సక్రమంగా జరుగుతున్నాయా అనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. మండలంలో వేగంగా పెరుగుతున్న కిరాణా దుకాణాల్లో ఎన్ని చట్టబద్ధమైన లైసెన్సులు, నమోదులతో కొనసాగుతున్నాయి? ఎన్ని దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి? అనే అంశాలపై స్పష్టత లేదని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత శాఖలు సమగ్ర తనిఖీలు చేపట్టకపోవడం వల్ల అక్రమాలకు అవకాశం ఏర్పడుతోందని ఆరోపిస్తున్నారు. కొన్ని దుకాణాల్లో వినియోగదారులకు కొనుగోలు బిల్లులు ఇవ్వకుండా విక్రయాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన పన్ను ఆదాయం దెబ్బతినడంతో పాటు, వినియోగదారులు తమ హక్కులను వినియోగించుకునే అవకాశాన్ని కోల్పోతున్నారు. నాసిరకం లేదా గడువు ముగిసిన వస్తువులపై ఫిర్యాదు చేయాలన్నా బిల్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు.తూనికలు--కొలతలను తనిఖీ చేయాల్సిన లీగల్ మెట్రాలజీ శాఖ, ఆహార నాణ్యతను పరిశీలించాల్సిన ఆహార భద్రత శాఖ, అక్రమాలపై నిఘా పెట్టాల్సిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. గడువు ముగిసిన వస్తువులు, కల్తీ ఆహార పదార్థాలు, లేబుల్ లేని ఉత్పత్తులు, నాసిరకం నూనెలు, మసాలా దినుసుల విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా..?

మండలంలోని అన్ని కిరాణా దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, లైసెన్సులు, తూనికలు-కొలతలు, బిల్లుల జారీ, ఆహార నాణ్యత, గడువు తేదీలు, నిల్వ విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం ద్వారా మాత్రమే వినియోగదారుల హక్కులు, ప్రజారోగ్యం కాపాడబడుతాయని వారు అభిప్రాయపడుతున్నారు.

## గ్రామకంఠం భూమి ఆక్రమదారులపై చర్యలు చేపట్టాలి

మాకవరపాలెం, జూలై 10, ప్రభాతవార్త



గ్రామకంఠం భూములను ఆక్రమించి నిబంధనకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కాకర నూకరాజుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు శుక్రవారం మండలంలోని పి.పి.అగ్రహారం గ్రామానికి చెందిన గ్రామ కంఠం భూమి అన్యాక్రాంతం అవుతుంది అంటూ.. గ్రామ టిడిపి అధ్యక్షులు బొంతు రాజబాబు, రమణ మరి కొంతమంది పెద్దలు ఫిర్యాదు చేశారు. పి.పి.అగ్రహారం గ్రామంలో పాలసొసైటీ సమీపంలో ఉన్న గ్రామ కంఠం భూమి కొంతమంది అన్యాక్రాంతం చేసి, అమ్మకాల జరుగుతున్నాయని ఆరోపించారు. అంతేకాకుండా ఆక్రమించిన స్థలాలలో ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే వీరిపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మాణం చేస్తున్న కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ పెద్దలు ప్రజలు ఫిర్యాదు చేశారు.దీనిపై స్పందించిన తహసిల్దార్ నూకరాజు రెవెన్యూ సిబ్బందిని పంపించి పరిశీలన చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. కార్యక్రమంలో పి. పి.అగ్రహారం గ్రామానికి చెందిన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌కు 3 రోజులే గడువు : ఈఆర్ఓ దయానిధి



గాజువాక, జులై 10,ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను మరో మూడు రోజుల్లో పూర్తి చేయాలని గాజువాక నియోజకవర్గ ఈఆర్ఓ, వియంఆర్డీఏ ఈఓ దయానిధి అధికారులను, రాజకీయ పార్టీలను ఆదేశించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 309 పోలింగ్ బూత్‌లలో బిఎల్ఓలు 99.3 శాతం ఫారాలను పంపిణీ చేయగా, ఇప్పటివరకు 72 శాతం మాత్రమే డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. మిగిలిన ఫారాలను త్వరగా సేకరించేందుకు రాజకీయ పార్టీల బిఎల్ఏ-2 ప్రతినిధులు సహకరించాలని కోరారు. చనిపోయిన వారివి, చిరునామా మారిన వారివి మరియు రెండేసి ఓట్లు ఉన్నవారి వివరాలను పంచనామా నిర్వహించి జాబితా నుండి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు త్రినాథ్, అమల, జీవీఎంసీ కమిషనర్ శేషాద్రి, డిప్యూటీ తహసీల్దార్ సూర్యకళతో పాటు వివిధ పార్టీల నాయకులు కరణంరెడ్డి నరసింగరావు, పల్లా శ్రీనివాసరావు (బెంగుళూరు రమణ), రౌతు గోవింద్, వెంకటేష్, రాంబాబు, బంగారు నాయుడు పాల్గొన్నారు.

## ఓటర్ల సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి : పప్పు రాజారావు

గాజువాక, జులై 10,ప్రభాతవార్త



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ఓటర్ల సవరణ ప్రక్రియను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర పరిశీలకులు పప్పు రాజారావు కోరారు. సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి లోకేష్, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక 71వ వార్డులోని 90, 91, 100, 101 బూత్‌లలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బిఎల్ఓలు ప్రతి ఇంటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేయాలన్నారు. ఓటర్లు తమ వివరాలు, కొత్త ఫోటో, సంతకంతో ఫారాలను అందించి రసీదు తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన వారు కొత్త ఓటు నమోదుకు ఈ అవకాశాన్ని వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది మోహన్, ఆర్పీలు, వార్డు నాయకులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ ఫారాలను నింపి త్వరగా అందజేయాలి :కరణంరెడ్డి నరసింగరావు



గాజువాక, జులై 10,ప్రభాతవార్త

నియోజకవర్గంలో ఎన్యూమరేషన్ ఫారాలను నింపి తిరిగి ఇవ్వడానికి మరో నాలుగు రోజుల సమయం మాత్రమే ఉందని, ఓటర్లందరూ గడువులోగా వీటిని బీఎల్ఓలకు అందజేయాలని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) కోరారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026లో భాగంగా శ్రీనగర్ టీఎస్ఆర్ టిబికే పాఠశాల వద్ద ఏఈఆర్ఓ, డిప్యూటీ తహశీల్దార్ రవికాంత్ ఆధ్వర్యంలో ఓటర్ల ప్రత్యేక గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కేఎన్ఆర్ పరిశీలించారు. బీఎల్ఓలు, ఆర్పీలు కలిసి మరణించిన వారివి, చిరునామా మారిన వారివి, డూప్లికేట్ ఓట్ల వివరాలతో ప్రత్యేక జాబితాలను సిద్ధం చేశారు. అనంతరం 92, 113, 114, 115, 131 పోలింగ్ బూత్‌ల పరిధిలో నిబంధనల ప్రకారం పంచనామా నిర్వహించి, వివిధ పార్టీల ప్రతినిధుల సంతకాలు సేకరించారు. నియోజకవర్గంలోని 309 బూత్‌లలో తమ పార్టీ ప్రతినిధులు ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొంటున్నట్లు కేఎన్ఆర్ తెలిపారు. బీజేపీ ప్రతినిధులు బగ్గు ఈశ్వరరావు, కేవీ రమణ, బొత్స జగదీష్, శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నేత్ర వైద్యశాలలో రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ఆవిష్కరణ

ఆరిలోవ, జులై 10, ప్రభాతవార్త



ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్యశాలలో సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి మానవీయ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సిఎస్ఆర్ గ్రాంట్ల ద్వారా వైద్యశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన 75 కి.వా రూఫ్‌టాప్ సోలార్ పవర్ సిస్టమ్ శుక్రవారం ప్రారంభించారు. మొత్తం ఏడు గ్రీన్ ఇనిషియేటివ్‌లకు మద్దతు ఇవ్వటంతో మొత్తం సోలార్ సామర్థ్యం 363 కే డబ్ల్యుకు చేరుకుంది. ఈ సోలార్ వ్యవస్థలు ఏటా 4.5 లక్షల యూనిట్ల సౌరశక్తిని అందిస్తుంది. ఈ విధంగా విద్యుత్ ఖర్చులలో ఆదా అయిన మొత్తం శస్త్రచికిత్సల ఖర్చును భరించలేని రోగులకు ప్రతి సంవత్సరం అదనపు కంటి శస్త్రచికిత్సలు చేయడానికి సహాయపడుతుంది. ఈ ఆవిష్కరణ సందర్భంగా చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ మానవీయ డెవలప్‌మెంట్ అండ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సహకారం ఎల్వి ప్రసాద్ ఆసుపత్రి యొక్క పర్యావరణ సుస్థిరత, హరిత కార్యక్రమాలను మరింత బలోపేతం చేసిందని, పర్యావరణానికి కాలుష్య హాని కలగకుండా సమాజానికి సేవ చేయడానికి సంస్థకు వీలు కల్పించిందని అన్నారు.

## పెదవలస వద్ద పోలీసుల వాహన తనిఖీల స్పెషల్ డ్రైవ్

### వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి : ఎస్సై సురేష్ సూచన

గూడెంకొత్తవీధి, జులై 10, ప్రభాతవార్త:



మండల పరిధిలోని పెదవలస గ్రామం వద్ద జాతీయ రహదారిపై పోలీసులు శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, ఆ మార్గంలో వెళ్తున్న ద్విచక్ర వాహనాలను నిలిపివేసి తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో పాటు, వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులను క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్సై సురేష్ మాట్లాడుతూ.. నిత్యం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని అవగాహన కల్పించారు. సరైన పత్రాలు లేకుండా, నిబంధనలు ఉల్లంఘిస్తూ వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## బాల్యవివాహాలు, డ్రగ్స్‌పై ఎల్‌సిసి చైర్మన్ అవగాహన

అరకులోయ, జూలై 10, ప్రభాతవార్త :



అరకులోయ ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతి గృహంను శుక్రవారం అల్లూరి జిల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కమిడి కృష్ణకుమారి సందర్శించి అక్కడి విద్యార్థినీలకు బాల్య వివాహాలు, డ్రగ్స్, టీనేజీ ప్రెగ్నె న్సీ వలన కలిగే నష్టాల పై అవగాహన పరిచారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ విద్యార్థినీలు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలన్నారు . మహిళల చట్టాలు హక్కులు గురించి అవగాహన పొందాలని చెప్పారు. డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని , బాల్యవివాహాలపై అవగాహన పొంది, తోటి వారికి అవగాహన పరచాలన్నారు. ప్రతి విద్యార్థిని ఉన్నత చదువులు చదివి ఉన్నత స్థానాల్లో నిలవాలని ఆకాంక్షించారు . వార్డెన్ విజయ, హెచ్ఆర్ ఏసిప ప్రతినిధి పి సింహాచలం పాల్గొన్నారు.

## అరకులోయలో వాలంటీర్ల 'మహాగర్జన'కు జీకే వీధి సంఘం పిలుపు



గూడెం కొత్తవీధి, జులై 10, ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో ఈ నెల 14న (మంగళవారం) నిర్వహించనున్న వాలంటీర్ల 'మహాగర్జన' బహిరంగ సభను విజయవంతం చేయాలని జీకే వీధి మండల వాలంటీర్ల సం ఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిషత్ కార్యా లయం వద్ద నిర్వహించిన సమావేశంలో సంఘం అధ్యక్షుడు గెమ్మెల కోటి, ఉపాధ్యక్షుడు డి. మురళీమోహన్, కార్యదర్శి పి. భాస్కర్ రావు మాట్లాడారు. మండల పరిధిలోని 16 పంచాయతీలకు చెందిన వాలం టీర్లు ఈ మహాసభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే వాలంటీర్లకు నెలకు రూ. 10,000 గౌరవ వేతనం అందిస్తామని హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. ఆ హామీని తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గతంలో రాజీనామా చేసిన వారు, చేయని వారు అనే భేదం లేకుండా వాలంటీర్లందరూ ఈ సభకు హాజరై తమ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

## సమస్యలపై కలెక్టర్ ఆఫీస్ ముట్టడించిన అంగన్వాడీలు



పాడేరు,జూలై10, ప్రభాతవార్త:

కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేస్తూ అంగన్వాడీలు యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు డిమాండ్స్ డే సందర్భంగా నల్ల చీరలతో నిరసన తెలుపుతూ పాడేరు జూనియర్ కాలేజీ గ్రౌండ్ నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయాన్ని అంగన్వాడీలు శుక్రవారం ముట్టడి చేశారు.ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.నాగమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని సామాజిక భద్రత పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు తీవ్రమైన పని ఒత్తిడి ఉందని తక్షణం నవజీవన్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన మినీ సెంటర్లను మెయిన్ సెంట్రల్‌గా మార్పు చేయాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు బిఎల్ఓ పేరుతో ఎన్నికల డ్యూటీలు చేయిస్తున్నారని తెలిపారు. ఉద్యోగం పేరుతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించడం లేదని అన్నారు తక్షణం వెబ్సైట్లో ఉద్యోగం అనే పేరు తొలగించాలని అన్నారు గ్యాస్ సర్వె లేక వంట నిర్వహణ ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఈనెల 31వ తేదీన మరోసారి కలెక్టర్ ఆఫీస్ వద్దకు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 11 ప్రాజెక్టుల నుంచి నాయకులు విస్తృతంగా అంగన్వాడీలు పాల్గొన్నారు. జిల్లా కోశాధికారి చిన్నారి, మోదకొండమ్మ, కొండమ్మ, వెంకటలక్ష్మి, భారతి, పెంటమ్మ, అచ్చి అమ్మ, ఈశ్వరి, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ ఎస్బిఐ పోతురాజు, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్ సుందర్రావు, జిల్లా కమిటీ సభ్యులు సత్యారావు, జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్, పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటర్ల సవరణ సర్వే 75 శాతం పూర్తి

గూడెం కొత్తవీధి, జులై 10, ప్రభాతవార్త



మండలంలో ప్రత్యేక ఓటర్ల సవరణ (సర్) సర్వే చురుగ్గా సాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం రింతాడ, సంకాడ, పెదవలస గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలకు తహసీల్దార్ అన్నాజీరావు, వైకాపా మండల అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు ఓటరు సర్వే తీరును పరిశీలించి, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం గిరిప్రసాద్ మాట్లాడుతూ.. సచివాలయాల పరిధిలో ఇప్పటివరకు 75 శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు), పార్టీ నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న ఎన్యూమరేషన్ ఫారాలను యుద్ధప్రాతిపదికన బీఎల్ఓలకు అందించాలన్నారు. మరణించిన వారి వివరాలు, వలస వెళ్లిన వారి వివరాలతో పాటు నకిలీ (డబుల్) ఓట్లను గుర్తించి జాబితా నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దుమంతి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, వైసీపీ నేతలు కంకిపాటి నారాయణ, లంబసింగి రమేష్, వంతల చంటిబాబు, సంకాడ మాజీ వైస్ సర్పంచ్ మడపల సోమేష్, బొబ్బిలి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

## సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో తీరిన తాగునీటి సమస్య

గూడెం కొత్తవీధి, జులై 10, ప్రభాతవార్త:



గూడెం కొత్తవీధి మండలం దామనపల్లి పంచాయతీ పరిధిలోని సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. స్పందన కార్యక్రమంలో ఇచ్చిన అర్జీకి నెల రోజుల్లోనే స్పందించి బోరు తవ్వించి ఇంటింటికీ తాగునీరు అందుబాటు లోకి తీసుకువచ్చిన కూటమి ప్రభుత్వం, జిల్లా అధికారులకు గ్రామస్తులు, బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావు తెలిపిన వివరాల ప్రకారం.. సిగినపల్లి రామ్‌నగర్ కాలనీలో సుమారు 15 కుటుంబాలు, 50 మందికిపైగా ప్రజలు దశాబ్దకాలంగా నివసిస్తున్నారు. అయితే, కాలనీ ఏర్పడిన నాటి నుంచి తాగునీటి సౌకర్యం లేక ప్రజలు కిలోమీటర్ల దూరం నుంచి కాలువ నీటిని తెచ్చుకుని వినియోగించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో అనేక మంది అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని మహిళలు గ్రామ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో గ్రామస్తుల తరఫున బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావు పాడేరులో నిర్వహించిన జిల్లా స్పందన కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించారు. అర్జీపై స్పందించిన జిల్లా అధికారులు, కూటమి ప్రభుత్వం నిధులతో బోరు తవ్వించి ఇంటింటికీ తాగునీటి సరఫరా కల్పించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దుక్కేరి ప్రభాకరరావుతో పాటు కూటమి నాయకులు సంకోజీ చంటిబాబు, పాంగి రంగారావు, దుక్కేరి బాబురావు, సంకోజీ సింహాచలం, సంకోజీ రామారావు, సంకోజీ మహేష్, కిముడు కృష్ణ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తండ్రి, సవతి తల్లి హత్య కేసులో కొడుకుకు జీవిత ఖైదు

**విజయనగరం, జులై 10 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా, బొండపల్లి పోలీసు స్టేషన్‌లో 2024 సంవత్సరంలో నమోదైన హత్య కేసులో నిందితుడు బొండపల్లి గ్రామం ఎస్.సి.కాలనీకి చెందిన డోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ.2000లు జరిమానా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పునిచ్చారు. డోల లక్ష్మణరావు తల్లి తన చిన్నతనంలోనే చనిపోగా అతని తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడు. సవతి తల్లి, తండ్రి నిందితుడిని ఎందుకు పనికిరావని, ఇంట్లో నుండి వెళ్లిపొమ్మని నిత్యం హేళన చేసేవారన్నారు. దీన్ని భరించలేని నిందితుడు డోల లక్ష్మణరావు (23) 2024 ఫిబ్రవరి 23న కత్తితో తల్లిదండ్రులను నరికి చంపేశాడు. బొండపల్లి వీఆర్ఒ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి గజపతినగరం ఎస్ఐ కె.లక్ష్మణరావు కేసు నమోదు చేయగా, అప్పటి గజపతినగరం సిఐ ఎస్.వి.ప్రభాకరరావు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, సమగ్రవంతంగా దర్యాప్తు పూర్తి చేశారు. అనంతరం సిఐ జి.ఎ.వి.రమణ నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేశారన్నారు. కేసులో ప్రాసిక్యూషన్ విజయవంతంగా పూర్తి చేసి, న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశ పెట్టడం, నేరం రుజువు కావడంతో నిందితుడు డోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ.2000 జరిమానాగా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పు వెల్లడించినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడు శిక్షింపబడే విధంగా చర్యలు చేపట్టిన పబ్లిక్ ప్రాసిక్యూటరు జి.సత్యం పోలీసుల తరుపున వాదనలు వినిపించగా, అప్పటి గజపతినగరం సిఐ జి.ఎ.వి.రమణ, కోర్టు కానిస్టేబుల్ బి.రవి కుమార్, సి.ఎం.ఎస్. ఎస్ఐ పి.మహేశ్వరరావుల క్రియాశీలకంగా పని చేసారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

## తెనాలిలో భార్యను చంపిన భర్త

**తెనాలి, జులై 10 ప్రభాతవార్త:** అక్రమ సంబంధం అనుమానంతో భార్యను భర్త కత్తితో నరికి చంపేశాడు. పోలీసుల కథనం ప్రకారం, అంగలకుదురులోని శ్రీనగర్ కాలనీలో నివసిస్తున్న నరేంద్రబాబు అలియాస్ నాని అనే వ్యక్తి తన భార్య సంధ్యారాణిపై అనుమానంతో గొడవపడ్డాడు. గొడవ తీవ్రమవడంతో కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి ఆమెను అక్కడికక్కడే చంపాడు. మృతురాలిది నూజండ్లకు చెందిన మన్నే సంధ్యారాణిగా గుర్తించారు. నిందితుడు నరేంద్రబాబు తెనాలికి చెందినవాడు. వీరికి వివాహమై 10 ఏళ్ల అవుతుంది. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. హత్య చేసిన తర్వాత నిందితుడు మృతురాలి జుట్టును కూడా కత్తిరించాడు. అనంతరం ఇంటికి బయట నుంచి గడియ పెట్టి నేరుగా తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి వాడిన కత్తితో సహా లొంగిపోయాడు. సమాచారం అందుకున్న తెనాలి రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది.

## చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్



**తిరుమల, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో యాత్రికుల ముసుగులో నేరాలకు పాల్పడుతున్న నిందితుడ్ని తిరుమల 2టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్దనుండి రూ.60వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. తిరుమల టు టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఐదేళ్ల కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. ఈనెల 6వతేదీ జార్ఖండ్ కు చెందిన ఒక భక్తుడు తన కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థమై తిరుమలకు వచ్చాడు. తిరుమలలోని ఎఎస్‌సి గది 414నిలో బస చేసి గదికి తాళం వేసి శ్రీవారి దర్శనానికి వెళ్ళారు. తిరిగి వచ్చే లోపు గదిన కిటికీ ద్వారా ప్రవేశించి సుమారు 95వేల రూపాయలు నగదు చోరీ చేశారు. దీనిపై బాధితుడు తిరుమల టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాల ద్వారా ముద్దాయిని గుర్తించారు. తిరుపతి రూరల్ మండలానికి చెందిన ఉప్పు గోవర్ధన్ (25) రెండు నెలల క్రితం తిరుమలలో శానిటేషన్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తూ దొంగతనానికి పాల్పడ్డాడు, ఇతడు గతంలో కూడా పలు దొంగతనం కేసులలో అరెస్ట్ విచారణ ఎదుర్కొంటున్నాడు. శ్రీవారి భక్తులు తాము తీసుకున్న వసతి గదుల నందు విలువైన వస్తువులు ఉంచి వెళ్ళవద్దని, గదులు, విడిచి వెళ్లే సమయంలో తలుపులు, కిటికీలు సక్రమంగా తాళం వేసి వెళ్ళాలని కోరారు. విలువైన నగదు, ఆభరణాలు ఇతర విలువైన వస్తువులను నిరక్ష్యంగా ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## విజయవాడలో గంజాయి పట్టివేత, ముగ్గురు అరెస్టు

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ రైల్వేస్టేషన్‌లో భారీగా గంజాయిని పట్టుకున్నారు. రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి పట్టుకున్నారు. విజయవాడలో ఈగల్, జీఆర్పీ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సోదాల్లో 31.5 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

## దుర్గమ్మ దర్శనానికి వెల్లువెత్తిన భక్తజనం



**ఇంద్రకీలాద్రి, జులై 10 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దర్శనానికి శుక్రవారం భక్తులు వెల్లువలా తరలివచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం సహాయ కమిషనర్ రంగారావు క్యూలైన్ల నిర్వహణను క్యూలైన్లను స్వయంగా పర్యవేక్షించారు. శుక్రవారం భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, సాధారణ భక్తులకు ఎలాంటి అంతరాయం కలగకుండా ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 30 గంటల వరకు అంతరాయ దర్శనం నిలిపివేశారు. అలాగే, ఇదే సమయంలో వీఐపీ దర్శనాలు అన్నీ కూడా పూర్తిగా నిలిపివేసి సామాన్య భక్తులకు పెద్ద పీట వేశారు.



**దుర్గమ్మ సేవలో హోం మంత్రి అనిత:** దుర్గమ్మని శుక్రవారం హోం మంత్రి అనిత దర్శించు కున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీ రంగారావు, ధర్మకర్తల మండలి సభ్యులు బడేటి ధర్మారావు మంత్రికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలు అందించారు. వేదపండితులు వేద ఆశీర్వచనం పలికారు.

**27 నుండి శాకంబరి ఉత్సవాలు:** ఆలయంలో 27 నుండి 29 వరకు శాకంబరి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. దుర్గమ్మ శాకంబరి మాతగా దర్శనమిస్తారని ఆలయంలోని మూలవర్లతో పాటు ఉపాలయాల్లో కూడా శాకంబరి అలంకరణ నిర్వహిస్తామన్నారు. సకల లోకాలు సుభిక్షంగా ఉండాలని, లోకాలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ... అందరికీ దవ్వుల బాధలు రాకుండా శ్రీ అమ్మవారిని భక్తులు ప్రార్థిస్తారని తెలిపారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారెను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు.

# గోదావరి వరదలకు సన్నద్ధం

**● రుద్రమకోటలో ఎస్‌డిఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్ ● ప్రాణరక్షణ చర్యలపై ప్రత్యక్ష విన్యాసాలు**

**● వరద ప్రభావిత మండలాల్లో అప్రమత్తతకు అధికారుల పిలుపు**



**ఏలూరు, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** వర్షాకాలం నేపథ్యంలో గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఏలూరు జిల్లా యంత్రాంగం ముందస్తు సన్నాహాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా వేలేరుపాడు మండలం రుద్రమకోట గ్రామంలోని గోదావరి నది తీరంలో శుక్రవారం ఎపి స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎస్‌డిఆర్‌ఎఫ్), జిల్లా పోలీసు శాఖ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. వరదల సమయంలో ప్రాణనష్టం జరగకుండా వేగంగా స్పందించడం, నీటిలో చిక్కుకున్న వారిని సురక్షితంగా రక్షించడం, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం వంటి అత్యవసర పరిస్థితులను ఈ మాక్ డ్రిల్‌లో ప్రతిరూపంగా ప్రదర్శించారు. పడవలు, లైఫ్ జాకెట్లు, రెస్క్యూ తాళ్లు, ఇతర ఆధునిక పరికరాలను ఉపయోగించి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ప్రత్యక్ష విన్యాసాలు చేసి సిబ్బందికి శిక్షణ ఇచ్చాయి. ఈ కార్యక్రమాన్ని వేలేరుపాడు తహసీల్దార్ శ్రీనివాసరావు, కుక్కునూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ బాబు, వేలేరుపాడు ఎస్ఐ నవీన్ కుమార్ పర్యవేక్షించారు. పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బందితో పాటు ఎస్‌డిఆర్‌ఎఫ్ ప్రత్యేక బృందాలు పాల్గొని వరదల సమయంలో చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

**గోదావరి పరివాహక గ్రామాలపై ప్రత్యేక దృష్టి:** ఏలూరు జిల్లాలోని కుక్కునూరు, వేలేరుపాడు మండలాల గోదావరి పరివాహక గ్రామాలు వరదల ప్రభావానికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఎగువ ప్రాంతాల్లో కురిసే భారీ వర్షాల కారణంగా గోదావరి నీటిమట్టం పెరిగితే ఈ ప్రాంతాల్లో అప్రమత్త చర్యలు అత్యంత కీలకంగా మారుతాయి. ఈ నేపథ్యంలో ముందస్తు సన్నాహాల్లో భాగంగానే మాక్ డ్రిల్ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:** వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు అధికారుల హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని, అవసరమైతే వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని అధికారులు సూచించారు. వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, విద్యుత్ తీగలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. గ్రామస్థులు స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.

**సమన్వయమే విజయానికి మూలం:** పోలీసు, రెవెన్యూ, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఇతర శాఖల మధ్య సమన్వయంతో పనిచేస్తే విపత్తుల సమయంలో ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని అధికారులు తెలిపారు. మాక్ డ్రిల్ ద్వారా సిబ్బందిలో అత్యవసర స్పందన సామర్థ్యం పెరగడంతో పాటు, విపత్తు నిర్వహణపై మరింత స్పష్టమైన అవగాహన ఏర్పడిందని పేర్కొన్నారు. వర్షాకాలం మొత్తం జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, అవసరమైతే తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని అధికారులు వెల్లడించారు.

# స్వల్పకాలిక పంటలే సాగుచేయాలి

**● ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు తక్కువే ● రైతులకు పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన**



**అనంతపురం, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది తక్కువ వర్షపాతం, దీర్ఘకాలిక వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల రైతులు ముందస్తు సన్నద్ధతతో వ్యవసాయాన్ని చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావం వల్ల ఎక్కువ నష్టం వాటిల్లకుండా ఉలవలు, పెసలు, సజ్జలు లాంటి స్వల్పకాలిక పంటలు రైతులు వేసుకోవాలని, చెరువులు, చెక్ డ్యాములోని నీటిని వినియోగించుకుని పంట ఎండబెట్టకుండా ఉండేందుకు రెండు, మూడు రక్షకతడులను ఇవ్వాలని, రిస్క్ తగ్గించుకొనే పంటలు, పండ్ల తోటల సాగుకు రైతులు చొరవ చూపాలని శాస్త్రవేత్తలు పలు సూచనలు చేశారు. శుక్రవారం అనంతపురంలోని అక్సియన్ ఫ్రాటర్నా ఏకాలజీ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'అనంతపురం ప్రాంతంపై ఎల్‌నినో ప్రభావం' అంశంపై శుక్రవారం ఒకరోజు సదస్సులో ఈ మేరకు పలు సూచనలు చేశారు. ఆ డా. బండి వెంకటేశ్వర్లు, మాజీ డైరెక్టర్, ఐసిఎఆర్-క్రిడా, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని, ఎల్‌నినో ప్రభావం రుతుపవనాల అనంతరం కూడా కొనసాగవచ్చని తెలిపారు. ఈ పరిస్థితుల్లో రైతులు వాతావరణ మార్పులకు అనుగుణమైన పంటల సాగు విధానాలను అనుసరించాలని, ప్రభుత్వం సకాలంలో తగినచర్యలు చేపట్టాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా దీర్ఘకాల, మధ్యకాల, స్వల్పకాల పంటలను సమన్వయంతో సాగు చేయాలని సదస్సు సిఫార్సు చేసింది. విత్తనాలు ఆలస్యమైతే ఉలవలు, పెసలు, మినుములు, చిరుధాన్యాలు వంటి కరువు తట్టుకునే పంటలను సాగు చేయాలని నిపుణులు సూచించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం (ఏఆర్ఎస్), రేకులకుంట ప్రధాన శాస్త్రవేత్త డా. ఎం. విజయ్ శంకర్ బాబు, ఎఎఫ్ ఏకాలజీ సెంటర్ డైరెక్టర్ వై.వి. మల్లారెడ్డి, రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం పండ్ల తోటల శాస్త్రవేత్త తిరుపతి రెడ్డి, బెంగళూరు ఐఐఎస్ఇ రిటైర్డ్ ప్రొఫెసర్ డా. ఎన్.హెచ్. రవీంద్రనాథ్, ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ డా. టి.యలమందారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సాల్‌రెడ్డి, శాస్త్రవేత్తలు డా. బి.ఎస్. సుష్మ (ఐఐఎస్‌సి), డా. ఎం.విజయ్ శంకర్‌బాబు, డా. జి.నారాయణస్వామి, డా. సి.రాధాకుమారి (ఏఆర్ఎస్, రేకులకుంట), రెడ్స్ స్వచ్ఛంద సంస్థ సిఇఒ భానుజా, డా. చంద్రాయుడు (కెవికె, కళ్యాణదుర్గం), డా. హెచ్.ఎస్. నాయక్ (ఎల్ఆర్ఎస్, సిద్ధరాంపురం), నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ అనూరాధ, జిల్లా వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ, పశుసంవర్ధక శాఖ, ఎపిఎంఐపి, రైతు సాధికార సంస్థ, డబ్ల్యూఎంఎ, ఫౌండేషన్ ఫర్ ఎకాలజికల్ సెక్యూరిటీ, సే ట్రీస్, సిసిడి, రెడ్స్, జన జాగృతి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూడు ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం

**● సిఎం చంద్రబాబు నాయుడు, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి డిఎస్‌బివి స్వామి**

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** సాంఘిక సంక్షేమ ఆధ్వర్యంలో మూడు ఎక్సలెన్సీ సెంటర్ల ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం పట్ల రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సహచర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో మంత్రి డా.స్వామి మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా మధురవాడ, గుంటూరు జిల్లా తాడికొండ, తిరుపతి జిల్లా కోటలో ఎక్సలెన్సీ సెంటర్లు ఈ విద్యా సంవత్సరం నుంచే ఏర్పాటు చేయనున్నాం. ఎక్సలెన్సీ సెంటర్లలో విద్యార్థులకు ఇంటర్ తో పాటు ఐఐటీ, నీట్, జేఈఈకి ఉచిత శిక్షణ అందిస్తాం. ఒక్కో ఎక్సలెన్సీ సెంటర్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఎంపీసీ, బైపీసీలకు 150 మంది చొప్పున ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 300 మందికి ప్రవేశం కల్పిస్తాం. ప్రవేశాల్లో బాలికలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం. ఈ ఎక్సలెన్సీ సెంటర్ల నిర్వహణకు టెండర్లు పిలిచి అర్హత కలిగిన వారికి అప్పగిస్తాం. పర్యవేక్షణ మాత్రం ప్రభుత్వానిదే. పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించేందుకు ఎక్సలెన్సీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నాం. పేద పిల్లలు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే సీఎం చంద్రబాబు సంకల్పమని అందుకను గుణంగా పేద విద్యార్థులకు కార్పొరేట్‌కి దీటుగా నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సంక్షేమ వసతి గృహాలు, గురుకులాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు.

# వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్న ప్రజా ప్రతినిధులు

**● నేతలకే మొదట కౌన్సెలింగ్ ఇవ్వాలని ఎస్పీని కోరా ● రిజర్వేషన్ పోరాట సమితి నేతల బిసి నాగరాజు ఆవేదన**



**అనంతపురం, జులై 10 ప్రభాతవార్త బ్యూరో:** ప్రజా ప్రతినిధులే వీధి రౌడీల్లా వ్యవహరిస్తున్నారని, రౌడీలను పెంచి పోషించే ప్రజా ప్రతినిధులకు మొదట కౌన్సెలింగ్ ఇవ్వాలని అనంతపురం జిల్లా ఎస్పీని కలిసి కోరినట్లు రిజర్వేషన్ పోరాట సమితి నేతల బిసి నాగరాజు డిమాండ్ చేశారు. ఇష్టాను సారం తిట్టుకునే నాయకులకే ఎమ్మెల్యేలు, ఎంపి టికెట్లను, ప్రధాన పార్టీల నేతలు చంద్రబాబు, జగన్ ఇస్తున్నారని ఆయన తీవ్రంగా ఆరోపించారు. నేతలు ఇష్టాను సారం నోటికి వచ్చినట్లు మాట్లాడే వారి ప్రెస్‌మీట్లను మీడియా బాయ్‌కాట్ చేయాలని సమాజానికి నష్టం చేకూర్చే విధంగా ప్రజా ప్రతినిధులు నోటికొచ్చినట్లు మాట్లాడితే ఆ భాషను సోషల్ మీడియా యదావిధిగా ప్రసారం చేస్తే సమాజానికి నష్టం చేసిన వారు అవుతారని ఈ విషయంలో సోషల్ మీడియా బాధ్యతగా వ్యవహరించాలని బిసి నాగరాజు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన జిల్లా ఎస్పీని కలిసి వినతిపత్రం ఇచ్చిన తర్వాత అక్కడే విలేకర్లతో మాట్లాడారు. తాడిపత్రి మొదలు ఉమ్మడి అనంతపురం జిల్లాలో ప్రజా ప్రతినిధులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పిజిఆర్ఎస్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కరం కోసం ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధతో నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. విజయవాడ తూర్పు నియోజక వర్గం పరిధిలోని మాచవరం బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, జేసి ఇలక్కియా ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొని ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా రెవెన్యూ సేవలు, ప్రభుత్వ పథకాలు, ఉపాధి కల్పన, పోలీస్ శాఖకు సంబందించి మొత్తం 61 అర్జీలు రాగా వాటిని వేగవంతంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రత్యేక పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించామని, ఇప్పుడు విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల నుండి వచ్చే సమస్యలను పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపిస్తున్నట్లు తెలిపారు. ప్రజల వద్దకు ప్రజాప్రతినిధులు, అధికారులు వచ్చి నిర్వహిస్తున్న ఈకార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ జులై నెలలో విజయవాడ తూర్పు నియోజకవర్గంలో నాలుగుచోట్ల ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణలో భాగంగా గత వారం ఆలోనగర్‌లో గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించామని వాటిలో చాలా వరకు పరిష్కారమైనట్లు తెలిపారు. జిల్లా యంత్రాంగం చొరవతో సూపర్ స్ట్రక్చర్ నుండి వందలాది కుటుంబాలకు ఊరట లభించిందన్నారు. మాచవరం జాగీర్దార్ పేరుతో 22ఏలో ఉన్న దాదాపు 80 ఎకరాల భూ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. పిజిఆర్ఎస్ ద్వారా ప్రజల సమస్యలు స్థానికంగానే పరిష్కారం లభిస్తుండటం పట్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.



## తొలి మోడల్ పుష్కర గ్రామంగా తీపర్రు

**● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి**

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 10 ప్రభాతవార్త:** రాబోయే 2027 గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని తదేకం ఫౌండేషన్ సహకారంతో నిడదవోలు నియోజకవర్గంలోని 'తీపర్రు' గ్రామాన్ని ఆదర్శ పుష్కర గ్రామంగా, స్థానిక ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా తీర్చిదిద్దాలని నిర్ణయించినట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. తీపర్రు మోడల్ విలేజ్ పనులను సంక్రాంతి నాటికి పూర్తి చేసే లక్ష్యంతో చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. అదే విధంగా గోదావరి తీరంలో ప్రతి గ్రామంలో ఈ తరహా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 'మా గోదావరి సంక్రాంతి2027' పేరిట రానున్న జనవరి నాటికి తీపర్రు నమూనాతో ముక్కామల, ముక్తేశ్వరం, కుండలీశ్వరం, కొవ్వూరు తదితర గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేయనున్నామన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఏ ఘాట్‌లో స్నానం చేసినా అదే పుణ్య ఫలం లభిస్తుందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. పుష్కరాలకు ముందే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజమహేంద్రవరం సంకల్పం 'స్వచ్ఛ గోదావరి పవిత్ర పుష్కరాల్ను క్షేత్రస్థాయిలో నిజం చేసే ఆదర్శ గ్రామంగా తీపర్రును నిలుపుతామని స్పష్టం చేశారు. మంత్రి కందుల దుర్గేష్ ఆకాంక్షకు అనుగుణంగా తీపర్రు ఘాట్‌ను మోడల్ ఘాట్‌గా ఎలా సిద్ధం చేయాలి? అలాగే 'నీర్షి అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ సహకారంతో అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేసుకుంటూ గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత, కాలుష్య రహిత ప్రాంతంగా ఎలా మార్చాలనే దానిపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తదేకం ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగా గ్రామ చెరువు పునరుద్ధరించడం, నీటి గుర్రపు డెక్క తొలగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వివరించారు. గ్రామంలో ఫ్లెక్సీలు లేకుండా ప్లాస్టిక్ రహిత ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. అదే విధంగా యాత్రికులు, పర్యాటకులు తమ గోదావరి దర్శనాన్ని గుర్తుంచుకునేలా 'ఐ లవ్ గోదావరి మా తీపర్రు' పేరుతో రెండు సెల్ఫీ పాయింట్స్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 25 హోమ్ స్టేలకు సన్నాహాలు చేస్తామన్నారు.

## ఎస్ఐఆర్‌ను ఆకస్మికంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్

**ఆత్మకూరు (నెల్లూరు), జులై 10 ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ఓటర్ల డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. డిజిటలైజేషన్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించి క్షేత్రస్థాయిలో చేపడుతున్న చర్యలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటికే 84శాతం డిజిటలైజేషన్ పూర్తి కావడంపై లెక్టర్ అధికారులను అభినందించారు. మిగిలిన డిజిటలైజేషన్ ప్రక్రియను శని, ఆదివారాల్లో కూడా వేగవంతంగా పూర్తిచేయాలని బిఎల్ఒలు, సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఓటరు వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. జాడతెలియని ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి వాస్తవ పరిస్థితులను నిర్ధారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఓటర్లు, డిజిటలైజేషన్ ప్రక్రియకు పూర్తి సహకారం అందించి తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ బి.పావని, తహసిల్దార్ పద్మజాకుమారి, మున్సిపల్ కమీషనర్ గంగాప్రసాద్, ఎంపిడిఒ, ఇతర అధికారులు, విఆర్ఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

## 'సర్' వేగవంతం చేయండి: ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), జులై 10 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెంలోని టిడిపి కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించారు. అలాగే 'సర్ష్ ప్రోగ్రామ్‌ని త్వరితగతని పూర్తి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల వద్ద నుండి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజలు సమర్పించిన ప్రతి అర్జీని ఆమె క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి అర్జీ సమస్యను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. అనంతరం కోవూరు నియోజకర్గంలో సర్ ప్రోగ్రామ్ పురోగతిని పరిశీలించారు. కోవూరు మండలంలో 75 శాతం, కొడవలూరులో 72.39, ఇందుకూరుపేటలో 72.2 శాతం, బుచ్చిరూరల్ 71.2 శాతం విడవలూరులో 67.54 శాతం పూర్తి కాగా బుచ్చి టౌన్‌లో కేవలం 63.4 శాతం మాత్రమే పూర్తి అయిందని తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెంలోని నాయకులందరు ఈకార్యక్రమంలో చురుక్కుగా పాల్గొని ఏ వార్డులో సర్ ప్రోగ్రామ్ వెనుక బడకుండా పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, వవ్వేరు బ్యాంకు చైర్మన్ దొడ్ల విజయలక్ష్మీ, దొడ్ల కోదండరామిరెడ్డి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ఎం.వి శేషయ్య, మురళీ, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, గౌరవాధ్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, క్లష్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బసవతారకం క్యాన్సర్ వైద్యశాల నిర్మాణాన్ని పరిశీలించిన గేట్స్ ఫౌండేషన్ ప్రతినిధి

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త:** అమరావతిలో నిర్మితమవుతున్న బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ వైద్యశాలను గేట్స్‌ఫౌండేషన్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అర్చన వ్యాస్, సిఓఓ రావి శ్రీనివాసరావుతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రాజెక్టు ఛీప్‌జనరల్ మేనేజర్ బాలసుబ్రమణ్యం ప్రాజెక్టుకు సంబందించిన పలు వివరాలను అర్చనకు వివరించారు. ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలనిసంస్థ ప్రతినిధులు చేసిన విజ్ఞప్తికి అర్చన సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో ఎందరో క్యాన్సర్ పేషంట్‌లకు సేవలు అందిస్తున్న బసవతారకం క్యాన్సర్ వైద్యశాల వైద్యులు, సిబ్బందితోపాటు సంస్థ చైర్మన్ నందమూరి బాలకృష్ణను ఈసందర్భంగా అర్చన అభినందించారు. వైద్యశాల ప్రాజెక్టు ప్రతినిధులు అర్చనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందచేసారు.

## పిఆర్‌సి అమలు కోసం 14న ర్యాలీ: ఆప్టా

**విజయవాడ, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** పిఆర్‌సి కమిటీ నియమించి, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎపి ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు కాకి ప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి ఎంజి మెహది ఒక ప్రకటన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని తమ నిరసన గళం వినిపించాలని పిలుపునిచ్చారు.

## కులమే లేని ఎఫ్ఐఆర్‌లో కులాన్ని అంటగట్టిన అడ్వకేట్ శ్రవణ్: కిరణ్ రాయల్

**తిరుపతి, జులై 10 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో జనం కోసం, వారి సంక్షేమం కోసం పనిచేస్తున్న డిసిఎం పవన్ కళ్యాణ్‌ని టార్గెట్ చేసే జోకర్లలో శ్రవణ్ ఒక్క జోకర్‌లా తయారయ్యాడని జనసేనపార్టీ తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ఎద్దేవాచేశారు. కులమే లేని ఎఫ్ఐఆర్ లో కులాన్ని అంటగట్టిన అడ్వకేట్ శ్రవణ్ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాయలసీమ రెడ్లను కాపులు అని అంటున్నారని, ఈ విషయంగా కావాలంటే విజయ్ సాయిరెడ్డి, జగన్మోహన్ రెడ్డిని అడిగి తెలుసుకో అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. జడా శ్రవణ్ లిల్లీపుట్ కాదు సిల్లిపుట్ అని కామెంట్స్ చేశారు. సిల్లీ పుట్ శ్రావణ్ జైలుకి వెళ్లడానికి తహతలాడుతున్నాడని, రూ.25 కోట్లు ఎన్నికల్లో ఖర్చు పెట్టామని చెబుతున్న శ్రవణ్ ఆ రూ.25 కోట్లు ఎలా వచ్చాయనేది ప్రభుత్వం విచారణ జరపాలని డిమాండ్ చేశారు. జనసేనాని పవన్ కళ్యాణ్ వల్లే సుగాలిప్రీతి ఘటన భయటకు వచ్చిందని కిరణ్‌రాయల్ గుర్తుచేశారు. సిల్లీపుట్ అడ్వకేట్ జడా శ్రవణ్ పబ్లిసిటీ కోసమే పవన్ కళ్యాణ్ టార్గెట్ చేస్తూ.. డ్రామాలు ఆడుతున్నాడని కిరణ్ రాయల్ విమర్శించారు.



# గిన్నిస్ రికార్డుల్లోకి కర్ణాటక పనస

## 72 కిలోల బరువు ఉన్నట్లు నిర్ధారణ

**బెంగళూరు,జులై 10:** కర్ణాటకలో ప్రదర్శించిన ఒక పనసపండు ఏకంగా 72 కిలోల బరువుతో గిన్నిస్ రికార్డుల్లోకి వెళుతోంది. గిన్నిస్ బుక్ వివరాల ప్రకారం 2024లో అమెరికాలోని ఫ్లోరిడాలో ఓ రైతు పండించిన 54.43 కిలోల పనసే ప్రపంచంలోనే అత్యంత బరువైనది. దీంతో రైతు ప్రతాప్ ఈ పండును ప్రపంచ రికార్డు కోసం పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. హాసన్ జిల్లా సకలేశ్‌పుర్ పట్టణంలోని శ్రీనివాస కన్వెన్షన్ హాల్‌లో ఇటీవల పనస, మామిడి పండ్ల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో హెబ్బనహళ్లి గ్రామానికి చెందిన రైతు హెచ్.బి.ప్రతాప్ కుమార్ తన తోటలో పండిన మూడు భారీ పనసపండ్లను ప్రదర్శనకు తీసుకొచ్చారు. వాటిలో 72 కిలోల బరువున్న పనసపండు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. సాధారణంగా పనస పండును ఒక వ్యక్తి చేత్తో ఎత్తగలడు. కానీ ఈ భారీ పండును మాత్రం ఒకరు ఎత్తడం సాధ్యం కాలేదు. దాంతో ఇద్దరు కలిసి దానిని ఎత్తి బరువు చూడాల్సి వచ్చింది. దాని పరిమాణం, బరువు చూసిన వారంతా సెల్ఫీలు తీసుకుంటూ ఆసక్తిగా వీక్షించారు. ప్రస్తుతం గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకారం ప్రపంచంలోనే అత్యంత బరువైన పనసపండు అమెరికాలోని ఫ్లోరిడాలో 2024లో నమోదైంది. ఆ పండు బరువు 54.43 కిలోలు. అయితే హాసన్ జిల్లాలో ప్రదర్శించిన పనసపండు 72 కిలోలు ఉండటంతో, అది ప్రస్తుతరికార్డును దాదాపు 18 కిలోల తేడాతో అధిగమించే అవకాశం కనిపిస్తోంది. సకలేశ్‌పుర్ తాలూకా ఉద్యానవన శాఖ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఇ. భానుప్రకాశ్ మాట్లాడుతూ, తమకు తెలిసినంత వరకు ఉద్యానవన శాఖ వద్ద ఇంత భారీ బరువున్న పనస రకం లేదన్నారు. ఈ పనస ప్రపంచంలోనే అత్యంత బరువైనదా అనే అంశాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌కు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. అన్ని ప్రమాణాలు సరిపోతే హెబ్బనహళ్లి గ్రామం పేరు ప్రపంచ రికార్డుల పుస్తకంలో నిలిచే అవకాశం ఉందన్నారు. ఈ యేడాది ప్రదర్శనలో ఉంచిన పనసపండు బరువు 72 కిలోలు కాగా, గత ఏడాది తమ తోటలో ఏకంగా 80 కిలోల బరువున్న పనసపండు కాసిందని ప్రతాప్ తెలిపారు. దానిని రికార్డుల కోసం నమోదు చేయలేకపోయామని చెప్పారు. ఈ భారీ పనస పండ్లను పెంచడానికి ఎలాంటి రసాయన ఎరువులు ఉపయోగించలేదని ఆయన వెల్లడించారు. పూర్తిగా సహజ పద్ధతుల్లోనే సాగు చేస్తున్నట్లు చెప్పారు. మల్నాడు ప్రాంతంలో ఈ రకాన్ని మక్కె పనస అని పిలుస్తారని తెలిపారు.

# ఆల్కహాల్ ఆధారిత దగ్గు సిరప్‌లకు డాక్టర్ల చీటీ తప్పనిసరి

**న్యూఢిల్లీ,జులై 10:** దేశంలో ఆల్కహాల్ ఆధారిత ఔషధాల నియంత్రణను మరింత పటిష్టం చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిబంధనలను మరింత కఠినతరం చేసింది. 12 శాతంకంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగిన ఔషధాలను లైసెన్స్ లేకుండా విక్రయించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలని పేర్కొంది. ఈ మేరకు డ్రగ్స్ రూల్స్, 2026ను ప్రభుత్వం నోటిఫై చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీని ప్రకారం 12 శాతం కంటే ఎక్కువ ఇథైల్ ఆల్కహాల్ కలిగి 30 మిల్లీలీటర్ల కంటే పెద్ద సీసాల్లో విక్రయించే సిరప్‌లు/టానిక్‌లను షెడ్యూల్ బీ1 పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొంది. కొన్నిరకాల దగ్గు సిరప్‌లు, టానిక్‌లలో ఔషధాల స్థిరత్వం కోసం, క్రియాశీల పదార్థాలను కరిగించడం కోసం ఇథైల్ ఆల్కహాల్‌ను ఎక్కువశాతం ఉపయోగిస్తారు. అయితే ఈ ఔషధాలు సులభంగా లభిస్తుండటంతో వీటిని చికిత్స కోసం కాకుండా మత్తు కోసం దుర్వినియోగం చేస్తున్నారు. ఈ విషయంలో పలు రాష్ట్రాల నుంచి ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలో డ్రగ్స్ కన్సల్టేటివ్ కమిటీ, డ్రగ్స్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డుల సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం వల్ల అవసరమైన రోగులకు ఈ ఔషధాలు ఎప్పటిలాగే అందుబాటులో ఉంటాయి. కానీ రిజిస్టర్డ్ డాక్టర్ ఇచ్చిన చెల్లుబాటు అయ్యే ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈమందులు విక్రయించనున్నారు. వీటి విక్రయానికు సంబంధించిన వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. నియంత్రణ అధికారుల తనిఖీల కోసం ఆ ప్రిస్క్రిప్షన్లు, విక్రయ రికార్డులను కనీసం మూడేళ్ల పాటు భద్రపరచాల్సి ఉంటుంది.

# హత్యచేసినా.. బంగ్లాకు వెళ్తా

## అక్కడే మరణిస్తా: షేక్ హాసీనా



**న్యూఢిల్లీ,జులై 10:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని, అవామీ లీగ్ అధినేత్రి షేక్ హాసీనా కీలక ప్రకటన చేశారు. స్వదేశంలో మరణశిక్షను ఎదుర్కొంటున్న ప్పటికీ, ఈ యేడాది డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్లి న్యాయస్థానం ముందు లొంగిపోవాలని నిర్ణయించుకున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రస్తుతం భారత్‌లో ఆశ్రయం పొందుతున్న 78 యేళ్ల హాసీనా, ఒక మీడియా సంస్థకు టెలిఫోన్ ద్వారా ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఈ విషయాలను స్పష్టం చేశారు. తనతో పాటు పార్టీకి చెందిన ఇతర సీనియర్ నాయకులు కూడా స్వదేశానికి తిరిగి వస్తారని ఆమె పేర్కొన్నారు. వారు నన్ను అరెస్టు చేయవచ్చు లేదా హతమార్చవచ్చు. ఏదేమైనా నేను వెళ్లాల్సిందే. ఒకవేళ మరణం సంభవిస్తే, అది నా తల్లిదండ్రులు విశ్రమిస్తున్న నా మాతృభూమిపైనే జరగాలి అని హాసీనా భావోద్వేగానికి లోనయ్యారు. మరణశిక్షను ఎదుర్కొంటున్న మరో సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి అసదుజ్జమాన్ ఖాన్ కమల్ కూడా ఆమెతో పాటు బంగ్లాదేశ్‌కు వెళ్లే వారిలో ఉన్నారు. 2024లో విద్యార్థులు, సామాన్య ప్రజలు చేపట్టిన భారీ నిరసనల కారణంగా షేక్ హాసీనా ప్రభుత్వం కూలిపోయిన సంగతి విదితమే. సుమారు రెండు దశాబ్దాల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆమె, 2024 ఆగస్టులో ప్రాణరక్షణ కోసం భారత్‌కు చేరుకుని రాజకీయ ఆశ్రయం పొందారు. నిరసనల అణిచివేతలో చోటుచేసుకున్న హింసాకాండ, మానవత్వానికి వ్యతిరేకంగా జరిగిన నేరాల ఆరోపణల నేపథ్యంలో బంగ్లాదేశ్‌లోని ప్రత్యేక ట్రైబ్యునల్ 2025 నవంబర్‌లో ఆమెకు మరణశిక్ష విధించింది. ఆమె పార్టీ అయిన అవామీ లీగ్‌పై కూడా నిషేధం విధించారు. అయితే, తనపై నమోదైన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితమైనవని హాసీనా కొట్టిపారేశారు.

# హైదరాబాద్- బెంగళూరు మధ్య అదనపు సర్వీసులు: ఆర్‌టిసి నిర్ణయం

**హైదరాబాద్, ప్రభాతవార్త, జులై 10:** హైదరాబాద్- బెంగళూరు మధ్య ప్రయాణించే ఐటీ ఉద్యోగులు, వ్యాపారులు, సాధారణ ప్రయాణీకులకు మరింత చేరువయ్యేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ఆర్‌టిసి) చర్యలు ప్రారంభించింది. ఆర్‌టిసి ప్రవేశపెట్టిన వినూత్న ఆఫర్‌కి ప్రయాణీకుల నుంచి విశేష స్పందన లభించడంతో హైదరాబాద్, బెంగళూర్ రూట్లలో ఆర్‌టిసి బస్సు సర్వీసు స్టాపింగ్‌ల సంఖ్యను పెంచడంతోపాటు, బెంగళూరు వెళ్లే ప్రయాణీకులకు నగరంలో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాన్ని కల్పించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందని సంస్థ ప్రకటించింది. బెంగళూరుకు ఆర్‌టిపి బస్సు టికెట్ బుక్ చేసుకున్న ప్రయాణీకులు, హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ రూట్లో నడిచే పుష్పక్ ఈ–సిటీ ఎసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. బెంగళూరు ప్రయాణ టికెట్ చూపించి ఈ ఉచిత సౌకర్యాన్ని పొందవచ్చని సంస్థ తెలిపింది.

ఆర్‌టిసి యాజమాన్యం తీసుకున్న ఈ సరికొత్త నిర్ణయం వల్ల ప్రయాణీకులకు ఆర్థిక భారం తగ్గడమే కాకుండా,ప్రయాణం మరింత సులువైందని, దీని ఫలితంగా ప్రతిరోజూ అదనంగా 60 నుండి 70 టికెట్లు బుక్ అవుతున్నట్టు సంస్థ వెల్లడించింది. ప్రయాణీకుల రద్దీతోపాటు డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్–బెంగళూర్ మధ్య బస్ స్టాపింగ్‌లను సంస్థ భారీగా పెంచింది. రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులను నడపాలని ఆర్‌టిసి ఎండీ నాగిరెడ్డి అధికారులను ఆదేశించారు. "ప్రయాణీకుల సౌకర్యార్థం, వారి సురక్షి త ప్రయాణమే ధ్యేయంగా టిజిఎస్ఆర్‌టీసీ నిరంతరం కొత్త ఆలోచనలతో ముందుకు సాగుతోందని ఆర్‌టిసి ఎండీ వై నాగిరెడ్డి తెలిపారు. బెంగళూరు ప్రయాణీకుల కోసం ప్రవేశపెట్టిన ఉచిత పుష్పక్ ఎసి కనెక్టివిటీకి వస్తున్న ఆదరణ చాలా సంతోషాన్నిస్తోందని, ఈ సదుపాయాన్ని ప్రయాణీకులందరూ మరింతగా సద్వినియోగం చేసుకోవాలని నాగిరెడ్డి కోరారు.

# క్రికెట్‌తో విడదీయరాని బంధం

## మెల్‌బోర్న్ గ్రౌండ్‌లో క్రికెటర్లతో ప్రధాని మోడీ భేటీ



**మెల్‌బోర్న్,జులై 10:** ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా భారతప్రధాని నరేంద్రమోడీ మెల్‌బోర్న్‌లోని ప్రముఖ మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌ను సందర్శించి యువ క్రికెటర్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన భారత్–ఆస్ట్రేలియా మధ్య క్రీడా సంబంధాలను మరింత బలోపేతం చేసే ఇండియా–ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్‌మ్యాప్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఎంసిజిలో ప్రసంగించిన ప్రధాని మోడీ మాట్లాడుతూ, ప్రతి భారతీయుడికి ఈ స్టేడియంలో అడుగుపెట్టడం రెండు భావోద్వేగాలను కలిగిస్తుందని అన్నారు. ఒకటి భారత్ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్ ఉత్సాహం కాగా, మరొకటి రెండు దేశాల్లోనూ క్రికెట్ కేవలం ఆట మాత్రమే కాకుండా ప్రజల అభిమానం, భావోద్వేగంగా మారిందనే విషయాన్ని గుర్తు చేస్తుందని చెప్పారు. అయితే ఈ రోజు చివరి ఓవర్ ఉత్కంఠ లేదని, ఆటపై ఆనందం, రెండు దేశాలస్నేహం, భవిష్యత్‌ఛాంపియన్ల ఉత్సాహం మాత్రమే కనిపిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్ సమక్షంలో ఇండియా–ఆస్ట్రేలియా స్పోర్ట్స్ కొలాబరేషన్ రోడ్ మ్యాప్‌ను ప్రారంభించిన ప్రధాని మోడీ, ఈ కార్యక్రమం ద్వారా కేవలం క్రికెట్‌కే పరిమితం కాకుండా ఇతర క్రీడల్లో కూడా ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని తెలిపారు.

ఈ సహకారంలో భాగంగా క్రీడా శిక్షణ, స్పోర్ట్స్ సైన్స్, ఆధునిక క్రీడా సాంకేతికత, ప్రతిభ అభివృద్ధి, క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో పరస్పర సహకారం పెంచనున్నట్లు వెల్లడించారు. ఆస్ట్రేలియా ప్రధాని ఆంథనీ అల్బనీస్‌తో తన ప్రతి భేటీలోనూ క్రికెట్ సహజంగానే చర్చకు వస్తుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

అహ్మదాబాద్‌లోని స్టేడియాన్ని ఇద్దరూ కలిసి సందర్శించిన విషయాన్ని గుర్తు చేశారు. మెల్‌బోర్న్‌లో కూడా మాజీ క్రికెట్ దిగ్గజాలు స్టీవ్ వా, లిసా స్టాలేకర్ సమక్షంలో ఉండటం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ, ఆ దేశ ప్రతిపక్ష నాయకుడు అంగస్ టేలర్‌ను కూడా కలిశారు. ఈ సందర్భంగా భారత్–ఆస్ట్రేలియా సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలో పేతం చేసే అంశాలపై చర్చించారు. భారత్‌తో సంబంధాలను మరింత విస్తరించేందుకు ఆస్ట్రేలియాలోని ప్రధాన రాజకీయ పార్టీల నుంచి కూడా విస్తృత మద్దతు ఉందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

# నాటో సదస్సులో ప్రపంచ నేతలకు ఎర్డోగన్ వినూత్న కానుక

## నేతల పేర్లు చెక్కిన రివాల్వర్లు బహూకరణ



**అంకారా,జులై 10:** నాటో సదస్సు ముగిసిన అనంతరం టర్కీ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డోగన్ ప్రపంచ దేశాల నేతలకు ఊహించని విధంగా ప్రత్యేక కానుక అందించారు. ప్రతి నాయకుడికి వారి పేర్లు చెక్కిన పురాతన నమూనా రివాల్వర్‌ను చెక్క పెట్టెలో బహూకరించారు. ఆయుధంతో పాటు కొన్ని బుల్లెట్లు కూడా అందించడంతో ఈకానుక అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. టర్కీ రక్షణ పరిశ్రమ సామర్థ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఎర్డోగన్ ఈబహుమతిని ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. ఈ రివాల్వర్ 1990లలో టర్కీ ప్రభుత్వ ఆయుధ తయారీ సంస్థ ఎంకెఇ తయారుచేసిన అరుదైన "గుముసాయ్ 357 మాగ్నమ్" మోడల్‌గా గుర్తించారు. ప్రతి రివాల్వర్‌ను ప్రత్యేకంగా తయారు చేసిన చెక్క పెట్టెలో ఉంచారు. పెట్టెపై టర్కీ జాతీయ పతాకంతోపాటు నాటో లోగోను ముద్రించారు. మా దేశంలో తయారైన తొలి రివాల్వర్‌తరహా తుపాకి అనే శాసనాన్ని టర్కిష్, ఆంగ్లభాషల్లో పొందుపరిచారు. ఆయుధంతో పాటు బుల్లెట్లు, ఎగుమతి నిబంధనల నుంచి మినహాయింపు ఉన్నట్లు తెలిపే పత్రాన్ని కూడా అందించారు. అనేక దేశాల్లో ఆయుధాల రవాణాపై కఠిన నిబంధనలు ఉండటంతో రివాల్వర్లను వెంటనే తరలించడం సాధ్యపడలేదు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, జర్మనీ చాన్సలర్ ఫ్రెడిక్ మెర్జ్, నెదర్లాండ్స్ ప్రధాని రాబ్ జెట్టెన్‌లకు అందించిన రివాల్వర్లు ప్రస్తుతం అంకారాలోనే భద్రపరిచినట్లు సమాచారం. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ మాట్లాడుతూ, తమ పేర్లు చెక్కిన రివాల్వర్, శుభ్రపరిచే కిట్‌తోపాటు బుల్లెట్లుకూడా అందించారని తెలిపారు. స్పెయిన్ ప్రధాని పెడ్రో సాంచెజ్ ప్రతినిధి మాట్లాడుతూ, అన్ని దేశాధినేతలకు ఒకే తరహా రివాల్వర్‌ను వారి పేర్లతో అందించినట్లు వెల్లడించారు. స్లోవాకియా అధ్యక్షుడు పీటర్ పెల్లెగ్రిని తనకు అందిన రివాల్వర్‌ను విమాన ప్రయాణంలోనే మీడియాకు చూపించారు. ఈ బహుమతి కారణంగా వివిధ దేశాల భద్రతా బృందాలు, కస్టమ్స్ అధికారులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సి వచ్చింది. బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్ తన రివాల్వర్‌ను బ్రస్సెల్స్ విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. పోలాండ్ అధ్యక్షుడు కరోల్ నవ్రోకీకి అందిన రివాల్వర్ వార్సా విమానాశ్రయంలో కస్టమ్స్ అనుమతులకోసం నిల్వలో ఉంది.

నెదర్లాండ్స్, స్వీడన్ ప్రధానుల కార్యాలయాలు తమ రివాల్వర్లను అంకారాలోని రాయబార కార్యాలయాలకు తరలించినట్లు వెల్లడించాయి. నెదర్లాండ్స్‌కు చెందిన రివాల్వర్‌ను పనిచేయకుండా మార్చనున్నట్లు, స్వీడన్‌కు చెందినది దిగుమతి అనుమతుల కోసం వేచిఉన్నట్లు తెలిపాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీకి అందిన రివాల్వర్‌ను రోమ్‌లోని ప్రభుత్వ భవనం పలాజ్జో చిగిలో ఇతరఅధికారిక బహుమతులతో పాటు భద్రపరిచారు. యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డర్ లేయెన్ తనకు అందిన రివాల్వర్‌ను సైనిక మ్యూజియంకు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించగా, గ్రీస్ నాయకుడు దానిని ఏథెన్స్ యుద్ధ మ్యూజియంకు అందజేయనున్నట్లు ప్రకటించారు. కెనడా ప్రధాని మార్క్ కార్నీ సరదాగా స్పందిస్తూ, నేను ఇచ్చిన మేపుల్ సిరప్‌తో పోలిస్తే టర్కీ కానుక చాలా భిన్నంగా ఉందన్నారు.

# ఆర్టీఐ నిబంధనల అమలులో నిర్లక్ష్యం సహించం

## ఉల్లంఘనలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తప్పవు

### ఎపి రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు

**విజయవాడ,జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ)లోని సెక్షన్ 4(1) (బి) నిబంధనలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో తప్పనిసరిగా అమలుచేయాలని, చట్టం అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ సజ్జా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఆర్టీఐ చట్టంఅమలుపై శుక్రవారం విజయవాడ రూరల్‌లోని గొల్లపూడిలో ఉన్న పలు ప్రభుత్వ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ కార్యాలయం, గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యాలయంతోపాటు డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూ షన్స్ కార్యాలయం, బందరు రోడ్డులోని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యాలయాలను సందర్శించి, ఆర్టీఐ చట్టం అమలు తీరును పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఆయా కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఆర్టీఐ రిజిస్టర్లు, రికార్డులు, పౌరులకు అందిస్తున్న సమాచార వ్యవస్థను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా ప్రధాన సమాచార కమిషనర్ మాట్లాడుతూ.. ఆర్టీఐ చట్టం ప్రభుత్వ ఆఫీసుల్లో ఏవిధంగా అమలు అవుతుందో పరిశీలనలో భాగంగా తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ నిబంధనలు సక్రమంగా అమలు కావడం లేదంటూ కమిషన్‌కు పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లు మొదటి అప్పీలేట్ అథా రిటీల వివరాలతో కూడిన నేమ్ బోర్డులు ఏర్పాటు చేయకపోవడం, జాబ్ చార్టులు, సిటిజన్ చార్టర్లను ప్రదర్శించకపోవడం వంటి లోపాలను రాష్ట్ర వ్యాప్తంగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితులను సరిదిద్దేందుకు రాష్ట్ర సమాచార కమిషన్ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. ఇందులో భాగంగా సమాచార కమిషనర్లు ఒక్కొక్కరికి రెండుజిల్లాల చొప్పున బాధ్య తలు అప్పగించి, ప్రభుత్వ కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆర్టీఐచట్టంపై పూర్తి అవగాహన పెంపొందించడం, చట్టాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా అమలు చేయించడమే ఆకస్మిక తనిఖీల ప్రధాన ఉద్దేశంఅని ఆయన తెలిపారు. తనిఖీల్లో నిరక్ష్ యం, విధి నిర్వహణలో లోపాలులేదా నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే సంబం ధిత అధికారులపైచట్టప్రకారం కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు.దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ దేవా దాయ శాఖలో ఆర్టీఐ చట్టం అమలు తీరును రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్ కు వివరించారు. అలాగే గొల్లపూడి గ్రామ పంచాయతీ, డైరెక్టరేట్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయాల్లో సంబంధిత అధికారులు అందించిన వివరాలు, రికార్డులను పరిశీలించిన ప్రధాన సమాచార కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

# అవినీతి అధికారులను టార్గెట్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

## ఎసిబి పేరిట బెదరింపులకు పాల్పడి రూ. లక్షల్లో వసూళ్లు

**హైదరాబాద్, జులై 10 ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు ట్రెండ్ మార్చారు. ఇప్పటివరకు చేస్తున్న నేరాలకు భిన్నంగా ఎసిబి కేసుల్లో వున్న వారు, ఎసిబి దాడులు జరిగిన సర్కారీ విభాగాల్లో పనిచేస్తున్న వారిని టార్గెట్ చేస్తూ అందినంత దోచుకుంటున్నారు. వీటిపై అప్రమత్తంగా వుండాలని ఓవైపు ఎసిబి, మరోవైపు సైబర్ క్రైం పోలీసులు హెచ్చరిస్తున్నా మోసపోతున్న వారి సంఖ్య ఆగడంలేదు. అయితే కొన్నిసార్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తుండగా ఇంకొన్ని సార్లు మౌనంగా వుంటుండం సైబర్ నేరగాళ్లకు ఊతం ఇస్తోంది.గతంలో ఎసిబి పేరు చెప్పి కొందరు నేరగాళ్లు రెవెన్యూ, అబ్కారీ, రిజిస్ట్రేషన్ విభాగాల అధికారులు, సిబ్బందిని బెదిరించి వసూళ్లకు పాల్పడిన ఘటనలు అనేకం వున్నాయి. మీడియాలో ఎక్కడైనా అవినీతి, అక్రమాలపై వార్తలు రాగానే ఈ తరహా నేరాలకు పాల్పడే నేరగాళ్లు రెచ్చిపోయి ఆయా విభాగాల అధికారులకు ఫోన్‌లు చేసి తాము ఎసిబి అధికారులమని బెదిరించి అందినంతా దండుకునే వారు. దీనిపై ఎసిబి ఎన్ని హెచ్చరికలు చేసినా పెద్దగా ప్రయోజనం వుండడడం లేదు. కొన్నిసార్లు ఇలాంటి నేరాలకు పాల్పడిన వారు పోలీసులకు పట్టుబడిన ఉదంతాలు వున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల ఈ తరహా నేరాలు సాగుతూనే వున్నాయి. అయితే తాజాగా సైబర్ నేరగాళ్లు సర్కారీ విభాగాల్లో అక్రమార్కులుగా పేరొందిన వారిని బెదిరించి వసూళ్లకు పాల్పడడం పెరిగి పోయింది. చేర్యాల తహసీల్దార్ ఇటీవలే ఎసిబికి పట్టుబడగా దీని తరువాత ఎసిబి అధికారులు ఆ కార్యాలయంతో పాటు అక్కడ పనిచేసే అధికారులు, సిబ్బంది, పలువురు అనుమానితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఎసిబి సోదాలు చేర్యాల తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులను హడలెత్తించగా దీనిని సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుని సొమ్ముచేసు కున్నారు. ఎసిబి దాడుల తరువాత ఈ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న ఓ అధికారికి ఎసిబి అధికారుల పేరిట సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి మీపైనా ఇంకా చాలా మందిపైనా అనేక ఆరోపణలు వున్నాయి...మీపై కేసు నమోదు కాకుండా వుండాలంటే వెంటనే మేము సూచించిన బ్యాంకు ఖాతాకు లక్ష రూపాయలు పంపాలని లేకుంటే నెక్స్‌ట్ మిమ్మల్నే అరెస్టు చేయాల్సి వుంటుందని బెదిరించారు.

దీంతో బెదిరిపోయిన సదరు అధికారి సైబర్ నేరగాళ్లు చెప్పినట్లే నిమిషాల వ్యవధిలో లక్ష రూపాయలు నేరగాళ్లు సూచించిన బ్యాంకు ఖాతాకు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తరువాత తనకు ఫోన్ చేసిన వ్యక్తికి ఫోన్ చేసి, తనను ఏమీ అనవద్దని, మీరు చెప్పినట్లే చేశానని చెప్పాలని ఫోన్ చేయగా అది స్విచాఫ్‌గా తేలింది. మరోసారి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన సదరు అధికారి వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. చేర్యాలతో పాటు మరో మూడుచోట్ల ఇ టువంటి ఘటనలు జరిగినట్లు సైబర్ క్రైం పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ఈ ఘటనలపై ఫిర్యాదులు అందక పోవడంతో సైబర్ క్రైం పో లీసులు అంతర్గతంగా విచారణ చేబట్టారు. ఈ తరహా ఘటనలపై సర్కారీ విభాగాల అధికారులు అప్రమత్తంగా వుండాలని సైబర్ క్రైం పోలీసులు కోరుతున్నారు.

# అంగన్‌వాడీల్లో భర్తీ ప్రక్రియ ప్రారంభం

## వివిధ జిల్లాల్లో నోటిఫికేషన్లు విడుదల

**హైదరాబాద్, జూలై 10, ప్రభాతవార్త :** తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలను కల్పించనుంది. ఇందుకు గాను తాజాగా మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో 15,982 అంగన్‌వాడీ పోస్టుల భర్తీప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో భాగంగా నిజామాబాద్‌జిల్లాతో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అంగన్‌వాడీ టీచర్, అంగన్ వాడీ ఆయా ఖాళీల భర్తీకి అధికారిక నోటిఫికేషన్లు వెలువడ్డాయి. నిజామాబాద్ జిల్లాలోని ఐదు సమగ్ర శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టుల పరిధిలో 179 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. నిజామాబాద్‌తో పాటు ములుగు, నల్గొండ, గద్వాల, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, కామారెడ్డి,పెద్దపల్లి,కొత్తగూడెం జిల్లాల్లో కూడా ఈ నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ నోటిఫికేషన్లలో పేర్కొన్న వివరాలు ప్రకారం దరఖాస్తుదారులు తప్పకుండా ఇంటర్మీడియట్ పూర్తి చేసి ఉండాలి. స్థానికంగా ఇంటర్ అభ్యర్థులు లేకపోతే 10వ తరగతి చదివిన వారికి అవకాశం కల్పించనున్నారు. అలాగే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు 18 నుండి 35 సంవత్సరాల మధ్యఉండాలి. ప్రధానంగా ఖాళీఉన్న కేంద్రం పరిధిలోని స్థానిక వివాహిత మహిళలు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ద్వారా 100 మార్కులకు ఈ ఎంపిక జరుగుతుంది. ఇందులో ఇంటర్ మార్కులకు 70, అనాథలకు 10, వితంతువులకు 5, దివ్యాంగులకు 5 వెయిటేజీతోపాటు 10 మార్కులకు ఇంటర్వ్యూ ఉంటుందని వెల్లడించింది.

# నేడు విజయవాడలో మెగా జాబ్ మేళా

**విజయవాడ, జులై 10, ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలో నిరుద్యోగ మైనారిటీ యువత కోసం రాష్ట్రస్థాయి మెగా జాబ్ మేళాను నేడు నిర్వహిస్తున్నట్లు మైనారిటీ, న్యాయశాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇస్లాం పేటలోని షాజహూర్ ముసాఫిర్ ఖానాలో ఉదయం 9 గంటల నుండి జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. నిరుద్యోగమైనారిటీ యువత కోసం, ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రఖ్యాతిగాంచిన 60 నుండి 70 మల్టీ నేషనల్ సంస్థలు, డొమెస్టిక్ కంపెనీలుపాల్గొంటున్నట్లు మంత్రి తెలిపారు. ఐటి,బ్యాంకింగ్, ఫైనాన్స్, హెల్త్ కేర్, లాజిస్టిక్స్, రిటైల్ తదితర రంగాలలో వివిధ స్థాయిలలో 2500 నుండి 3500 మందికి ఉపాధిఅవకాశాలుకల్పించడమే జాబ్ మేళా ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 10వ తరగతినుండి పీజీ దాకా చదివిన నిరుద్యోగులంతా పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపు నిచ్చారు.

# వరుస ఓటములపై మంత్రి అజారుద్దీన్ అసంతృప్తి

**హైదరాబాద్, జులై 10, ప్రభాతవార్త:** ఇంగ్లాండ్ పర్యటనలో ఉన్న భారత జట్టుకు వరుస ఓటములతో పరాభవం పాలవుతోంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత క్రికెట్ జట్టు వరుసగా మూడోఓటమితో సిరీస్‌ను చేజార్చుకుంది. కాగా ఈ వరుస ఓటములపై మాజీ భారత కెప్టెన్, తెలంగాణ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐపీఎల్ మైండ్ సెట్ నుండి భారత బ్యాటర్లు ఎంత త్వరగా బయట పడితే అంత మంచిదని అన్నారు. ఇంగ్లాండ్‌తో ఆడటం అనేది పూర్తిగా భిన్నమైన విషయమని, ఐపిఎల్‌లో ఆడినట్లు ప్రతి బంతిని స్టేడియం దాటించడానికి ఇక్కడ కుదరదని స్పష్టం చేశారు.

## డాక్టర్ శ్రీనివాసరావుకు లెగసీ హ్యూమానిటేరియన్ అవార్డు

**ఎచ్చెర్ల, జూలై 10, ప్రభాతవార్త:**

కావేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీగా, రామ్సేయర్ అండ్ అసోసియేట్స్ పి.సి. సంస్థలో ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు కావేటికి కెనడా లెగసీ హ్యూమానిటేరియన్ అవార్డు ఫర్ గ్లోబల్ అడ్వకసీ ప్రదానం చేశారు. న్యాయ వృత్తి, మానవ హక్కుల పరిరక్షణ, మానవతా సేవలు అంతర్జాతీయ న్యాయ నాయకత్వంలో ఆయన చేసిన విశిష్ట కృషికి అంతర్జాతీయ పురస్కారాలు, గౌరవాలను అందుకున్నారు. ఈ గౌరవాలలో ముఖ్యమైనది యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ఆక్స్‌ఫర్డ్‌లో ప్రదానం చేసిన నెల్సన్ మండేలా అవార్డు. మానవ హక్కుల పరిరక్షణ, న్యాయ సంస్కరణలు, న్యాయాన్ని అందరికీ చేరువ చేయడంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం అందించారు. తన న్యాయ సేవల ద్వారా సమానత్వం, రాజ్యాంగ సూత్రాలు, చట్ట పరిపాలనను ప్రోత్సహించడంలో ఆయన చూపిన నిబద్ధతను ఈ అవార్డు గుర్తించింది. డాక్టర్ కావేటి అంతర్జాతీయ న్యాయ రంగంలో చూపిన నాయకత్వం, వ్యక్తులు, వ్యాపార సంస్థలు, సంస్థాగత సంస్థలకు సంక్లిష్టమైన అంతర్జాతీయ న్యాయ సమస్యల పరిష్కారంలో అందించిన సేవలకు గాను ఇంటర్నేషనల్ కౌన్సెల్ లీడర్‌షిప్ అవార్డును కూడా అందుకున్నారు. మానవ హక్కులు, న్యాయ విద్య అంతర్జాతీయ సహకారాన్ని ప్రోత్సహించడంలో ఆయన చేసిన కృషికి గ్లోబల్ హ్యూమన్ రైట్స్ లీడర్‌షిప్ అవార్డుతో సత్కరించబడ్డారు.

## ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**కవిటి, జూలై 10, ప్రభాతవార్త:**



కవిటి మండలంలోని బి.గొనపపుట్టుగ ఉన్నత పాఠశాలలో తమరాల వేణుబాబు ఏ.ఆర్ కానిస్టేబుల్ ఆర్థిక సహాయంతో విద్యార్థులకు డైరీలను అందించడం జరిగిందని హెచ్ఎం కే.వీరభద్రరావు పత్రికలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ హెచ్ఎం బాబురావు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు పని చేస్తున్నాయని అందులో భాగంగా నేడు మకరంపురానికి చెందిన తమరాన వేణుబాబు ప్రతి ఒక్క విద్యార్థికి ఒక డైరీని అందించడం జరిగింది. ప్రతి ఒక్క విద్యార్థి డైరీ సహాయంతో హోంవర్క్ అలాగే ఉపాధ్యాయులు చెప్పినవి నోట్ చేసుకుని ఉన్నత విద్యాభ్యాసం చేయాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ విద్యా కమిటీ చైర్మన్ సామల సర్వేశ్వరరావు, గ్రామ పెద్దలు బెందాళం కృష్ణారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## తెరుచుకోని పశువుల ఆసుపత్రి

### నౌపడలో పశుపోషకుల ఇబ్బందులు



**సంతబొమ్మాళి, జూలై 10, ప్రభాతవార్త:**

మండలంలోని నౌపడ ప్రభుత్వ పశువైద్యశాల నిర్లక్ష్యానికి చిరునామాగా మారి పశు వైద్యం పడకేసింది. వైద్యశాలలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి పని వేళల్లో తరచూ తాళం వేసి ఉండడంతో చికిత్స కోసం వచ్చే రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నౌపడ, పరిసర గ్రామాల్లోని వందలాది మంది రైతులు, పాడి పరిశ్రమపై ఆధారపడిన కుటుంబాలు ఈ ఆసుపత్రిపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. అయితే అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం ఈ ప్రాంతంలో పశువులకు వైద్యం అందని ద్రాక్షగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పశు వైద్య శాఖ జిల్లా అధికారులు స్పందించి పశు వైద్య సిబ్బంది నౌపడ పశువైద్యశాలలో సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు. ఈ విషయాన్ని మండల పశువైద్యాధికారి రాజ్ కిరణ్ వద్ద ప్రస్తావించగా నౌపడలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వైద్య సేవలు నిలిచి పోయవన్నారు. ఇక్కడ నియమించిన (జీవిఓ) జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ విధులలోకి చేరకుండానే మెడికల్ లీవ్‌లో ఉన్నారని దీంతో వైద్య సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. కొద్ది రోజుల్లో డిప్యూటేషన్‌పై సిబ్బందిని నియమించి పశువైద్య సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు.

## ఉన్నత పాఠశాలకు లీప్ హోదా



**కంచిలి, జూలై 10, ప్రభాతవార్త :**

కంచిలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు లీప్ హోదా వచ్చినట్లు ఎంటిఎస్ ఉపాధ్యాయ రాష్ట్ర కార్యదర్శి బుడ్డెపు కామేష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజక వర్గంలో మూడు ఉన్నత పాఠశాలలో ఎంపిక చేసి దానిలో కంచిలి ఉన్నత పాఠశాలకు స్థానం కల్పించేందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**కంచిలి, జూలై 10, ప్రభాతవార్త :**



కంచిలి మండలంలో పలు అభివృద్ధి పనులకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మాదిన రామారావు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. శుక్రవారం చిన్న కొజ్జిరియా గ్రామంలో గల స్మశాన వాటికలో బోర్‌కు శంకస్థాపన, అలాగే డీజీపురం గ్రామంలో 140 మీటర్ల సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మద్దిల ఆనంద్, బొడ్డ హరిబాబు, వాసాల రమేష్‌రెడ్డి, పిలక చిన్నబాబు, బి.పూర్ణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



## ఆడపిల్లల భద్రత... అందరిదీ బాధ్యత

### ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

**వీరఘట్టం, జూలై 10, ప్రభాతవార్త :**

ఆడపిల్లల భద్రత అనేది కేవలం కుటుంబ సభ్యుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యత అని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం వీరఘట్టం మండలంలోని యు.వెంకంపేట గ్రామానికి చెందిన వారాడ పారినాయుడు ఆధ్వర్యంలో పాలకొండ మార్కెట్ యార్డ్ ఆవరణలో 'ద లిటిల్ గర్ల్స్ లాస్ట్ సెల్యూట' అనే డాక్యుమెంటరీ పోస్టర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజానికి ఎంతో ఉపయోగపడే అవగాహన చిత్రమని ఆయన అన్నారు. ప్రభుత్వం తీసుకునే చర్యలతో పాటు ప్రజల్లో కూడా బాధ్యతాయుతమైన ఆలోచన, అప్రమత్తత ఉండాలని సూచించారు. ఈ డాక్యుమెంటరీలో మాదకద్రవ్యాలు, మద్యం మత్తులో యువత తప్పుదారి పట్టి, అమాయక బాలికల జీవితాలను నాశనం చేయడమే కాకుండా, తమ జీవితాలు, కుటుంబాల గౌరవాన్ని కూడా కోల్పోతున్న వాస్తవ పరిస్థితులను అవగాహన కలిగించేలా చూపించడం చాలా గొప్ప విషయమని కొనియాడారు. ఇలాంటి సామాజిక సందేశాలతో కూడిన డాక్యుమెంటరీలు ప్రజల్లో విస్తృతంగా చేరితే, ముఖ్యంగా యువతలో చైతన్యం పెరిగి, నేరాల నివారణకు కొంత మేర దోహదపడుతుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. సమాజంలో సానుకూల మార్పు తీసుకురావడానికి ఇలాంటి ప్రయత్నాలు ఎంతో అవసరమని ఆయన అన్నారు.

## నా భూమిపై పెండింగ్ పరిహారం ఇప్పించండి

### మూలపేట పోర్టు బాధిత రైతు ఆవేదన



**సంతబొమ్మాళి, జూలై 10, ప్రభాతవార్త:**

మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణంతో భూములు కోల్పోయి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని పెండింగ్ పరిహారం ఇప్పించండి మహాప్రభు అంటూ బాధిత రైతు జీరు ధర్మారావు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వీరు విలేకరులతో మాట్లాడారు. తనకున్న ఎకరా 73 సెంట్లు భూమి పోర్ట్ నిర్మాణానికి ఇవ్వగా, అందులో 80 సెంట్లుకి మాత్రమే 21 లక్ష 50 వేల రూపాయలు పరిహారం ఇచ్చారన్నారు. తర్వాత మిగిలిన పరిహారం ఇవ్వకుండా ఏళ్లు తరబడి అధికారులు చుట్టూ తిప్పుతున్నారన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తహసిల్దార్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణానికి నాతోపాటు మరో 31 మంది రైతులు భూములు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టుకు భూములు ఇచ్చామని తెలిపారు. దీంతో ఎకరాకి అదనంగా ఇచ్చిన 12 లక్షల 50 వేల రూపాయలు కూడా నాకు ఇవ్వలేదని అన్నారు. కొబ్బరి, జీడి చెట్లు పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పరిహారం కోసం అడిగితే పోలీస్ కేసులంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికా రులు స్పందించి పెండింగ్ పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. మరోపక్క కే.లింగుడు గ్రామంలో సర్వేనెంబర్ 164/12,139/6లో మూడు ఎకరాల 51 సెంట్లకు పాస్ పుస్తకాలు కూడా రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

## ఎంపీడీవో ఫణీంద్ర కుమార్‌కు డిడివోగా పదోన్నతి



**కోటబొమ్మాళి, జూలై 10, ప్రభాతవార్త:**

కోటబొమ్మాళి ఎంపీడీవోగా పని చేస్తున్న కుప్పిలి ఫణీంద్ర కుమార్‌కు పార్వతీపురం డి డి ఓగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి పొందిన ఎంపీడీవో ఫణీంద్ర కుమార్‌కు మండల పరిషత్ పరిపాలనాధికారి నారాయణరావు, పలువురు పంచాయతీ కార్యదర్శులు, మండల పరిషత్ సిబ్బంది అభినందనలు తెలిపారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం

### ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

**ఆమదాలవలస, జూలై 10, (ప్రభాతవార్త) :**



వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులు, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నీటి నిర్వహణ, మార్కెట్ అనుసంధానానికి ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో వ్యవసాయం, భూమి, నీటి వనరులపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి, రైతులకు ఉపయోగపడే అంశాలను రాష్ట్రంలో అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇలాంటి జాతీయ స్థాయి చర్చలు ప్రజాప్రతినిధులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్ విధానాల రూపకల్పనకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, వ్యవసాయ నిపుణులు, విధాన రూపకర్తలు పాల్గొని రైతుల ఆదాయాన్ని పెంచే వ్యూహాలు, వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాల విస్తరణ, భూ పరిపాలనలో పారదర్శకత, నీటి వనరుల సమర్థ వినియోగం, వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలపై చర్చించారు. రైతుల అభ్యున్నతికి సంబంధించిన ఈ సదస్సులో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ వేగవంతం చేయండి



**ఇఛ్ఛావరం, జూలై 10, ప్రభాతవార్త :**

బీఎలఎలు ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం లొద్దపుట్టి పంచాయితీ పరిదిలో గల 56, 57, 58, 59, 60 పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమాన్ని ఆకస్మితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో బీఎలఎ లతో మాట్లాడుతూ ప్రత్యేక సమగ్ర సవరణ గడువు ఈ నెల 14తో ముగుస్తుందని, నాలుగు రోజుల్లో బీఎల్ ఓలు, రెవిన్యూ అధికారులు, సూపర్ వైజర్ లు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా డిజిటలైజేషన్ పూర్తి చేయకపోయినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇచ్ఛాపురంలో ప్రత్యేక సమగ్ర సవరణ పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఒక్క ఓటు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎన్యూమరేషన్ ఫారాలును డిజిటలైజేషన్ చేసి 14లోపు పూర్తి చేయాలని అన్నారు. ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పరిశీలించారు. నిర్ణీత గడువులోపు విజయవంతంగా పూర్తిచేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) హరి ఓం పండా, తహశీల్దార్ ఎన్.వెంకటరావు, స్పెషల్ ఆఫీసర్ ఏపీడీ సిహెచ్ శ్రీనువాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## త్వరితిగతిన ఇంజనీరింగ్ పనులు పూర్తి చేయండి

### గిరిజన సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కుమార్

**సీతంపేట, జులై 10, ప్రభాతవార్త :**



సీతంపేట ఐటిడిఏ ఆధ్వర్యంలో గిరిజన ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం సీతంపేట, భామిని మండలాల్లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యతలో రాజీ పడకుండా చేపట్టాలన్నారు. గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల అదనపు భవనాలను పరిశీలించారు. అదేవిధంగా భామిని మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆడలి వ్యూ పాయింట్ సందర్శించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమాదేవి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణ్. అసిస్టెంట్ ఇంజనీర్ గంగాధర్ , తదితరులు పాల్గొన్నారు.

## ఐతంలో 22 ఎంఎం రైఫిల్ ఫైరింగ్ సిమ్యులేటర్ ప్రారంభం!

**టెక్కలి, జూలై 10, ప్రభాతవార్త:**



టెక్కలి సమీపంలోని ఐతం ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన .22 ఎంఎం రైఫిల్ ఫైరింగ్ సిమ్యులేటర్‌ను ఎన్‌సీసీ గ్రూప్ విశాఖ గ్రూప్ కమాండర్ కమోడోర్ సుమంత రాయ్ గురువారం ప్రారంభించారు. అనంతరం జిల్లా స్థాయి ఎన్‌సీసీ క్యాడెట్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఎన్‌సీసీ ద్వారా యువతకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశసేవా భావం అలవడటమే కాకుండా ఉద్యోగాలు, ఉన్నత విద్య, కెరీర్‌లో విశేష అవకాశాలు లభిస్తాయని తెలిపారు. 'బి', 'సి' సర్టిఫికెట్లు పొందిన క్యాడెట్లకు భారత సాయుధ దళాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, రాష్ట్ర పోలీసు శాఖలతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో లభించే కోటా, అదనపు వెయిటేజ్, ప్రత్యేక ప్రాధాన్యంపై వివరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన .22 ఎంఎం రైఫిల్ ఫైరింగ్ సిమ్యులేటర్‌ను పరిశీలించిన కమోడోర్ సుమంత రాయ్, ఈ సిమ్యులేటర్ ద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లు ఫైరింగ్ విధానంలో శిక్షణ పొందే అవకాశం కలుగుతుందని, షూటింగ్ నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఐతం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా. ఎ.ఎస్.శ్రీనివాసరావు, 14 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్ కుశ్వాహా, ప్రదీప్, ఐతం ఎన్‌సీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డా. డి.విష్ణుమూర్తి, మేజర్ మహేష్, ఏఎన్‌వోలు మురళీమోహన్, రాజు, వివిధ పాఠశాలల ఏఎన్‌వోలు, అధ్యాపకులు, జిల్లా స్థాయి ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ .22 రైఫిల్ ఫైరింగ్ శిక్షణకు, మాజీ సైనికులు రమణయ్య, భుజంగరావు శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు.

## కిడ్నీ రోగులు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి



### ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్

**కవిటి, జూలై 10, ప్రభాతవార్త:**

కిడ్నీ రోగులు పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలంటూ కవిటి ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండలం రాజపురంలో గల పిహెచ్‌సీ కేంద్రాన్ని సందర్శించి అక్కడ రోగులకు అందుతున్న వైద్యసేవలు గూర్చి డాక్టర్ను అలా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈపీఎస్సీ కేంద్రంలో సిబ్బంది కొరత, సి కే డి బాధితుల సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అలానే అక్కడ మౌలిక సౌకర్యాలను, ఔషధాలు లగ్జిత సిబ్బంది పరిస్థితి, సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు మరియు మూత్రపిండ వ్యాధులపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈపీఎస్సీ పరిధిలో ఏడు గ్రామ సచివాలయాలు ఉండగా సుమారు 26,500 మంది జనాభా వైద్య సేవలు పొందుతున్నారని డాక్టర్లు తెలిపారు. సాధారణ రోజుల్లో రోజుకు 60 మంది నుంచి 70 మంది వరకు ఓపి నమోదు అవుతుందని సిబ్బంది తెలిపారు. ఇక్కడ పరిస్థితులపై ఎంపీపీ కడియాల పద్మ ప్రకాష్ మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతోపాటు సీకేడి రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వారికి అవసరమైన మందులను అందుబాటులోకి వచ్చే విధంగా ఉన్నతాధికారులకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శశిధర్, డాక్టర్ ప్రవీణ్ కుమార్‌తో పాటు ఎంపీటీసీ సనపల కృష్ణారావు, మాజీ ఏం సి వైస్ చైర్మన్ ఎలమంచి నీలయ్య, మాజీ పిఎస్ సభ్యుడు ఎన్ని అశోక్, బెందాళం ఢిల్లీ బాబు, సనపల సోమేశ్వరరావు, ఆనింగి బాబురావు, మరిడి మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధాప్య తల్లిదండ్రులతో ఈ బైక్ షోరూం ప్రారంభం

**వీరఘట్టం, జూలై 10, ప్రభాతవార్త :**



కన్న తల్లిదండ్రులని దూరం పెట్టి, సరిగా వారి బాగోగులు చూడని, పట్టించుకోని పరిస్థితులు ఉన్న ఈ రోజుల్లో వృద్ధాప్యంగా ఉన్న తన తల్లిదండ్రుల అలజంగి అప్పలస్వామి నాయుడు, పార్వతమ్మలచే శుక్రవారం నూతనంగా జ్యోతి ఈ బైక్ అండ్ ఆటోమొబైల్స్ షోరూమ్‌ను ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు వారి కుమారుడు, షోరూమ్ యజమాని అలజంగి దుర్గారావు. ఈ రోజుల్లో చిన్న పాన్ షాప్‌ల ప్రారంభోత్సవాలకే రాజకీయ నాయకులు, ప్రముఖుల వంటి వారిని తీసుకువచ్చి హడావిడి చేసే ఈ రోజుల్లో వీరఘట్టంలో పెద్ద షోరూమ్‌నే ప్రారంభించి ఎటువంటి హంగూ ఆర్భాటాలకు తావులేకుండా తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులచే ప్రారంభించడం ఈ ప్రాంతంలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అంతే కాదు ఈ విషయం తెలుసుకున్న ప్రజలు మంచి మనసున్న దుర్గారావును ప్రత్యేకంగా అభినందనలతో ముంచేత్తున్నారు. ఎలక్ట్రిక్ బైక్ షోరూం వీరఘట్టంలో ప్రారంభించడం ఎంతో శుభపరిణామని, ఈ నూతన వ్యాపారం బాగా రాణించి మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగాలని తన కుమారుడు దుర్గారావును ఆశీర్వదించారు వృద్ధాప్య తల్లిదండ్రులు.

# శ్రీకాకుళం వార్త



## ఢిల్లీలో కేంద్ర మంత్రి కింజరాపుతో ఎమ్మెల్యే కూన భేటీ

**ఆమదాలవలస, జూలై 10, (ప్రభాతవార్త):**



"స్వర్ణ ఆంధ్ర" విజన్‌తో గ్రామీణ ఉపాధి, చేతివృత్తుల అభివృద్ధిపై సార్థక చర్చ జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆముదాలవలస ఎమ్మెల్యే రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో సహచర ఎమ్మెల్యేలు బుర్ల రామాంజనేయులు, బందారు శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్ఠాత్మకంగా ముందుకు తీసుకెళ్తున్న "స్వర్ణ ఆంధ్ర" విజన్ అమలులో భాగంగా రాష్ట్ర గ్రామీణ ప్రాంతాలను సంప్రదాయ కళలు, చేతివృత్తులు, కుటీర పరిశ్రమలను ఆధారంగా చేసుకుని ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు కేంద్రాలుగా ఎలా అభివృద్ధి చేయాలనే అంశంపై విస్తృతంగా చర్చించారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పన, సంప్రదాయ వృత్తులకు ఆధునిక సాంకేతికతను అనుసంధానం చేయడం, స్థానిక కళాకారులకు మార్కెట్ అవకాశాలు విస్తరించడం, మహిళా స్వయం సహాయక సంఘాల ఆర్థిక సాధికారత, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసే మార్గాలపై సమావేశంలో ఇరువురు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం ఎంతో కీలకమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టితో అమలవుతున్న "స్వర్ణ ఆంధ్ర" విజన్ గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కొత్త దిశను చూపుతుందని తెలిపారు.

## బీసీలకు రూ.20,000 అదనపు సబ్సిడీ : కలెక్టర్



**వీరఘట్టం, జూలై 10, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'పీఎం-సూర్య ఘర్-ముఫ్త్ బిజిలీ యోజన' కింద వెనకబడిన తరగతుల (బీసీ) గృహ వినియోగదారులకు అదనపు ఆర్థిక లబ్ధి చేకూర్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నెం.58 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్ రెడ్డి ఒక శుక్రవారం ప్రకటనలో తెలిపారు.

**రూ.20,000 అదనపు సబ్సిడీ:**

నెలకు 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగం ఉన్న బీసీ కుటుంబాలకు, 2 కిలోవాట్ల వరకు రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీకి (సిఎపఎ) అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.20,000 అదనపు సబ్సిడీని మంజూరు చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 27.2 లక్షల మంది బీసీ వినియోగదారులకు ఈ నిర్ణయం ద్వారా ప్రయోజనం చేకూరనుంది. ఈ అదనపు సబ్సిడీ అమలు కోసం ప్రభుత్వం రూ.5,445.7 కోట్ల అంచనా వ్యయంతో ఈ నిధులను కేటాయించిందని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన బీసీ గృహ విద్యుత్ వినియోగదారులు ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ ఇళ్లపై సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని ఉచిత విద్యుత్ పొందడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ పథకానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం స్థానిక విద్యుత్ శాఖ లేదా నెడ్‌క్యాప్ అధికారులను సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

## ఏపిపిఆర్ఎంఈఏ సంఘం కార్యవర్గం ఇదే

**వీరఘట్టం, జూలై 10, ప్రభాతవార్త :**



ఏపిపిఆర్ఎంఈఏ సంఘం వీరఘట్టం యూనిట్ అధ్యక్షునిగా సిహెచ్ తమ్మినాయుడు, ఉపాధ్యక్షుడుగా సి హెచ్ రాజశేఖర్‌మూర్తి, ప్రధాన కార్యదర్శిగా వి.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శి గా పి.మౌళి, కోశాధికారిగా ఎ.శ్రీకాంత్, జిల్లా కౌన్సిలర్ 1గా కె.గురు గోవింద్, జిల్లా కౌన్సిలర్ 2గా పి.సుహాసిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరికీ ఎంపీడీవో బి.వెంకటరమణ అభినందనలు తెలిపారు. అనంతరం కొత్తగా ఎన్నికైన నూతన కార్యవర్గమంతా ఎంపీడీవోను సత్కరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



**ఆమదాలవలస, జూలై 10, (ప్రభాతవార్త):**

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, పట్టణ పార్టీ అధ్యక్షులు సంపదరావు మురళీధర్ అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే కూన రవికుమార్ పిలుపు మేరకు ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో టిడిపి కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు అందజేసిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే ఎమ్మెల్యే రవికుమార్ దృష్టికి తీసుకొని వెళ్తామన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు. ప్రజా సమస్యలు తీర్చేందుకు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఎమ్మెల్యే ఉంటారని, ప్రజలు నేరుగా వచ్చి తమ సమస్యలను విన్నవించుకోవచ్చన్నారు. ప్రజాపాలన దిశగా కూటమి ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, తమ్మినేని శ్రీనివాసరావు, పీవీకే రాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు



**కంచిలి, జూలై 10, ప్రభాతవార్త:**

కంచిలి మండలంలోని పలు గ్రామాలలో ప్రజలు విద్యుత్ సమస్యలు, ముఖ్యంగా లో వోల్టేజ్ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ విప్ మరియు స్థానిక ఎమ్మెల్యే అశోక్ బాబు చొరవతో, విద్యుత్ శాఖ జేఈతో సమన్వయం చేసుకుంటూ గ్రామాల వారీగా విద్యుత్ సమస్యలను పరిష్కరించడం జరుగుతుంది. అందులో భాగంగా శుక్రవారం పోలేరు పంచాయతీలో దేవాలయం గుడికి కొత్తగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేసి, దేవాలయం గుడికి సమస్య పరిష్కరించడమైంది. రానున్న రోజుల్లో మిగిలిన గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను కూడా ఎమ్మెల్యే మరియు విద్యుత్ శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో దశలవారీగా పరిష్కరించడం జరుగుతుంది.

## 110 హైరిస్క్ గ్రామాలుగా గుర్తించి స్పెషల్ మెడికల్ క్యాంప్స్

**సీతంపేట, జూలై 10 , ప్రభాతవార్త :**



మండలంలో 110 మలేరియా ఐ రిస్క్ గ్రామాలుగా గుర్తించి స్పెషల్ మెడికల్ క్యాంప్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఐటీడీఏ డిప్యూటీ డిఎంహెచఓ డాక్టర్ విజయ పార్వతి తెలిపారు. శుక్రవారం కూసిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న గొయిది గ్రామంలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో నిర్వహించారు. దీనిలో భాగంగా గిరిజనులకు మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి ఎక్కడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని వర్షాలు కురుస్తుండడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున అప్రమతంగా ఉండాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహన్ రావు, ఎంపీహెచఈఓ వెంకటరావు, ఆయుష్ విభాగం డాక్టర్ రత్నం, తదితరులు పాల్గొన్నారు.

## కొండపై నుంచి బండ పడి గ్రానైట్ కార్మికుడు మృతి

**కోటబొమ్మాళి, జూలై 10, ప్రభాతవార్త:**



మండలం దుప్పలపాడు కొండ వద్ద జరుగుతున్న గ్రానైట్ పనులలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొండపై నుంచి బండ పడి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన పల్లి ఎర్రయ్య (62) మృతి చెందాడు. కొండపై పనులు జరుగుతుండగా కొండ కింద మరికొంతమంది పనులు నిర్వహిస్తున్నారు. కొండపై నుంచి బండ దొర్లుకుంటూ వచ్చి ఎర్రయ్యపై పడింది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఎర్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎర్రయ్యకు భార్య పార్వతి, వివాహితులైన కుమార్తెలు కింజరాపు ఉమా, దేశల్ల హేమలత ఉన్నారు. ఉమా భర్తతోపాటు హైదరాబాదులో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. హేమలత గ్రామంలోనే ఉంటుంది. కుటుంబాన్ని పోషించాల్సిన పెద్దదిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు రోదనలు అరణ్య వాదనలై ఉన్నాయి. కాగా ఈ సంఘటనలో మరికొద్ది మంది కార్మికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానిక ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


11 -7Pg9th cheli 1.qxd:11 -7Pg9th cheli 1.qxd 1/2/02 5:55 AM Page 1



ఫ్యాషన్ ఫ్యాషన్

# రాజసాన అనార్కలీ






అనార్కలి గ్రాండ్‌లుక్ ఉంటుంది. మొఘలుల కాలం నాటిది! రాజనర్తకి అనార్కలీ వేసుకునేదనీ, తన పేరుమీదుగానే తీసుకొచ్చారనీ చెబుతారు. దానిమ్మ మొగ్గ అనీ అర్థమట. శతాబ్దాల నాటిదే! కానీ ఇప్పటికీ దాని రాజసం తగ్గలేదనేది వాస్తవం. అందుకే అది వేసుకుని అమ్మాయిలు నడిచొస్తోంటే అచ్చు యువరాణుల్లానే ఉంటారు. నడకకి దీటుగా పోటీపడతాయీ దుస్తులు మరి. కాబట్టే, ఆ రాయల్ లుక్. లావు, సన్నం, ఎత్తు, పొడవు, అన్న తేడాలేకుండా ఎవరికైనా నప్పుతుంది. దీనిలోనూ ఎన్ని రకాలని? దొరికే వస్త్ర రకాలకీ కొదవలేదు. ఇంకేం, స్నేహితురాళ్లు కాదు. వధువులూ తమ పెళ్లి వేడుకల్లో వీటికి ప్రాధాన్యమిస్తున్నారు. ఓ మంచి అనార్కలీ డ్రెస్, పెద్ద జుంకీలు చాలు వేడుకకి సిద్ధం. లేదు లేదు ఇంకా ప్రత్యేకంగా కనిపించాలంటే కాస్త హంగులున్న డిజైనర్ అనార్కలీ, దీన్ని ఎంచు కోవడమంటే కేవలం డ్రెస్‌ని ఎంచుకోవడంలా చూడరు ఫ్యాషనిస్టులు. సొగసుని అందిపుచ్చు కోవడం అంటారు.


# సియాచిన్‌లో శివంగి



భారత సైనిక చరిత్రలో నూతన అధ్యాయాన్ని లిఖిస్తూ కెప్టెన్ శివ చౌహాన్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధ క్షేత్రమైన సియాచిన్ గ్లేసియర్‌లోని కుమార్ పోస్ట్‌లో ఆపరేషనల్ విధుల్లో నియమితులైన తొలి మహిళా అధికారిగా శివ సరికొత్త చరిత్ర సృష్టించారు.

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌కు చెందిన శివ చౌహాన్, 11 ఏళ్ల ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారు. తల్లి, సోదరి అండతో అనేక సవాళ్లను అధిగమించి, తన చిన్ననాటి కలను సాకారం చేసుకునే దిశగా సైన్యంలో అడుగుపెట్టారు. 2020లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ పూర్తి చేసిన ఆమె, సర్వీసెస్ సెలక్షన్ బోర్డు (ఎస్‌ఎస్‌బి) నిర్వహించిన పరీక్షలో ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అనంతరం చెన్నైలోని ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకుని, 2021 మే నెలలో కార్ప్స్ ఆఫ్ ఇంజినీర్స్‌లో అధి కారిగా నియమితులయ్యారు. కఠినమైన శిక్షణ అనంతరం 2023 జనవరి 2న కెప్టెన్ శివ చౌహాన్‌ను సుమారు 15,632 అడుగుల ఎత్తులో ఉన్న కుమార్ పోస్ట్‌లో మూడు నెలల కాలానికి నియమించారు. అక్కడ ఇంజినీరింగ్ బృందానికి నాయకత్వం వహిస్తూ, మైనస్ 40 నుంచి 50 డిగ్రీల సెల్సియస్ గడ్డకట్టే చలిలోనూ హెలిప్యాడ్‌ల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పన నిర్వహణ బాధ్యతలను ఆమె సమర్థవంతంగా నిర్వర్తించడంతో ఆమె మరో మెట్టుకు ఎదిగారు. సియాచిన్ వంటి అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లో లింగభేదం లేకుండా, కేవలం ప్రతిభ మరియు దక్షత ఆధారంగానే సైన్యం కీలక బాధ్యతలు అప్పగిస్తుందనడానికి కెప్టెన్ శివ చౌహాన్ నియామకమే నిదర్శనం. వ్యక్తిగత కష్టాలను అధిగమించి దేశ సేవలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన ఆమె ప్రస్థానం, రక్షణ రంగంలో స్థిరపడాల నుకునే ఎంతో మంది యువతులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ◻

# పెరుగు



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి



మంచి బాక్టీరియా ఎక్కువగా ఉండే రిఫ్రెష్ క్రీముల ప్రోబయోటిక్ ఆహారం. ఇది పిల్లల నుంచి పెద్దల వరకు సులభంగా జీర్ణమయ్యే సంపూర్ణాహారం. దీన్ని పెరుగు, మొసారు, దధి, దహి యోగర్ట్, త్రైర్, దోయీ అని అంటారు. ఇది కేవలం ఒక గంటలో పెరగు 91% జీర్ణ అయ్యే మంచి ఆహార పదార్థాం. పెరుగు శరీరానికి బలాన్ని, రోగ నిరోధక శక్తిని ఆకలిని, జీర్ణశక్తిని, రుచిని పెంపొందించే ఎనర్జీ బూస్టర్ అంతే గాకుండా శరీర పోషణకు మూలమైన ముఖ్యమైన ఆంటీ ఆక్సిడెంట్ అని చెప్పవచ్చు. ఇది అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్‌ని తగ్గిస్తుంది. ఇది గుండె, చర్మం, జుట్టు, జీర్ణకోశ ఆరోగ్యా నికి మంచిది. ఇది శరీర అధిక బరువుని తగ్గిస్తుంది. శరీరంలో వేడిని తగిస్తుంది. దీనిలోని మంచి బాక్టీరియా గట్‌హెల్త్‌కి మంచిది. ఇది దంతాలు ఎముకలకు బలం, శరీరంలోని అధిక షుగర్ లెవల్స్‌ని తగ్గిస్తుంది. ఇమ్యూనిటీని పెంపొందించి దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా చేస్తుంది. పెరుగులోని విటమిన్స్ మినరల్స్, కాల్షియం త్వరగా రక్తంలో కలిసేలా చేస్తాయి. ఎండవేడికి చర్మం పాడవకుండా, నగనిగలాడేలాగ చేస్తుంది. ఇది నరాలకి శక్తిని జీర్ణశక్తిని పెంపొందించే ఔషధ కారకం ఆహారం అని చెప్పవచ్చు. వేసవిలో శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది. శరీరంలో మంట, వాపుని తగిస్తుంది. నిద్ర పట్టనివారు, ఉన్మాదం ఉన్నవారు, ఫట్స్‌తో బాధపడేవారు, మాన సిక సమస్యలున్న వారిలో సెరిటోనిన్ పెరిగి నిద్రపడుతుంది సెరెయాసిస్, ఎగ్జిమా వంటి చర్మ వ్యాధులున్నవారు వాడవచ్చు రెగ్యులర్‌గా పెరుగు తీసుకుంటే అపెండిసైటిస్, ఎమిబియాసిస్, మలబద్ధకం, జ్వరం, విరేచనాలు, బహిష్ఠులు సక్రమంగా రాక పోవడం వంటి వ్యాధులు రావు. కడుపులో అల్సర్ ఉండే వారిలో, గ్యాస్ట్రిక్ ఇంటేషన్ ఉన్న, హైపర్ అసిడిటీ ఉన్నప్పుడు పెరుగు జీర్ణ అయ్యేటప్పుడు అది సిఒ2 నీరుగా మారడం వల్ల హైపర్ అసిడిటీ, అల్సర్, గ్యాస్ తగ్గుతుంది. పెప్సిన్ ఎంజైమ్స్ విడుదల వల్ల ఆహారం జీర్ణమవుతుంది పెరుగు ఒత్తిడి, ఆందోళ నకు కారణమయ్యే హార్మోన్ల స్థాయి తగ్గిస్తుంది. గర్భిణీలు, కామెర్లు, హైపటైటిస్, లివర్ వ్యాధులు న్నవారు, ఆంటి బయాటిక్స్, హెపటైటిస్, లివర్ వ్యాధులున్న వారు, ఆంటి బయా టిక్స్, దీర్ఘకాలిక వ్యాఉలకి మందులు వాడే వారు పెరుగు ని వాడడం వల్ల దానిలోని ఇన్‌ఫ్లమేటరీ గుణాలు, మంటని తగ్గించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. జలుబుగా ఉన్నప్పుడు మూత్ర సంబంధ రోగాల్లో, జిగురు విరేచలున్నప్పు పెరుగు వాడడం మంచది. ఇది జీర్ణ వ్యవస్థని పటిష్టం చేస్తుంది. పెరుగు ఎక్కువగా తీసుకుంటే బరువు పెరుగు తారు. దీనివల్ల మందకొడి తనం, స్థూల కాయం, ఇన్‌ఫ్లమేషన్, రక్తస్రావ రుగ్మతలు, కఫం, వాతం ఎక్కువై కుష్టు, గోధుమ రంగు మచ్చలు, రక్తహీపత మలబదనదకం, వస్తుంది. పెరుగులోని బయోజెనిక్ ఆమైన్ వల్ల తలనొప్పి, మైగ్రేన్ ఎక్కువవుతుంది. కీళ్ళనొప్పులు వస్తాయి. గెలాక్టోజ్ అనే రసాయన సమ్మేళనం వల్ల అరుదుగా అండాశయ కేన్సర్ వచ్చే అవకాశం ఉంది. చలువచేసే పెరుగులో వేడి కల్గించే ఉల్లిగడ్డ ముక్కలు వేసుకొని తింటే ఎలర్జీలు, దద్దుర్లు, జీర్ణకోశ సమస్యలు వాంతులు, తామర, సోంయాస్ వంటి వ్యాధులు వస్తాయి. అలాగే పాలు, పెరుగు కలిపికాని, వెంటనేకాని తిన్నా ఎసిడిటీ, అజీర్తి, అతిసారం, కడుపునొప్పి అనీజీ ఉంటుంది. పెరుగు తిన్న వెంటనే మినపప్పుతో చేసిన పదార్థాలు, నూనె, నెయ్యి, వెన్న అధికంగా ఉండే ఆహార పదార్థాలు తిన్న జీర్ణకోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ◻

# శ్రీరామరాజ్యం

త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడి పరిపాలనా కాలంలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచేదంటారు. ఆ విషయాన్ని బలపరిచే ఉదంతాలు అనేకం రామాయణ మహాకావ్యంలో చూస్తాం. ఆదికవి వాల్మీకి విరచిత సంక్షిప్త రామాయణంలో పుత్ర మరణం కించి ద్ద్రక్ష్యం పురుషాః క్వచిత్ అన్నారు. రామరాజ్యంలో తండ్రి కంటే ముందు పుత్రులు మరణించడం అన్నది లేదు. రుషివాక్యం సత్యదూరం కాదు కదా!

**నిర్దస్యుర భవల్లోకో నానర్థం కశ్చిదస్పృశత్**
**నచస్మవృద్ధా బాలానాం ప్రేత కార్యాణి కుర్వతే** వాల్మీకి రామాయణం యుద్ధకాండలోని ఈ శ్లోకానికి రామరాజ్యంలో దొంగలు లేరు. పిల్లలకు ప్రేతకార్యం చేసే అవసరం ఎన్నడూ ఎక్కడా కలగలేదు అనేది భావం. ఆ కాలంలో ప్రజలెవ్వరినీ అకాలమృత్యువు హరించలేదంటూ తులసీదాసు రామాయణంలోనూ లిఖితమైంది. కంకంటి పాపరాజు ఉత్తర రామాయణంలో సుతులు లేక కలంగు సుదతు లెక్కడ లేరు అంటూ భరతుడు శ్రీరామచంద్రుడికి తెలియ జేయడం కనిపిస్తుంది. ఇందులోనే ధర్మాభిదానమంత కదు నిక్కమొనర్చే ముదుసళ్లనైనను గడియబోక అనే ప్రయోగం ఉంది. రామ రాజ్యంలో ప్రజలెవ్వరూ బాధపడలేదు. లోకం ధర్మబద్ధంగా నడిచింది. అకాల మరణాలు సంభవించవు అనేది భావం. ◻

# మెక్సికన్ పరోటా రోల్స్



**కావలసిన పదార్థాలు:** బ్రకోలీ ముక్కలు: ఒక కప్పు, సన్నగా తరిగిన ఉల్లిగడ్డ, క్యాప్సికం, టమాట ముక్కలు: పావు కప్పు చొప్పున, చీజ్ తురుము: ఒక కప్పు, ఉడికించిన స్వీట్‌కార్న్: రెండు టేబుల్ స్పూన్లు, మిరియాల పొడి: అర టీస్పూన్, కారం: ఒక టీస్పూన్, ఉప్పు: తగినంత, నిమ్మరసం: ఒక టేబుల్ స్పూన్, గోధుమపిండి, మైదాపిండి: ఒక కప్పు చొప్పున, నూనె: అర కప్పు.

**తయారీ ..** ఒక గిన్నెలో మైదాపిండి, గోధుమపిండి, ఒక టేబుల్ స్పూన్ నూనె, కొద్దిగా ఉప్పు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో తగినన్ని నీళ్లు పోసి ముద్దలా కలిపి పావుగంట మూతపెట్టి పక్కనపెట్టాలి. బ్రకోలీ ముక్కల్ని పది నిమిషాల పాటు ఉప్పునీళ్లలో ఉడికించి చిన్నగా తరగాలి. ఒక గిన్నెలో బ్రకోలీ, టమాట, క్యాప్సికం, ఉల్లిగడ్డ ముక్కలు, చీజ్ తురుము, స్వీట్ కార్న్, కారం, మిరియాల పొడి, ఉప్పు, నిమ్మరసం వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పెనం పెట్టి వేడి చెయ్యాలి. పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుని చపాతీలా ఒత్తి పెనంపై వేసి ఒక నిమిషంపాటు రెండు వైపులా తిప్పుతూ కాల్చుకోవాలి. కాలిన చపాతీ మధ్యలో బ్రకోలీ మిశ్రమం పెట్టి గుండ్రంగా చుట్టి ఒక నిమిషంపాటు మూతపెడితే వేడివేడి మెక్సికన్ పరోటా రోల్స్ సిద్ధం. ◻

# 'గ్రహాంతర ప్రేమికుడ్ను' చిత్రం ట్రైలర్ విడుదల



ప్రముఖ యూట్యూబర్, క్రియేటివ్ డైరెక్టర్ స్టైల్ రవి తెరకెక్కిస్తున్న వినూత్న ఓటిటి చిత్రం 'గ్రహాంతర ప్రేమికుడ్ను. సినీ చరిత్రలోనే ఒక మైండ్‌బ్లోయింగ్ ప్రయోగంగా రాబోతున్న ఈ సినిమా ఫస్ట్ లుక్, ట్రైలర్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెలగపూడి సచివాలయంలో ఘనంగా విడుదల చేశారు. 'విశ్వంలో ఏలియన్స్ ఉనికిపై ప్రపంచవ్యాప్తంగా సైంటిస్టులు రీసెర్చ్ చేస్తున్నారు. ఇలాంటి టైంలో ప్రజలను ఆలోచింపజేసే కథాంశంతో వస్తున్న 'గ్రహాంతర ప్రేమికుడ్ను ఒక అద్భుత ప్రయోగం. ఏలియన్స్‌తో మానవాళికి ముప్పా? మేలా? అనే పాయింట్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ఇలాంటి కొత్త కంటెంట్ తో వచ్చే దర్శకులకు, ఎపిలో సినిమా తీసే ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుంద్ని అని చిత్ర యూనిట్‌ని మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. "భూమి ట్రాన్సిట్ జోన్‌లో 1,715 నక్షత్రాలు ఉన్నాయనే సైంటిఫిక్ రీసెర్చ్ ఆధారంగా ఈ కథను సిద్ధం చేశాం. విశ్వకాంతి వేగంతో ఏలియన్స్ ప్రయాణించే విజువల్స్ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తాయి. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), హైఎండ్ విజువల్ ఎఫెక్ట్స్, టాప్ నాచ్ కంప్యూటర్ గ్రాఫిక్స్ సాయంతో అంతర్జాతీయ సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం అని సినిమాపై ఉన్న నమ్మకాన్ని దర్శకుడు స్టైల్ రవి వ్యక్తపరిచారు. ఈ చిత్రంలో భవానీ కపూర్, రమ్య రాథోడ్, సముద్రాల శ్రీధర్ శర్మ, రమేష్ వర్మ, వారణాసి పాత్రుడు, యశ్వంత్ చంద్ర, మల్లెపాడు రమేష్, సైదులు తదితరులు నటిస్తున్నారు. నిర్మాతగా ఎలిజబెత్ (కెనడా) వ్యవహరించగా డిఒపి ప్రకాష్ జైన్ (రాజస్థాన్), ఎడిటర్ ఆండ్రు అలెక్సా, ఏఐ కంపోజర్ బెంజమిన్ వియర్, కంప్యూటర్ గ్రాఫిక్స్‌ను అలెక్సా తెరకెక్కించారు.

# రోషన్ కనకాల కొత్త చిత్రం ప్రారంభం



కొన్ని సినిమాలు ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తాయి. ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్, ప్రేమ, మిస్టరీ కలిసిన అలాంటి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయబోతున్న ఓ భారీ కాన్సెప్ట్ సినిమా ఘనంగా ప్రారంభమైంది. రోషన్ కనకాల, గహజి ప్రధాన పాత్రల్లో సరి కొత్త హైకాన్సెప్ట్ సైఫై ఎంటర్‌టైనర్ అధికారి కంగా లాంచ్ అయ్యింది. సత్య, సుదర్శన్, రవితేజ నన్నిమాల ఇతర కీలక పాత్రలు పోషిస్తు న్నారు. ఈ చిత్రం ద్వారా విజయ్ కె కామిశెట్టి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ప్రముఖ దర్శకుడు విఐ ఆనంద్ వద్ద చీఫ్ అసోసియేట్ డైరెక్టర్, డైలాగ్ రైటర్‌గా ఎన్నో ఏళ్లుగా పనిచేసిన విజయ్, 'టైగర్', 'ఎక్కడికి పోతావు చిన్నవాడా', 'ఒక్క క్షణం', 'డిస్కో రాజా', 'స్వయంభు' వంటి విజయవంతమైన చిత్రాలలో కీలక పాత్ర పోషించారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమలో ఫాంటసీ, సైన్స్ ఫిక్షన్ సినిమాల స్థాయిని తన వినూత్న స్టోరీ టెల్లింగ్‌తో మార్చిన విఐ ఆనంద్ అందించిన కథ ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. గుత్తా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై బాలాజీ గుట్ట, కౌశిక్‌రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ సహకారం అందిస్తోంది. ఆసక్తికరమైన కాన్సెప్ట్, భారీ స్థాయి నిర్మాణంతో ఈ చిత్రం సరికొత్త సినిమాటిక్ అనుభూతిని అందించనుంది. కాకతీయ హిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఈ రోజు ఘనంగా ప్రారంభ మైంది. హీరో నిఖిల్ ముహూర్తపు షాట్‌కు క్లాప్ కొట్టగా, సినిమాటో గ్రాఫర్ కెకె సెంథిల్ కుమార్ కెమెరాను స్విచ్ ఆన్ చేశారు.


# తెర

## 'మైసా' కోసం రష్మిక రిస్కీ స్టంట్స్



బాడీ డబుల్ లేకుండా రెండు రోజుల్లో 20 గంటల పాటు అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్ పూర్తి చేసిన భారతీయ సినీ చరిత్రలో తొలి హీరోయిన్‌గా రికార్డు సృష్టించిన రష్మిక మందన్న నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం ప్రతిష్టాత్మక పాన్ ఇండియా యాక్షన్ డ్రామా 'మైసా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమాలో ఆమె కెరీర్‌లోనే అత్యంత సవాల్‌తో కూడిన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్ సినిమాపై భారీ ఆసక్తిని పెంచగా, ఇప్పుడు రష్మిక చేస్తున్న రిస్కీ స్టంట్స్ మరింత అంచనాలని పెంచుతోంది. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో, అన్‌ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో రష్మిక గోండ్ గిరిజన యువతి పాత్రలో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమా కోసం అత్యంత ప్రమాదకరమైన యాక్షన్ సన్నివేశాలను రష్మిక స్వయంగా చేశారు. రెండు రోజుల పాటు దాదాపు 20 గంటల పాటు నీటిలో ఉండి అత్యంత క్లిష్టమైన అండర్‌వాటర్ ఫైట్ సీక్వెన్స్‌ను చిత్రీకరించారు. ఈ సన్నివేశం కోసం బాడీ డబుల్‌ను ఉపయోగించకుండా, స్వయంగా నటించాలని రష్మిక నిర్ణయించుకున్నారు. సన్నివేశాల్లో సహజత్వం కోసం ఆమె చూపించిన ఈ అంకితభావం సినిమా టెక్నికల్ టీమ్‌తో పాటు అండర్‌వాటర్ యాక్షన్ టీమ్‌ను కూడా ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ చిత్రంలో రాహుల్ రవీంద్ర, ఈశ్వరి రావు ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీని శ్రేయాస్ పి.కృష్ణ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. అంతర్జాతీయ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా ఖాంఫక్‌డీ యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు.

# 'ది ఇండియా స్టోరీ' ఇంటెన్స్ పోస్టర్ రిలీజ్



జీ స్టూడియోస్, ఎంఐజీ ప్రొడక్షన్ అండ్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'ది ఇండియా స్టోరీ' సినిమా నుంచి మరో ఆసక్తికరమైన పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. చేతన్ డీకే దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు నిర్మిస్తున్నారు. సమాజానికి సంబంధించిన కీలక అంశాన్ని కోర్ట్‌రూమ్ డ్రామా రూపంలో చూపిస్తున్న ఈ సినిమా జూలై 24, 2026న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. విషపూరిత పురుగుమందుల వ్యవసాయం, దాని వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న తీవ్ర ప్రభావం వంటి అంశాల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలోని కొత్త పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. విడుదల చేసిన పోస్టర్‌లో కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తీవ్ర ఉద్రిక్త పరిస్థితుల్లో కనిపిస్తున్నారు. ఒక భయానక నిజాన్ని బయటపెట్టేందుకు వారు చేసే పోరాటాన్ని ఈ పోస్టర్ సూచిస్తోంది. కూరగాయల మార్కెట్ బ్యాక్ డ్రాప్ లో రూపొందిన ఈ పోస్టర్‌లో ఇద్దరూ ఆగ్రహంతో ఉన్న వ్యాపారుల మధ్య చిక్కుకున్నట్లు చూపించారు. చుట్టూ ఉన్న జనాలు వారిపై కూరగాయలు విసురుతూ, వేలెత్తి చూపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాజల్, శ్రేయాస్ ముఖాల్లో కనిపించే భయం, చుట్టూ నెలకొన్న ఉద్రిక్త వాతావరణం నిజాన్ని బయటపెట్టే ప్రయత్నం చేసే వారికి ఎదురయ్యే ప్రతిఘటనను బలంగా చూపిస్తోంది.

# 'రక్త చరిత్ర' నా కెరీర్‌లో చాలా స్పెషల్

**: రామ్ గోపాల్ వర్మ**



'రాయలసీమ ఫ్యాక్షనిజంలోని యథార్థ ఘటనలను ఆధారంగా చేసుకుని 'రక్త చరిత్ర' సినిమాను తీశాను. అందులోని క్యారెక్టర్స్ గురించి ఎంతో స్టడీ చేసిన తర్వాతే ఈ సినిమాను మొదలుపెట్టాం. నా కెరీర్ లో చాలా స్పెషల్ సినిమా ఇది" అని సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ అన్నారు. వివేక్ ఒబెరాయ్, సూర్య, రాధికా ఆప్టే, ప్రియమణి ప్రధాన పాత్రధారులుగా నటించిన ఈ సినిమా 2010లో విడుదలై, అప్పట్లో సూపర్ హిట్ అయింది. 16 ఏళ్ల తర్వాత ఈ సినిమాను త్రిపుర క్రియేషన్స్ అధినేత మురళీకృష్ణ వంకాయలపాటి, నట్టీస్ ఎంటర్టైన్మెంట్స్, క్విటీ ఎంటెర్టైనెంట్స్ తరపున నట్టి కుమార్ రీ రిలీజ్ చేస్తున్నారు. స్టార్ డామినేషన్ లో తప్పు లేదు సినిమా ఇండస్ట్రీ లో ఒకప్పుడు డైరెక్టర్ కు అధిక ప్రాధాన్యం ఉండేది. డైరెక్టర్ ను కెప్టెన్ ఆఫ్ ది షిప్ అనే వారు...మరి నేడు స్టార్ డామినేషన్ ఎక్కువైంది. దీనికి కారణం ఏమిటి? అన్న ప్రశ్నకు వర్మ బదులిస్తూ... డైరెక్టర్ కు ఏమైనా కిరీటం ఉంటుందా!. స్టార్ ముఖం చూసి ప్రేక్షకులు టిక్కెట్లు కొంటున్నప్పుడు... కోట్లాది రూపాయల బిజినెస్ స్టార్ మూలంగా జరుగుతున్నప్పుడు సహజంగానే స్టార్ డామినేషన్ ఉండటంలో ఎలాంటి తప్పు లేదు. ఫ్యామిలీ సెంటిమెంట్, మల్టీ స్టారర్ సినిమాలు తీయను నా జీవితంలో ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎప్పటికీ తీయను. ఫ్యామిలీ సెంటిమెంట్ సినిమాలు ఎవరి కోసం తీయాలి. ఒక కుటుంబం థియేటర్ కు సినిమాకు వెళితే...భర్త ఏమో హీరోయిన్ ను చూస్తాడు, అత్యధిక థియేటర్లలో రీ రిలీజ్ చేస్తున్నాం: నట్టి కుమార్, మురళీకృష్ణ ఒకప్పుడు రాయలసీమలో రెండు వర్గాలు ఎలా కత్తులు దూసుకున్నాయి. దానివల్ల ఎంత మారణ హోమం జరిగిందన్న అంశాన్ని రక్త చరిత్ర సినిమాలో వర్మ చాలా చక్కగా చూపించారని, అప్పట్లో బ్లాక్ బస్టర్ అయిన ఈ చిత్రాన్ని ఈ జనరేషన్‌కి కూడా చూపించాలన్న ఉద్దేశ్యంతోనే రీ రిలీజ్ చేస్తున్నామని నిర్మాతలు నట్టి కుమార్, మురళీకృష్ణ వంకాయలపాటి తెలిపారు.

# 'సైరాబాను' మొదటి షెడ్యూల్ పూర్తి



శంబాల ఘనవిజయంతో మంచి జోష్‌లో ఉన్న హీరో ఆది సాయి కుమార్, ప్రస్తుతం సరికొత్త కాన్సెప్ట్,కమర్షియల్ అంశాల కలయికతో రూపొందుతున్న మరో ఆసక్తికరమైన ఎంటర్‌టైనర్‌లో నటిస్తున్నారు. 'కెర్యాంప్'(K-Ramp) వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్న ఈ మూవీ టైటిల్ 'సైరాబాను'. ఫణి కృష్ణ సిరికి దర్శకత్వం వహిస్తున్నారు. కృష్ణకాంత్ పరుచూరి సహనిర్మాతగా ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. ఒక హిందూ యువకుడు, ముస్లిం యువతి మధ్య సాగే విభిన్నమైన ప్రేమకథను దర్శకుడు ఫణి కృష్ణ సిరికి ఇందులో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నారు. హైదరాబాద్ , రాజమండ్రి నేపథ్యంలో సాగే ఈ చిత్రం మొదటి షూటింగ్ షెడ్యూల్ ఇప్పటికే పూర్తయింది. 15 రోజుల పాటు జరిగిన ఈ షెడ్యూల్‌లో ఆది సాయి కుమార్, బాంధవి శ్రీధర్, వెన్నెల కిషోర్, ఇతర ప్రధాన తారాగణం పాల్గొన్నారు. చిత్రం రూపుదిద్దుకుంటున్న తీరు పట్ల చిత్ర బృందం ఎంతో సంతోషంగా ఉంది, వారి ఉత్సాహం BTS (బిహైండ్‌దిసీన్స్) వీడియోలో స్పష్టంగా కనిపిస్తోంది. సెట్స్‌లో నెలకొన్న సరదా వాతావరణాన్ని, అందరి ముఖాల్లోని ఆనందం ఈ వీడియో కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది. ఈ ప్రాజెక్ట్ అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. రామ్‌రెడ్డి సినిమాటోగ్రఫీ, శేఖర్ చంద్ర సంగీతం, చోటా కె ప్రసాద్ ఎడిటింగ్, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైన్‌ను

11vzm15:11vzm15.qxd 10-07-2026 21:37 Page 1



## సీజనల్ జ్వరాలపై అపోహలు వద్దు : మంత్రి



**విజయనగరం, జూలై 10, ప్రభాతవార్త:**

సీజనల్ జ్వరాలపై ఎలాంటి అపోహలు వద్దని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోనే గజపతినగరం నియోజకవర్గ వ్యాప్తంగా వైద్యశాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోందని.. జ్వరాలపై వస్తోన్న కథనాలతో ఎలాంటి అపోహలు వద్దని మంత్రి హితవు పలికారు. ఇప్పటికే వైద్యాధికారులకు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలోని గజపతి నగరంలో జ్వరాల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నారని, రాష్ట్రవ్యాప్తంగా వైద్య సిబ్బంది పనితీరులో నాలుగో స్థానం, రోగులకు మందులు అందించే విషయంలో గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రి రెండో స్థానంలో ఉందన్న ఆయన .. రోగులకు వైద్య సేవలు అందించే విషయంలో వైద్య సిబ్బంది పనితీరును ప్రశంసించారు. వర్షాకాలంలో సీజనల్ జ్వరాల నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ఆశ వర్కర్ల నుంచి వైద్య సిబ్బంది, వైద్యులు అందరూ కూడా జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే కొండ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సైతం అవగాహన కల్పించాలన్న మంత్రి అపోహలు విడనాడాలని సూచించారు. ఎవరికైనా జ్వరం వస్తే.. వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించి వైద్యుల సూచన మేరకు వైద్యం పొందాలన్నారు. గజపతి నగరం ఆసుపత్రిలో అన్ని రకాల టెస్టులను, మందులను రోగులకు ఉచితంగా అందించడం జరుగుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుదల విషయంలో పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. దోమల నిర్మూలన చేయడంతో పాటు ప్రతి ఒక్కరు తమ ఇళ్ల వద్ద మురుగునీరు లేకుండా చూసుకోవాలని మంత్రి సూచించారు. జ్వరం వచ్చిన వెంటనే దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు నిర్వహించుకోవాలని, అశ్రద్ధ వహించినట్లయితే మామూలుగా వచ్చే జ్వరం సైతం టైఫాయిడ్ మలేరియా వంటి జ్వరాలు అయ్యే అవకాశం ఉందని, జ్వరాల పట్ల అశ్రద్ధ వహించవద్దని నియోజకవర్గ ప్రజలకు సైతం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు.

## మహిళా సంరక్షణ.. బాధ్యత ప్రధాన లక్ష్యం



**చీపురుపల్లి, జూలై10, ప్రభాతవార్త:**

మహిళా భద్రత ప్రధాన లక్ష్యముగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని చీపురుపల్లి ఎస్సై పి ఉమా వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రాత్రి చీపురుపల్లి పట్టణంలోని గురుకుల పాఠశాల లో భారీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్ఐ పి ఉమా వెంకటేశ్వరరావు విద్యార్థినులకు భద్రత, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల భద్రతకు సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై వివరించారు. ముఖ్యంగా ఉమెన్ సేఫ్టీ గురించి మాట్లాడుతూ, మహిళలు, బాలికలు తమ రోజువారీ జీవితంలో అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా వేధింపులకు గురిచేసినా వెంటనే కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదే విధముగా గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశంపై విద్యార్థినులకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాను అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యమని, ఏదైనా అసౌకర్యంగా అనిపించినప్పుడు వెంటనే పెద్దలకు చెప్పాలని సూచించారు. బాలికలు తమ భద్రత విషయంలో ధైర్యంగా వ్యవహరించాలని ప్రోత్సహించారు. అంతేకాకుండా సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పిస్తూ, సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఇతరులతో పంచుకోకూడదని, ఆన్‌లైన్ మోసాలు, ఫేక్ కాల్స్, ఫేక్ లింక్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినిలతోపాటు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

## టెక్కలిలో రైతులకు అవగాహన సదస్సు

**నెల్లిమర్ల, జూలై 10, ప్రభాతవార్త:**




నెల్లిమర్ల మండలంలో టెక్కలి పంచాయతీ కార్యాలయంలో ఉద్యాన పంటల పై రైతులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం ఉద్యాన శాఖ అధికారిణి డి. జోత్స్నారాణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాస్తకుటుంబాయి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త ఎస్ శ్రీనివాసరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి పంటలో ఎరువుల యాజమాన్యం పూత పిందె రాలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, కోతకు ముందు కోతనంతర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే అంతర పంటలుగా పైనాపిల్ వేసుకోవాలని సూచించారు. మామిడి రైతులతో ముఖాముఖి చర్చ జరిపి రైతుల సందేహాలు తెలుసుకొని వాటికి తగు పరిష్కారం చూపించారు. అలాగే ఉద్యాన శాఖ అధికారి జ్యోత్స్నారాణి మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా అందజేస్తున్న వివిధ పథకాలను వివరించి రైతులు సద్వినియోగం చేసుకోవలసినదిగా కోరారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ అధికారిణి డి జోత్స్నారాణి, వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలక్ష్మి, గ్రామ పెద్దలు నేతేటి స్వామినాయుడు, మొయిద జగదీష్, కే.విశ్వేశ్వరరావు, అల్లూరు రామరాజు వ్యవసాయ విస్తరణ అధికారి రమేష్, ఉద్యాన విస్తరణ అధికారి ా. సుజాత, గ్రామ వ్యవసాయ, హార్టికల్చర్ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో



**కురుపాం, జులై 10, ప్రభాతవార్త :**

గ్రామాలలో సీజనల్ వ్యాధులు షోకాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ఎస్ భాస్కరరావు అన్నారు. శుక్రవారం మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ) పరిధిలోని కురుపాం మండలం మంత్రజోల గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ తీరును ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్వయంగా మాట్లాడి వైద్య సేవలపై సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. ?ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో "లార్వా వేట" , డ్రైడే , సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు అవగాహన పరిచారు. జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, మాదలింగి పీహెచ్సీ వైద్యాధికారిణి డాక్టర్ తనూజ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే విజయచంద్ర జన్మదిన వేడుకలు

**పార్వతీపురం, జులై10, ప్రభాతవార్త:**



ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక అను ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గత రెండేళ్లలో పార్వతీపురం నియోజకవర్గంలో ఎమ్మెల్యే విజయచంద్ర నేతృత్వంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ప్రధానంగా పార్వతీపురం రూరల్ నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో కోట్లాది రూపాయలతో కొత్త రోడ్లు, డ్రైన్ లను నిర్మాణం జరిగిందని టీడీపీ నాయకులు కొనియాడారు. ఇక పార్వతీపురం మున్సిపాలిటీ లో ప్రతీ వార్డులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లను వేసి ఒక రూపు తీసుకువచ్చిన ఘనత ఎమ్మెల్యే విజయచంద్రకు దక్కుతుందని అన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు, అభిమానులు తరలివచ్చి ఎమ్మెల్యే విజయచంద్రకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కూటమి నాయకుల ఆనందోత్సాహాల మధ్య ఎమ్మెల్యే విజయచంద్ర కేకు కట్ చేసి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు.

## పంటల బీమా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలి

### వ్యవసాయ అధికారి గోవిందమ్మ



**దత్తిరాజేరు, జులై 10, ప్రభాత వార్త**

మండల పరిధిలో ఉన్న అన్ని గ్రామాల రైతులకు 2026- 27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన రైతులు పండించే పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజన పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని మండల వ్యవసా యాధికారి గోవిందమ్మ తెలిపారు మండల కేంద్రంలో ఉన్న రైతు సేవ కేంద్రం వద్ద శుక్రవారం స్థానిక పాత్రికేయ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏవో మాట్లాడుతూ ఖరీఫ్ 2026-27 సంవత్సరానికి సంబం ధించిన పంటలైన ప్రత్తి మొక్కజొన్న వరి నువ్వు పంటలకు రైతులు భీమా చెల్లించినట్లయితే అతివృష్టి అనా వృష్టి వంటి ప్రమాదాలు పంటలకు సంభవించిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులకు ఇన్సూరెన్స్ వర్తించి పంట నష్టం కింద భీమ వర్తిస్తుందన్నారు ప్రత్తి పంట ఎకరానికి.1923 రూపాయలు రైతు ప్రీమియంను కట్టాలన్నారు ఆఖరు తేదీ జులై 15 లోపు చెల్లించాలన్నారు మొక్కజొన్నకు 165 రూపాయలు నువ్వు పంటకు 65 రూపాయలు జులై 31 లోగా ప్రీమియం కట్టలన్నారు వరి పంటకు ఎకరాకు 200 రూపాయలు ఆగస్టు 15 లోపు ప్రీమియంను రైతు సేవా కేంద్రాల వద్ద రైతులు గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా కట్టించుకోవాలన్నారు ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అని ఆమె తెలిపారు.

## చారిటీ బాక్స్ ప్రారంభం నిరుపేదలకు వరం : టౌన్ సీఐ

**సాలూరు, జూలై 10, ప్రభాతవార్త :**



సాలూరు పట్టణంలో కొందరు యువకులు మీకై మేము వెల్ఫేర్ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి గౌరమ్మ చారిటీబుల్ ట్రస్ట్ వారి సహకారంతో పేదలకు ఎన్నో సేవలు అందిస్తున్నారు. అదే విధంగా శుక్రవారం పట్టణ సీఐ అప్పలనాయుడు,రూరల్ సీఐ రామకృష్ణ,ఎంపీడీఓ గొల్లపల్లి. పార్వతి చేతుల మీదుగా "సాలూరు చారిటీ బాక్స్" ప్రారంభించారు. దీనిముఖ్య ఉద్దేశ్యం వారి మాటల్లో పాతబట్టలు ఇంకా పుస్తకాలు, అలాగే చిన్నపిల్లలు ఆడుకునే ఆటబొమ్మలు ఈ బాక్సులో ఉంచితే వాటిని నేరుగా మీకై మేము స్వచ్ఛంద సంస్థ ద్వారా అవసరమైన నిరు పేదలకు అందజేస్తారని స్పష్టం చేశారు. అధ్యక్షుడు దిలీప్ కుమార్, శ్రీనివాస్,లక్ష్మణరావు,నరేష్‌కుమార్,గణపతి,కృష్ణవేణి,సన్యాసిరావు,రాజగోపాల్,నాగోలు తాతాజీ పాల్గొన్నారు.

## వెంపటాపు సత్యంకి నివాళి అర్పించిన ప్రభుత్వ విప్



**కురుపాం, జులై 10, ప్రభాతవార్త:**

గిరిజన రైతుల కోసం పోరాటం చేసిన వెంపటాపు సత్యం పోరాటం మరువలేనిదని ప్రభుత్వ విప్ ప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కురుపాం నియోజకవర్గం గుమ్మ గ్రామంలో శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాట అమరుడు కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ (సత్యం) వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెంపటాపు సత్యం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజనులు, రైతుల హక్కుల కోసం వెంపటాపు సత్యం చేసిన పోరాటం చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలోని అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంపటాపు సత్యం కుమార్తె మాజీ సమితి అధ్యక్షురాలు వెంపటాపు భారతి, కురుపాం ఏఎంసి చైర్ పర్సన్ కద్రక కళావతి, గుమ్మలక్ష్మీపురం టిడిపి మండల పార్టీ అధ్యక్షులు అడ్డాకుల నరేష్, యూనిట్ ఇన్ ఛార్జ్ బిడ్డిక కొండలరావు, బాలు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొని వెంపటాపు సత్యం ఘనంగా నివాళులర్పించారు.

## బిజేపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా నియామకం

**గరివిడి, జూలై 10, ప్రభాత వార్త:**



భారతీయ జనతా పార్టీ కిశాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా చీపురుపల్లి నియోజకవర్గ బిజెపి అధ్యక్షుడు సాగి వెంకట లక్ష్మీ నరసింహ రాజు(ఎస్ వి ఎల్ ఎన్ రాజు) ని నియమించారు. ఈ మేరకు కిశాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు చిరుగుపాటి కుమార స్వామి నుండి నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాజు రాష్ట్ర కిషాన్ మోర్చా ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా నియామకం అవడం పట్ల నియోజకవర్గ బిజెపి నాయకులు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేసి,అభినందించారు.

## కరడవలస గిరిజనుల రేషన్ కష్టాలు ..!



**సాలూరు, జూలై10, ప్రభాతవార్త :**

సాలూరు మండలంలో ఉన్న గిరిశిఖర ప్రాంతాల గిరిజనులకు రేషన్ సరుకుల కష్టాలు తప్పడం లేదు. ప్రతీనెల సుదూర ప్రాంతాల నుండి దండిగాం గ్రామం వచ్చి రేషన్ తీసుకుంటున్న దివ్యాంగులు ఇంకా వృద్ధులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇంకా వివరాల్లోకి వెళ్తే కరడవలస పంచాయతీ జిల్లేడువల ఇంకా పలుగ్రామాల్లో ఉంటున్న గిరిజనులకు సమార 50 కిలోమీటర్లు దూరంలో ఉన్న దండిగాం రేషన్ డిపోలో సరుకులు అందజేస్తున్నారు. దీంతో అంతదూరం నుండి వచ్చిన గిరిజనులు రేషన్ సరుకులు తీసుకెళ్తున్నారు. అలాగే ఇంతదూరంలో కాకుండా కరడవలసలోనే రేషన్ డిపో అధికారులు ఏర్పాటుచేసి ఆఫ్‌లైన్‌లో సరుకులు ఇవ్వాలని వారు కోరుతున్నారని ఆదివాసి గిరిజనసంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సీదరపు. అప్పారావు శుక్రవారం డిమాండ్ చేశారు. జి వెంకటేష్, మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

**పాచిపెంట, జూలై 10, ప్రభాతవార్త :**




సైబర్ నేరాలకు, మాదకద్రవ్యాలు పట్ల విద్యార్థుల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని మన్యం జిల్లా పార్వతిపురం జిల్లా ఎడిషన్ ఎస్పీ వెంకటేశ్వరరావు హితవు పలికారు. మండలంలో శుక్రవారంపి కొనవలస ప్రభుత్వ గిరిజన బాలికల కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఎస్సై ఎల్ అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్వతిపురం మన్యం జిల్లా ఎడిషనల్ ఎస్పీ శ్రీ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు మాధక ద్రవ్యాలకు బానిస కాకుండా దూరంగా ఉండాలని విద్యార్థి దశ నుండే మంచి లక్షణాలు అలవర్చుకోవాలని సూచించారు. అలాగే ఫోక్సో, మహిళా చట్టాల పైన వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ పీ రామకృష్ణ సాలూరు పట్టణ సీఐ బి అప్పలనాయుడు సాలూరు రూరల్ ఎస్సై రవీంద్ర రాజు , ఎస్సై .జే షణ్ముఖేశ్వరరావు పాచిపెంట పోలీసు సిబ్బంది కళాశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర చెక్పోస్టుల్లో నిఘా పటిష్టంగా ఉండాలి

**పాచిపెంట, జూలై 10, ప్రభాత వార్త :**

అంతర్రాష్ట్ర చెక్పోస్టుల వద్ద పోలీస్ మెగా పటిష్టంగా ఉండాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బందికి ఆదేశించారు. శుక్రవారం పాచిపెంట మండలం పి కోనవలస అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ ను పార్వతీపురం మన్యం జిల్లా ఎడిషనల్ ఎస్పీ వెంకటేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేసారు. చెక్ పోస్ట్ లో నిరంతరం గస్తీ పటిష్టం చేయాలనీ నిషేధిత పదార్థాలు గంజాయి, నాటుసారా అక్రమ రావాణా పై ప్రత్యేక చర్యలు చెప్పట్టాలని సూచించారు. కార్యక్రమంలో సాలూరు రూరల్ సీఐ పీ రామకృష్ణ సాలూరు పట్టణ సీఐ బి అప్పలనాయుడు సాలూరు రూరల్ ఎస్సై రవీంద్ర రాజు పాచిపెంట ఎస్సై అర్జున్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన ఓట్లు తొలగించొద్దు



**దత్తిరాజేరు, జులై 10, ప్రభాతవార్త :**

షికారుగంజి మధుర గ్రామమైన ఎస్టీవలసలో సుమారు 30 కుటుంబాలు 2014 నుండి నివసిస్తుమన్నారు.. సుమారు 12 సంవత్సరాలు ఎస్టీవలసిలో బ్రతుకుతున్నా మన్నారు మాకు ప్రభుత్వం ఆధార్ కార్డులు రేషన్ కార్డులు అన్ని మంజూరు చేశారు 2019 2024 శాసనసభ ఎన్నికల్లో 50 ఓట్లు వేశామని స్థానిక ఎన్నికలైనా సర్పంచులకు ఎంపిటిసి లకు కూడా ఓట్లు వేశామన్నారు 2021 పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీవలసకు గ్రామ వార్డు నెంబర్ గా పోటీ చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా 50 ఓట్లు తొలగించకుండా మంజూరు చేయాలని అధికారులును కోరుకుంటున్నామన్నారు. వైసీపీ నాయకులు సోమురోతి వెంకటరమణ చెల్లూరు వెంకటరమణ పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం
25
వార్త

## పెద్ద గెడ్డ జలాశయంలో పడి వివాహిత మృతి

**పాచిపెంట, జులై 10, ప్రభాతవార్త:**

పెద్దగెడ్డ జలాశయంలో గురువారం సాయంత్రం విశ్వనాథపురం గ్రామానికి చెందిన, నందిని దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎల్ .అర్జున్ విలేకరుల శుక్రవారం తెలిపారు. పోలీసులు వివరాలు ప్రకారం మృతురాలు అన్న రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్ చేసినట్లు తెలిపారు. అలాగేగజ ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది సహకారంతో గాలించగా శుక్రవారం మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.

## ఘనంగా వీర బ్రహ్మం గారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు



**నెల్లిమర్ల, జూలై 10, ప్రభాతవార్త:**

నెల్లిమర్ల పట్టణంలో కొలువుదీరిన మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గోవిందమాంబ సమేత శ్రీ వీర బ్రహ్మేం ద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వేద పండితుడు పెరుమాల మణికంఠ శాస్త్రీ మంత్రోచ్చారణల మధ్య వైభవంగా జరిపించారు. కల్యాణ వేడుకను వీక్షించడానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమానికి ఎయిమ్ విద్యా సంస్థల అధినేత కడగల ఆనంద్ కుమార్ రూ.50 వేలు విరాళంతో పాటు పలువురు దాతలు ఆర్థిక సహకారం అందజేశారు. ఆలయ నిర్వహకులు కె. రామాచారి మాస్టారు, కొండపల్లి రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ వార్షికోత్సవ వేడుకల్లో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ గోడి నరసింహాచారి, సంఘం జిల్లా పెద్దలు కుప్పిలి శ్రీనివాసరావు, కిల్లంపల్లి ఆచారి, మారోజు శ్రీనువాసరావు, కొండపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం భారీ స్థాయిలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.

## విజయనగరం జిల్లాలో శతశాతం ఈఎఫ్‌ల పంపిణీ పూర్తి

### కలెక్టర్ , జిల్లా ఎన్నికల అధికారి రామ సుందర్ రెడ్డి



**విజయనగరం, జూలై 10 ప్రభాతవార్త:**

: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం కింద విజయనగరం జిల్లాలో ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామ సుందర్ రెడ్డి తెలిపారు. జూలై 10వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు నమోదైన పురోగతిపై ఆయన వివరాలను విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,847 మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ద్వారా 15,78,949 మంది ఓటర్లకు ఎలెక్టర్ స్పెసిఫిక్ ఫారాలు (ఈఎఫ్‌లు) శతశాతం పంపిణీ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. పంపిణీ చేసిన ఫారాలలో ఇప్పటివరకు 12,50,069 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి కావడంతో జిల్లా స్థాయిలో 79.17 శాతం పురోగతి నమోదైందన్నారు.

**నియోజకవర్గాల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి:**

రాజాం నియోజకవర్గం: మొత్తం 2,29,880 ఈఎఫ్‌లను శతశాతం పంపిణీ చేయగా, 1,83,335 ఫారాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఇది 79.75 శాతం.

బొబ్బిలి నియోజకవర్గం: మొత్తం 2,33,621 ఫారాల పంపిణీ పూర్తి కాగా, 1,80,986 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 77.47 శాతం పురోగతి నమోదైంది.

చీపురుపల్లి నియోజకవర్గం: మొత్తం 2,07,471 ఫారాల పంపిణీ పూర్తి కాగా, 1,66,229 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 80.12 శాతం నమోదైంది.

గజపతినగరం నియోజకవర్గం: మొత్తం 2,07,402 ఫారాల పంపిణీ పూర్తయింది. వాటిలో 1,69,451 ఫారాలు డిజిటలైజేషన్ పూర్తి కావడంతో 81.70 శాతంతో జిల్లాలోనే అత్యధిక పురోగతి నమోదు చేసింది.

నెల్లిమర్ల నియోజకవర్గం: మొత్తం 2,14,418 ఫారాలను పంపిణీ చేయగా, 1,70,235 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 79.39 శాతం పురోగతి సాధించింది.

విజయనగరం నియోజకవర్గం: మొత్తం 2,61,300 ఫారాల పంపిణీ పూర్తయింది. ఇప్పటివరకు 1,98,051 ఫారాల డిజిటలైజేషన్ పూర్తై 75.79 శాతం నమోదైంది.

శృంగవరపుకోట నియోజకవర్గం: మొత్తం 2,24,857 ఫారాల పంపిణీ పూర్తికాగా, 1,81,782 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేసి 80.84 శాతం పురోగతి సాధించింది.

జిల్లాలో ఈఎఫ్‌ల పంపిణీని శతశాతం పూర్తి చేసిన నేపథ్యంలో, మిగిలిన ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను కూడా మిషన్ మోడ్‌లో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఎస్. రామ సుందర్ రెడ్డి సంబంధిత అధికారులకు, బీఎల్‌వోలు మరియు సిబ్బందికి ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## పారిశ్రామిక వేత్తలుగా విశ్రాంత ఉద్యోగులు

### డిఐఈపిసి సమావేశంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

**విజయనగరం, జులై 10, ప్రభాతవార్త:**

జిల్లాలోని నిరుద్యోగ యువతతోపాటు, విశ్రాంత ఉద్యోగులను సైతం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందించి పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని, అందువల్ల వారి పెట్టుబడులను పారిశ్రామిక రంగంవైపు మరల్చాలని సూచించారు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, అలాగే ఎంబిఏ విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, వారు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేటట్టుగా చైతన్య పరచాలని కోరారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), ఎస్ఐపిబి (ఇన్‌వెస్ట్‌మెంట్ ట్రాకర్), ఎంఓయుల సమావేశాలు ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం జరిగాయి. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా పరిశ్రమలను స్థాపించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన ధరఖాస్తులు, ఎంఓయుల స్థితిగతులపై చర్చించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద నిర్ణీత కాలవ్యవధిలోగా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. మా మహామాయ, రాధిక వెజిటబుల్ ఆయిల్స్, జెఎస్‌డబ్ల్యూ పార్క్, స్టీల్ ఎక్స్చేంజ్ ఆఫ్ ఇండియా, బెర్రీ ఎల్లాయిస్, సూపర్ స్మెల్టర్స్ తదితర కంపెనీల స్థాపనకు, విస్తరణకు అవసరమైన భూసేకరణ, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కెవిఐసి 2.0పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జిఎం ఎంవి కరుణాకర్, ఏపిఐఐసి జెడ్ఎం కృష్ణప్రసాద్, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఆర్‌డిఓలు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

## భర్తను హతమార్చిన భార్య అరెస్టు

### రిమాండ్ నిమిత్తం కోర్టుకి తరలింపు

**గరివిడి, జూలై 10 , ప్రభాతవార్త**

మండలంలోని శివరాం గ్రామంలో భర్త ని హతమార్చిన భార్య కుమిలి సరస్వతి అనే హంతకురాలిని చీపురుపల్లి సి .ఐ. జి.శంకర రావు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం చీపురుపల్లి జ్యూడిషల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్ కి తరలించారు. చీపురుపల్లి పట్టణ పరిధిలో గల వంగపల్లి పేట శివారు లో సరస్వతి ని అరెస్ట్ చేసి నట్లు సి ఐ శంకర రావు, గరివిడి ఎస్ ఐ. బి.లోకేశ్వర రావు తెలిపారు. ఈనెల 8 న శివరాం గ్రామంలో కుమిలి సరస్వతి తన భర్త కుమిలి సత్యం ని హత్య కు పాల్పడిన సంఘటన స్థానికంగా సంచలనం రేకెత్తించింది. ఈ నేపథ్యంలో చీపురుపల్లి డి ఎస్ పి ఎస్.రాఘవులు, సి ఐ శంకర రావు, ఎస్ ఐ లోకేశ్వర రావు కేసు దర్యాప్తు ముమ్మరం చేసి నేరస్థురాలిని రెండు రోజుల వ్యవధిలోనే పట్టుకొని కోర్ట్ కి తరలించారు.

11-07pg10.qxd:11-07pg10.qxd 1/2/02 6:35 AM Page 1




అంబరాన్నంటిన ఫ్రాన్స్ ఆనందం

# ఫ్రాన్స్ సెమీస్ హ్యాట్రిక్

**బోస్టన్, జులై 10:** నిరుటి రన్నరప్ ఫ్రాన్స్ సాకర్ వరల్డ్‌కప్-2026లో దూసుకుపోతోంది. 2022లో ఖతార్‌లో తృటిలో చేజారిన కప్‌ను ఈసారి సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగిన హాట్ ఫేవరెట్ ఫ్రాన్స్... ఆ దిశగా సెమీఫైనల్ చేరింది. బోస్టన్ వేదికగా జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై 2-0 గోల్స్‌తో విజృంభించింది. ఫ్రాన్స్ స్టార్ స్ట్రైకర్ కిలియన్ ఎంబాపె అద్భుతమైన ఆట తీరును ప్రదర్శించాడు. ఈ ఘన విజయంతో ప్రపంచకప్ చరిత్రలో వరుసగా మూడో సారి (2018, 2022, 2026) సెమీఫైనల్‌కు చేరిన జట్టుగా ఫ్రాన్స్ సరికొత్త రికార్డు సృష్టించింది.

**పెనాల్టీ మిస్ చేసిన ఎంబాపె**

మ్యాచ్ ఆరంభం నుంచే ఫ్రాన్స్ మైదానంలో దూకుడు ఆట ప్రదర్శించింది. బంతిని ఎక్కువసేపు తమ ఆధీనంలో ఉంచుకుంటూ ఆట పై పట్టు సాధించింది. చివరకు 30వ నిమిషంలో ఫ్రాన్స్‌కు గోల్ చేసే అవకాశం చిక్కింది. మొరాకో డిఫెన్స్‌ను దాటుకుంటూ బాక్స్ లోపలికి దూసుకెళ్లిన ఎంబాపెను... ప్రత్యర్థి డిఫెండర్ నౌసైర్ మజ్రావోయి ప్రమాదకరంగా అడ్డుకున్నాడు. దీంతో రెఫరీ.. ఫ్రాన్స్‌కు పెనాల్టీ ప్రకటించారు. ఎంబాపె షాట్ కొట్టగా, మొరాకో గోల్‌కీపర్ యాసిన్ బోనో అద్భుతమైన డైవ్‌తో అడ్డుకున్నాడు. తొలి అర్ధభాగం ముగిసే సమయానికి ఇరు జట్లు గోల్ లెస్‌గా నిలిచాయి.

**ఎంబాపె, ఉస్మాన్ డెంబెలె గోల్స్**

రెండో అర్ధభాగంలో మొరాకో వ్యూహాత్మకంగా పుంజుకోవడానికి ప్రయత్నించింది.కానీ, ఫ్రాన్స్ ఆ జట్టును నిలువరించింది. 60వ నిమిషంలో ఎంబాపె... బాక్స్ పైభాగం నుంచి బంతిని నెట్ కార్నర్‌లోకి పంపాడు. ఈఅద్భుత గోల్‌తో ఫ్రాన్స్ 1-0ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. మొదటి గోల్ వచ్చిన ఉత్సాహంలో ఫ్రాన్స్ మరింత వేగంగా కదిలింది. మొరాకో జట్టు కోలుకునే లోపే ఉస్మాన్ డెంబెలె... డూయే అందించిన పాస్‌ను నెట్‌లోకి పంపి ఫ్రాన్స్‌కు రెండో గోల్ అందించాడు. రెండు గోల్స్‌తో వెనుకబడిన మొరాకో మ్యాచ్‌లోకి తిరిగి రావడానికి తమ స్టార్ ఆటగాళ్లు సోఫియాన్ రహిమి, సోఫియాన్ అమ్రబాత్, జకారియా ఎల్ ఊహాదీలను సబ్‌స్టిట్యూట్‌లుగా రంగంలోకి దించింది. మ్యాచ్ చివరి పది నిమిషాల్లో మొరాకో గోల్ కోసం సర్వశక్తులూ ఒడ్డినా ఫలితం లేకపోయింది.


గోల్డెన్ బూట్ రేసులో ఎంబాపె

# నార్వేకు పరీక్ష.. ఇంగ్లాండ్‌కు సవాల్




**మియామి, జులై 10:** ఫిఫా ప్రపంచ కప్‌లో మరో ఆసక్తికర పోరు నేడు జరగనుంది.మియామివేదికగా జరగనున్న క్వార్టర్ ఫైనల్లో నార్వే, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధరాత్రి తర్వాత రెండున్నర గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల చూపంతా ఇప్పుడు ఈ మ్యాచ్‌పై నిలిచింది. మ్యాచ్ ఫలితంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

**సంచలనాల నార్వే**

ఈ పోరు కేవలం రెండు జట్ల మధ్య పోటీ మాత్రమే కాదు.ప్రపంచంలోని అత్యుత్తమ స్ట్రైకర్లలో ఇద్దరైన ఎర్లింగ్ హాలాండ్, హ్యారీ కేన్ మధ్య జరిగే ప్రతిష్ఠాత్మక ద్వంద్వ యుద్ధంగా మారింది.ఇరు జట్లు ప్రీ క్వార్టర్ ఫైనల్లో అద్భుత విజయాలు సాధించిన జోష్‌లో ఉండటంతో ఈ మ్యాచ్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. నార్వే ఈ టోర్నీలో అందరినీ ఆశ్చర్యపరిచింది.గ్రూప్-ఐలో ఇరాక్‌పై 2-0గోల్స్‌తో గెలుపు బోణీ చేసిన నార్వే... సెనెగల్‌తో మ్యాచ్‌ను 1-1తో డ్రా చేసింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఫ్రాన్స్ చేతిలో 0-2తో ఓడింది. గ్రూప్-ఐలో ఫ్రాన్స్‌తో కలిసి నాకౌట్‌కు వచ్చిన నార్వే.... రౌండ్ ఆఫ్ 32లో ఐవరీకోస్ట్‌పై 2-1తో నెగ్గింది. ఇక ప్రీ క్వార్టర్ ఫైనల్లో ఐదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్‌ను 2-1తో ఓడించి తొలిసారిగా క్వార్టర్ ఫైనల్ చేరుకుంది. ఆ మ్యాచ్‌లో హాలాండ్ రెండు గోల్స్ చేసి నార్వే జట్టును ముందుండి నడిపించాడు.

**అనుభవమే అండగా ఇంగ్లాండ్**

మరోవైపు హాట్ ఫేవరేట్లలో ఒకటైన ఇంగ్లాండ్...ఈ వరల్డ్ కప్‌లో స్థాయికి తగ్గ ఆటతీరు కనబరుస్తోంది. ఇప్పటివరకు అజేయంగా ఉంది. గ్రూప్-ఎల్‌లో పనామాపై 2-0గోల్స్‌తో, క్రొయేషియాపై 2-0గోల్స్‌తో నెగ్గిన ఇంగ్లాండ్... ఘనాతో గోల్ లెస్ డ్రా చేసుకుంది. గ్రూప్-ఎల్ అగ్రస్థానంతో నాకౌట్‌కు వచ్చిన ఇంగ్లాండ్... రౌండ్ ఆఫ్ 32లో డీఆర్ కాంగోపై 2-1తో గెలుపొందింది. ఇక అతిథ్య మెక్సికోను దాని సొంత గడ్డపై 3-2తో ఓడించి ఉత్కంఠ విజయంతో క్వార్టర్ ఫైనల్ వచ్చింది. కోచ్ థామస్ టుచెల్ వ్యూహాలు, కెప్టెన్ హ్యారీ కేన్ నాయకత్వం జట్టుకు పెద్ద బలంగా నిలుస్తున్నాయి.

**హాలాండ్ వర్సెస్ కేన్ హ్యారీ**

ఈ మ్యాచ్‌లో ప్రధాన ఆకర్షణ హాలాండ్-కేన్ హ్యారే. హాలాండ్ ఇప్పటికే ఈ టోర్నీలో ఏడు గోల్స్ చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. మరోవైపు కేన్ కీలక సమయాల్లో గోల్స్ సాధిస్తూ ఇంగ్లాండ్‌కు విజయాలు అందిస్తున్నాడు. ఇద్దరూ క్లబ్ ఫుట్‌బాల్ ఇంగ్లాండ్‌లోనే ఆడటం ఈ పోరుకు మరింత ఆసక్తి తీసుకొచ్చింది.

చరిత్ర పరంగా చూస్తే ఇంగ్లాండ్‌కే ఆధిక్యం ఉంది. ఇరు జట్లు ఇప్పటివరకు 12 సార్లు తలపడగా ఇంగ్లాండ్ ఏడు విజయాలు సాధించింది. నార్వే రెండు మ్యాచ్‌ల్లో మాత్రమే గెలిచింది. అయితే ఈసారి నార్వే గత రికార్డులను మార్చే సంకల్పంతో బరిలోకి దిగుతోంది.అనుభవం, సమతూకమైన జట్టు కూర్పు కారణంగా ఇంగ్లాండ్ స్వల్ప ఫేవరెట్‌గా కనిపిస్తోంది. అయితే హాలాండ్,ఓడెగార్డ్ వంటి ఆటగాళ్లు మ్యాచ్‌ను ఏ క్షణంలోనైనా మలుపుతిప్పే సామర్థ్యం కలిగి ఉండటంతో నార్వేను తక్కువ అంచనా వేయలేం.ఈమ్యాచ్‌లో గెలిచిన జట్టు సెమీస్‌లో అర్జెంటీనా-స్విట్జర్లాండ్ మ్యాచ్ విజేతతో తలపడనుంది. అందుకే ఈ క్వార్టర్ ఫైనల్‌ను అత్యంత ఆసక్తికర పోరుగా అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# స్మృతి ట్రిపుల్ సెంచరీ; లార్డ్స్‌లో శతకం మిస్



**లండన్, జులై 10:**లార్డ్స్ వేదికగా భారత్ -ఇంగ్లాండ్ మహిళల జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్ట్‌లో ఓపెనర్ స్మృతి మంధాన అరుదైన ఘనత సాధించింది.భారత్ తరపున 300అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన మూడో మహిళా క్రికెటర్‌గా రికార్డు సృష్టించింది. 2013లో బంగ్లాదేశ్‌పై టీ20 మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన మంధాన.. ఇప్పటివరకు అన్ని ఫార్మాట్లలో కలిపి 300 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో 9 టెస్ట్‌లు, 120 వన్డేలు, 171 టీ20 లున్నాయి.మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా హర్మన్ ప్రీత్(374) అగ్రస్థానంలో ఉండగా..తర్వాత స్థానాల్లో సూజీ బేట్స్ (370), ఎలీస్ పెర్రీ(349), మిథాలీ రాజ్(333) ఉన్నారు.

కాగా సిడ్నీ టెస్ట్‌లో భారత్ విమెన్స్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 275 మార్కు దాటింది. స్మృతి మంధాన(108 బంతుల్లో 83) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. కెప్టెన్ హర్‌ప్రీత్(58), దీప్తిశర్మ (56) అర్ధసెంచరీలతో రాణించారు. జిమీ రోడ్రిగ్స్ 35 రన్స్ చేసింది.

## తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో జ్వెరెవ్



లండన్: జర్మనీ రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ తొలిసారి వింబుల్డన్ ఫైనల్లో ప్రవేశించాడు. తొలి సెమీఫైనల్లో బ్రిటిష్ వైల్డ్‌కార్డ్ ఆటగాడు ఆర్థర్ ఫెరీని 7-6, 6-2, 6-4 తేడాతో ఓడించాడు. సొంతగడ్డపై ఫైనల్ చేరాలన్న ఫెరీ ఆశలకు బ్రేక్ వేశాడు. మొదటి సెట్ చెమటోడ్చి నెగ్గిన ఫ్రెంచ్ ఓపెన్ ఛాంపియన్ జ్వెరెవ్... తరువాతి రెండు సెట్లను అలవోకగా కైవసం చేసుకున్నాడు. 2గంటల 14 నిమిషాల్లో మ్యాచ్ ముగించాడు. జ్వెరెవ్‌కు ఇది అయిదో గ్రాండ్ స్లామ్ ఫైనల్.

## భారత్‌లో బిగ్‌బాష్ లీగ్ ఆరంభ మ్యాచ్

**మెల్‌బోర్న్, జులై 10:** ఆస్ట్రేలియా టీ20 టోర్నీ బిగ్ బాష్ లీగ్ ప్రారంభ మ్యాచ్ డిసెంబర్ 12న చెన్నైలోని చెపాక్ స్టేడియం వేదికగా జరగనుంది.2026-27 సీజన్ మొదటి మ్యాచ్‌ను భారత్‌లో నిర్వహించబోతున్నట్లు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్, భారత ప్రధాని మోడీ సంయుక్తంగా చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో మెల్‌బోర్న్ రెనెగేడ్స్, పెర్త్ స్కోర్చర్స్ జట్లు తలపడతాయి. ఆస్ట్రేలియా వెలుపల జరగబోతున్న మొట్ట మొదటి బిగ్ బాష్ లీగ్ మ్యాచ్ ఇదే.అలాగే భారత్‌లో నిర్వహించబడుతున్న తొలి విదేశీ క్రికెట్ లీగ్ మ్యాచ్‌గా ఇది రికార్డు సృష్టించనుంది. మిగతా బిగ్‌బాష్ లీగ్ మ్యాచ్‌లు ఆస్ట్రేలియాలోనే డిసెంబర్ 15 నుంచి యథావిధిగా జరుగుతాయి.

## ఫ్రాన్స్ కెప్టెన్ నయా చరిత్ర
## సెంచరీ క్లబ్‌లో ఎంబాపె

**బోస్టన్, జులై 10:** క్వార్టర్ ఫైనల్లో మొరాకోపై చేసిన గోల్‌తో ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపె అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో పలు మైలురాళ్లను అందుకున్నాడు. ఫ్రాన్స్ ఫుట్‌బాల్ చరిత్రలోనే అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నేరుగా 100 గోల్స్‌లో భాగస్వామ్యాన్ని పంచుకున్న మొదటి ఆటగాడిగా ఎంబాపె నిలిచాడు. ఇంటర్నేషనల్ కెరీర్‌లో ఫ్రాన్స్ తరఫున ఇప్పటివరకు ఎంబాపె వ్యక్తిగతంగా 64 గోల్స్ చేశాడు. మరో 36గోల్స్‌కు అసిస్ట్‌లు అందించాడు. దీంతో 100 గోల్స్ మైలురాయిని కిలియన్ ఎంబాపె అందుకున్నట్లు అయింది.

సాకర్ ప్రపంచకప్‌లు (2018, 2022, 2026)లలో ఎంబాపె గోల్స్ సంఖ్య 20కి చేరింది. వరల్డ్ కప్‌లో అత్యధిక గోల్స్ చేసిన లియోనెల్ మెస్సీ (21 గోల్స్) ఆల్ టైమ్ రికార్డుకు ఎంబాపె కేవలం ఒక్క గోల్ దూరంలో ఉన్నాడు. ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో ఎంబాపెకు ఇది 8వ గోల్. దీంతో మెస్సీతో కలిసి ఈ టోర్నీలో అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా గోల్డెన్ బూట్ రేసులో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## 7.26 బిలియన్ డాలర్లు పెరిగిన ఫారెక్స్ ఖజానా


**న్యూఢిల్లీ,జులై 10:** దేశ విదేశీ మారక ద్రవ్య నిల్వలు ఈనెల3తో ముగిసిన వారంలో 7.26 బిలియన్ అమెరికన్ డాలర్లు పెరిగి 674.193 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని భారతీయ రిజర్వ్ బ్యాంక్ శుక్రవారం వెల్లడించింది. అంతకుముందు వారంలో దేశ ఫారెక్స్ నిల్వలు 5.654 బిలియన్ డాలర్లు తగ్గి 666.933 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో దేశ విదేశీ మారక నిల్వలు చరిత్రాత్మక గరిష్ఠ స్థాయి అయిన 728.494 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అనంతరం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు పెరగడం,రూపాయిపై ఒత్తిడి అధికమవడం వల్ల ఆర్‌బీఐ డాలర్ల విక్రయం ద్వారా విదేశీ మారక మార్కెట్లో జోక్యం చేసుకోవాల్సి రావడంతో ఫారెక్స్ నిల్వలు వరుస వారాల పాటు తగ్గుముఖం పట్టాయి.విదేశీ మారక నిల్వలను పరిరక్షించేందుకు విదేశీ పర్యటనలను తగ్గించాలని, ఇంధన వినియోగాన్ని పరిమితం చేయాలని, ఏడాది పాటు బంగారం కొనుగోళ్లను నివారించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మే 11 నుంచి పలు సందర్భాల్లో దేశ ప్రజలకు విజ్ఞప్తి చేసిన విషయం తెలిసిందే.ఈనెల 3తో ముగిసిన వారానికి సంబంధించిన ఆర్‌బీఐ గణాంకాల ప్రకారం, ఫారెక్స్ నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు 4.51 బిలియన్ డాలర్లు పెరిగి 545.578 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అమెరికన్ డాలర్ల రూపంలో లెక్కించే ఈ విదేశీ కరెన్సీ ఆస్తుల్లో యూరో, పౌండ్ స్టెర్లింగ్, జపాన్ యెన్ వంటి ఇతర ప్రధాన కరెన్సీల విలువల్లో వచ్చిన పెరుగుదల లేదా తగ్గుదల ప్రభావం కూడా ప్రతిబింబిస్తుంది.

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నికరలాభం 2020 కోట్లు




**ముంబై:** ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తొలి త్రైమాసికంలో బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది.గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే బ్యాంక్ నికర లాభం 26.8శాతం పెరిగి రూ.1,593కోట్ల నుంచి రూ.2,020కోట్లకు చేరుకుంది. బ్యాంకు ప్రధాన ఆదాయమైన నికర వడ్డీ కూడా 14.5శాతంవృద్ధి చెంది రూ.3,292 కోట్ల నుంచి రూ.3,770 కోట్లకు పెరిగింది. రుణాలపై వచ్చే ఆదాయం స్థిరంగా పెరగడం ఈ వృద్ధికి ప్రధాన కారణమని బ్యాంకు తెలిపింది. ఆపరేటింగ్ పనితీరు కూడా మెరుగుపడింది. ఆపరేటింగ్ లాభం ఏడాది ప్రాతిపదికన 21.3 శాతం పెరిగి రూ.2,570 కోట్ల నుంచి రూ.3,117 కోట్లకు చేరుకుంది. ఇతర ఆదాయం 25 శాతం పెరిగి రూ.825 కోట్ల నుంచి రూ.1,029 కోట్లకు పెరిగింది. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి వరుసగా రెండో త్రైమాసికంలోనూ 1.45 శాతం వద్దనే కొనసాగగా, నికర ఎన్‌పిఎలు కూడా 0.13 శాతం వద్ద స్థిరంగా ఉన్నాయి.ఈ త్రైమాసికంలో కేటాయింపులు రూ.840 కోట్లుగా నమోదయ్యాయి.గత ఏడాది ఇదే కాలంలో ఇవి రూ.867 కోట్లు ఉండగా, గత త్రైమాసికంలో రూ.617 కోట్లుగా నమోదయ్యాయి.జూన్ 30, 2026తో ముగిసిన త్రైమాసికంలో కోవిడ్19కు సంబంధించిన అత్యవసర ప్రొవిజన్లలో రూ.250 కోట్లను తిరిగి రద్దు చేసినట్లు బ్యాంక్ తన నియంత్రణ సంస్థలకు సమర్పించిన నివేదికలో వెల్లడించింది.

## ఐదు ఐపీవోలకు సెబీ గ్రీన్ సిగ్నల్




**ముంబయి,జులై 10:** మార్కెట్ నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా శుక్రవారం ఐదు కంపెనీల ఐపీవో ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. టోన్బో ఇమేజింగ్ ఇండియా లిమిటెడ్, మార్రీ రిటైల్ లిమిటెడ్, రెంటోమోజో లిమిటెడ్, జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్ లిమిటెడ్, గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ లిమిటెడ్ సంస్థలకు సంబంధించిన డ్రాఫ్ట్ పత్రాలపై సెబీ అబ్జర్వేషన్ లెటర్ జారీ చేసింది. సెబీ పరిభాషలో ఇది తుది ఆమోదంగా పరిగణిస్తారు.జెట్‌వర్క్ మాన్యుఫ్యాక్చరింగ్ బిజినెస్‌జెట్‌వర్క్ ఐపీవోలో తాజా ఈక్విటీ షేర్ల జారీ తో పాటు ప్రస్తుత వాటాదారులు విక్రయించే ఆఫర్ ఫర్ సేల్ కూడా ఉండే అవకాశం ఉంది. ఐపీవో పరిమాణం, కంపెనీ విలువ వంటి తుది వివరాలు బుక్ బిల్డింగ్ ప్రక్రియ ద్వారా నిర్ణయించబడతాయి.కంపెనీలో ప్రస్తుతం ఖోస్లా వెంచర్స్, బైలీ గిఫోర్డ్, రాకేష్ గంగ్వాల్, యాక్సెల్, పీక్ శ్రీజు, గ్రీన్‌ఓక్, లైట్‌స్పీడ్ వంటి ప్రముఖ పెట్టుబడిదారులు ఉన్నారు. జెట్‌వర్క్ సాంకేతికత ఆధారిత తయారీ వేదికను నిర్వహిస్తోంది.

పరిశ్రమల నుంచి వచ్చే డిమాండ్‌ను వివిధ సరఫరాదారులు, తయారీ యూనిట్లతో అనుసంధానం చేస్తుంది. టోన్బో ఇమేజింగ్ ఐపీవోలో ప్రమోటర్ వాటాదారులు 19.60 లక్షల ఈక్విటీ షేర్లు, ప్రమో టర్ గ్రూప్ వాటాదారు 3.39 లక్షల షేర్లు, ఇన్వెస్టర్ వాటాదారులు 1.56 కోట్లకు పైగా ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు.ప్రస్తుతం అరవింద్ లక్ష్మీకుమార్, అంకిత్ కుమార్, సిసీలియా డిసౌజా సంస్థ ప్రమోటర్లుగా ఉన్నారు. ప్రపంచ రక్షణ రంగ ప్రాజెక్టులు, ఉత్పత్తుల రూపకల్పన, నిధుల సమీకరణలో వీరికి విశేష అనుభవం ఉంది. గుజరాత్ విక్టరీ ఫోర్జింగ్స్ ఐపీవోలో 65 లక్షల వరకు తాజా ఈక్విటీ షేర్ల జారీ, 1.32 కోట్ల వరకు ఈక్విటీ షేర్ల ఆఫర్ ఫర్ సేల్‌తో వస్తోంది. ఒక్కో ఈక్విటీ షేరు ముఖ విలువ రూ.10గా నిర్ణయించారు.





# స్టాక్ మార్కెట్లలో జోష్
## ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. అన్ని రంగాల్లో కొనుగోళ్ల జోరుతో నిఫ్టీ 24,200 మార్క్‌ను అధిగమించి ముగిసింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు కూడా మంచి ర్యాలీ నమోదు చేశాయి.ఎన్ఎస్ఈలోని రంగాల వారీ సూచీల్లో నిఫ్టీ ఎఫ్ఎంసీజీ మినహా మిగిలిన అన్ని సూచీలు లాభాల్లో ముగిశాయి.ప్రభుత్వ రంగ ఇండియన్ బ్యాంక్ షేరు 10శాతానికి పైగా పెరిగి నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ సూచీలో అగ్రగామిగా నిలిచింది. టీసీఎస్ జూన్ త్రైమాసిక ఫలితాలు అంచనాలకు మించి రావడం, ఐటీ రంగంలో డిమాండ్ మెరుగుపడుతున్నట్లు సంస్థ సంకేతాలు ఇవ్వడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

ముడి చమురు ధరలు తగ్గడం, రూపాయి బలపడటం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని మరింత పెంచాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 827.57 పాయింట్లు పెరిగి 77,569.39 వద్ద ముగిసింది. నిఫ్టీ50 సూచీ 244.10 పాయింట్లు లాభపడి 24,206.90 వద్ద స్థిరపడింది. వరుసగా రెండు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1.35శాతం, నిఫ్టీ 1.33శాతం పెరిగాయి.రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.36 శాతం, ఐసీఐసీఐ బ్యాంక్ 1.48 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.85 శాతం లాభపడటం నిఫ్టీకి ప్రధాన బలంగా నిలిచింది.విస్తృత మార్కెట్‌లో ప్రధాన సూచీల కంటే మెరుగైన ప్రదర్శన కనిపించింది. బీఎస్ఈ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.40 శాతం, బీఎస్ఈ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.20 శాతం పెరిగాయి. మార్కెట్‌లో కొనుగోళ్ల ర్యాలీ స్పష్టంగా కనిపించింది.

ఎన్ఎస్ఈలో 2,339 షేర్లు లాభపడగా, 973 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 98 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.కమోడిటీలు, కరెన్సీ మార్కెట్‌సెప్టెంబర్ 2026 డెలివరీకి బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 10 సెంట్లు తగ్గి 76.20 డాలర్లకు చేరింది. భారత్ 10 సంవత్సరాల ప్రభుత్వ బాండ్ రిటర్నులు 6.754శాతం నుంచి 6.711 శాతానికి తగ్గింది. విదేశీ మారక ద్రవ్య మార్కెట్లో డాలర్‌తోపోలిస్తే రూపాయి స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 95.4700తో పోలిస్తే 95.3200వద్ద ట్రేడైంది. ఆగస్టు 5,2026 డెలివరీకి ఎంసీఎక్స్ బంగారం ఫ్యూచర్స్ ధర 0.74 శాతం తగ్గి 10 గ్రాములకు రూ.1,44,222కు చేరింది. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన షేర్లుటాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ షేరు 0.90 శాతం పెరిగింది.ఇండియన్ బ్యాంక్ షేరు 10.11 శాతం ఎగసింది.బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 2.43 శాతం లాభపడింది.ముత్తూట్ మైక్రోఫిన్ షేరు 13.19 శాతం జంప్ చేసింది.ఆనంద్ రాఠీ వెల్త్ 2.12శాతం పెరిగింది.హ్యుందాయ్ ఇంజినీరింగ్ అండ్ కన్స్ట్రక్షన్ నుంచి అంతర్జాతీయ కాంట్రాక్టు దక్కడంతో అయాన్ ఎక్స్ఛేంజ్ ఇండియా షేరు 17.38శాతంఎగిసింది.నికర లాభం 59.9 శాతం తగ్గడంతో ఐమ్‌కో ఎలెకాన్ షేరు 1.72 శాతం పడిపోయింది. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.18.54 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్ పొందడంతో రైల్‌టెల్ కార్పొరేషన్ షేరు 2.31 శాతం పెరిగింది.సుమారు 51.98 మిలియన్ డాలర్లు విలువైన అంతర్జాతీయ ఆర్డర్ దక్కడంతో హెచ్ఎఫ్‌సీఎల్ షేరు 0.57 శాతం లాభపడింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్‌లో ప్రమోటర్లకు చెందిన 41.33 శాతం వాటాను రూ.1,550 కోట్ల నగదు ఒప్పందంతో కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించడంతో అపోలో మైక్రో సిస్టమ్స్ షేరు 2.57 శాతం పెరిగింది. ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ షేరు 3.92 శాతం క్షీణించింది.

## ఐదేళ్లలో 5 వేలు జీసీసీలు సాధ్యమే




కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ,జులై 10:** దేశంలో 2030 నాటికి ఐదువేల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు ఏర్పాటు చేయాలన్న లక్ష్యం సాధ్యమేనని, వాస్తవికమైనదేనని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. జీసీసీల తదుపరి విస్తరణ మెట్రో నగరాలకే పరిమితం కాకుండా రెండు,మూడోశ్రేణి నగరాలకు విస్తరించడంపైనే ఆధారపడి ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. సీఐఐ నిర్వహించిన జాతీయ జీసీసీ బిజినెస్ సమ్మిట్‌లో ప్రసంగించిన కేంద్ర ఆర్థికమంత్రి.. ప్రపంచంలోని ఫార్చ్యూన్2000 కంపెనీలలో దాదాపు మూడింట రెండొంతుల సంస్థలు ఇంకా భారత్‌లో జీసీసీలను ఏర్పాటు చేయలేదని,దీంతో ఈ రంగంలో వృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇటీవలి కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన పలు విధానపరమైన సంస్కరణలు జీసీసీల విస్తరణకు ఊతమిస్తాయని తెలిపారు.

ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ విధానాన్ని సరళీకరించడం, సేఫ్ హార్బర్ నిబంధనలను విస్తరించడం, అడ్వాన్స్ ప్రైసింగ్ మెకానిజాన్ని వేగవంతం చేయడం, సిటీ ఎకనామిక్ రీజియన్లు, యూనివర్సిటీ టౌన్‌షిప్‌లు, అర్బన్ చాలెంజ్ ఫండ్ వంటి చర్యలు జీసీసీల పెట్టుబడులను ఆకర్షించేందుకు దోహదపడతాయని నిర్మలా సీతారామన్ చెప్పారు.జీసీసీలు కేవలం అగ్రశ్రేణి నగరాలకే పరిమితం కావొద్దని పేర్కొన్న సీతారామన్, చండీగఢ్, వారణాసి, విశాఖపట్నం వంటి నగరాలు కూడా జీసీసీ కేంద్రాలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ప్రస్తుతం దాదాపు 10 రాష్ట్రాలు ప్రత్యేక జీసీసీ విధానాలను ప్రకటించాయని ఈ సదస్సులో 14కు పైగా రాష్ట్రాలు పాల్గొనడం ప్రాంతీయ ప్రభుత్వాల ఆసక్తిని ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు.విజ్ఞాన ఆధారిత పరిశ్రమలకు అనుకూలమైన ప్రత్యేక పారిశ్రామిక వాతావరణాన్ని రూపొందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులతో భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) సమన్వయం చేసుకోవాలని ఆమె సూచించారు.

దేశంలోని జీసీసీలు ఏటా సుమారు 100 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే ఫోర్బ్స్2000 జాబితాలోని 500కుపైగా కంపెనీలున్నాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న జీసీసీలలో దాదాపు సగం భారత్‌లోనే ఉండగా, రోజుకు సగటున ఒక కొత్త జీసీసీ దేశంలో ప్రారంభమవుతోందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రారంభమవుతున్న కొత్త జీసీసీలలో సగానికి పైగా కృత్రిమ మేధ (ఏఐ) ఆధారితంగా పనిచేస్తుండటంవిశేషమని కేంద్రమంత్రి చెప్పారు.




## మ్యూచువల్ ఫండ్లలో 29వేల కోట్ల పెట్టుబడులు

**న్యూఢిల్లీ,జులై 10:** దేశీయంగా చురుకుగా ఉన్న ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెరిగాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా ఆంఫీ విడుదల చేసిన డేటాచూస్తే జూన్‌లో యాక్టివ్ ఈక్విటీ ఫండ్లలో రూ.28,973.41 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మే నెలలో ఈ మొత్తం రూ.22,907.77 కోట్లుగా ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు నమోదైన అత్యల్ప నెలవారీ ఈక్విటీ పెట్టుబడులు మే నెలలోనే నమోదయ్యాయి.మొత్తం మ్యూచువల్ ఫండ్ పరిశ్రమలో నికర ఉపసంహరణలు జూన్‌లో రూ.52,948.78 కోట్లకు తగ్గగా, మేలో అవి 64,021.17కోట్లుగా ఉన్నాయి. జూన్ నెలలో దాదాపు అన్ని ఈక్విటీ విభాగాల్లోనూ పెట్టుబడులు పెరిగాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్ ఫండ్లు పెట్టుబడిదారులను అత్యధికంగా ఆకర్షించాయి.

లార్జ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.2,067.48 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఈ మొత్తం రూ.1,592.93 కోట్లుగా ఉంది. మిడ్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.6,090.17 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మేలో ఇవి రూ.4,385.06కోట్లుగా నమోదయ్యాయి.స్మాల్‌క్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,601.96 కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. అంతకుముందు నెలలో రూ.6,263.56 కోట్లుగా ఉండటంతో స్వల్ప తగ్గుదల కనిపించింది.ఫ్లెక్సీక్యాప్ ఫండ్లలో జూన్‌లో రూ.5,231.31 కోట్ల పెట్టుబడులు నమోదుకాగా, సెక్టోరల్, థీమాటిక్ ఫండ్లలో కూడా పెట్టుబడులు పెరిగి జూన్‌లో రూ.1,469.26 కోట్లకు చేరాయి. డెట్ మ్యూచువల్ ఫండ్లలో గత నెలలో రూ.1.09 లక్షల కోట్ల నికర విత్‌డ్రాలున్నాయి. ఓవర్‌నైట్ ఫండ్ల నుంచి జూన్‌లో రూ.10,579.58 కోట్లు విత్‌డ్రాకాగా లిక్విడ్ ఫండ్ల నుంచి రూ.42,293.29 కోట్ల నికర ఉపసంహరణలు నమోదయ్యాయి. హైబ్రిడ్, ప్యాసివ్ ఫండ్ల పరిస్థితిహైబ్రిడ్ పథకాలలో జూన్‌లో రూ.12,892.76కోట్ల నికర పెట్టుబడులు నమోదయ్యాయి. మేలో ఇవి రూ.16,538.47 కోట్లుగా ఉన్నాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.